
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 250

శుక్రవారం 24-5-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



శ్రమించి నెగ్గిన సింధు

మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ బ్యాడ్మింటన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి - 13లో



బ్లాక్‌లిస్టులో ఈవీ కంపెనీలు!

ఫేమ్–2 నిబంధనలు ఉల్లంఘించిన హీరో ఎలక్ట్రిక్, ఒకినావా, బెన్లింగ్ - 13లో



బీజేపీకి మహిళలంటే చిన్నచూపు

మహిళలను బీజేపీ రెండో శ్రేణి పౌరులుగా చూస్తోందని.. ఆర్‌ఎస్‌ఎస్ అడుగుపెట్టనివ్వడం లేదని రాహుల్‌గాంధీ విమర్శించారు.

వివరాలు 6లో ▸



ఇటు నేను.. అటు ఎవరు?

'ఇండియా' కూటమి నాయకులు అధికారంలోకి రాకముందే ప్రధాని పదవి కోసం పోటీ పడుతున్నారని మోదీ ఎద్దేవా చేశారు.

వివరాలు 6లో ▸



వాయుసేన మరో ఘనత

భారత వాయుసేన నైట్ విజన్ గాగుల్స్ సాయంతో తక్కువ వెలుతురులో సీ–130జే విమానాన్ని విజయవంతంగా ల్యాండ్ చేసింది.

వివరాలు 6లో ▸



శెభాష్ కామ్య..!

పదహారేళ్ల కామ్య కార్తికేయన్ ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని చిన్న వయసులోనే అధిరోహించి చరిత్ర సృష్టించింది.

వివరాలు 6లో ▸

కూటమి సేవలో ఘనాపాఠి

చంద్రబాబు విధ్వంస కుట్రలో ప్రధాన పాత్రధారి.. పల్నాడులో హింసాకాండకు ఐజీ త్రిపాఠి వత్తాసు

కీలక అధికారుల ఆకస్మిక బదిలీల వెనుక సూత్రధారి

పోలీసులను కట్టడి చేసి టీడీపీ గూండాగిరికి అండదండలు

కౌంటింగ్ రోజు మరోసారి అలజడికి కొమ్ము కాస్తున్న వైనం

పచ్చ మూకలను ఇంతవరకు అరెస్ట్ చేయకపోవడమే నిదర్శనం

టీడీపీ అధినేత ఒత్తిడితోనే త్రిపాఠికి పోస్టింగ్

పల్నాడులో ప్రశాంతత కోసం ఆయన్ను తక్షణం బదిలీ చేయాలంటున్న పోలీస్ యంత్రాంగం





పోలింగ్ రోజున నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటిపై దాడి చేసి కార్లను ధ్వంసం చేస్తున్న టీడీపీ గూండాలు.. (ఇన్‌సెట్‌లో) సర్వశ్రేష్ఠ త్రిపాఠి

సాక్షి, అమరావతి: సర్వ శ్రేష్ఠుడు అంటే అందరికంటే సమర్థుడు అని అర్థం. కానీ ఆ సమర్థత విధి నిర్వహణలో కాకుండా చంద్రబాబు కుట్రలకు వత్తాసు పలకడంలో చూపించిన ఘనాపాఠి గుంటూరు ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి! ఎన్నికల సందర్భంగా పల్నాడులో టీడీపీ మూకలు బరితెగించి సాగించిన విధ్వంసకాండకు ఆయన వెన్నుదన్నుగా నిలిచారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలు ఓటింగ్‌లో పాల్గొనకుండా భయానక వాతావరణం సృష్టించిన టీడీపీ గూండాలకు పోలీసు లాఠీని అందించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు పోలింగ్ బూత్‌లలో లేకుండా దాడులకు తెగబడ్డ పచ్చ మూకలకు ఈ ఖాకీ కొమ్ము కాశారు. పోలింగ్ అక్రమాలకు పాల్పడ్డ టీడీపీ రౌడీమూకలు రోడ్లపై దర్జాగా తిరుగుతున్నా వారిని అరెస్ట్ చేయకుండా పోలీసు యంత్రాంగం చేతులు కట్టేశారు. ఓట్ల లెక్కింపు రోజు టీడీపీ గూండాలు మరోసారి అరాచకం సృష్టించేందుకు రంగం సిద్ధం చేయిస్తున్నారు. ఎన్నికల అక్రమాలకు సహకారం అందించేందుకు చంద్రబాబు, పురందేశ్వరి పక్కా పన్నాగంతో పల్నాడులో ప్రవేశపెట్టిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వారి ద్దరి నమ్మకాన్ని వమ్ము చేయలేదనే

మిగతా 2వ పేజీలో ▶

బదిలీ చేస్తేనే పల్నాడులో ప్రశాంతత

పోలింగ్ రోజు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వ్యవహార శైలి చూసిన పోలీసులు ఆయన ఆ పోస్టులో కొనసాగితే కౌంటింగ్ రోజు పల్నాడు మరోసారి భగ్గుమనడం ఖాయమని తేల్చిచెబుతున్నారు. ఆయన్ను ఈసీ తక్షణం బదిలీ చేయాలని పేర్కొంటున్నారు. పల్నాడులో శాంతి నెలకొని ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగాలంటే త్రిపాఠీతోపాటు టీడీపీకి వత్తాసు పలికిన క్షేత్రస్థాయి అధికారులను సైతం బదిలీ చేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.



ఆ వీడియో లీక్ అయింది

అది మేము విడుదల చేయలేదు

ఈసీకి సంబంధం లేదు

దర్యాప్తు సమయంలో బయటకు వెళ్లి ఉండవచ్చు

దానిపైనా విచారణ చేస్తున్నాం

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

మీడియాతో సీఈవో ముకేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం సంఘటనకు సంబంధించి మాధ్యమాల్లో ప్రసారమవుతున్న వీడియో లీక్‌తో ఎన్నికల సంఘానికి సంబంధం లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. ఆ వీడియో తమ నుంచి బయటకు వెళ్లలేదని గురువారం సచివాలయంలో

మిగతా 5వ పేజీలో ▶



ప్రైవేట్ బస్సు బోల్తా.. ఇద్దరు బాలికల

మృతి

5లో

21 మందికి గాయాలు

హైదరాబాద్ నుంచి ఆదోనికి వెళ్తుండగా కోడుమూరు వద్ద ప్రమాదం

డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఘోరం

టీడీపీ రీపోలింగ్ ఎందుకు కోరలేదు!?

- మాచర్లలో విచ్చలవిడిగా రిగ్గింగ్ చేసిన టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి
- అడ్డొచ్చిన వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లు, కార్యకర్తలపై దాడి
- రిగ్గింగ్ అడ్డుకోవడంతో తుమ్మకోటలో 4 ఈవీఎంలను ధ్వంసం చేసిన టీడీపీ నేతలు
- అయినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లిపై ఆరోపణలు
- రీపోలింగ్ జరగకుండా అధికారులపై టీడీపీ ఒత్తిడి

5లో

ఆ అభ్యర్థులకు హైకోర్టు రక్షణ

జూన్ 6 వరకు పిన్నెల్లి, గోపిరెడ్డి, పెద్దారెడ్డి తదితరులను అరెస్టు చెయ్యొద్దని పోలీసులకు ఆదేశం

- కౌంటింగ్ ముగిసే వరకు తాడిపత్రిలో ఉండొద్దని అస్మిత్‌రెడ్డికి ఆదేశం
- నలుగురి కంటే ఎక్కువ మందితో తిరగరాదు
- ఎలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడరాదు
- సాక్షులను ప్రభావితం చేయరాదు.. దర్యాప్తులో జోక్యం చేసుకోరాదు
- హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకు స్పష్టీకరణ
- వీరిపై నిఘా పెట్టాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: ఎన్నికల బరిలో నిలిచిన పలువురు అభ్యర్థులకు హైకోర్టు పోలీసుల అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులను జూన్ 6వ తేదీ వరకు అరెస్టు చెయ్యొద్దని పోలీసులను ఆదేశించింది. దీంతో వారికి హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లయింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. కౌంటింగ్ ముగిసే వరకు తాడిపత్రిలో ఉండరాదని.. తాడిపత్రి బయట ఉండాలని జేసీ అస్మిత్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సోమశేఖర నాయుడులను హైకోర్టు ఆదేశించింది. నలుగురు కంటే ఎక్కువ మందితో తిరగరాదని.. ఎలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడరాదని అస్మిత్‌రెడ్డి, పెద్దారెడ్డిలతో సహా మిగిలిన అభ్యర్థులైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతమనేని ప్రభాకర్

మిగతా 2వ పేజీలో ▶

ఏబీ వెంకటేశ్వరరావు

సస్పెన్షన్ సబబే

- ఆయన ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి సైతం ఇచ్చింది
- అన్ని అంశాలను క్యాట్ పరిగణనలోకి తీసుకోలేదు
- అందువల్ల క్యాట్ తీర్పు అమలును నిలిపేయండి
- హైకోర్టును అభ్యర్థించిన రాష్ట్ర ప్రభుత్వం
- తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం

5లో



చారిత్రక విజయానికి ఐదేళ్లు

- చంద్రబాబు అరాచక పాలనకు 2019 మే 23న ముగింపు పలుకుతూ ప్రజా తీర్పు
- 50 శాతం ఓట్లు.. 151 శాసన సభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం
- రాష్ట్ర చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించేలా ఐదేళ్లుగా సీఎం జగన్ సుపరిపాలన
- వైఎస్సార్‌సీపీకి మరో చారిత్రక విజయాన్ని జనం కట్టబెడతారంటున్న విశ్లేషకులు

14లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్



ఏడుగురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గురువారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. ఘటనాస్థలిలో 7 ఆయుధాలతోపాటు భారీగా మందుగుండు సామగ్రి దొరికినట్లు పోలీసులు చెప్పారు.

6లో

ఇదంజగత్



మీరు మీరే ఓట్లేసుకుంటుంటే మధ్యలో నేనెందుకని వెళ్లిపోతున్నాడ్సార్!!

పచ్చమూక అరాచకం.. ఆనవాళ్లివిగో..

పల్నాట గ్రామాలు వదిలి బయట తలదాచుకుంటున్న బడుగులు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు.. ఆపై రిగ్గింగ్‌కు పాల్పడిన టీడీపీ నేతలు

- ఓటింగ్ తరువాత కూడా బడుగు, బలహీన వర్గాలపై దాడులు కొనసాగింపు
- వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని కారంపూడి మండలం పేటసన్నెగండ్లలో బేడ బుడగ జంగాలపై దాడి.. రెంటచింతల మండల పరిధిలోని గోలిలో ఎస్టీలపై దాడి
- తొండేపి గ్రామాన్ని వదలి ప్రాణభయంతో బయట తలదాచుకుంటున్న మైనార్టీలు
- చిలకలూరిపేట మండలం కావూరులో ఎస్సీలకు తాగునీరు నిలిపివేత
- కొత్త గణేషునిపాడు నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీలను వెళ్లగొట్టిన టీడీపీ నేతలు
- చివరకు బాధితులపైనే కేసులు నమోదు
- పరామర్శకు వెళ్లిన ఎమ్మెల్యేలు కాసు, అనిల్ కుమార్‌పైనా దాడి
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం



కారంపూడిలో టీడీపీ మూక దాడిలో కాలిపోతున్న బైక్‌లు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: పోలింగ్ రోజు, ఆ తర్వాత టీడీపీ నేతలు పల్నాడులో విధ్వంసం సృష్టించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాల్సిన ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారన్న అక్కసుతో వారిపై దాడులకు తెగబడ్డారు. ఎలాగైనా వారిని ఓటింగ్‌కు దూరం చేసి ఏకపక్షంగా రిగ్గింగ్‌కు పాల్పడేందుకు అరాచకాలు సృష్టించారు. ఓటింగ్ తరువాత సైతం బడుగు, బలహీన వర్గాలపై ప్రతాపం చూపారు. బలహీన వర్గాలపై సాగిన వరుస దాడులను అడ్డుకోవాల్సిన పోలీసు యంత్రాంగం పట్టించుకున్న

మిగతా 2వ పేజీలో ▶

అల్లర్లపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలి

నరసరావుపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్



- టీడీపీ నేతలు సత్యహరిశ్చంద్రులు అన్నట్లుగా కమిషన్ వ్యవహరిస్తోంది
- మాచర్లలో అధికారులను మార్చిన తర్వాతే హింసాత్మక ఘటనలు
- టీడీపీ అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్నదని పిన్నెల్లి ముందే ఈసీకి లేఖ
- రిగ్గింగ్ నిరోధించడంలో జిల్లా ఎస్పీ విఫలం 14లో



నేడు బంగాళాఖాతంలో

వాయుగుండం

- రేపటికి తుపానుగా మారే అవకాశం.. అనంతరం బంగ్లాదేశ్ వైపు పయనం
- ఆపై తీవ్ర తుపానుగా బలపడే అవకాశం
- మూడు రోజులపాటు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వానలు
- రేపు ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు

- వివరాలు 3లో

పచ్చమూక అరాచకం.. ఆనవాళ్లివిగో..

▶ మొదటి పేజీ తరువాయి
పాపానపోలేదని వైఎస్సార్‌సీపీ నేతలు వాపోతున్నారు. పోలింగ్ రోజు, తరువాత పల్నాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడుల పరంపర కొనసాగింది.

ఓటేసేందుకు వెళ్తున్న ఎస్సీ, ఎస్టీలపై దాడి

రెంటచింతల మండలం తుమృకోటలో మే 13న ఓటు వేసేందుకు వెళ్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళలపై టీడీపీలోని అగ్రకుల నాయకులు విచక్షణారహితంగా దాడి చేశారు. అప్పటికే క్యూలైన్లలో ఉన్న మహిళల్ని కొట్టడంతోపాటు వారిని బయటకు తరిమేసిన టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. పోలింగ్ బూత్‌లో ఏజెంట్లను బయటకు గెంటేశారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తున్న మహిళల తలలు పగులగొట్టారు. దీంతో బాధిత మహిళలు ఆర్తనాదాలు చేస్తూ పరుగులు తీశారు. ఆ ఒక్క కులమే గ్రామంలో బతకాలా.. దళితులకు ఓటు వేసే హక్కులేదా అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. రెంటచింతల మండల పరిధిలోని గోలి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మూఢావత్ మల్లయ్య నాయక్, కొండానాయక్, ఆర్.నాగేశ్వరరావు నాయక్, నాగేశ్వరరావు నాయక్‌లపై టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు.

పాలువాయిగేటు బూత్‌లలో అరాచకం

పాలువాయిగేటు గ్రామంలో టీడీపీ గూండాలు ఈ నెల 13న ఉదయం 6.30 గంటల సమయంలో ప్రవేశించి గ్రామంలోని 201, 202 పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీకి చెందిన వారిని ఓటు వేయనివ్వకుండా అడ్డుకున్నారు. ఇక్కడ జరుగుతున్న అరాచకాన్ని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నంబూరి శేషగిరిరావు బరితెగించి ఓటర్లపై దౌర్జన్యానికి దిగారు. 202 బూత్‌లోకి వెళ్లి ఓటర్లను భయాందోళనకు గురిచేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి, ఎస్పీ బిందుమాధవ్, జేసీ శ్యామ్‌ప్రసాద్ తదితర ఉన్నతాధికారులకు పిన్నెల్లి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు. ఈ సమయంలో టీడీపీ గూండాలు ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో వచ్చి వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడులకు తెగబడ్డారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి, డ్రైవర్ అంజిరెడ్డి, శ్రీను, మరికొందరికి గాయాలయ్యాయి. అక్కడితో ఆగకుండా టీడీపీ వర్గీయులు పిన్నెల్లి కాన్వాయ్‌లోని వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడిలో ప్రధాన నిందితుడు నంబూరి శేషగిరిరావు. అతనిపై పోలీసులు ఏ1గా కేసు నమోదు చేశారు. అయితే.. ఆయనేదో ప్రజాస్వామ్యాన్ని రక్షించాడంటూ చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించడంపై పాలువాయిగేటు గ్రామ ప్రజలు ఛీదరించుకుంటున్నారు.


కారంపూడిలో టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన కారు (ఫైల్)

పోలింగ్ ముగిశాక బుడగ జంగాలపైనా దాడి

కారంపూడి మండలం పేటసన్నెగండ్ల శివారు బాలచంద్రనగర్ (పోతురాజుగుట్ట)లో నివాసం ఉంటున్న బేడ బుడగ జంగాలు తమకు ఓటు వేయలేదని ఆగ్రహించిన టీడీపీకి చెందిన సుమారు 70 మంది పోలింగ్ ముగిశాక వారి ఇళ్లపై దాడి చేశారు. కనిపించిన ప్రతి ఒక్కరినీ కర్రలు, రాళ్లతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. మహిళలు, పిల్లలని కూడా చూడకుండా చావబాదారు. ఇళ్లలోని సామాన్లు, చివరకు ఫ్యాన్లు, బల్బులను కూడా పగులగొట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పెల్లూరి కోటయ్యకు చెందిన స్కార్పియో కారును ధ్వంసం చేశారు. గొర్ల సైదులు చేయి, కాలిపై కర్రలతో బాదారు. కత్తెర లక్ష్మి చేయి విరగ్గొట్టారు. రాళ్ల దాడితో పోతురాజుగుట్టలోని వారంతా ప్రాణభయంతో పారిపోయి వేరేచోట తలదాచుకున్నారు. 'ఏరా.. టీడీపీకి ఓటు వేయకుండా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేస్తారా. నా కొడకల్లారా..' అంటూ తీవ్రంగా దూషిస్తూ అరాచకపర్వాన్ని కొనసాగించారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. తాము అధికారంలోకి వచ్చాక మీ అంతు చూస్తామని బెదిరించారన్నారు.

ఊరొదిలి పారిపోయిన బడుగు జీవులు

గురజాల నియోజకవర్గ పరిధిలోని మాచవరం మండలం కొత్త గణేషునిపాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకి చెందిన కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లు వేశారన్న అక్కసుతో యరపతినేని శ్రీనివాస్ వర్గీయులు పక్క గ్రామాల నుంచి పెద్దఎత్తున టీడీపీ రౌడీలు, గూండాలను తీసుకొచ్చి పోలింగ్ రోజు రాత్రి దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల్ని లక్ష్యంగా చేసుకుని వారి ఇళ్లపై దాడులకు పాల్పడి ధ్వంసరచన సాగించారు. బైక్‌లు, జేసీబీలు, ఆటోలను, ఇళ్లలోని సామగ్రితోపాటు టీవీలు ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. మహిళలు, పిల్లలు అనే కనికరం కూడా లేకుండా బూతులు తిడుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనతో గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నేతలు పొలాల్లోకి పారిపోయి అర్ధరాత్రి బిక్కుబిక్కుమంటూ గడిపారు. మహిళలు, చిన్న పిల్లలు, మహిళలు గంగమ్మ గుడిలో తలదాచుకున్నారని తెలిసి రాళ్లు విసురుతూ భయకంపితుల్ని చేశారు. పోలీసులకు విషయం తెలిసినా గ్రామానికి చేరుకోలేని పరిస్థితి కల్పించారు. ఇప్పటికీ ఆ గ్రామానికి చెందిన బాధితులు అజ్ఞాతంలో ఉండగా, వారిపైనే పోలీసులు కేసులు నమోదు చేయడం కొసమెరుపు. బాధితుల్ని పరామర్శించడానికి వెళ్లిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్‌కుమార్, కాసు మహేష్‌రెడ్డిపై కూడా టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయంటే వారి అరాచకం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి నాయకుల్ని గ్రామాలు దాటించాల్సిన భయానక పరిస్థితులు నెలకొన్నాయి.

ముప్పాళ్లలో మైనార్టీలపై దాడులు

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ల మండలం తొండపిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ముస్లింల ఇళ్లలోకి టీడీపీ సానుభూతిపరులు మూకుమ్మడిగా చొరబడ్డారు. మహిళలను, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలోని పురుషులంతా ప్రాణాలు కాపాడుకునేందుకు పొలాల్లోకి పరుగులు తీశారు. మహిళలు, చిన్నారులు తలుపులు వేసుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉండిపోయారు. ముస్లిం వర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గ్రామం వదిలి వెళ్లిపోయారు.

కంభంపాడులో విధ్వంసకాండ

పెదకూరపాడు నియోజకవర్గం కంభంపాడులో పోలింగ్ రోజున వైఎస్సార్‌సీపీకి పట్టున్న ఎస్సీ, బీసీ కాలనీలపై కత్తులు, కర్రలతో టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీరంగం వేశారు. మహిళలపైనా దాడులకు తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ ఆర్తిమళ్ల నాగేశ్వరరావు (నాగయ్య), సతీమణి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు అంజిమ్మ లక్ష్యంగా టీడీపీ కార్యకర్తలు, నేతలు దాడులకు పాల్పడ్డారు. పలుమార్లు ఎస్సీ, బీసీ కాలనీలకు టీడీపీ రౌడీ మూక వెళ్లి అక్కడ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారు.

ఎస్సీలపై దాష్టీకం

చిలకలూరిపేట మండలం కావూరు ఎస్సీ కాలనీలో పోలింగ్ సందర్భంగా మే 13వ తేదీ రాత్రి వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకుల దౌర్జన్యం చేశారు. వైఎస్సార్‌సీపీకి ఎస్సీలు ఓటు వేశారన్న అక్కసుతో వారిపై టీడీపీ నేతలు దాడి చేశారు. పోలింగ్ మరుసటి రోజు నుంచి కాలనీకి చెందిన ఎస్సీలు గ్రామంలోని ప్లాంట్‌నుంచి మంచినీరు తీసుకువెళ్లకుండా టీడీపీ నేతలు తమ దాష్టీకాన్ని చాటుకున్నారు.

ఓటేయకుండా అడ్డుకున్నారు



ఓటేద్దామని పోలింగ్ బూత్‌కు వెళితే టీడీపీ నేతలు బెదిరించి అడ్డుకున్నారు. కర్రలతో దాడులు చేస్తుండటంతో ప్రాణభయంతో ఇంటికి పారిపోయా. అధికారులకు చెప్పినా చూస్తూ నిలబడిపోయారు. ప్రాణాలు కాపాడుకోవడం మేలని ఓటేయకుండా తిరిగొచ్చేశా. – కర్రా ఏసుపాదం, ఎస్సీ మహిళ, తుమృకోట

ఓటు వేయలేకపోయా



ఓటు వేయాలని రెండుసార్లు పోలింగ్ బూత్‌కు వెళ్లాను. అక్కడ యుద్ధ వాతావరణం చూసి భయపడి ఇంటికి వచ్చేశా. టీడీపీకి చెందిన వారు దాడులు చేస్తూ బడుగులను భయపెట్టి ఇళ్లకు పంపించారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి నేను చూడలేదు.
– నందిగం పున్నమ్మ, ఎస్సీ మహిళ, తుమృకోట

నా భర్తను కొట్టారు



ఓటు వేయడానికి వెళ్లిన నా భర్త దీపావత్ స్వామినాయక్‌ను టీడీపీ గూండాలు దారుణంగా కొట్టారు. నన్ను కూడా ఓటు వేయకుండా బెదిరించారు. పోలింగ్ బూత్‌ల వద్ద దాడులు చేయడంతో మా కాలనీలో ఎవరూ ఓటు వేయలేదు. అధికారులు మాకు రక్షణ కల్పించలేకపోవడం వల్ల ప్రాణ భయంతో ఓటు వేయడానికి వెళ్లలేదు.
– దీపావత్ రమణ, ఎస్టీ మహిళ, తుమృకోట

వైఎస్సార్ సీపీకి ఓటు వేశామని దాడి



టీడీపీ నేతలు పోలింగ్ రోజు మా ఇళ్ల మీద పడి కనపడిన వారిని కనపడినట్టు కొట్టారు. మా ఆస్తులను ధ్వంసం చేశారు. నా చేయి, కాలుపై కర్రలతో కొట్టారు. నాతో పాటు మరో నలుగురిని కొట్టారు. బీభత్సం చేశారు.
– గొర్ల సైదులు, జంగాల కాలనీ, పేటసన్నెగండ్ల , కారంపూడి

ప్రాణభయంతో పరుగులు పెట్టా



ఓటు వేయవద్దని.. వేస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని టీడీపీ నేతలు బెదిరించారు. గ్రామస్తులు లెక్కచేయకపోవడంతో రిగ్గింగ్ చేయాలనే తలంపుతో దళితులపై కర్రలు, రాళ్లతో దాడులు చేయడంతో ప్రాణాలు కాపాడుకోవడం కోసం పరుగులు పెట్టా.
– కత్తి భూలక్ష్మి, ఎస్సీ మహిళ, పాలువాయిగేటు, రెంటచింతల మండలం

ఆ అభ్యర్థులకు హైకోర్టు రక్షణ

▶ మొదటి పేజీ తరువాయి
తదితరులనూ ఆదేశించింది. పోలీసులు ఎన్నికల సంఘం నియంత్రణలో పనిచేస్తున్నారని, అందువల్ల అభ్యర్థుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని ప్రధాన ఎన్నికల అధికారికి స్పష్టంచేసింది. అంతేకాక.. ఆయా కేసులకు సంబంధించి సాక్షులను ప్రభావితం చేయడంగానీ.. దర్యాప్తులో జోక్యం చేసుకోవడంగానీ చేయరాదని ఆదేశించింది. కేసు పూర్వాపరాల ఆధారంగా ఎలాంటి అభిప్రాయం వ్యక్తంచేయడం లేదన్న హైకోర్టు, ఈ వ్యాజ్యాల్లో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి గురువారం రాత్రి మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.

అరెస్టుకు అవకాశం ఉంది.. మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వండి..

ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలకు సంబంధించి నమోదైన కేసుల్లో పోలీసులు తమను అరెస్టుచేసే అవకాశముందని, అందువల్ల తమకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నర్సరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌లతో పలువురు స్వతంత్ర అభ్యర్థులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు టి. నిరంజన్‌రెడ్డి, పి.వీరారెడ్డి, ఓ.మనోహర్‌రెడ్డి, పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎస్.రామలక్ష్మణరెడ్డి, చుక్కపల్లి భానుప్రకాశ్.. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి తమ తమ వాదనలను వినిపించారు.

సుప్రీంకోర్టుకన్నా తామే ఎక్కువని ఈసీ భావిస్తోంది..

పిటిషనర్లపై నమోదైన కేసులన్నీ కూడా ఏడేళ్ల కంటే తక్కువ శిక్షపడే కేసులని, అందువల్ల వారికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇచ్చి విచారించాల్సి ఉంటుందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏడేళ్ల కన్నా తక్కువ శిక్షపడే కేసుల్లో అరెస్టుచేయడానికి వీల్లేదన్నారు. అయితే, ఎన్నికల సంఘం మాత్రం రామకృష్ణారెడ్డిని అరెస్టుచేసి తీరుతామని ప్రకటనలు ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు కన్నా తామే ఎక్కువన్న విధంగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని తెలిపారు. అలాగే, టీడీపీ నేత నారా లోకేశ్ ఎక్స్ ఖాతాలో పోస్ట్‌చేసిన వీడియో ఆధారంగా ఎన్నికల కమిషన్ రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయాలని ఆదేశించిందన్నారు. వాస్తవాలు విచారించకుండా ఇలాంటి వీడియోల ఆధారంగా అరెస్టుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇలా వ్యవహరించిన ఉదంతాలు గతంలో ఎక్కడా లేవన్నారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఎనిమిది పోలీసు బృందాలు రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల వెంటపడ్డాయన్నారు. తాము కౌంటింగ్ పూర్తయ్యే వరకు పోలీసుల అరెస్టు నుంచి రక్షణ కోరుతున్నామని సీనియర్ న్యాయవాదులు తెలిపారు. ఇప్పుడు అరెస్టుచేస్తే కౌంటింగ్ రోజున ఏజెంట్లను నియమించుకునే అవకాశం కూడా ఉండదన్నారు. దీనివల్ల పిటిషనర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ సమయంలో పీపీ నాగిరెడ్డి జోక్యం చేసుకుంటూ.. మధ్యంతర బెయిల్ ఇస్తే మొన్న జరిగిన ఘటనల వంటి వాటిని పునరావృత్తం చేసే అవకాశం ఉందన్నారు. ఒకవేళ మధ్యంతర బెయిల్ ఇవ్వాలనుకుంటే షరతులు విధించాలని కోర్టుకు విన్నవించారు. ఎలాంటి ఘటనలు జరిగినా వారినే బాధ్యులుగా చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన కోరారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి, హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకు పోలీసుల అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేశారు. అప్పటివరకు పిటిషనర్లను అరెస్టు చెయ్యొద్దని పోలీసులను ఆదేశించారు.

ఆ పిటిషన్ల విచారణ 30కి వాయిదా..

ఇదిలా ఉంటే, ఎన్నికల సమయంలో, ఎన్నికల తరువాత జరిగిన ఘర్షణలపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ పలువురు వ్యక్తులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

ఈసీ ఘోర వైఫల్యం..

ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు



విశాఖ సిటీ: రాష్ట్రంలో స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించడంలో ఎన్నికల సంఘం ఘోరంగా విఫలమైందని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి వి.ఆర్.కృష్ణంరాజు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. గురువారం శంకరమఠం ప్రాంతంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన విషయాలను వెల్లడించారు. పోలింగ్ అనంతరం పల్నాడు, నంద్యాల, అనంతపురం, తిరుపతి, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనల్లో 4,668 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. 10 చోట్ల కూటమి సానుభూతిపరులు, ఒకచోట వైసీపీ నాయకుడు ఈవీఎంలను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనలపై ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, ఎన్నికల సంఘం ఉదాసీనంగా వ్యవహరించిందన్నారు. కొన్ని చోట్ల పోలింగ్ బూత్ సిబ్బందీ ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలూ ఉన్నాయని, వాటిపైనా ఎన్నికల సంఘం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పిన్నెల్లికి లుకౌట్ నోటీసు దారుణం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు: వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఒక ప్రజానాయకుడని, అలాంటి నేతకు లుకౌట్ నోటీస్ జారీచేయడం చాలా దారుణమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. గురువారం మీడియాతో మాట్లాడారు. ఒకరేమో పదేళ్ల శిక్ష పడుతుందని, ఇంకొకరేమో జీవితఖైదని ...ఇలా ఎవరికివారే పరిధులు దాటి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని కొరముట్ల దుయ్యబట్టారు. ఏ శిక్ష వేయాలో ఈనాడు, ఆంధ్రజ్యోతి నిర్ణయిస్తుందా? అని ప్రశ్నించారు. కూటమి అభ్యర్థి గుప్త గుంతకల్‌లో ఈవీఎంను పగల కొడితే ఎలాంటి చర్యలు తీసుకోని ఎన్నికల సంఘం పిన్నెల్లిపై లుకౌట్ నోటీస్ జారీచేయడం తప్పని అన్నారు. రెంటచింతలలో జరిగిన సంఘటనపై నివేదిక రప్పించుకోకుండానే లోకేష్, చంద్రబాబులు ఏది చెబితే దాన్నే పోలీసులు అనుసరిస్తున్నారని విమర్శించారు. ఈసీ ప్రకటనలపై అనుమానాలు ఉన్నాయని, చంద్రబాబు డైరెక్షన్‌లో అత్యుత్సాహం చూపిస్తోందన్నారు. మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్‌నాడు ఈవీఎంలకు సంబంధించి ఏడు ఘటనలు జరిగాయని ఈసీనే చెబుతుంది కదా.. చిత్తశుద్ధి ఉంటే మొత్తం వీడియోలను, 7 చోట్ల జరిగిన ఘటనలకు సంబంధించిన ఫుల్ వీడియోలను ఈసీ ఎందుకు బయటపెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు.

ఈసీ అండగా పేట్రేగిన టీడీపీ

హనుమంత్ నాయక్



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పనిచేయడం దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. 'పల్నాడులో పచ్చ నేతలు కుట్ర రాజకీయాలు చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో రిగ్గింగ్ కు పాల్పడ్డారు. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ రిగ్గింగ్ చేస్తోందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదిచ్చినా స్పందించకపోవడం అన్యాయం. పిన్నెల్లిని ఓడించడం చేతకాక, నీచ రాజకీయాలకు టీడీపీ తెరతీసింది. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాలే టీడీపీ కూటమికి జవాబు చెబుతాయి' అని చెప్పారు.

కూటమి సేవలో ఘనాపాఠి

▶ మొదటి పేజీ తరువాయి
ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు వ్యవస్థ రాజకీయ బురద పులుముకుంటే ప్రజాస్వామ్యానికి ఎంత చేటు కలుగుతుందో చెప్పేందుకు ఈ 'పచ్చ' ఖాకీ కథే నిదర్శనం!

పోలింగ్‌కు ముందు పల్నాడులో పచ్చ జట్టు

పల్నాడులో టీడీపీ పరిస్థితి దయనీయంగా ఉందని గుర్తించిన చంద్రబాబు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే కుట్రకు తెరతీశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైన పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని పావులు కదిపారు. గుంటూరు డీఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ శివశంకర్‌రెడ్డితోపాటు క్షేత్రస్థాయిలో కీలకమైన డీఎస్పీలు, సీఐలపై అసత్య ఆరోపణలతో ఎన్నికల కమిషన్(ఈసీ)కి ఫిర్యాదులు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా కథ నడిపించారు. టీడీపీ ఆరోపణలు చేసిన పోలీసు అధికారులపైనే ఆమె ఫిర్యాదు చేయడం గమనార్హం. అంతేకాదు.. ఆ అధికారుల స్థానాల్లో ఎవర్ని నియమించాలో సూచిస్తూ ఆమె ఏకంగా జాబితా సమర్పించడం గమనార్హం. అంటే ఈసీ అధికార పరిధిలో పురందేశ్వరి జోక్యం చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. టీడీపీ, బీజేపీ ఒత్తిడికి ఈసీ తలొగ్గినట్టు అనంతరం పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో గుంటూరు డీఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని ఈసీ ఆకస్మికంగా బదిలీ చేసింది. వారి స్థానాల్లో టీడీపీ అనుకూలురైన పోలీసు అధికారులు నియమితులయ్యారు. గుంటూరు ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, ఎస్పీగా గరికపాటి బిందు మాధవ్ బాధ్యతలు చేపట్టారు.

జాబితా పంపిన నిమ్మగడ్డ, వర్ల

చంద్రబాబుకు నమ్మిన బంటు అయిన వివాదాస్పద ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అత్యంత సన్నిహితుడు. ఎస్పీగా నియమించిన గరికపాటి బిందు మాధవ్ నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు బంధువు. ఐజీగా రాగానే త్రిపాఠి టీడీపీ కుట్రలను అమలు చేశారు. పోలింగ్‌కు కేవలం రెండు రోజుల ముందు మాచర్ల టౌన్ సీఐ పి.శరత్‌బాబు, కారంపూడి సీఐ చిన్నమల్లయ్య, గురజాల సీఐ పల్లపురాజు, ఎస్సై ఎం.రామాంజనేయులును బదిలీ చేయడం గమనార్హం. వారి స్థానాల్లో నియమించాల్సిన అధికారుల జాబితాను సైతం ఆయనే పంపించారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్, టీడీపీ అధికార ప్రతినిధి వర్ల రామయ్య ఇచ్చిన జాబితాలనే ఆయన పంపడం గమనార్హం. టీడీపీకి అనుకూలురైన కోటేశ్వరరావు మాచర్ల టౌన్ సీఐగా, కారంపూడి సీఐగా నారాయణస్వామి నియమితులయ్యారు. రెంటచింతల మండలానికి చెందిన నారాయణస్వామి టీడీపీ గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు సన్నిహితుడు.

అరాచకాలకు అండదండలు

- పోలింగ్‌కు మూడు రోజుల ముందు మాచర్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి, మాజీ ఎంపీపీ వెల్దుర్తిలో ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీ మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. విధి నిర్వహణలో ఉన్న ఎస్సై, కానిస్టేబుళ్లపై కూడా పచ్చమూకలు దాడి చేయడం గమనార్హం. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. దాడికి పాల్పడిన వారిని కనీసం స్టేషన్‌కు పిలిచి కూడా మాట్లాడలేదు.
- నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు విద్యా సంస్థలకు చెందిన బస్సులో టీడీపీ కార్యకర్తలు హోలోగ్రామ్‌లు ముద్రించిన ఓటర్ల స్లిప్పులు, డబ్బులు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఐజీ త్రిపాఠి ఆదేశాలతో వాటిని జప్తు చేయకుండా వదిలేశారు.
- పోలింగ్‌కు రెండు రోజుల ముందు అంటే మే 11న రెంటచింతలలో టీడీపీ వర్గీయులతో సమావేశమైన సీఐ నారాయణస్వామి.. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినా తాము పట్టించుకోబోమని భరోసానిచ్చారు. అదే రోజు కారంపూడి మండల వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డిని ఆయన కాలితో తన్నారు. వెంకటపల్లిలో టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసినట్లు సమాచారం అందినా ఒక్క కానిస్టేబుల్‌ను అక్కడకు పంపారు. అనంతరం ఆయనే ఆ గ్రామానికి వెళ్లి బాధితుడైన మహేష్‌ను ఓ విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టారు.
- మే 12న సీఐ నారాయణస్వామి టీడీపీ వర్గీయులతో కలసి రెంటచింతల వెళ్లారు. దాదాపు 200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి చెందిన మోర్తల ఉమామహేశ్వరరెడ్డి, ఆయన అనుచరులపై దాడికి తెగబడ్డా నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఐజీ త్రిపాఠి ఆదేశాలతో ఉదాశీనంగా వ్యవహరించారు. తద్వారా దాడులకు తెగబడ్డా, ఓటర్లను బెదిరించినా పట్టించుకోబోమని టీడీపీ శ్రేణులకు సంకేతాలిచ్చారు.

పోలీసులను కట్టడి చేసి..

పల్నాడు అంతా టీడీపీ అనుకూల పోలీసు అధికారుల ద్వారా తమ గుప్పిట్లోకి వచ్చిన తరువాత చంద్రబాబు తన రెండో దశ కుట్రను అమలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, పేద వర్గాలకు చెందిన ఓటర్లను బెంబేలెత్తించి వారు ఓట్లు వేయకుండా అడ్డుకోవాలన్న పచ్చ పన్నాగానికి ఐజీ త్రిపాఠి కొమ్ము కాశారు. జిల్లాలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తనకు చెప్పకుండా కాలు కదపటానికి వీల్లేదని ఆదేశించారు. ఎక్కడైనా హింసాత్మక సంఘటనలు జరుగుతున్నట్లు సమాచారం అందినా సరే తాను అనుమతిస్తేనే వెళ్లాలని స్పష్టం చేశారు. టీడీపీ మూకలు దౌర్జన్యాలకు పాల్పడ్డ ప్రాంతాల వైపు పోలీసులు కన్నెత్తి చూడకుండా ఉండేందుకే త్రిపాఠి ఇలా వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది.

రిగ్గింగ్ నిరోధించాలని పిన్నెల్లి మొర పెట్టుకున్నా..

టీడీపీ వర్గీయులు కొత్తూరు, కంభంపాడు, భైరవునిపాడు, రెంటాల, జెట్టిపాలెం, పాల్వాయిగేటు, గోలి, మిట్టగుడిపాడు, కారంపూడి, ఒప్పిచర్ల, పేట సన్నెగండ్ల, చింతపల్లి, ముటుకూరు, అడిగొప్పుల, పోలేపల్లి, వెల్దుర్తి, లోయపల్లి, వజ్రాలపాడు, గొట్టిపాడు, నర్సపెంట గ్రామాల్లో రిగ్గింగ్‌కు కుట్ర చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆ 20 గ్రామాల్లో సక్రమంగా పోలింగ్ జరిగేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఆ కాపీని ఐజీ త్రిపాఠీకి అందచేసి టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడకుండా కట్టడి చేయాలని కోరినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. వెల్దుర్తితోపాటు ఆ 20 గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ గూండాలు దాడి చేసి చితకబాది బూత్‌ల నుంచి వెళ్లగొట్టినా స్పందించలేదు. టీడీపీ రౌడీమూకలు ఆరు కేంద్రాల్లో ఈవీఎంలను ధ్వంసం చేశాయి. దీనిపై సమాచారం అందినా ఆ పోలింగ్ కేంద్రాల వద్దకు ఒక డీఎస్పీని కూడా పంపలేదు. త్రిపాఠి ఆ పోలింగ్ కేంద్రాలను కనీసం సందర్శించ లేదు.

కుట్రలకు సహకారం..

కీలకమైన పోలింగ్ రోజు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తానో పోలీస్ ఉన్నతాధికారిననే విషయాన్ని విస్మరించి టీడీపీ కార్యకర్త తరహాలో చెలరేగిపోయారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాల్సిన ఆయన ఓ వర్గానికి వత్తాసు పలికారు. స్వయంగా పల్నాడులో తిష్ట వేసి మరీ టీడీపీ రిగ్గింగ్‌కు కొమ్ము కాయడం విభ్రాంతి కలిగిస్తోంది. మాచర్లలోని కేసీపీ సిమెంట్స్ గెస్ట్ హౌస్, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ కేంద్రంగా టీడీపీ కుట్రలకు సంపూర్ణ సహకారం అందించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామం కండ్లకుంటతోపాటు పరిసర గ్రామాల్లో టీడీపీ ఏజెంట్లను ఐజీ త్రిపాఠీనే నియమించడం గమనార్హం. అంతేకాదు.. ఆయనతోపాటు ఎస్పీ బిందుమాధవ్ ఆ గ్రామాల్లోనే ఉన్నారు. ఒక అదనపు ఎస్పీ, ఒక ట్రైనీ ఐపీఎస్, డీఎస్పీ, ఇద్దరు సీఐలను అక్కడ నియమించారు. అదే త్రిపాఠికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి స్వగ్రామం వెల్దుర్తిలో అన్ని పార్టీల ఏజెంట్లు ఉన్నారో లేదో చూడాలని కూడా అనిపించలేదు.

పదేపదే ఫోన్లు చేసినా..

పల్నాడు అంతటా టీడీపీ శ్రేణులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినా పట్టించుకోవద్దని సంకేతాలిచ్చి ఐజీ త్రిపాఠి పోలీసుల చేతులు కట్టేశారు. అదే అదనుగా అల్లరి మూకలు కర్రలు, కత్తులు, రాడ్లు పట్టుకుని స్వైర విహారం చేస్తున్నా పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తుండి పోయింది. పోలింగ్ రోజు ఉదయం 9 గంటలలోపే యథేచ్ఛగా రిగ్గింగ్ పాల్పడాలన్న టీడీపీ కుట్రకు త్రిపాఠి కొమ్ము కాశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం వర్గాలు అత్యధికంగా ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ విధ్వంసకాండ సృష్టించింది. మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి, కారంపూడి, దుర్గి, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, పెదకూరపాడు... ఇలా పల్నాడు అంతటా పచ్చ ముఠాలు బరితెగించి అక్రమాలకు పాల్పడ్డాయి. పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడి చేసి బయటకు వెళ్లగొట్టినా, ఓటర్లను బెదిరించి పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుకున్నా, టీడీపీ కార్యకర్తలు రిగ్గింగ్ చేస్తున్నా పోలీసులు మౌనముద్ర దాల్చారు. దీనిపై ఐజీ త్రిపాఠి, ఎస్పీ బిందు మాధవ్‌లకు వైఎస్సార్‌సీపీ నేతలు పదేపదే ఫోన్లు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఎన్నికల కమిషన్, ఇతర ఉన్నతాధికారులకు ఫోన్ల మీద ఫోన్లు చేయడంతో ఉదయం 9 గంటల తరువాత వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను అనుమతించారు.

కౌంటింగ్ రోజు అక్రమాలకు అభయం!

ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి దన్నుతో పల్నాడులో భయానక వాతావరణం సృష్టించిన పచ్చ ముఠాలు ఓట్ల లెక్కింపు రోజైన జూన్ 4న మరోసారి దాడులకు తెగబడాలని పథకం రచిస్తున్నాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు లేకుండా చేసి ఓట్ల లెక్కింపులో అక్రమాలకు పాల్పడాలని పన్నాగం వేశాయి. దీనిపై నిఘా వర్గాలు స్పష్టమైన నివేదిక ఇచ్చినా ఐజీ త్రిపాఠి నిర్లిప్తంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. పోలింగ్ సందర్భంగా దాడులకు పాల్పడిన రౌడీమూకలను ఇప్పటివరకు గుర్తించకపోవడం గమనార్హం. పల్నాడు జిల్లాలో 581 మంది దాడుల్లో పాల్గొన్నట్టు నిర్ధారించగా ఇప్పటివరకు 274 మందినే గుర్తించారు. మరో 307 మందిని ఇంతవరకు గుర్తించలేదు. వీరిలో అత్యధికంగా మాచర్ల నియోజకవర్గానికి చెందినవారే 245 మంది ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నరసరావుపేట నియోజకవర్గానికి చెందినవారు 62 మంది ఉన్నారు. ఇప్పటివరకు గుర్తించిన వారిలో కేవలం 19 మందినే పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా గురజాల నియోజకవర్గానికి చెందినవారే. మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల్లో పోలింగ్ రోజు దాడులకు పాల్పడ్డ వారిలో ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదంటే ఐజీ త్రిపాఠి నేతృత్వంలో పోలీసు యంత్రాంగం ఎంత చేష్టలుడిగి చూస్తోందో అర్థమవుతోంది. టీడీపీ గూండాల దాడులపై వీడియోలతో స్పష్టమైన ఆధారాలున్నా అరెస్ట్ చేయకపోవడం వెనుక టీడీపీ ఒత్తిళ్లు ఉన్నట్టు వెల్లడవుతోంది. ఓట్ల లెక్కింపు రోజు వరకూ ఆ నిందితులను అదుపులోకి తీసుకోకూడదన్నది పోలీసుల ఉద్దేశంగా ఉంది. తద్వారా మరోసారి దాడులు, దౌర్జన్యాలతో భయానక పరిస్థితి సృష్టించేందుకు పోలీసు యంత్రాంగం కొమ్ము కాస్తున్నట్లు స్పష్టమవుతోంది.

నేడు బంగాళాఖాతంలో
వాయుగుండం

రేపటికి తుపానుగా మారే అవకాశం



సాక్షి, విశాఖపట్నం: దక్షిణ బంగాళాఖాతానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం గురువారం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. అనంతరం అదే దిశలో పయనిస్తూ శనివారం ఉదయానికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉంది. ఆ తరువాత ఉత్తరం వైపు వెళ్లి 26వ తేదీ ఆదివారం సాయంత్రానికి బంగ్లాదేశ్, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకుని తీవ్ర తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గురువారం రాత్రి నివేదికలో వెల్లడించింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో శుక్ర, శని వారాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉత్తర కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉంది. శనివారం అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. ఆదివారం అల్లూరి సీతారామరాజు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో పిడుగులు కూడా సంభవిస్తాయని తెలిపింది.

నేడు, రేపు కొన్నిచోట్ల వడగాడ్పులు

కాగా.. మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కొన్ని జిల్లాల్లో సాధారణంకంటే 3నుంచి 5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వీటి ఫలితంగా రానున్న రెండు రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. శుక్రవారం శ్రీకాకుళంజిల్లాలో 9, విజయనగరం 11, పార్వతీపురం మన్యం 11, కాకినాడ 1, తూర్పు గోదావరి 1 మండలం చొప్పున 33 మండలాల్లోను, శనివారం శ్రీకాకుళం జిల్లాలో 5, విజయనగరం 7, పార్వతీపురం మన్యం 5, పశ్చిమ గోదావరి 1, ఏలూరు 2, కృష్ణా 2, బాపట్ల జిల్లాలో రెండు చొప్పున 24 మండలాల్లోనూ వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

బాప్ రే.. యాప్‌లతో
తస్మాత్ జాగ్రత్త..!



కొంపముంచుతున్న యాప్స్ పర్మిషన్స్ | మన అజ్ఞానమే సైబర్ నేరగాళ్ల వంచనావకాశం

వ్యక్తిగత సమాచారం మొత్తం నేరగాళ్లకు.. | యాప్స్ పట్ల అప్రమత్తత లేకుంటే అనర్థాలే..

ఆరేళ్ల పిల్లాడి మొదలు అరవై ఏళ్ల వయస్కుల వరకు రాత్రింబగళ్లు మొబైల్ ఫోన్లకు బానిసలు కాని వారంటూ లేరు.. అతి సర్వత్రా వర్జయేత్...అన్నట్లుగా మొబైల్‌ను జాగ్రత్తగా వినియోగించుకునేంతవరకు ఏ ముప్పూ ఉండదు...మనకు అత్యంత చౌకగా లభించే ఇంటర్నెట్ ఆధారంగా సైబర్ నేరగాళ్లు అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఇంటర్నెట్ మొబైల్‌కు అనుసంధానం ద్వారా బ్యాంకింగ్, పే యాప్‌ల వంటి వాటి వరకు ప్రయోజనకరమే. అంతకుమించి ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, ఇంకా లోన్‌యాప్స్ .. విదేశీ పెళ్లి సంబంధాల పేరిట ప్రలోభపెట్టే కాల్స్, యాప్స్.. ఆర్థిక మోసాలు...ఇలాంటివాటి వల్లే ముప్పంతా...వీటిపై సైబర్ నేర పరిశోధకులు తరచూ హెచ్చరిస్తూనే ఉన్నా విద్యాధికులే ఎక్కువగా మోసపోతున్నారు...దీనంతటికీ కారణం... మనం మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకునే యాప్పే కారణమని సైబర్ నేర పరిశోధన నిపుణులు చెబుతున్నారు.. జాగ్రత్తగా ఉండాలని పదేపదే హెచ్చరిస్తున్నారు..

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ లబ్బీపేటకు చెందిన 16 ఏళ్ల కుర్రాడికి ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం హాబీ...వారం రోజులుగా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఫోన్ చేసిన వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొనాలని, లోన్ యాప్స్‌లో డబ్బులు ఇస్తామని, షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయాలని ...ఇలా పలు ఆకర్షణలతో వంచించడానికి ఈ కాల్స్ చేశాయి. తెలివిగా ఆలోచించి, తనకు ఈ ఫేక్ కాల్స్ ఎక్కడ నుంచి వస్తున్నాయా? అని ఆరా తీశాడు. దాదాపు 15 యాప్స్ వరకు తనకు తెలియకుండానే తన మొబైల్‌లో ఇన్‌స్టాలై ఉన్నాయి. ఈ యాప్స్ ఇన్‌స్టాల్ సమయంలో తానిచ్చిన పర్మిషన్స్‌తోనే ఫోన్‌లోని కాల్ డేటా, కాంటాక్ట్ లిస్ట్, కెమెరా యాక్సెస్, లొకేషన్ పూర్తిగా యాప్ నిర్వాహకుల చేతిలోకి వెళ్లిపోయిందని, యాప్ నిర్వాహకులు.. మొబైల్‌లో నిక్షిప్తమైన వివరాలను పలు కంపెనీలకు విక్రయించారని పోలీసుల ద్వారా తెలుసుకుని కంగుతిన్నాడు. సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లకుండా ముందుగానే తేరుకుని ఫోన్‌లో అవసరం లేని యాప్స్‌ను వెంటనే అన్‌ఇన్‌స్టాల్ చేశాడు.

ఈ జాగ్రత్తలు పాటించండి..

కొన్ని యాప్స్‌కు ఎండ్ టు ఎంట్ ఇన్‌స్క్రిప్షన్ ఉండదు. అలాంటి యాప్స్‌ను వాడే వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలి. రెగ్యులర్‌గా వాడని యాప్స్‌కు ఉన్న పర్మిషన్స్‌ను తొలగించాలి. లేదంటే యాప్స్‌ను అన్ ఇన్‌స్టాల్ చేయాలి. అవసరం లేకపోయినా గ్యాలరీ పర్మిషన్ అడిగినప్పుడు 'డినై' చేయాలి. డినై చేసిన తరువాత ఆ యాప్ పని చేయలేదంటే.. మిమ్మల్ని మోసం చేసేందుకు యాప్ సిద్ధంగా ఉందని అర్థం చేసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



అవసరం లేని యాప్స్ మీ ఫోన్‌లో ఎన్నో ఉంటాయి. వాటిని ఎందుకు ఇన్‌స్టాల్ చేసుకున్నారో.. మీకే తెలీదు. అలాంటి వాటితోనే చిక్కులు వస్తుంటాయి. ఆ యాప్స్ చేసే మానిటరింగ్‌తో మీ డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుందని గుర్తించండి. అనాలోచితంగా మీరు ఇచ్చే సమాచారంతోనే సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి మీ నెంబర్లు, మీ వ్యక్తిగత సమాచారం చేరుతుంది. దాని ఆధారంగానే నేరగాళ్లు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారు. కొందరు నేరగాళ్లు.. మీతోనే మీ న్యూడ్ వీడియో తీయించి బ్లాక్‌మెయిల్‌కు తెగబడుతున్నారు.

– కోమాకుల శివాజీ, సీఐ, సైబర్ క్రైం, విజయవాడ

అప్రమత్తంగా లేకుంటే సమస్యలే..



మొబైల్ అప్లికేషన్స్‌కు ఇచ్చే అనుమతుల విషయంలో అప్రమత్తంగా లేకుంటే చాలా ఇబ్బందులు తలెత్తుతాయని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. యాప్స్‌కు పర్మిషన్స్ (లోకేషన్, కాల్ డేటా, కాంటాక్ట్స్, గ్యాలరీ, మైక్రోఫోన్, కెమెరా) ఇవ్వడం ఇబ్బందులను కొని తెచ్చుకోవడమేనని.. వ్యక్తిగత సమాచారాన్ని నేరగాళ్లు, సంఘ విద్రోహ శక్తులు, స్వార్థపరులకు ఇస్తున్న విషయాన్ని గుర్తించాలని హెచ్చరిస్తున్నారు.' కెమెరా, మైక్రో ఫోన్ పర్మిషన్ అన్నింటికంటే ప్రమాదకరమని పోలీసులు చెబుతున్నారు. లోన్ యాప్స్ సృష్టించిన విధ్వంసం ప్రతి ఒక్కరికీ గుర్తుండే ఉంటుంది. ఆర్‌బీఐ గుర్తింపు లేని 150కి పైగా లోన్ యాప్స్ చేసిన మోసానికి, తెగబడిన బెదిరింపులకు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. యువత అమితంగా డౌన్‌లోడ్ చేసుకుని వాడుతున్న డేటింగ్ యాప్స్ దోపిడీకి పాల్పడుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఉసురు తీసిన టేబుల్ ఫ్యాన్

విద్యుదాఘాతంతో దంపతుల మృతి

తోటపల్లిగూడూరు: టేబుల్ ఫ్యాన్ షార్ట్ సర్క్యూట్ కావడంతో దంపతులు మృతి చెందిన ఘటన పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలంలోని చిన్నచెరుకూరులో చోటుచేసుకొంది. ఎస్‌ఐ జంపానీ కుమార్ వివరాల మేరకు.. చిన్నచెరుకూరుకు చెందిన అన్నం నరసయ్య (55) కల్లుగీత కార్మికుడు. బుధవారం రాత్రి భోజనం అనంతరం నరసయ్య తన గదిలో నిద్రపోగా.. భార్య అన్నం భాగ్యమ్మ (50) తన ఇద్దరు కుమారులతో కలిసి మరో గదిలో నిద్రించారు. గురువారం వేకువజామున నరసయ్య కాలు టేబుల్ ఫ్యాన్‌కు తగిలింది. దీంతో నరసయ్యకు కరెంట్ షాక్ తగలడంతో మంచంపై నుంచి కిందపడ్డారు. వెంటనే టేబుల్ ఫ్యాన్ సైతం ఆయనపై పడిపోయింది. నరసయ్య గది నుంచి శబ్దం రావడంతో భాగ్యమ్మ వెళ్లి చూడగా, నేలపై విలవిల్లాడుతున్న భర్తను లేపేందుకు ప్రయత్నించింది. దీంతో ఆమె కూడా కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయింది. పక్క గదిలో ఉన్న కుమారులు నిద్ర లేచి వచ్చేసరికి తల్లిదండ్రులు అపస్మారక స్థితిలో ఉన్నారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దంపతులు మృతి చెందారని నిర్ధారించారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను జీజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

తాడిపత్రి అల్లర్ల ఘటనలో మరో 11 మంది అరెస్ట్

తాడిపత్రి/తాడిపత్రి అర్బన్: పోలింగ్ రోజున, ఆ మరుసటి రోజున తాడిపత్రిలో చెలరేగిన అల్లర్ల ఘటనలో ఇరువర్గాలకు చెందిన మరో 11 మంది నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు తాడిపత్రి అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కేసుల్లో ఇప్పటికే ఇరువర్గాలకు చెందిన 91 మందిని రిమాండ్‌కు పంపారు. తాజాగా గురువారం మరో 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా 9 మందిని బైండోవర్ చేశారు.

కొనసాగుతున్న 'సిట్' విచారణ

తాడిపత్రిలో చెలరేగిన అల్లర్ల ఘటనపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టేందుకు నియమించిన 'సిట్' బృందం సభ్యులు మూడోరోజు గురువారం కూడా తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లోనే మకాం వేశారు. అల్లర్ల ఘటనకు సంబంధించిన కేసుల వివరాలు, నిందితుల గుర్తింపు తదితర వాటిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే తాడిపత్రి అల్లర్ల ఘటనపై డీజీపీకి నివేదిక ఇచ్చిన సిట్ సభ్యులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు నాలుగు రోజుల కిందట రెండో దఫా తాడిపత్రికి వచ్చారు. తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లోనే మకాం వేసి హింసాత్మక ఘటనలపై నిందితులపై పోలీసులు నమోదు చేసిన కేసులతో పాటు ఇరు పార్టీల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు నమోదు చేసిన కేసుల ఎఫ్ఐఆర్‌లను పరిశీలించారు. రోజూ ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అక్కడే ఉంటూ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. సిట్ బృందం సభ్యులు ఇంకా వారం పాటు తాడిపత్రిలోనే మకాం వేయనున్నట్లు తెలుస్తోంది. తాడిపత్రి అల్లర్ల కేసుల్లో నిందితులందరినీ గుర్తించి, గొడవలపై కారణాలను పూర్తి స్థాయిలో నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేసేలా కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

ఎన్నికల హింస కేసులో 54 మంది అరెస్టు

74 మంది బైండోవర్, ఐదుగురిపై రౌడీషీట్లు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసపై గురువారం సిట్ కేసుల్లో 13 మందితో పాటు పోలింగ్‌కు ముందు, ఆ తర్వాత జరిగిన సంఘటనలకు సంబంధించి నమోదైన కేసుల్లో 54 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ మలికా గార్గ్ వెల్లడించారు. ఎన్నికల నేరాల్లో ఈ ఒక్క రోజే తొమ్మిది మందికి 41 సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చామన్నారు. నరసరావుపేట సబ్ డివిజన్‌లో ఒకరు, సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో 46 మంది, గురజాల సబ్ డివిజన్‌లో 27 మందితో కలిపి 74 మందిని బైండోవర్ చేశామన్నారు. నరసరావుపేట సబ్ డివిజన్‌లో ఐదుగురిపై రౌడీషీట్స్ ఓపెన్ చేసి, ఎన్నికల సమయంలో ట్రబుల్ మాంగర్స్‌గా గుర్తించినట్లు తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో నిబంధనలు ఉల్లంఘించిన ఐదుగురిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చేందుకు నోటీసులు ఇచ్చారు. 102 సీఆర్‌పీసీ సెక్షన్‌లో ఒక వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

పాల్వాయిగేటు ఎన్నికల సిబ్బందిపై వేటు

ఎన్నికల పోలింగ్ సందర్భంగా పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలంలోని పాల్వాయి గేటు 202వ పోలింగ్ స్టేషన్లో చోటుచేసుకున్న పరిణామాలపై ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులపై వేటు పడింది. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన సత్తెనపల్లి జీజేసీ జూనియర్ కాలేజ్ జూనియర్ లెక్చరర్ పీవీ సుబ్బారావు, పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూలు స్కూలు అసిస్టెంట్ షేక్ షహనాజ్ బేగంలను ఎన్నికల విధుల ఉల్లంఘన కారణంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి లత్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు అభ్యర్థికి త్రుటిలో తప్పిన ప్రమాదం

గేదెలు అడ్డు రావడంతో ఢీకొన్న రెండు కార్లు

పిఠాపురం/ఏలేశ్వరం: కాకినాడ జిల్లా పిఠాపురం రాపర్తి సెంటర్ వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బెండపూడి నుంచి వస్తున్న ఒక కారు రాపర్తి సెంటర్ వద్దకు వచ్చేసరికి గేదెలు అడ్డంగా వచ్చాయి. దీంతో ఆ కారు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న వరుపుల సుబ్బారావు కారు ముందున్న కారును బలంగా ఢీకొంది. రెండు కార్లూ దెబ్బతిన్నాయి. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రెంటచింతల, నరసరావుపేటలో సిట్ బృందం దర్యాప్తు

రెంటచింతల/నరసరావుపేట టౌన్: ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనల పరిశీలన నిమిత్తం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి నేతృత్వంలో ఇద్దరు సభ్యులతో ఏర్పాటు చేసిన సిట్ బృందం గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి కొన్ని గంటలపాటు పలు రికార్డులను పరిశీలించి దర్యాప్తు చేసింది. ఎన్నికలు ప్రారంభానికి ముందు రెంటాల గ్రామంలో జరిగిన దాడుల్లో పాల్గొన్న వారి పేర్లను, ఆ దాడిలో గాయపడిన ఆరుగురు బాధితులను పిలిపించి ఫిర్యాదులను స్వీకరించింది. మండల పరిధిలోని పాలువాయిగేటు, తుమృకోట, జెట్టిపాలెం గ్రామాల్లో ఈవీఎంలు ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించిన సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, కొందరు గ్రామస్తులను పిలిపించి అందులో దాడులు చేసి ఈవీఎంలను ధ్వంసం చేసిన వారిని గుర్తించారు. ఘటనలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని సిట్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. నరసరావుపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలింగ్ చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై నమోదైన ఐదు కేసులకు సంబంధించిన రికార్డులను సిట్ అదనపు ఎస్పీ సౌమ్యలత గురువారం బృందం పరిశీలించింది.

ముగ్గురు టీచర్ల సస్పెన్షన్

దర్శి: ప్రకాశం జిల్లా దర్శిలో టీడీపీ వారికి ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్‌కు రూ.5 వేలు లంచం తీసుకున్న కేసులో ముగ్గురు ఉపాధ్యాయులను కలెక్టర్ దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ సుభద్ర చర్యలు తీసుకున్నారు. సస్పెండ్ అయిన వారిలో గుత్తా నారాయణ, గోవిందు, అరుణకుమారి ఉన్నారు.

డిమాండ్ బ్రహ్మాండం

కేజీ రూ.వేయి పలుకుతున్న చింత చిగురు.. రుచిలోనే కాదు.. ఆరోగ్యానికి సైతం మేలు

- పలు రకాల పోషకాలు.. యాంటీ ఇన్ఫ్లమేటరీ, డైటరీ ఫైబర్లు
- శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి దోహదం
- గుండె జబ్బుల నివారణకు మేలు... వైరల్ జ్వరాలకు విరుగుడు
- శాకాహార.. మాంసాహారాల్లో అధికంగా వినియోగం
- హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి



చింత చిగురుతో చేసిన వంటకాలు



సాక్షి అమలాపురం: ఆతిథ్యానికి మారుపేరుగా నిలిచే గోదావరి వాసులు రకరకాల వంటకాలతో అతిథులకు భుక్తాయాసం తెప్పించడమే కాదు.. సొంతంగా రుచి చూసేందుకు సైతం వివిధ రకాల వంటకాలు సిద్ధం చేసుకుంటారు. అందునా సీజన్ వారీ వంటలకు గోదారోళ్లు పెట్టింది పేరు. వరదల సీజన్‌లో పులస పులుసుతో దేశీయంగా గుర్తింపు సంతరించుకున్న గోదావరి జిల్లాలు అంతకన్నా రుచికరమైన.. విభిన్నమైన వంటకాలకు ప్రసిద్ధి. అటువంటి వాటిలో చింత చిగురుతో చేసే వంటకాలు మరీ ప్రత్యేకం. రుచిలోనే కాదు... ఆరోగ్యానికి కూడా చింత చిగురు మేలు చేస్తుంది. అందుకే దీనికి డిమాండ్ పెరిగింది.

చింత చిగురుతో చేసే శాకాహార, మాంసాహార వంటల రుచికి ఫిదా కానివారంటూ ఉండరు. చైత్రమాసం దాటిన వెంటనే చింతచెట్టు చిగురించిన ఆకుని సేకరించి అమ్మకాలు చేస్తారు. ఒకప్పుడు వచ్చినట్టు ఇప్పుడు చింతాకు మార్కెట్‌కు రావడం లేదు. గతంలో చింత చెట్లు పల్లె ప్రాంతాల్లోనూ, రోడ్ల పక్కన విరివిగా ఉండేవి. గ్రామాలు, రోడ్ల విస్తరణతో ఆయా చోట్ల వీటిని తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా ఎక్కడా చింత చెట్లను నాటడం లేదు. ఫలితంగా వీటి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. దీంతో పల్లెలకు దూరంగా ఉంటున్న చింత చెట్ల నుంచి చిగురు సేకరణకు ఆసక్తి చూపడం లేదు. చిగురు కోయడానికి ఎక్కువ కూలీ సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. దీని వల్లే ధర పెరిగిపోతోందని చింతాకు విక్రయించే అంబాజీపేట మండలం గంగలకుర్రు అనంతలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. చెట్టు చివరి భాగంలో ఉండే లేత చిగురు చెట్టులు ఎక్కి కోసేవారు తగ్గడం వల్ల చింతాకుకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది.

పెరిగిన వినియోగం

గుప్పెడు చింతాకు ధర రూ.25 పలుకుతోంది. ప్రస్తుత మార్కెట్‌లో వంద గ్రాముల చింత చిగురు ధర రూ.100 వరకు ఉంది. కేజీ రూ.వెయ్యి. గత ఏడాది దీని ధర రూ.500 మాత్రమే. ఈ ఏడాది రెట్టింపయ్యింది. వారపు సంతలు, రోజువారీ సంతలు, ఇళ్లకు వచ్చేవారి వద్ద చింతాకును ఎగబడి కొంటున్నారు. కాలక్రమంలో పల్లెటూళ్లలో చింత చిగురు వినియోగాన్ని తగ్గించారు. కానీ మారిన జీవనశైలి, ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ, యూట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియా, టీవీల్లో ప్రసారమయ్యే వంటకాల్లో చింత చిగురులో ఉన్న పోషక విలువలు, ఔషధ గుణాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుండడంతో ఇప్పుడు పల్లెలు కంటే పట్టణాలు, నగరాల్లోనే దీని వినియోగం బాగా పెరిగింది. ఏడాదిలో జూన్, జులైలో మాత్రమే ఇది దొరుకుతుంది. గతం కంటే అర్బన్ ప్రాంతాల్లో ఏటికేడాది డిమాండ్‌తో పాటు ధర కూడా పెరుగుతోంది. హైదరాబాద్ వంటి ప్రాంతాలకు సైతం చింత చిగురు ఎగుమతి అవుతుండడం వల్ల దీనికి రానురాను డిమాండ్ పెరిగిపోతోంది.

పలు రకాల వంటలు

చింత చిగురుతో చేసే శాకాహార, మాంసహార వంటకాలకు లెక్కే లేదు. అటు శాకాహారానికి.. ఇటు మాంసాహారానికి అదనపు రుచిని తీసుకువస్తోంది. చింత చిగురు పప్పు, చింతాకు కూర (ఉల్లిపాయలు వేసి), చింత చిగురు... పనస పిక్కల కూర శాకాహారుల జిహ్వ చాపల్యాన్ని చల్లారుస్తుంది. ఇంకా దీనితో చట్నీ, పులిహోర, రసం తయారు చేస్తారు. చింత చిగురుతో చేసే మాంసాహార కూరలకు సైతం మంచి డిమాండ్ ఉంది. చింత చిగురు పచ్చిరొయ్యల రుచికి దాసోహం కాని మాంసాహారులు ఉండరు. కోనసీమ నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలోని బంధుమిత్రులకు కూరలు తయారు చేసి పంపేవారు ఉంటారు. చింతాకుతో ఎండు రొయ్యల కలిపి కూడా కూరలు చేస్తారు. ఇక మేక బోటీని చింతచిగురుతో కలిపి చేస్తే దాని రుచి అమోఘమే! ముద్ద నోటిలో పెట్టుకుంటే వేడివేడి అన్నంలో వెన్నపూసలా నమలకుండానే కరిగిపోతుందని మాంసప్రియులు లొట్టలు వేస్తూ గొప్పలు చెబుతారు. ఇవే కాకుండా చింతాకు మాంసం, చింత చిగురు మదుళ్లు (చిన్న రకం చేపలు), చింత చిగురు కొతుకు పరిగి (చేప పిల్లలు) కూరలు సైతం రుచిలో అద్భుతం.

విటమిన్లను శరీరంలో నిక్షిప్తం చేస్తాయి

చింతచిగురు లేత ఆకులలో విటమిన్ సీ (ఆస్కార్బిక్ ఆమ్లం) పుష్కలంగా ఉంటుంది. లేత ఆకులు నీటిలో కరిగే విటమిన్లను శరీరంలో నిక్షిప్తం చేస్తాయి. పిండి పదార్థాలు, కొద్దిపాటి ప్రోటీన్లతోపాటు పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. బీటా కెరోటిన్, కాల్షియం, పోటాషియం వంటి పదార్థాలుంటాయి.

– కదలి సాయిరామ్, ఎస్‌జీసీ కో ఆర్డినేటర్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, అంబాజీపేట



ఆరోగ్యానికి ఔషధం

చింత చిగురు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చింత చిగురులో ఎక్కువ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాలు, ఎక్కువ మోతాదులో ఔషధ గుణాలుంటాయి. ప్రతి వంద గ్రాముల చిగురులో 5.8 గ్రాముల ప్రొటీన్లు, 10.6 గ్రాముల పీచు పదార్థం, 100 మిల్లీగ్రాముల కాల్షియం, 140 మిల్లీగ్రాముల ఫాస్ఫరస్, 26 మి.గ్రా.ల మెగ్నీషియం, విటమిన్–సి 3 మి.గ్రా.లు ఉంటుంది. దీనిలో ఎక్కువగా వున్న ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి.

- చింత చిగురులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలున్నాయి. చింత చిగురును ఉడికించి నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. దీనిలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీంతో ఇది సహజ సిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీని వల్ల మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. చింత చిగురు పైల్స్ ఉన్న వారికి నివారణగా ఉపయోగపడుతుంది.
- వైరల్ ఇన్ఫెక్షన్లతో వచ్చే జ్వరాన్ని చింత చిగురు తగ్గిస్తుంది. నోటి పూతకు చింత చిగురు నివారిణిగా పనిచేస్తుంది. గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. శరీరంలో ఎర్రరక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురు మంచి ఔషధంగా పనిచేస్తుంది.
- జీర్ణాశయ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ చింత చిగురును తింటే ఎముకలు ధృడత్వాన్ని సంతరించుకుంటాయి.
- థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు చింత చిగురును తమ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. సుగర్ వ్యాధిగ్రస్తులు చింత చిగురు తింటే రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. చింత చిగురును ముద్దగా దంచి కీళ్లపై ఉంచితే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి చింతచిగురు మేలు చేస్తుంది. కంటి సంబంధ సమస్యలను కూడా చింత చిగురు దూరం చేస్తుంది. కళ్లు దురదగా ఉన్నప్పుడు కొంత చింత చిగురు తింటే ఉపశమనం కలుగుతుంది.

సీజన్‌లో తినాల్సిందే

చిన్ననాటి నుంచి చింతచిగురుతో చేసిన శాకాహార, మాంసాహార కూరలు తినడం అలవాటు. హైదరాబాద్‌లో ఉన్నా సరే చింతచిగురుతో చేయించిన కూరలు మా ఆత్రేయపురం నుంచి ప్రత్యేకంగా రప్పించుకుంటాం. బంధువులు, స్నేహితులు హైదరాబాద్ వస్తే చింత చిగురు కూరలు పట్టుకుని వస్తారు.

– నడింపల్లి నాగార్జున వర్మ, హైదరాబాద్

సాక్షి

శుక్రవారం, 24 మే 2024

రిషి సాహసం!

వచ్చే జులై 4న బ్రిటన్ దిగువసభ ఎన్నికలు నిర్వహిస్తామంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ బుధవారం చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యపరిచింది. కన్సర్వేటివ్ పార్టీ నిరంతరాయంగా పద్నాలుగేళ్ల నుంచి అధికార పీఠాన్ని అంటిపెట్టుకుంది. అయిదేళ్ల గడువుకు అయిదు నెలల ముందే జరుగుతున్న ఈ ఎన్నికలు వారి పాలనకు చరమగీతం పాడతాయా, మరోసారి అందలమెక్కిస్తాయా అన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. కానీ కన్సర్వేటివ్‌లకు ఆ విషయంలో అనుమానం లేదు. ఓటమి ఖాయమన్న దిగులు ఆ పార్టీని ఆవరించింది. విశ్వవిఖ్యాత కవి, రచయిత విలియం షేక్స్‌పియర్ విరచిత 'హామ్లెట్' నాటకంలోని పాత్ర పలికిన ఆత్మగత సంభాషణలో 'టు బీ ఆర్ నాట్ టు బీ...' అందరికీ గుర్తుండిపోయే పదబంధం. బతకటమా, చావటమా అనే సందిగ్ధ స్థితిని అది చెబుతుంది. కన్సర్వేటివ్ పార్టీ ప్రస్తుతం ఆ సంకటస్థితిలోనే ఉంది. నిరుడు జులైలో దిగువ సభకు జరిగిన మూడు ఉప ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం ఒకటే గెల్చుకుంది. ఈ నెల మొదట్లో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ దాని పరిస్థితి ఏమంత బాగులేదు. నిజానికి నిరుడూ, అంతకు ముందు సంవత్సరమూ దేశం అధిక ద్రవ్యోల్బణంతో కుంగిపోయింది. కానీ నెలరోజుల్లో ఉప ఎన్నికలుంటాయనగా అది చెప్పుకోదగ్గ మేర తగ్గింది. అయినా వోటర్లు కరుణించలేదు. మొన్న స్థానిక ఎన్నికల సమయానికి కూడా ఆర్థిక స్థితి మెరుగుపడిన సూచనలు కనబడ్డాయి. వృద్ధి రేటు బాగుందని జీడీపీ గణాంకాలు చాటాయి. ఆర్థిక మాంద్య ప్రమాదం తప్పిందన్న సంకేతాలు వెలువడ్డాయి. కానీ స్థానిక ఎన్నికల్లో జనం లేబర్ పార్టీ వైపే మొగ్గారు. కన్సర్వేటివ్ పార్టీ రేటింగ్ కనీవినీ ఎరుగని రీతిలో 20 శాతానికి పడిపోయిందని, లేబర్ పార్టీ 44 శాతంతో ముందంజలో ఉన్నదని సర్వేలు చెబుతున్నాయి. బహుశా అందుకే కన్సర్వేటివ్ పార్టీ ఎంపీలూ, రిషి మంత్రివర్గ సహచరులూ గడువుకు ముందే పార్లమెంటు రద్దు చేయటం ప్రమాదకరమంటూ వాదించారు. అయితే రిషి సునాక్ లెక్కలు వేరు. సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు కొన్ని గంటల ముందు వెల్లడైన ఆర్థిక గణాంకాలు ఆయనకు ధైర్యాన్నిచ్చాయి. ద్రవ్యోల్బణం మూడేళ్ల కనిష్ఠానికి పడిపోయిందని గణాంకాలు తేల్చాయి. 2022 అక్టోబర్‌లో 11.1 శాతం ఉన్న ద్రవ్యోల్బణం ప్రస్తుతం 2.3 శాతానికి దిగొచ్చింది. కన్సర్వేటివ్‌లు పెట్టుకున్న 2 శాతం లక్ష్యం కన్నా ఇది కాస్తా ఎక్కువే అయినా ఇంతకు మించి ఆశించకూడదన్న అభిప్రాయం అధికారపక్షంలో ఉంది. మరోపక్క అక్రమ వలసదారులను రువాండాకు సాగనంపే చట్టం ఆమోదం పొందాక ఆ తరహా వలసలు కొద్దో గొప్పో తగ్గాయి. ఈ నేపథ్యంలోనే రిషి అత్యుత్సాహంగా ఎన్నికల ప్రకటన చేశారు. అయితే ఈ పరిస్థితి నిలకడగా కొనసాగుతుందా... మళ్లీ దిగజారుతుందా అన్న సంశయం కన్సర్వేటివ్ శ్రేణులను పట్టి కుదుపుతోంది.

అమెరికా నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ ప్రపంచంలో ఎప్పుడు ఎక్కడ ఎన్నికలు జరిగినా తప్పుడు సమాచారాన్ని జనం మెదళ్లకు ఎక్కించే ప్రయత్నం రివాజుగా మారింది. బ్రిటన్ కూడా అందుకు మినహాయింపు కాదు. దేశం ఎదుర్కొంటున్న సకల అరిష్టాలకూ యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో కొనసాగటమే కారణమన్న తప్పుడు ప్రచారాన్ని తలకెత్తుకున్నది కన్సర్వేటివ్ పార్టీయే. చివరకు వారి ఏలుబడిలోనే తప్పనిసరై ఆ తంతు ముగించారు. బ్రిటన్ స్వేచ్ఛాజీవి అయింది. అయినా ఆర్థిక ఒడుదొడుకులు దాన్ని పీడించాయి. అధిక ధరలు, నిరుద్యోగం పాలకపక్షాన్ని నిద్రపోనీయకుండా చేశాయి. వోటర్లలో కనబడిన అనాసక్తత వల్ల 2019 డిసెంబర్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజారిటీ రాకపోవచ్చన్న అంచనాలు కూడా వచ్చాయి. కానీ అనూహ్యంగా కన్సర్వేటివ్ పార్టీ నికరమైన మెజారిటీతో బోరిస్ జాన్సన్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఆర్థిక అవ్యవస్థను చక్కదిద్దలేక ఆయన తప్పుకోవాల్సి వచ్చింది. ఆయన స్థానంలో వచ్చిన లిజ్ ట్రస్ సైతం ప్రజల్ని నిరాశపరిచారు. కనుకనే ప్రధానిగా రిషి సునాక్‌ను కన్సర్వేటివ్ పార్టీ ఎంచుకుంది. కానీ పదవిలోకొచ్చింది మొదలు రిషికి సమస్యలు తప్పలేదు. జాన్సన్, ట్రస్‌ల మాదిరే ఆయనపై కూడా సాధారణ వోటర్లలో ఏవగింపు మొదలైంది. వ్యక్తిగతంగా రిషి రేటింగ్ కూడా తీసికట్టే! సర్వేలన్నీ వరసబెట్టి దీన్నే చాటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలకు సిద్ధపడటమంటే ఏ ప్రధానికైనా ఆత్మహత్యాసదృశమే. కానీ రిషి తెగింపు వెనక కారణం ఉంది. ప్రత్యర్థి లేబర్ పార్టీకి వోటర్ల ఆదరణ బాగానేవున్నా వ్యక్తిగతంగా ఆ పార్టీ నాయకుడు కియర్ స్టార్మర్ పై ప్రజలకంత విశ్వాసం లేదు. అందుకే ఎన్నికలకు ఇంతకన్నా మంచి ముహూర్తం ఉండబోదన్న నిర్ణయానికి రిషి వచ్చివుండొచ్చు. దానికితోడు స్టార్మర్ ప్రధాన నినాదం 'ఆర్థిక సుస్థిరత'. అది ఇప్పటికే సాధించినట్టు గణాంకాలు చెబుతుండగా ఆ నినాదానికి విలువుండదని రిషి నమ్మకం.

రష్యా దురాక్రమణ యుద్ధం, గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ, ఇరాన్ దూకుడు... మరో ప్రపంచయుద్ధానికి దారితీస్తాయన్న భయాందోళనలు అన్నిచోట్లా ఉన్నట్టే బ్రిటన్‌లోనూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మితవాద పార్టీ కన్సర్వేటివ్‌లు అధికారంలో ఉండటమే ఉత్తమమన్న వాదనను ఆ పార్టీ తెరపైకి తీసుకొస్తోంది. సైనిక వ్యయాన్ని అదుపు చేస్తామన్న లేబర్ పార్టీ వాగ్దానం ప్రమాదకరమని కూడా ఆ పార్టీ ప్రచారం మొదలుపెట్టింది. కనుక రాబోయే ఎన్నికలు రక్షణ, భద్రత చుట్టూ తిరిగే అవకాశం లేకపోలేదు. తనకొచ్చిన అవకాశాన్ని లేబర్ పార్టీ సద్వినియోగం చేసుకుని అధికారంలోకి వస్తుందా లేక వోటర్లను ఒప్పించలేక చతికిల పడుతుందా అన్నది మరికొన్నాళ్లలో తేలిపోతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం, తిథి: బ.పాడ్యమి సా.6.55 వరకు, తదుపరి విదియ
నక్షత్రం: అనూరాధ ఉ.9.58 వరకు, తదుపరి జ్యేష్ఠ
వర్జ్యం: ప.3.43 నుండి 5.19 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.03 నుండి 8.51 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.11 వరకు
అమృతఘడియలు: రా.1.32 నుండి 3.13 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

రైసీ మరణం రేపుతున్న ప్రశ్నలు

విశ్లేషణ



కేసీ సింగ్

ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడుల నేపథ్యంలో... ఇజ్రాయెల్‌తో, అమెరికాతో ఇరాన్‌కు ప్రచ్ఛన్న ఘర్షణ జరుగుతున్న తరుణంలో ఆ దేశాధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హఠాన్మరణం ఇరాన్‌కు అకాల ఘటనే అని చెప్పాలి. తాలిబాన్ పాలనలో ఉన్న అఫ్గానిస్తాన్, ఇరాన్ దేశాలు ఇజ్రాయెల్‌తో పోరాడటానికి తమ ప్రచ్ఛన్న ఘర్షణలను ముందుకు తీసుకువెళుతున్న దశ ఇది. ఇరాన్ పట్ల భారత్ సానుకూల వైఖరి చేపడుతున్న ఈ దశలో.. రైసీ మరణం అనేక ప్రశ్నలు రేపుతోంది. ఆంక్షల నుండి భారతదేశాన్ని మినహాయించడానికి అమెరికన్లు గతంలో కంటే తక్కువ సుముఖతనే ప్రదర్శిస్తారా అన్నది ప్రధాన ప్రశ్న. భారత్ – ఇరాన్ సంబంధాలపై రైసీ మరణం ఎలాంటి ప్రభావం చూపబోతోందన్నది మరొక కీలకమైన ప్రశ్న.

హమాస్‌కి ధన, ఆయుధాల సరఫరాదారుగా, ప్రేరేపకురాలిగా ఇరాన్‌పై ఆరోపణలున్నాయి. ఇరాక్, సిరియా, లెబనాన్‌లో ఉంటున్న ఇరాన్ అనుకూల సాయుధ గ్రూపులు, ప్రత్యేకించి హిజ్బుల్లాను ఇందులో భాగస్వాములుగా పరిగణిస్తున్నారు. ఇజ్రాయెల్‌పై తన మొట్టమొదటి ప్రత్యక్ష క్షిపణి, డ్రోన్ దాడిని ఇరాన్ ఈ ఏప్రిల్ 13న ప్రారంభించింది. డమాస్కస్‌లోని ఇరాన్ దౌత్య భవనంపై ఇజ్రాయెల్ బాంబు దాడి చేయడం ఇరాన్‌ని రెచ్చగొట్టటం అందుకు కారణం. పశ్చిమాసియాలో ఇరాన్ రహస్య కార్యకలాపాలను సమన్వయం చేస్తున్న కొంతమంది ఇరాన్ సైనిక కమాండర్లు ఈ దాడి ఘటనలో చనిపోయారు.

బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, ఇరాన్ నుండి ఇరాక్, సిరియా, లెబనాన్ మీదుగా మధ్యధరా సముద్రం వరకు నడుస్తున్న షియా ప్రభావిత ప్రాంతంలో తన అణు కార్యక్రమాన్ని, వ్యూహాత్మక విస్తరణను నియంత్రించడానికి ఇరాన్‌తో కలిసి పనిచేసే అవకాశాన్ని అమెరికా ఎంచుకుంది. ఈ నేపథ్యంలోనే ఇరాన్, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాలకు జర్మనీ మధ్య 2015లో అణు ఒప్పందం కుదిరింది. అయితే, అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2018లో ఇరాన్‌పై ఆంక్షలు విధిస్తూ ఆ ఒప్పందం నుండి వైదొలిగారు. అదే సమయంలో, అమెరికా అనుసరించే ఇజ్రాయెల్ అనుకూల వైఖరిని మరింతగా పెంచి పోషించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో స్థావరాల ఏర్పాటును అరికట్టడానికి లేదా ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాల మధ్య పరిష్కారం విషయంలో ఇజ్రాయెల్ వైపునుంచి నిబద్ధతను సాధించకుండా అమెరికా రాయబార కార్యాలయాన్ని ఏకపక్షంగా జెరూసలేంకు మార్చివేశారు.

తదుపరి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ విధానాన్ని పునఃపరిశీలించడానికి ప్రయత్నించారు, కానీ మొదటగా కోవిడ్–19 మహమ్మారి, తరువాత ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఈ అంశంపై పెద్దగా దృష్టి సారించలేదు. ఈలోగా, ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సంతకం చేసిన అబ్రహం ఒప్పందాలను ఉపయోగించి కొత్త పశ్చిమాసియా, గల్ఫ్ భద్రతా నమూనా అమలు గురించి అమెరికా ఊహించింది. ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకురావడానికి యూఏఈ, బహ్రెయిన్, మొరాకో, సౌదీ అరేబియా వంటి తన అనుకూల అరబ్ దేశాలను అమెరికా ప్రోత్సహించింది. ఇరాన్‌తో, పశ్చిమాసియాతో తన లోతైన రాజకీయ సంబంధాలను కొనసాగించడమే దీని లక్ష్యం. కానీ ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కొత్త సంకీర్ణ ప్రభుత్వంతో, పాలస్తీనా ప్రాధాన్యాన్ని తగ్గించి వేయడాన్ని సమర్థిస్తున్న తీవ్ర మితవాద పార్టీలతో ఎదురయ్యే ప్రమాదాన్ని అమెరికా విస్మరించింది. ప్రాంతీయ భౌగోళిక రాజకీయాలలో పాలస్తీనియన్లు ప్రాముఖ్యం కోల్పోయారని నెతన్యాహు ఈ సందర్భంగా వాదించారు.



హఠాన్మరణం : ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ

ఈ కొత్త దృక్పథం ఆధారంగా భారత్, మధ్య ప్రాచ్యం, యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎమ్ఈసీ) ప్రతిపాదనకు వచ్చింది. యూఏఈ, సౌదీ అరేబియా, అమెరికా, భారతదేశ నాయకులు న్యూఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఈ ప్రతిపాదనను ఘనంగా ఆవిష్కరించటం కోసం సమావేశమయ్యారు. కానీ అదానీ యాజమాన్యంలోని హైఫా ఓడరేవు ల్యాండ్ రూట్ ముగింపు కేంద్రంగా ఉన్న ఇజ్రాయెల్‌ని ఈ సందర్భంగా ప్రస్తావనలోకి తీసుకోలేదు. పాలస్తీనా సమస్యను పరిష్కరించే విషయంలో ఇజ్రాయెల్ నుంచి నిబద్ధత లేకుండా, అబ్రహం ఒప్పందాలపై సంతకం చేయడాన్ని సౌదీ స్పష్టంగానే ప్రతిఘటించింది. తర్వాత ఒక సంవత్సరం లోపే, ఇరాన్ ప్రేరేపిత గాజా సంక్షోభం ఐఎమ్ఈసీ ప్రాజెక్ట్‌ను ఎత్తివేసింది. యూఏఈ, బహ్రెయిన్ వంటి అబ్రహం ఒప్పందాలపై సంతకం చేసిన దేశాలు కూడా దేశీయ ప్రజాభిప్రాయాన్ని, అరబ్ ప్రజానీకం ఆగ్రహాన్ని సంతృప్తి పరచడానికి, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తమ బహిరంగ వైఖరిని కఠినతరం చేయవలసి వచ్చింది.

అమెరికా–ఇజ్రాయెల్ ప్రణాళికలను చిత్తు చేసిన ఇరాన్ ఈ క్రమంలో రష్యా–చైనా కూటమికి దగ్గరైంది. రష్యాకు సాయుధ డ్రోన్‌ల ప్రధాన సరఫరాదారుగా ఇరాన్ మారింది. ఈ దశలోనే రైసీ మరణం సంభవించింది. రైసీ తన నాలుగేళ్ల పదవీకాలంలో మూడో సంవత్సరంలో ఉన్నారు. ఇరాన్ న్యాయవ్యవస్థ మాజీ అధిపతిగా, ప్రజాస్వామ్య దేశాలలో ప్రధాన న్యాయమూర్తుల కంటే ఎక్కువ అధికారం ఉన్న పదవిలో, ఆయన రక్తపు మరకలతో కూడిన కలుషిత గతాన్ని కలిగి ఉన్నారు. 1980లలో రాజకీయ ఖైదీల సామూహిక మరణశిక్షను ఆయన పర్యవేక్షించారు. 2021లో తన ఎన్నిక సాధారణ ఇరాన్ అధ్యక్ష ఎన్నికల కంటే తక్కువ స్వేచ్ఛాయుతంగా జరిగింది. సాంప్రదాయికంగా సుప్రీం లీడర్, అతని సలహాదారులు అధ్యక్ష అభ్యర్థుల జాబితాను కత్తిరించడానికి గార్డియన్ కౌన్సిల్‌ను ఉపయోగిస్తారు. గతంలో ప్రజలకు కొంత ఎంపిక అవకాశాన్ని, ఎన్నికల స్వేచ్ఛను అందించడానికి దీన్ని తెలివిగా అమలు చేశారు. 1997లో మొహమ్మద్ ఖతామీ ఎన్నికైనప్పుడు, అతను వ్యవస్థానుకూలమైన, సంప్రదాయవాదులను ఓడించిన, గుర్తింపు పొందిన సంస్కరణవాదిగా ఉండేవారు. పాశ్చాత్య ఆంక్షల కారణంగా ఏర్పడిన ఆర్థిక కష్టాల వల్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని 2021లో నిలిపివేశారు. తరువాత, 2022 సెప్టెంబరులో పోలీసు కస్టడీలో మహ్సా అమిని అనే యువతి మరణం, ముఖ్యంగా మహిళల నుండి విస్తృతమైన నిరసనలను రేకెత్తించింది. వ్యవస్థ నైతిక అధికారం దెబ్బతినడంతో, 2021 ఓటింగ్ శాతం 60 శాతం లేదా అంతకంటే ఎక్కువ నుండి 49 శాతానికి పడిపోయింది. వాస్తవానికి, ఓటర్లు 13 శాతం వ్యతిరేక ఓట్లను వేయడం ద్వారా తమ నిరసన తెలిపారు. ఇది రైసీ ప్రత్యర్థులకు వచ్చిన ఓట్ల కంటే కూడా ఎక్కువ. ఇప్పుడు 50 రోజుల్లో కొత్త అధ్యక్ష ఎన్నికలు జరగాలి.

ప్రస్తుత పరిస్థితి భారతదేశం–ఇరాన్ సంబంధాలపై ఎలా ప్రభావం చూపుతుందన్నది పెద్ద ప్రశ్న. చాబహార్ ఓడరేవు భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాలకు ప్రధాన చిహ్నం. ఓడరేవును అభివృద్ధి చేయడానికి ఇటీవలి పదేళ్ళ ఒప్పందం తరువాత, అమెరికా ఆంక్షల హెచ్చరికను జారీ చేసింది. అఫ్గానిస్తాన్, ఇరాన్ దేశాలు ఇజ్రాయెల్‌తో పోరాడటానికి తమ ప్రతినిధులను ముందుకు తీసుకువెళుతున్నందున, అమెరికన్లు భారతదేశానికి మినహాయింపు ఇవ్వడానికి గతంలో కంటే తక్కువ సుముఖంగా ఉండవచ్చు.

1996–2001 కాలంలో తాలిబాన్లు అఫ్గానిస్తాన్‌ను నియంత్రించినప్పుడు ఇండో–ఇరానియన్ వ్యూహాత్మక కలయిక అత్యంత సన్నిహితంగా ఉండేది. రెండు దేశాలూ అహ్మద్ షా మసూద్ నేతృత్వంలోని ఉత్తర కూటమికి మద్దతు ఇచ్చారు. కానీ 2003 నుండి, ఇరాన్ రహస్య అణు కార్యక్రమం వెల్లడి, అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన తర్వాత, భారతదేశం అమెరికాతో అణు ఒప్పందంపై చర్చలు ప్రారంభించింది. అప్పటి నుండి, ఇరు దేశాల మధ్య సంబంధాలు వ్యూహాత్మక అనుమానం, లావాదేవీలలో సహనం మధ్య హెచ్చుతగ్గులకు లోనయ్యాయి.

రైసీ మరణం ఈ ప్రాథమిక అంశాలను మార్చదు. ఏది ఏమైనప్పటికీ, ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలిలోని సుప్రీం లీడర్, సలహాదారులు, ముఖ్యంగా దాని సెక్రటరీ జనరల్ అలీ అక్బర్ అహ్మదీయన్ ఇరాన్ విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తారు. కానీ రైసీ మరణం ఇరాన్ అంతర్గత రాజకీయ సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే అధికార శూన్యతను పూరించడానికి ఎవరో ఒక నేతను పైకి లేపడం ప్రారంభం కానుంది.

వ్యాసకర్త ఇరాన్ మాజీ రాయబారి,
మాజీ కార్యదర్శి, విదేశాంగ మంత్రిత్వ శాఖ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఊరెళ్లిపోయాం!



37 ఏళ్లుగా అమెరికన్‌గా ఉన్న నేను... నా భార్య, మా బిడ్డతో కలసి ఆమె పుట్టిల్లు మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)కు తరలిపోయాం. ఆమె గర్భిణిగా ఉన్నప్పటి ఆసుపత్రి ఖర్చులను చెల్లించే విషయమై మా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి ఎదురైన చేదు అనుభవమే ఇందుకు కారణం. – ఆండ్రూ పోలినో, డిజిటల్ ప్రొడ్యూసర్

వస్తు ప్రపంచం



భారతీయ వస్తూత్పత్తి రంగం వర్సెస్ సేవల రంగం అనే అంశంపై చర్చ జరిగినప్పుడు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వస్తూత్పత్తి రంగానికి ప్రాధాన్యమిస్తూ మాట్లాడారు. ఈ ఎంపిక గురించి ఏమంటాం? ఉత్పత్తి, సేవా రంగాలు కలసి నడిస్తేనే కదా అభివృద్ధి! – అరవింద్ సుబ్రహ్మణియన్, ఆర్థిక సలహాదారు

మరింత జటిలం!



మూడో విడత అధికారంలోకి వచ్చాక ఎన్డీయే గోవధను నిషేధిస్తుందని, సీతమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తుందని అమిత్ షా తన ఎన్నికల ప్రచారంలో చెబుతున్న దానిని బట్టి భవిష్యత్తు మరింత సమస్యాత్మకం కాబోతోందనిపిస్తోంది. అసలు మన జీవితాలకు ఇంత సంఘర్షణ అవసరమా? – ప్రీతిష్ నంది, ప్రముఖ జర్నలిస్టు, కవి

స్పష్టతనివ్వండి



పాండియన్! మీకు దమ్ముంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీయేకు మద్దతు ఇవ్వబోనని, 'ఇండియా' కూటమి వైపు నిలబడతానని మీ సార్ (ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్) చేత ఒక ప్రకటన ఇప్పించగలరా? (పాండియన్ బీజేడీలో ద్వితీయ నేత. నవీన్ పట్నాయక్ విశ్వాసపాత్రుడు). – సంజయ్ ఘోష్, న్యాయవాది

మరపురాని మనిషి



ఇబ్రహీం రైసీ వేలాది అమాయక ఇరానీయులకు ఉరిశిక్ష విధించాడు. టెహ్రాన్ 'ఉరి మనిషి', 'కసాయి'గా పేరు పడ్డాడు. ఆ తర్వాత దేశానికే తలారి అయ్యాడు. అందుకే రైసీ చనిపోయాడని నిర్ధారణ కాగానే ఇరాన్ వ్యాప్తంగా లక్షల మంది రహస్యంగా వేడుక చేసుకున్నారు. – పీటర్ అడా, ప్రవాస ఇరానీయుడు

మాటలతో చంపేశారు!



ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో పై అంతస్తు బాల్కనీ నుంచి తల్లి చేతుల్లోంచి కిందికి పడబోయిన పసికందును ఆ అపార్ట్‌మెంట్‌లోని మిగతా ఫ్లాట్‌ల వారు భద్రంగా కాపాడిన వీడియో ఒకటి కొద్ది రోజుల క్రితం వైరల్ అయింది. ఆ వీడియోను చూసిన ప్రతి ఒక్కరూ ఆ పసికందు తల్లిని మాటల్లో చెప్పలేని విధంగా దూషిస్తూ పోస్టులు పెట్టారు. ఆ పోస్టులు భరించలేక ఆ తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఏం సమాజం?! – చిన్మయి శ్రీపాద, గాయని

అచ్ఛే దిన్



నేను భారతదేశం పట్ల ఆశావహ దృక్పథంతో ఉన్నాను. రైతులు, కార్మికుల నుంచి ప్రొఫెసర్లు, కార్పొరేట్ నాయకులు, ప్రభుత్వంలోని ఐ.ఎ.ఎస్., ఐ.ఎఫ్.ఎస్. అధికారుల వరకు... దేశం పట్ల శ్రద్ధ వహించే వారంతా తప్పు మార్గంలో వెళుతున్నామని గ్రహించినట్లు అనిపిస్తోంది. – కౌశిక్ బసు, కార్నెల్ యూనివర్సిటీ ప్రొఫెసర్

ఆధునిక వైద్య తారలు

ఆధునిక భారతీయ వైద్యశాస్త్రం గురించి మాట్లాడేటప్పుడు తప్పనిసరిగా నలుగురు మహిళల గురించి చెప్పాలి. అమోఘమైన ప్రతిభ, శ్రమతో వారు మన వైద్య చరిత్ర గతినే మార్చారు.

ఫ్లారెన్స్ డిసెంట్ అందులో ఒకరు. ఆమె కలకత్తాలో జన్మించిన ఆంగ్లో ఇండియన్. 1894లో స్కాటిష్ మెడికల్ అండ్ సర్జికల్ కళాశాలల నుంచి ట్రిపుల్ క్వాలిఫికేషన్స్ సంపాదించుకున్న 48 మందిలో ఒకరు. అలహాబాద్ డఫ్రిన్ హాస్పిటల్లో పనిచేస్తూ ఘోషా పద్ధతి వల్ల ఆరోగ్యం కోల్పోయిన భారతీయ స్త్రీల ప్రసవ సంబంధిత సమస్యలపై చేసిన కేస్ స్టడీస్‌ను 1891, 1892, 1895 సంవత్సరాల్లో 'ఇండియన్ మెడికల్ గెజిట్'లో ప్రచురించారు. ఈ అరుదైన సమాచారం తర్వాత కాలంలో వైద్యశాస్త్ర ప్రగతికి చాలా దోహదం చేసింది. 1922లో బొంబాయి ప్రభుత్వ పరిశ్రమలలో పనిచేసే మహిళా కార్మికుల ప్రసూతి స్థితిగతులను అధ్యయనం చేసి ఆమె ఇచ్చిన నివేదిక 'బొంబాయి లేబర్ గెజిట్'లో ప్రచురితమయ్యింది. మరో గొప్ప మహిళ ఎడిత్ మేరీ బ్రౌన్. ఈమె ఆసియా ఖండంలోనే తొలిసారిగా మహిళలకు వైద్య శిక్షణ అందించే మెడికల్ కాలేజీను లూధియానాలో 1894లో స్థాపించారు. 1947లో దేశ విభజన జరిగినప్పుడు ఇప్పటి పాకిస్తాన్ ప్రాంతం నుంచి ఎంతో మంది సిక్కు, హిందూ మతస్థులు ఈ ఆసుపత్రికి కాందిశీకులుగా వచ్చి ఆరోగ్యంతో పాటు రక్షణ కూడా పొందారు. ఎడిత్ 1952లో పదవీవిరమణ చేసి కశ్మీర్‌కు వెళ్లారు. 92 ఏళ్ల వయసులో 1956 డిసెంబర్ 6న శ్రీనగర్ లో ఎడిత్ తుదిశ్వాస విడిచారు.



ఫ్లారెన్స్ డిసెంట్

స్కాట్లాండ్‌కు చెందిన మార్గరెట్ ఐడా బల్ఫోర్ 1892లో భారతదేశం వచ్చి లూధియానాలో జనానా ఆసుపత్రి మేనేజర్‌గా చేరారు. ఇక్కడ స్త్రీల ఆరోగ్యం, మంత్రసానులు ప్రసవ సమయాల్లో వాడే పద్ధతులు, ఇతర సాంఘిక పరిస్థితులను అధ్యయనం చేశారు. 1914లో పంజాబ్ లోని సివిల్ ఆసుపత్రుల ఇన్స్పెక్టర్ జనరల్‌గా నియమితులై రెండేళ్ల తర్వాత ఉమెన్స్ మెడికల్ సర్వీస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాసిన 'ది వర్క్ అఫ్ మెడికల్ ఉమెన్ ఇన్ ఇండియా' పుస్తకం ఎంతో విలువైనది.

పేథాలజిస్టుగా, సర్జన్ గా కొంతకాలం పని చేసిన చార్లెట్ లైటన్ హోల్టన్ 1918–19 కాలంలో ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కళాశాలలో బోధించారు. తర్వాత సిమ్లాలో ఉమెన్స్ మెడికల్ సర్వీస్‌లో సూపరింటెండెంట్‌గా సేవలందించారు. పిమ్మట చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు. 'డఫ్రిన్ ఫండ్' సెక్రటరీగా పనిచేస్తున్న కాలంలో 'ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' గా ఇప్పుడు పిలుస్తున్న సంస్థ స్థాపనకు ప్రణాళిక రచించారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, । 94407 32392

ఈజ్ ఆఫ్ డూయింగ్ సైన్స్‌లో వెనుకబాటు

అభిప్రాయం



ఈదర శ్రీనివాసరెడ్డి

భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని ఉవ్విళ్లూరుతోంది. ఇందుకు శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంతగానో దోహదం చేస్తాయి. అయితే శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం పశ్చిమ దేశాలతో పోలిస్తే వెనకబడే ఉన్నాం. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుండి శాస్త్ర సాంకేతిక రంగాలను ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తూనే వస్తున్నాయి. వీటిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు కేటాయించిన తక్కువ మొత్తంలోని నిధులే ఇందుకు సాక్ష్యాలు. ఆధ్యాత్మికవేత్తలనూ, శాస్త్రవేత్తలనూ, విద్యా వేత్తలనూ, వైద్య నిపుణులనూ, ఖగోళ శాస్త్రజ్ఞులనూ భుజాన మోయాలి, ఎందుకంటే వీరి వల్ల మానవాళికి ఎనలేని సేవలు ఒనగూరుతున్నాయి. కాని, ఇటువంటివారికి దేశంలో సరైన ఆదరణ లేక ఇతర దేశాలకు వలస వెళ్లవలసి వస్తోంది.



ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న అనేక పరిశోధనాభివృద్ధి సంస్థలు తమకు కేటాయించే నిధులను రెండింతలు చెయ్యాలని కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. 2005–2009 మధ్య మన దేశ జీడీపీలో 0.8 శాతం నిధులు కేటాయించగా, అవి 2017–2019 నాటికి 0.7 శాతానికీ, 2021– 2022 నాటికి 0.64 శాతానికీ పడిపోవడం గమనార్హం. అభివృద్ధి చెందిన దేశాలు ఈ రంగంపై 2 శాతం నుండి 4 శాతం వరకు నిధులు కేటాయిస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిలోని సభ్యదేశాలు సగటున 2.7 శాతం నిధులు ఖర్చు పెడుతున్నాయి. అమెరికా, చైనా, యూకే వంటి దేశాలు 2 శాతం కన్నా ఎక్కువ నిధులు ఖర్చు పెడుతున్నాయి. కాని మన దేశం 1 శాతం నిధులు కూడా ఈ రంగానికి కేటాయించడం లేదు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవతరించాలంటే ఈ నిధులు కనీసం 3 శాతంగా వుండాలి. ఇప్పటి నుంచే 3 శాతం నిధులు కేటాయిస్తూ పోతే కాని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేము.

ఉన్నత విద్య, శాస్త్రసాంకేతిక రంగాల వంటివాటిపై ఖర్చు పెడుతున్న నిధులు సామాన్యులు కొనే పెట్రోలు, డీజిల్ వంటివాటిపై విధించే సెస్సు నుండి వస్తుండటం గమనార్హం. 2020–2021లో ఈ రంగానికి కేటాయించిన నిధులలో 43 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వ వాటా. 30 శాతం ప్రైవేటు రంగం నుండి, 7 శాతం రాష్ట్ర ప్రభుత్వాల నుండి, 9 శాతం ఉన్నత విద్యా సంస్థల నుండి సేకరించారు. అభివృద్ధి చెందిన దేశాలలో నిధులు ప్రైవేటు రంగం నుండే వస్తున్నాయి. కాని మనదేశంలో నాణ్యమైన పరిశోధనలు జరగకపోవటం, మేధాహక్కుల ఉల్లంఘన, పరిశోధనా ఫలితాల చోరీ వంటి వాటి వల్ల ఈ రంగంపై పెట్టుబడులు పెట్టటానికి ప్రైవేటు పరిశ్రమలు ముందుకు రావటం లేదు.

2023లో కొత్త పరిశోధనా నిధులను కేటాయించడానికి కొత్తగా 'అనుసంధాన్ జాతీయ పరిశోధనా నిధుల సంస్థ' ఏర్పాటయ్యింది. దీని ద్వారా రానున్న 5 ఏళ్ల కాలంలో 6 బిలియన్ డాలర్లను పరిశోధనలపై ఖర్చు పెట్టనున్నారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రతిపాదనల్లో భాగంగా 2023–2025 మధ్య కాలంలో పరిశోధనలకు రూ. 50,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. వీటిలో 11 శాతం నిధులు టైర్ 2, టైర్ 3 పరిశోధనా సంస్థలను బలోపేతం చెయ్యటానికి వినియోగించనున్నారు. ఈ నిధుల్లో రూ. 36,000 కోట్లు ప్రైవేటు రంగం నుంచి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరి ఎంతవరకు ఈ లక్ష్యం నెరవేరుతుందో చూడాలి.


వ్యాసకర్త ఆచార్య నాగార్జున యూనివర్సిటీ
ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

సంకీర్తన – సరైన దృక్పథం

ఇంతగా ధ్యానం చేసినప్పటికీ ఎందుకు మంచి ఫలితాలు రావటం లేదు, సద్గురువు ఉన్నప్పటికీ మనస్సులో చెడు విచారాలు ఎలా కలుగుతున్నాయి వంటి ప్రశ్నలు చాలా మంది సాధకులకు మనసులో తలెత్తుతూ ఉంటాయి. అయితే ఆ విధమైన ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు. అలాగని మనసును నిర్బంధించవలసిన అవసరమూ లేదు. అన్నిరకాలైన ఆలోచనలనూ రేకెత్తించడమే మనసు ప్రకృతి.

రైలులో ప్రయాణాన్ని ఉదాహరణగా తీసుకొందాం. ఒక రైలు బండి తన ద్వారా ప్రయాణించేవారు ఎటువంటివారు అనేదానితో నిమిత్తం లేకుండా ప్రయాణిస్తుంది. అలాగే అది వెళ్లే దారిలో అనేక స్టేషన్లు ఉంటాయి. అది వెళ్లవలసిన ప్రతి స్టేషనూ ఒకే విధంగా ఉండదు. కొన్ని పెద్దవీ, కొన్ని చిన్నవీ; కొన్ని శుభ్రంగానూ, కొన్ని మురికిగానూ ఉంటాయి. వీటినేమీ పట్టించుకోకుండా కేవలం గమ్యస్థానం చేరడమే రైలు పని. రైలు మాదిరిగా నీవు కూడా నీ గమ్యస్థానాన్ని చేరటమే జీవిత ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలి. నీ ప్రయాణంలో పట్టుదల వదలకుండా, విశ్వాసం కోల్పోకుండా మనసు ఆడుకొనే ఆటలతో భంగపాటు చెందకుండా ఉండు. 'జీవిత ప్రయాణం' రైలు ప్రయాణం లాంటిదే. రైలులోనే గమ్యం చేరేదాకా ప్రయాణికుడు ఓపికగా, నమ్మకంతో కూర్చొని ఉన్నట్లు... జీవిత ప్రయాణంలో సహనంతో, విశ్వాసంతో స్థిమితంగా ఉండు. గురువు అనే డ్రైవర్ నీ జీవిత ప్రయాణంలో నిన్ను నీ గమ్యస్థానానికి నిక్షేపంగా చేర్చుతాడు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మానవుడు జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. ఇటువంటి సమస్యలకు పరిష్కారం అంతరంగం నుండే రావాలి. మనసే ఈ సమస్యలన్నింటినీ సృష్టిస్తుంది. కాబట్టి ఈ సమస్యలను తొలగించడం కూడా మనసే చేయగలుగుతుంది. మనసు సమతాస్థితిలో ఉన్నప్పుడు, వివేకంతో సమస్యలన్నింటినీ బహిర్గతం చేస్తుంది. మందబుద్ధికి ఈ సమస్యలకు అంతమే లభించదు. పైపైన తేలికగా కనపడే సమస్యలన్నీ వట్టి భ్రాంతి మాత్రమే. సుఖ, దుఃఖాలు మానవుని స్వాధీనంలోనే ఉన్నాయి. నీవు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకొని, భగవన్నామ సంకీర్తన చేస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనే నిమగ్నుడవై ఉన్నట్లయితే నీలో సరైన దృక్పథం వృద్ధి చెందుతుంది. అందువలన నీవు ప్రశాంతంగా ఉండగలవు.

టీడీపీ రీపోలింగ్ ఎందుకు కోరలేదు?

మాచర్లలో విచ్చలవిడిగా రిగ్గింగ్ చేసిన టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

- అడ్డొచ్చిన వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లు, కార్యకర్తలపై దాడి
- రిగ్గింగ్ అడ్డుకోవడంతో తుమ్మకోటలో నాలుగు ఈవీఎంలను ధ్వంసం చేసిన టీడీపీ నేతలు
- అయినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఆరోపణలు
- పోలింగ్ సక్రమంగా జరగలేదంటూ గగ్గోలు
- అయినా రీపోలింగ్ కోరని టీడీపీ
- అంటే తమకు అనుకూలంగా ఎన్నికలు జరిగినట్లేగా..
- మరోవైపు.. మాచర్లలోని పలు ప్రాంతాల్లో రీపోలింగ్ కోరిన ఎమ్మెల్యే పిన్నెల్లి
- రీపోలింగ్ జరగకుండా ఎన్నికల అధికారులపై టీడీపీ నేతల ఒత్తిడి

సాక్షి, నరసరావుపేట: 'మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలు ధ్వంసం చేశాడు.. ఓటర్లను బెదిరించాడు.. ఎన్నికలు సక్రమంగా జరగలేదు'.. అని రెండ్రోజులుగా గగ్గోలు పెడుతున్న టీడీపీ, పచ్చ మీడియా వర్గాలు ఎందుకు ఈవీఎంలు పగలగొట్టిన చోట్ల రీపోలింగ్ జరపమని ఎన్నికల సంఘాన్ని కోరలేదన్న ప్రశ్న అందరిలోనూ వేధిస్తోంది. సాధారణంగా ప్రతిపక్ష పార్టీలు పోలింగ్ రోజు అధికార పార్టీ రిగ్గింగ్ చేసిందనో, అధికారులను ఉపయోగించి ఎన్నికలు పారదర్శకంగా జరపలేదన్న కారణాలను చూపి రీపోలింగ్ అడుగుతాయి. ఫ్యాక్షన్‌కు దూరంగా ఉంటూ అభివృద్ధి బాటపట్టిన మాచర్లను కావాలనే టీడీపీ అనుకూల మీడియా చంబల్‌లోయ అంటూ గత కొన్నినెలలుగా విషప్రచారం చేస్తోంది. అదే నిజమైతే అక్కడ నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలుస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల్లో అరాచకం సృష్టించాడు.. రీపోలింగ్ జరపండి అని ఈసీని కోరాలిగానీ అటువంటి చర్యలేవి తెలుగుదేశం పార్టీ, మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తీసుకోలేదు, అంటే.. ఎన్నికల వారికి అనుకూలంగా జరిగాయని వారు భావిస్తున్నట్లేగా? తాము చేసిన రిగ్గింగ్ వృథా కాకూడదనే మౌనంగా ఉన్నారా అన్న వాదన వినిపిస్తోంది.

విచ్చలవిడిగా రిగ్గింగ్ చేసిన జూలకంటి..

నిజానికి.. ఫ్యాక్షన్ నేతగా ముద్రపడిన మాచర్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పోలింగ్ రోజు తన నిజస్వరూపాన్ని బయటపెట్టాడు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ బూత్ నుంచి బయటకు లాగి కళ్లలో కారంకొట్టి దాడి చేయించాడు. రెంటచింతల మండలం పాల్వాయిగేట్, తుమ్మకోట, జెట్టిపాలెం, కారంపూడి మండలం ఒప్పిచర్ల, చింతలపూడి, వెల్దుర్తి వంటి పలు గ్రామాల్లో ఇదే జరిగింది. ఒప్పిచర్లలో పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న ఎస్టీ సామాజికవర్గానికి చెందిన పాలకీర్తి శ్రీనివాసరావు, ఆయన సోదరుడు పాలకీర్తి నరేంద్రలపై వందల మంది దాడిచేసి బయటకు లాగి యథేచ్ఛగా రిగ్గింగ్ చేశారు. అలాగే, రెంటచింతల మండలం తుమ్మకోటలో ఏజెంట్లుగా ఉన్న షేక్ సైషావలీ, షేక్ జానీబాషాలను బయటకు లాగి విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. రిగ్గింగ్ అడ్డుకున్నందుకు తుమ్మకోటలో నాలుగు ఈవీఎంలను టీడీపీ నేతలు పగలగొట్టారు. జూలకంటి సొంత గ్రామమైన వెల్దుర్తిలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకులాగి దాడిచేసి రిగ్గింగ్‌లకు తెగబడ్డాడు. 137, 138, 139, 140, 141 బూత్‌లలో కూర్చున్న వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను టీడీపీ నేతలు బయటకులాగి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఇలా మాచర్ల నియోజకవర్గంలో ఎనిమిది గ్రామాల పరిధిలోని సుమారు 20 పోలింగ్ బూత్‌లలో టీడీపీ నేతలు రిగ్గింగ్ చేశారు. అంతేకాక.. మాచర్లలో బ్రహ్మారెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేశాడు. ఇందుకు పోలీసుశాఖ పూర్తి సహాయ సహకారాలు అందించిందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు.


Gmail
101- MAHCERLA REPOLLING - CERTAIN VILLAGES - REQUEST - REGARDING

To

1. Election Commission of India, Nirvachan Sadan, Ashoka Road, New Delhi
2. Chief Electoral Officer, ... Amaravathi
3. District Election Officer cum District Collector, Narasaraopet, Palnadu District
4. Election Returning Officer, Macherla Assembly Constituency, Macherla, Palnadu District

Dear Sir

Sub: General Elections – to HOP/APLA 2024 – 101-Macherla Assembly Constituency – Violent and Organised rigging of votes by TDP supporters after capturing the booths in various villages of Macherla assembly constituency in 100% webcasting. - Request for conduct repoll by verifying the webcasting and CCTV and immediate action – representation – Submitted

I am to state that from 12:30 noon onwards the Telugu Desam Party supporters and a mob of persons, by forming into an unlawful assembly forcibly entered into the polling stations i.e., situated in the below mentioned villages Karempudi Mandal: 1. Chinthapalli, 2. Oppicherla, 3. Petasannegandla, 4. Pedakodamagundla, Rentachinthala Mandal: 1. Thummurukota, 2. Paluvaigate, 3. Jettipalem, Veldurthy Mandal: Velourthy, and rigged the votes by dragging out the YSRCP agents. As the Macherla-101 Assembly constituency is covered under 100% webcasting and it is under 100% surveillance of 360-degree cameras in and around the polling booths. The election commission of India declared the Macherla assembly constituency as hyper sensitive but the police authorities utterly failed to allot required police personnel and taking appropriate measures. Even though, I have complained to your authorities on 11.05.2024 about the modus operandi of TDP Contestant namely Julakanti Brahmananda Reddy and requested to direct the police to provide additional security but in vain.

Further the TDP people have terrorised the SC, ST,BC, Minority & other electors/voters attended at the polling stations in the above mentioned villages

రీపోల్ నిర్వహించమని ఈసీకి మెయిల్ ద్వారా పిన్నెల్లి పంపిన అభ్యర్థన

వీడియో బయటకు వచ్చాక గగ్గోలు..

ఇక జూలకంటి బ్రహ్మారెడ్డి అనుకున్నట్లుగా రిగ్గింగ్ విచ్చలవిడిగా జరగడంతో టీడీపీ, పచ్చమీడియా పోలింగ్ రోజు, తరువాత వారం రోజులపాటు రిగ్గింగ్ అన్న పదం వాడలేదు. టీడీపీ రిగ్గింగ్ చేయడంతో అడ్డుకోవడానికి పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురించి పెద్దగా ప్రస్తావించలేదు. ఈవీఎంలు పగలగొట్టాడు అని వార్తలు సైతం పెద్దగా రాయలేదు. కారణం పాల్వాయిగేట్‌లో టీడీపీ చేసిన రిగ్గింగ్ బయట పడుతుందన్న ఒకేఒక్క కారణంతో. అయితే, నిజమో కాదో తెలియని ఓ ఈవీఎం పగలగొడుతున్న వీడియో బయటకు రాగానే ఒక్కసారిగా మాచర్లలో అరాచకం జరిగిందని గగ్గోలు పెడుతున్నారు. అయినా సరే.. ఏ టీడీపీ నేత కూడా ఈవీఎంలు పగిలినచోట్ల రీపోలింగ్ జరపమని మాటవరుసకైనా అనలేదు. కారణం అక్కడ రిగ్గింగ్ చేసింది, లాభపడింది తెలుగుదేశం పార్టీ కావడమే. ఈవీఎంలు పగలడానికి ముందు ఆయా పోలింగ్ కేంద్రాల్లో జరిగిన దౌర్జన్యాల సీసీటీవీ ఫుటేజ్ బయటపెట్టమని అడగడంలేదు. ఒకవేళ టీడీపీ రిగ్గింగ్ చేసి ఉండకపోతే పూర్తి సీసీ ఫుటేజ్ బయటపెట్టమని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తున్నా సరే వారెందుకు మౌనంగా ఉంటున్నారో మిలియన్ డాలర్ల ప్రశ్న. కారణం జూలకంటి బ్రహ్మారెడ్డి వర్గం చేసిన అరాచకాలు బయటపడితే వారి కుట్రలు ప్రజలకు తెలిసిపోతాయని.

రీపోలింగ్ కోరిన పిన్నెల్లి..

మరోవైపు.. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ చేసిన రిగ్గింగ్‌పై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల సంఘానికి రెండుసార్లు లేఖ రాశారు. పోలింగ్ రోజు నియోజకవర్గంలోని 8 గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో టీడీపీ చేసిన దౌర్జన్యాలను వివరిస్తూ మే 13వ తేదీ మ.3.33 గంటలకు.. సా.6.10 గంటలకు ఈసీకి రెండు లేఖలు రాశారు. ఇందులో టీడీపీ రిగ్గింగ్ చేస్తున్న గ్రామాల్లో తిరిగి రీపోలింగ్ నిర్వహించాలని అభ్యర్థించారు. ఆ గ్రామాలు కారంపూడి మండలంలో చింతపల్లి, ఒప్పిచర్ల, పేటసన్నెగుండ్ల, పెదకోడగుండ్ల, రెంటచింతల మండం తుమ్మకోట, పాల్వాయిగేట్, జెట్టిపాలెం, వెల్దుర్తి గ్రామాలున్నాయి. అయినా, ఈ లేఖలను ఎన్నికల సంఘం పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ నేతలు రీపోలింగ్ జరపకుండా ఎన్నికల సంఘాన్ని ఒత్తిడి తెచ్చి విజయం సాధించారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నిజంగా.. వైఎస్సార్‌సీపీ నేతలు రిగ్గింగ్ చేసి ఉంటే రీపోలింగ్ జరపమని పదేపదే లేఖలు రాసి ఎందుకు డిమాండ్ చేస్తారు? వెబ్‌కాస్టింగ్ వీడియోలు పూర్తిగా బయటపెట్టమని ఎందుకు అడుగుతారు? అంబటి రాంబాబు లాంటి నేతలు రీపోలింగ్ కోసం ఎందుకు హైకోర్టు మెట్లు ఎక్కుతారు? ఈ చిన్న లాజిక్‌వల్ల పల్నాడులో అరాచకాలు చేసింది తెలుగుదేశం పార్టీయేనని స్పష్టమవుతోంది.

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో 'సుప్రీం' న్యాయమూర్తి


జస్టిస్ రవికుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనక దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి.రవికుమార్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొనేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చిన జస్టిస్ రవికుమార్ దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం వారు దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ ఈవో కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

హైకోర్టు న్యాయమూర్తి కూడా..


జస్టిస్ దుర్గాప్రసాద్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. గురువారం అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

ఈ ఏడాది ఎన్నో అద్భుతాలు జరగాలి

- శ్రీవారిసేవలో విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి



తిరుమల: ఈ ఏడాది ఎన్నో అద్భుతాలు జరగాలని తిరుమలేశుని ప్రార్థించినట్టు విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి చెప్పారు. ఆయన గురువారం ఉదయం నైవేద్య విరామ సమయంలో తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. తరువాత ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్నో అద్భుతాలు జరగాలని, అందరికీ మంచి జరిగి, రాష్ట్రం మరింత గొప్పగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. తరిగొండ వెంగమాంబ కీర్తనలు బయటకు తీయడానికి విశాఖ శారదాపీఠం పూర్తిగా సహకారం అందించిందన్నారు. గతంలో భూమన కరుణాకర్‌రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆ కీర్తనలను గానం చేయించారని తెలిపారు. అప్పటినుంచి వెంగమాంబ కీర్తనల ఆలాపనలు నేటికీ సాగుతున్నాయన్నారు. అమ్మవారి స్వరూపంగా వెంగమాంబ ఎన్నో అద్భుత కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. వెంగమాంబ ఉత్సవాల్లో పాల్గొని నేడు శ్రీవారిని దర్శించుకున్నట్లు చెప్పారు.

స్వర్ణరథంపై పద్మావతి అమ్మవారి దివ్యదర్శనం



చంద్రగిరి (తిరుపతి జిల్లా): తిరుచానూరులో కొలువైన శ్రీ పద్మావతి అమ్మవారు గురువారం ఉదయం భక్తులకు స్వర్ణరథంపై దర్శనమిచ్చారు. తిరువీధుల్లో ఊరేగుతూ దివ్యదర్శన భాగ్యం ప్రసాదించారు. ఏటా ఆలయంలో నిర్వహించే వసంతోత్సవాల్లో భాగంగా రెండోరోజు శ్రీ పద్మావతి అమ్మవారికి స్వర్ణ రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో నిద్రమేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని సన్నిధి నుంచి మండపానికి తీసుకువచ్చి స్వర్ణరథంపై కొలువుతీర్చారు. ఉదయం భక్తుల కోలాటాల నడుమ దివ్యమంగళ స్వరూపిణియైన శ్రీపద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆసీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ గణేష్, భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా.. ఇద్దరు బాలికల మృతి

- 21మందికి గాయాలు
- హైదరాబాద్ నుంచి ఆదోనికి వెళ్తుండగా కోడుమూరు వద్ద ప్రమాదం
- డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఘోరం..

కోడుమూరు రూరల్: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రైవేట్ ఏసీ స్లీపర్ బస్సు బోల్తా పడింది. ఇద్దరు బాలికలు మృతిచెందారు. మరో 21మంది గాయపడ్డారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా కోడుమూరు సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు... ఆదోనిలోని బిస్మిల్లా ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు బుధవారం రాత్రి ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి ఆదోనికి బయలుదేరింది. కోడుమూరు వద్ద లారీని ఓవర్‌టేక్ చేసేందుకు డ్రైవర్ అతివేగంగా వెళ్లే క్రమంలో బస్సు బోల్తా పడింది. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికులు తమను రక్షించాలని హాహాకారాలు చేశారు. కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్ఐ బాలనరసింహులు తమ సిబ్బందితో వచ్చి స్థానికుల సాయంతో బస్సు అద్దాలను పగులగొట్టి గాయపడినవారిని బయటకు తీశారు. ఈ ప్రమాదంలో మైదుకూరుకు చెందిన వెంకటేశ్వర్లు కుమార్తె ధనలక్ష్మి(13), సురేష్ కుమార్తె గోవర్ధనీ(9) మరణించారు. వరుసకు అక్కాచెల్లెళ్లు అయిన వీరిద్దరూ తమ మేనత్త కృష్ణవేణితో కలిసి ఆదోనికి బస్సులో వెళుతూ గాఢ నిద్రలోనే కన్నుమూశారు. హైదరాబాద్, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరులకు చెందిన కృష్ణవేణి, పుష్పావతి, మౌనిక, అశోక్, భారతి, గౌస్‌మొహిద్దీన్, పినిశెట్టి లక్ష్మి, వెంకటరెడ్డితోపాటు మరో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. బోయ శకుంతల, శివరాముడు, లక్ష్మి, గణేష్, అశోక్‌కుమార్‌ల తోపాటు మరో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు 108 అంబులెన్స్‌లలో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 29మంది ప్రయాణికులు, డ్రైవర్, ఇద్దరు క్లీనర్లు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, క్లీనర్లు పరారైనట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్‌లు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.


ప్రమాదంలో మృతిచెందిన బాలికలు

ఆ వీడియో లీక్ అయింది

▶ మొదటి పేజీ తరువాయి

తనను కలిసిన విలేకరులకు చెప్పారు. ఆ వీడియో ఎలా బయటకు వెళ్లిందన్న దానిపై విచారణ చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన సంఘటనలపై దర్యాప్తు చేస్తున్న సందర్భంగా ఎవరి చేతి నుంచో బయటకు వెళ్లి ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం ధ్వంసంపై సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్టు మీనా తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పుడు వెళ్లడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. అక్కడ పరిస్థితులు ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తున్నాయని, ఇలాంటి తరుణంలో పరామర్శల పేరుతో వెళ్లి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. ఇప్పుడు తెలుగుదేశం వాళ్లకు అనుమతిస్తే రేపు వేరే పార్టీ వాళ్లు వెళ్తామంటారని, అందుకే బయటి నుంచి నేతలెవరూ పరామర్శకు వెళ్లనీయొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

వచ్చే నెల 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. కచ్చితమైన ఫలితాలను త్వరితగిన ప్రకటించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ చెదురుమదురు సంఘటనలు మినహా అందరి సమష్టి కృషితో ఈ నెల 13న రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్టు వివరించారు. అదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు జరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఏ రోజు, ఎన్ని గంటలకు ఎన్నిటేబుళ్లపై ఓట్ల లెక్కింపు జరుగుతుందో రాతపూర్వకంగా సంబంధిత అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు ముందుగానే తెలియజేయాలన్నారు. ప్రత్యేకంగా మీడియా సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడంచెల భద్రత కొనసాగుతున్నదని, స్ట్రాంగ్ రూమ్‌లకు సీలు వేసిన తలుపులు, సెక్యూరిటీ కారిడార్లను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన సీసీ కెమెరాల పనితీరును నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తుండాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎమ్.ఎస్.హరీంధర ప్రసాద్‌తో పాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్, అసెంబ్లీ.. వేర్వేరుగా లెక్కింపు

స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు పోలింగ్ యంత్రాలను తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజంట్లు వెళ్లడానికి వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలు రాకుండా ఉండటానికి బారికేడ్లతో పాటు సూచికల బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. లెక్కింపు కేంద్రంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా ఓట్ల లెక్కింపు టేబుళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేక టేబుళ్ల ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లు లెక్కించిన తరువాతనే ఈవీఎంల వారీగా ఓట్లను లెక్కించాలని సూచించారు. హై స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యంతో అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లను కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్కోర్‌లో ఎప్పటి కప్పుడు డాటా ఎంట్రీకి సుశిక్షితులైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేసేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గుర్తింపు కార్డులు లేనివారిని, అనధికార వ్యక్తులను, ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రం ప్రాంగణాల్లోకి అనుమతికుంచ కుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ సబబే

సాక్షి, అమరావతి: నిఘా పరికరాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. క్యాట్ తీర్పు అమలును నిలుపుదల చేయాలని అభ్యర్థించింది. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తులు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ, క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులు అసమంజసంగా ఉన్నాయన్నారు. అక్రమాలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు, కోర్టులో విచారణ ముగిసేంత వరకు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని సస్పెండ్ చేసే విచక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఇందుకు ఆల్ ఇండియా సర్వీస్ నిబంధనలు అనుమతిస్తున్నాయన్నారు. వెంకటేశ్వరరావుపై తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నాయన్నారు. అంతేగాక ఆయనపై నమోదైన కేసులో సాక్ష్యులను ప్రభావితం చేసేలా కూడా వ్యవహరించారన్నారు. రెండో సారి సస్పెండ్ చేయడానికి ఇది కూడా ఓ కారణమని, అయితే ఈ విషయాన్ని ట్రిబ్యునల్ పరిగణనలోకి తీసుకోలేదన్నారు. అవినీతి నిరోధక చట్టం కింద ఏబీ వెంకటేశ్వరరావును ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిని కూడా ఇచ్చిందన్నారు. వెంకటేశ్వరరావు తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణ రావు వాదనలు వినిపిస్తూ, క్యాట్ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే తీర్పు ఇచ్చిందన్నారు. ఒకే అభియోగంపై రెండు సార్లు సస్పెండ్ చేయడాన్ని క్యాట్ తప్పు పట్టిందన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకుని జీతభత్యాల బకాయిలు చెల్లించాలని ఆదేశించిందన్నారు. అయితే ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. సస్పెన్షన్ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కోడ్‌కు ముందే కేటాయించాం

- విండ్, సోలార్ ప్రాజెక్టులు గత ఏడాదే 'బర్మర్'కు అప్పగింత
- తప్పుడు ప్రచారం చేస్తే చట్టప్రకారం చర్యలు
- ఇంధన శాఖ అదనపు కార్యదర్శి కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఎన్నికల కోడ్‌కు ముందే విండ్, సోలార్ ప్రాజెక్టులను 'బర్మర్' సంస్థకు అప్పగించామని, కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇచ్చామనే వార్తలు అవాస్తవమని ఇంధన శాఖ అదనపు కార్యదర్శి కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నంద్యాల జిల్లా కోటపాడులో 225 మెగావాట్ల డీసీ సోలార్ పవర్, అనంతపురం, నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లోని తలారి చెరువు, బోయల ఉప్పలూరు గ్రామాల పరిధిలో 150 మెగావాట్ల విండ్ పవర్ కలిపి మొత్తం 375 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ (బర్మర్)కు రాష్ట్ర ప్రభుత్వం (ఇంధన శాఖ) 2023 ఆగస్టు 17న జీఓ–18 ద్వారా కేటాయించిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 'బర్మర్' సంస్థ వంద శాతం హీరో సోలార్ ఎనర్జీ, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ యాజమాన్యానికి అనుబంధ సంస్థ అని తెలిపారు. 2022 మార్చి 1 నాటికి హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ లిమిటెడ్ ఆస్తుల విలువ రూ.552.94 కోట్లని న్యూఢిల్లీకి చెందిన సంజయ్ భువానియా అండ్ కంపెనీ (చార్టెర్డ్ అకౌంటెంట్) సర్టిఫికెట్ జారీ చేసిందన్నారు. అలాగే సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన బిడ్‌లో హీరో సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ 120 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టును కైవశం చేసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థకు కేటాయించిన 375 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుల ద్వారా 120 మెగావాట్ల విండ్, సోలార్ విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. వాస్తవ విరుద్ధంగా ఎవరైనా తమ మీడియాలో ఉద్దేశపూర్వకంగా ఈ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కుమార్‌రెడ్డి హెచ్చరించారు.

నిందితులపై పోక్సో కేసు నమోదు చేయండి

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా మండవల్లి మండలం చింతపాడులో విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారానికి పాల్పడిన ఘటన మీద రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. ఏలూరు జిల్లా ఎస్పీకి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి గురువారం ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలికను స్కూల్‌లోకి లాక్కెళ్లి తోటి విద్యార్థి దారుణానికి పాల్పడగా.. ఈ ఘటనను గ్రామానికి చెందిన మరో నలుగురు యువకులు ఫోన్‌లో వీడియో తీసి బాలికను బెదిరించడంతో.. బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించారని వెంకటలక్ష్మి మీడియాకు తెలిపారు. కాగా, బాధితురాలికి మెరుగైన వైద్యం అందించి రక్షణ కల్పించాలని జిల్లా అధికారులకు వెంకటలక్ష్మి సూచించారు. అండగా ఉంటామని బాధితురాలి తల్లికి ఆమె భరోసా ఇచ్చారు.

ఆదర్శప్రాయుడు వైఎస్ రాజారెడ్డి

- రాజారెడ్డి తనయుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి
- ఘనంగా రాజారెడ్డి వర్ధంతి
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల నివాళి


నివాళులర్పిస్తున్న రాజారెడ్డి కుమారుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల: దివంగత నాయకుడు వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజారెడ్డి 26వ వర్ధంతిని గురువారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్సార్ సమాధుల తోటలోగల జయమ్మ, రాజారెడ్డి ఘాట్ వద్ద వైఎస్ సుధీకర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, సీఎం కార్యాలయ కో ఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడున్న ఇతర వైఎస్ కుటుంబీకుల సమాధుల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజారెడ్డి పార్కులోని రాజారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, జీసస్ చారిటీస్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాజారెడ్డి ఘాట్ వద్ద టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పెద్దాయనగా పిలిచే రాజారెడ్డి జీవితం ఆదర్శవంతమైందన్నారు. ఆయనను మార్గదర్శకుడుగా భావిస్తానని చెప్పారు. ఎప్పుడు ఎవరు ఏ సమస్యతో ఆయన దగ్గరకు వెళ్లినా అండగా నిలిచేవారని గుర్తుచేసుకున్నారు. రాజారెడ్డికి పులివెందుల ప్రాంతంలోనేగాక రాష్ట్రవ్యాప్తంగా అభిమానులున్నారని ఆయన చెప్పారు.

వైభవంగా అన్నమయ్య జయంత్యుత్సవం


వేణుగోపాల్‌దీక్షితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం, అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

రాజంపేట: తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యాన తాళ్లపాక గ్రామంలో గురువారం పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ధ్యానమందిరంలోని అన్నమయ్య విగ్రహానికి అభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోష్టిగానం నిర్వహించారు. అన్నమయ్య ధాన్యమందిరం ఆవరణలో శ్రీవారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు వేణగోపాల్ దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీవారి కళ్యాణోత్సవాన్ని జరిపించారు. శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని విశాఖ శ్రీ శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ తిలకించారు. స్వామీజీ వెంట అన్నమయ్య వారసులు శ్రీహరినారాయణచార్యులు, టీడీపీ అధికారులు ఉన్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణ శర్మ, డిప్యూటీ ఈవో ప్రశాంతి, తాళ్లపాక గ్రామ సర్పంచి గౌరీశంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య వారసులను టీటీడీ తరఫున డిప్యూటీ ఈవో ప్రశాంతి సన్మానించారు. ఇందులో అన్నమయ్య వారసుల్లో 12వ తరానికి చెందిన శ్రీహరినారాయణచార్యులు(తాళ్లపాకస్వామి)తోపాటు మరికొందరు ఉన్నారు.

మనీలాను సందర్శించిన భారత నౌకలు

సింధియా(విశాఖ పశ్చిమ): భారత నౌకాదళంలోని తూర్పు నౌకాదళానికి చెందిన నౌకలు ఢిల్లీ, శక్తి, కిల్తాన్‌లు మనీలాను సందర్శించాయి. దక్షిణ చైనా సముద్రానికి చెందిన ఆపరేషనల్ విస్తరణలో భాగంగా ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలను, భాగస్వామ్యాన్ని విస్తరించే దిశగా ఫిలిప్పీన్స్‌లోని మనీలా సందర్శనను విజయవంతంగా పూర్తి చేసినట్లు నేవీ వర్గాలు తెలిపాయి. పోర్టుకాల్‌లో భాగంగా ఇరు దేశాల నేవీ సిబ్బంది మధ్య సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ ఎక్స్ఛేంజ్, స్పోర్ట్స్ ఫిక్చర్‌లు, క్రాస్‌డెక్ విజిట్‌లు, సాంస్కృతిక కార్యకలాపాలు, సహకార కమ్యూనిటీ ఔట్ రీచ్ ప్రోగ్రామ్‌లు ఆద్యంతం స్నేహపూర్వక వాతావరణంలో ముగిశాయి. ఈ సందర్శనలో భాగంగా తూర్పు నౌకాదళ ఫ్లాగ్ ఆఫీసర్, రియర్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఫిలిప్పీన్స్ దేశ ఓడల కమాండింగ్ ఆఫీసర్లు రియర్ అడ్మిరల్ రెనాటో డేవిడ్, వైస్ అడ్మిరల్ రోలాండో లిజోర్ పుంజలాన్, ఆపరేషన్స్ విభాగంలోని డిప్యూటీ కమాండెంట్ ఫిలిప్పీన్ కోస్ట్‌గార్డ్‌లతో పరస్పరం సంభాషించి, ప్రస్తుత భద్రతా పరిస్థితులపై విస్తృతంగా చర్చలు జరిపారు.



ఫిలిప్పీన్స్‌లోని మనీలాను సందర్శించిన భారత నౌకాదళ నౌకలు ఢిల్లీ, శక్తి, కిల్తాన్



శెభాష్ కామ్య..!

16 ఏళ్లకే ఎవరెస్ట్‌ను అధిరోహించిన కామ్య కార్తికేయన్

- మొట్టమొదటి భారతీయ పిన్న వయస్కురాలిగా రికార్డు
- ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన రెండో బాలిక
- తండ్రితో కలిసి విజయవంతంగా పర్వతారోహణ
- వివరాలను వెల్లడించిన టాటా స్టీల్ అడ్వెంచర్ ఫౌండేషన్
- ఏడు ఖండాల్లోని ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించిన ఘనతకు అడుగుదూరం

జంషెడ్‌పూర్: కామ్య కార్తికేయన్. 16 ఏళ్లు. చదివేది ప్లస్‌టూ. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్ వైపు నుంచి చిన్న వయస్సులోనే అధిరోహించి చరిత్ర సృష్టించింది. ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన రెండో బాలికగా కూడా నిలిచింది. ఈ నెల 20వ తేదీన తండ్రితో కలిసి ఆమె ఈ ఘనత సాధించినట్లు టాటా స్టీల్ అడ్వెంచర్ ఫౌండేషన్(టీఎస్ఏఎఫ్) గురువారం తెలిపింది. ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన శిఖరాలను అధిరోహించిన రికార్డు సాధించేందుకు కామ్య మరో అడుగు దూరంలోనే ఉన్నట్లు టీఎస్ఏఎఫ్ చైర్మన్ చాణక్య చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరైన ప్రోత్సాహం, అంకితభావం ఉంటే ఏదైనా సాధ్యమనే విషయం కామ్య రుజువు చేసిందని, సాహసికులకు ఆమె ప్రేరణగా నిలిచిందని తెలిపారు. ఈ సంస్థే కామ్యకు సహాయ సహకారాలు అందిస్తోంది.

ఏప్రిల్ ఆరో తేదీన తన బృందంతోపాటు కఠ్మాండుకు చేరుకున్న కామ్య..పూర్తిస్థాయి సన్నద్ధతతో మే 16వ తేదీన ఎవరెస్ట్ బేస్ క్యాంప్ నుంచి తండ్రి కార్తికేయన్‌తోపాటు సాహసయాత్రను ప్రారంభించింది. తండ్రితో కలిసి మే 20వ తేదీన వేకువజామున 8,848 మీటర్ల ఎత్తయిన శిఖరంపైకి చేరుకుందని టీఎస్ఏఎఫ్ వివరించింది. తాజా విజయంతో ఆరు ఘనతలను సాధించిన కామ్య.. ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించాలన్న ధ్యేయానికి కేవలం అడుగు దూరంలో నిలిచిందని వెస్టర్న్ నేవీ కమాండ్ 'ఎక్స్'లో పేర్కొంది. ఏడో లక్ష్యమైన అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ మాస్సిఫ్‌ను వచ్చే డిసెంబర్‌లో అధిరోహించేందుకు సిద్ధమవుతున్న కామ్య.. ఈ అరుదైన ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా చరిత్ర పుటల్లో నిలవాలని కోరుకుంటున్నట్లు వివరించింది.

నేవీ కమాండర్ ఎస్.కార్తికేయన్ కుమార్తె కామ్య. ముంబైలోని నేవీ చిల్డ్రన్స్ స్కూల్‌లో ప్లస్‌టూ చదువుకుంటోంది. పర్వతారోహణ అంటే కామ్యకు చిన్ననాటి నుంచే ఎంతో ఆసక్తి. ఏడో ఏటనే, 2015లో 12 వేల అడుగుల ఎత్తయిన చంద్రశిల పర్వతాన్ని అధిరోహించి తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. 2016లో 13,500 అడుగుల ఎత్తున్న మరింత కఠినమైన హరి కీ దున్‌ను, కేదార్‌నాథ్ శిఖరాలను అవలీలగా ఎక్కింది. అదేవిధంగా, 16,400 అడుగుల ఎత్తులో రూప్‌కుండ్ సరస్సుకు చేరుకుంది. అసాధారణ విజయాలను నమోదు చేసిన బాలల కిచ్చే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల శక్తి పురస్కారం కూడా కామ్య అందుకుంది. 2017లో నేపాల్‌లోని 17,600 అడుగుల ఎత్తున ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌నకు చేరుకుని ఈ ఘనత సాధించిన రెండో పిన్న వయస్కురాలిగా నిలిచింది.

ఎవరెస్ట్ కీ బేటీ
- ప్రత్యేక కథనం ఫ్యామిలీలో

చోటీ బహూకు ఇంటిపోరు

తొమ్మిదో గెలుపుపై మేనక గురి!

- బీజేపీ దన్ను అంతంతే
- ప్రచారానికి మోదీ దూరం
- సర్వం తానై ఒంటరి పోరు

సుల్తాన్‌పూర్. గాంధీ కుటుంబపు కంచుకోట రాయ్‌బరేలీకి కేవలం 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న లోక్‌సభ స్థానం. అత్తగారైన ఇందిరను ఎదిరించి చిన్న వయస్సులోనే ఒంటరిగా రాజకీయాల్లోకి వచ్చిన మేనకా గాంధీ ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. ఎంపీగా ఏకంగా తొమ్మిదో విజయమే లక్ష్యంగా బీజేపీ తరఫునే మళ్లీ బరిలోకి దిగారు. అయితే సొంత పార్టీయే ఆమెకు అంతగా సహకరించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో మేనక కేవలం 14,500 ఓట్లతో గట్టెక్కారు. ఈసారి ఆమె గెలుపు ఈజీ కాదని విశ్లేషకులూ అంటున్న పరిస్థితి! ఇన్ని సవాళ్ల నడుమ సుల్తాన్ పూర్ పరీక్షలో 67 ఏళ్ల ఈ 'చోటీ బహు' ఎలా నెగ్గుకొస్తారనేది ఉత్కంఠ రేపుతోంది...

భర్త సంజయ్‌గాంధీ మరణం తర్వాత ఇందిరతో విభేదాలు మేనకను ఒంటరిని చేశాయి. అప్పటికి చంటిపిల్లాడైన వరుణ్ గాంధీని తీసుకొని కుటుంబం నుంచి బయటికొచ్చారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఒంటరి పోరాటమే చేస్తూ వచ్చారు. తొలిసారి 1984లో అమేథీలో బావ రాజీవ్ గాంధీని ఢీకొని 2.7 లక్షల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. 1989లో జనతాదళ్ తరఫున ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ నుంచి గెలిచి తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. 1991లో మళ్లీ బీజేపీ చేతిలో ఓటమి చవిచూసినా ఆ తర్వాత మాత్రం వరుసగా ఏడుసార్లు విజయం సాధించారు. పిలిభిత్‌ను కంచుకోటగా మార్చుకున్నారు. అక్కడి నుంచి మూడుసార్లు ఇండిపెండెంట్‌గా కూడా విజయకేతనం ఎగరేయడం విశేషం. మధ్యలో ఒకసారి ఆవ్లా లోక్‌సభ స్థానం నుంచీ నెగ్గారు. వీపీ సింగ్ ప్రభుత్వంలో, తర్వాత వాజ్‌పేయి సర్కారులో, మోదీ తొలి విడత ప్రభుత్వంలోనూ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఫిలిభిత్‌లో ఆరుసార్లు గెలిచాక 2019లో ఆ స్థానాన్ని కుమారుడు వరుణ్‌కు వదిలి తొలిసారి సుల్తాన్‌పూర్‌కు మారారు. వరుణ్‌కు బీజేపీ ఈసారి మొండిచేయి చూపడంతో మేనక కూడా నిరుత్సాహానికి గురయ్యారు.

సుల్తాన్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ ముఖచిత్రం...

- మొత్తం ఓటర్లు 18 లక్షలు
- ముస్లింలు, దళితులు, కుర్మీ, నిషాద్‌లు కీలకం.
- 2014లో వరుణ్ గాంధీ 42.5 శాతం ఓట్లు సాధించారు. బీఎస్పీ అభ్యర్థికి 24 శాతమే దక్కాయి.
- 2019 ఎన్నికల్లో మేనకా గాంధీకి 45.9 శాతం, బీఎస్పీ అభ్యర్థికి 44.4 శాతం ఓట్లొచ్చాయి.

గత విజేతలు...

2019	మేనకా గాంధీ (బీజేపీ)
2014	వరుణ్ గాంధీ (బీజేపీ)
2009	సంజయ్ సింగ్ (కాంగ్రెస్)
2004	తాహిర్ ఖాన్ (బీఎస్పీ)
1999	జై భద్ర సింగ్ (బీఎస్పీ)

ఓబీసీలు, ముస్లింలే కీలకం...

సుల్తాన్‌పూర్‌లో నిషాద్‌లతో పాటు కుర్మీలు, యాదవులు, ముస్లింలు, దళితులు ఎక్కువగా ఉన్నారు. బ్రాహ్మణులు, ఠాకూర్లు ఓ మోస్తరుగా ఉంటారు. కాంగ్రెస్ మద్దతుతో ఎస్పీ తరఫున బరిలోకి దిగిన రామ్ భువల్ నిషాద్‌కు ఆ సామాజిక వర్గంలో గట్టి పట్టుంది. బీఎస్పీ కుర్మీ సామాజికవర్గానికి చెందిన ఉద్రజ్ వర్మను రంగంలోకి దించడంతో ఓట్లు భారీగా చీలే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడ బీఎస్పీ రెండుసార్లు గెలవగా ఎస్పీ బోణీయే చేయలేదు! స్థానిక సమస్యలే ప్రధానాంశాలుగా ప్రచారం సాగింది.

ప్రచారానికి మోదీ, షా దూరం

సుల్తాన్‌పూర్‌లో శనివారం ఆరో విడతలో పోలింగ్ జరగనుంది. కానీ యూపీ అంతా కలియదిరుగుతున్న ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర బీజేపీ అగ్ర నేతలెవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం! ప్రచారం చివర్లో సీఎం యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఓ ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో ఈ ఎన్నికలు ఆమెకు మళ్లీ ఒంటరి పోరాటంగానే కనిపిస్తున్నాయి. అయితే కుటుంబీకులైన రాహుల్, ప్రియాంక మొదలుకుని విపక్ష నాయకులెవరూ కూడా మేనకకు వ్యతిరేకంగా పెద్దగా ప్రచారం చేయకపోవడం విశేషం!



అయోధ్య రామ మందిర నిర్మాణం, వరుణ్‌కు టికెట్ నిరాకరణ వంటివేవీ సుల్తాన్‌పూర్‌లో ఎన్నికల అంశాలు కావు. నియోజకవర్గ ప్రజల సమస్యలే ప్రధానాంశాలు. వాటిని తీర్చేందుకు ఐదేళ్లుగా చేసిన కృషే నన్ను మళ్లీ గెలిపిస్తుంది. గత ఎన్నికల కంటే ఎక్కువ మెజారిటీతో గెలిచి చూపిస్తా.
- మేనకా గాంధీ

- సాక్షి, నేషనల్ డెస్క్

మహిళలంటే చిన్నచూపు!

వారిని ఆర్ఎస్ఎస్ 'శాఖ'లోకి అనుమతించట్లేదు ● బీజేపీపై రాహుల్ గాంధీ ఆరోపణ

న్యూఢిల్లీ: మహిళలను బీజేపీ రెండో శ్రేణి పౌరులుగానే చూస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నార్త్ వెస్ట్ ఢిల్లీ పార్టీ అభ్యర్థి ఉదిత్ రాజ్ తరఫున గురువారం ఢిల్లీలోని మంగోల్‌పురిలో మహిళలు మాత్రమే పాల్గొన్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ''ఎంతో ఆర్భాటంగా ఇప్పుడే మహిళాలోకం కలలు సాకారం చేస్తున్నట్లు పార్లమెంట్‌లో నారీశక్తి వందన్ అధినయమ్(మహిళా రిజర్వేషన్ బిల్లు) ప్రవేశపెట్టారు. ఆ చట్టం ఇప్పుడు కాదు ఏకంగా పదేళ్ల తర్వాత అమలుచేస్తామని తీరిగ్గా చెప్పారు. ఈ నిర్ణయం వెనుక ఒక సిద్ధాంతముంది. అదే ఆర్ఎస్ఎస్. బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ అయితే ఏకంగా మహిళలను కనీసం 'శాఖ' లోకి అడుగుపెట్టనివ్వడంలేదు. మహిళలను రెండో తరగతి పౌరులుగా భావించాలని ఆర్ఎస్ఎస్ నరనరాల్లో నాటుకుపోయింది' అని విమర్శలు గుప్పించారు.

వర్కింగ్ ఉమెన్ పనికి గుర్తింపు దక్కట్లేదు

''భారత్‌లో ప్రతీ రంగం గురించి మాట్లాడతాంగానీ వర్కింగ్ ఉమెన్ ఇంట్లోనూ చేసే శ్రమకు ఎక్కడా గుర్తింపు దక్కట్లేదు. రోజంగా ఆఫీస్/కార్యస్థలంలో పనిచేసి అలసిపోయిన మహిళలు ఇంటికొచ్చాక మళ్లీ రెండో షిఫ్ట్ మొదలెడతారు. పిల్లల ఆలనాపాలనా చూసుకుని ఇంటి పనులన్నీ చేస్తారు. ఈ పనికి వాళ్లకు ఎలాంటి చెల్లింపులు ఉండవు. పురుషులు రోజుకు 8 గంటలు పనిచేస్తే మహిళలు 16 గంటలపైనే పనిచేస్తారు. వారి శ్రమకు ప్రతిఫలంగా ఏమీ దక్కట్లేదు. ఇది ఒక రకంగా చెల్లింపులులేని గుర్తింపులేని పని. మేం అధికారంలోకి వస్తే మహాలక్ష్మీ యోజన ద్వారా పేద మహిళలకు నెలకు రూ.8,500 చొప్పున ఏటా రూ.1 లక్ష వారి ఖాతాలో జమచేస్తాం'' అని రాహుల్ అన్నారు. మే 25నాటి పోలింగ్‌కు ప్రచారం గురువారంతో ముగుస్తుండటంతో ఢిల్లీ మెట్రోలోనూ రాహుల్ ప్రయాణించారు. ''నార్త్ ఈస్ట్ ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్ తరఫున సైతం రాహుల్ దిల్షాద్ గార్డెన్ ప్రాంతంలో ప్రచారంలో పాల్గొన్నారు.

ఏపీ భవన్‌లో మధ్యాహ్న భోజనం

ఎన్నికల ప్రచారంలో అలసిపోయిన రాహుల్ మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్/తెలంగాణ భవన్‌కు వచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌సహా దాదాపు 10 మందితో కలిసి రాహుల్ భోజనం చేశారు. రాహుల్ పూరీలు, చపాతీలు, కోడికూర వేపుడు, రొయ్యల వేపుడు ఆర్డర్ ఇచ్చారు. తొలుత పూరీ/చపాతీని పప్పుతో కలిపి తిన్నారు. తర్వాత చికెన్ ఫ్రై, రొయ్యల ఫ్రైతో చపాతీ/పూరీ తిన్నారు.



ఢిల్లీ మెట్రోలో రాహుల్ గాంధీ

మీ కీలక పాత్ర పోషించండి | సోనియా గాంధీ

ఢిల్లీ పరిధిలో ప్రచారం చివరిరోజు సందర్భంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గురువారం ఓటర్లకు ఒక వీడియో సందేశం విడుదలచేశారు. '' ప్రజాస్వామ్య పరిరక్షణకు జరుగుతున్న కీలక ఎన్నికలివి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులు కొనసాగుతున్న వేళ వచ్చిన ఎన్నికలివి. ఈ పోరాటంలో మీరు మీ కీలక పాత్ర పోషించండి. మీ ఓటు ఉపాధి కల్పనకు బాటలువేస్తుంది. ఎగసిన ధరలను కిందకు దింపుతుంది. మహిళలకు సాధికారతను కట్టబెడుతుంది. మెరుగైన భవిష్యత్తుతో సమానత్వాన్ని సాధిస్తుంది. ఢిల్లీ పరిధిలోని ఏడు ఎంపీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించండి' అని సోనియా సందేశమిచ్చారు.

'నైట్ విజన్ గాగుల్స్'తో విమానం ల్యాండింగ్

మరో ఘనత సాధించిన భారత వాయుసేన

న్యూఢిల్లీ: భారత వాయుసేన(ఐఏఎఫ్) మరో అరుదైన ఘనత సాధించింది. నైట్ విజన్ గాగుల్స్(ఎన్‌వీజీ) సాయంతో తక్కువ వెలుతురు ఉన్న సమయంలో సీ-130జే రవాణా విమానాన్ని విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు సెక్టార్‌లోని అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్‌లో ఈ ప్రక్రియను చేపట్టింది. ఇందుకు సంబంధించిన రెండు వీడియోలను 'ఎక్స్'లో షేర్ చేసింది. ఒక వీడియోలో ఎన్‌వీజీ టెక్నాలజీతో విమానం సాఫ్ట్ ల్యాండింగ్ అయిన దృశ్యాలు, మరో వీడియోలో విమానంలో లోపలి నుంచి దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఎన్‌వీజీ విజువల్స్ కావడంతో ఈ దృశ్యాలు ఆకుపచ్చ రంగులో విభిన్నంగా ఉన్నాయి. మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకొనే ప్రక్రియలో భాగంగా తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకొనేందుకు కట్టుబడి ఉన్నామని భారత వాయుసేన పేర్కొంది. నైట్ విజన్ గాగుల్స్ టెక్నాలజీతో భారత వాయుసేన మరింత బలోపేతమైంది. వెలుతురు తక్కువ ఉన్న సమయాల్లో, రాత్రిపూట విమానాలను సురక్షితంగా ల్యాండ్ చేయడానికి, సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానం దోహదపడనుంది.

మోదీజీ.. దేవుడు మిమ్మల్ని క్షమించడు

నా తల్లిదండ్రులను వేధిస్తారా?: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ హద్దు మీరుతున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిదండ్రులను సైతం లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్ గురువారం వర్చువల్‌గా మీడియాతో మాట్లాడారు. పద్ధతి మార్చుకోవాలని ప్రధానికి హితవు పలికారు. ''నా ఎమ్మెల్యేలను, మంత్రిని అరెస్టు చేశారు. నన్ను జైలులో పెట్టి వేధించారు. ఈరోజు మీరు హద్దులు దాటారు. నన్ను లక్ష్యంగా చేసుకుని నా తల్లిదండ్రులను వేధిస్తున్నారు. ఆ దేవుడు మిమ్మల్ని క్షమించడు'' అని మోదీని ఉద్దేశించి పేర్కొన్నారు.

అప్పుడు కేజ్రీవాల్ ఇంట్లోనే ఉన్నారు: స్వాతి మలివాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ తనపై దాడి చేసినపుడు ముఖ్యమంత్రి ఇంట్లోనే ఉన్నారని, బిభవ్‌ను కేజ్రీవాల్ కాపాడుతున్నారని ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ ఆరోపించారు. గురువారం ఆమె ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. '' దాడి ఉదంతం తర్వాత కేసులు, దర్యాప్తు, విచారణ, నా వాదనలు, ఆప్ ఖండనలు.. ఇలా ఇంత జరుగుతున్నా కేజ్రీవాల్ నాకు ఇంతవరకు ఒక్కసారి కూడా ఫోన్ చేసి మాట్లాడలేదు. అసలేమైంది? ఎందుకలా జరిగింది? అని పిలిచి మాట్లాడలేదు. నిందితుడిని ఆయన రక్షిస్తున్నారు. నా వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డాలని ఆప్‌లో అందరికీ ఆదేశాలు వెళ్లాయి'' అని ఆరోపించారు.

ఇటు నేను.. అటు ఎవరు?

'కూటమి'ని నిలదీసిన ప్రధాని మోదీ



మహేంద్రగఢ్/పటియాలా: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నాయకులు అధికారంలోకి రాకముందే ప్రధానమంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారని, ఆవు పాలు ఇవ్వకముందే నెయ్యి కోసం రగడ మొదలైందని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు మారితే దేశం ఎలా ముందుకు సాగుతుందని ప్రశ్నించారు. తాను బతికి ఉన్నంత కాలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని పునరుద్ఘాటించారు. ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని చెప్పారు. దేశ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయని స్పష్టంచేశారు. ఈ పోరాటంలో ఒకవైపు ప్రజల సేవకుడు మోదీ ఉన్నారని, మరోవైపు ఎవరున్నారో తెలియదని వ్యాఖ్యానించారు. విపక్ష కూటమికి ప్రధానమంత్రి అభ్యర్థి లేడని పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కరడుగట్టిన కులతత్వం, మతతత్వం, బంధుప్రీతితో కూడిన ఇండియా కూటమిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం హరియాణాలోని మహేంద్రగఢ్, పంజాబ్‌లోని పటియాలాలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు.

ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి విపక్షాల కుట్రలు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'రామ్ రామ్' అని జపించినవారిని అరెస్టు చేస్తారని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ మన దేశాన్ని ముక్కలు చేసిందని, ఓటు బ్యాంక్‌ను సంతృప్తిపర్చడానికి రెండు ముస్లిం దేశాలను సృష్టించిందని విమర్శించారు. ఈసారి అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరానికి తాళం వేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని గుర్తుచేశారు. మన ఆరాధన, విశ్వాసాన్ని కాంగ్రెస్ కించపరుస్తోందని దుయ్యబట్టారు. విభజించగా మిగిలిపోయిన భారతదేశంలోని వనరులపై మొదటి హక్కు ముస్లింలకే ఉందని విపక్ష నాయకులు అంటున్నారని, బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లను సైతం కాజేయాలని చూస్తున్నారని తప్పుపట్టారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు రాత్రికి రాత్రే ఓబీసీ సర్టిఫికెట్లు ఇచ్చేశారని పేర్కొన్నారు. గత పన్నెండేళ్లలో ఇచ్చిన ఆ సర్టిఫికెట్లను కలకత్తా హైకోర్టు రద్దు చేసిందని తెలిపారు. ఒకవేళ కోర్టు అడ్డుకోకపోతే ఓబీసీ అన్యాయం జరిగే మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. ముస్లింలకు రిజర్వేషన్లకు కల్పించాలని కుట్ర పన్నుతున్న ప్రతిపక్షాల నిజస్వరూపం ప్రజలు తెలుసుకోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి ఓటమి తప్పదన్నారు. ఓటమికి బాధ్యులను చేసేందుకు ఒక బకరా కోసం ఆ కూటమిలో ఇప్పటినుంచే అన్వేషణ మొదలైందని పేర్కొన్నారు.

పంజాబ్‌లో అరాచక పాలన

పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో అరాచకం రాజ్యమేలుతోందని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దందా విచ్చలవిడిగా సాగుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. పరిశ్రమలు పంజాబ్‌ను వదిలి వెళ్లిపోతున్నాయని, ప్రజలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక, డ్రగ్స్ మాఫియా, షూటర్ గ్యాంగ్‌లు చెలరేగిపోతున్నాయని ధ్వజమెత్తారు. పంజాబ్ మంత్రులు ఎంజాయ్ చేస్తున్నారని, ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఢిల్లీ దర్బార్‌లో హాజరు వేయించుకోవడంతోనే సమయం గడిపేస్తున్నారని ఆక్షేపించారు. అలాంటి వ్యక్తులు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కలిసి పోటీ చేస్తున్న కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు పంజాబ్‌లో మాత్రం పరస్పరం పోటీ పడుతున్నాయని చెప్పారు. ఇది డ్రామా కాదా? అని మోదీ నిలదీశారు.

ఎలక్షన్ బీట్

ఐదో విడతలో 62.2% పోలింగ్

- అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 78.48 శాతం
- అత్యల్పంగా బిహార్‌లో 56.76 శాతం

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఐదో విడతలో 62.2 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 78.48%, అత్యల్పంగా బిహార్‌లో 56.76% పోలింగ్ నమోదైనట్లు తెలిపింది. మే 20న 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 లోక్‌సభ నియోజక వర్గాల్లో పోలింగ్ జరగడం తెలిసిందే. అయిదో విడతలో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించింది. మహిళలు 63 శాతం, పురుషులు 61.48 శాతం, థర్డ్ జెండర్ 21.96 శాతం మంది ఓటేశారని ఈసీ పేర్కొంది.

8 రాష్ట్రాల్లో నమోదైన పోలింగ్ శాతం వివరాలు	
బిహార్	56.76
కశ్మీర్	59.10
జార్ఖండ్	63.21
లద్దాఖ్	71.82
మహారాష్ట్ర	56.89
ఒడిశా	73.50
ఉత్తరప్రదేశ్	58.02
బెంగాల్	78.45%

ఆరో విడతకు ముగిసిన ప్రచారం

6 రాష్ట్రాలు, 2 యూటీల్లోని 58 స్థానాలకు శనివారం జరగనున్న పోలింగ్

న్యూఢిల్లీ: సార్వత్రిక సమరంలో ఆరో విడత పోలింగ్ జరగనున్న స్థానాల్లో ప్రచారం గురువారంతో ముగిసింది. 6 రాష్ట్రాలు, రెండు యూటీల్లోని 58 స్థానాలకు పోలింగ్ శనివారం జరగనుంది. ఢిల్లీ పరిధిలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో, హరియాణాలోని మొత్తం 10 స్థానాల్లో ఒకేదఫాలో శనివారం పోలింగ్ నిర్వహిస్తున్నారు. వీటితోపాటు ఒడిశా అసెంబ్లీ ఎన్నికల మూడో విడతలో 42 ఎమ్మెల్యే స్థానాలకూ రేపే పోలింగ్ జరగనుంది.

రాష్ట్రం	సీట్లు
ఉత్తరప్రదేశ్	14
హరియాణా	10
బిహార్	8
బెంగాల్	8
ఢిల్లీ	7
ఒడిశా	6
జార్ఖండ్	4
కశ్మీర్	1

బరిలో ముఖ్య నేతలు

బీజేపీ నేతలు మనోహర్ లాల్ ఖట్టర్(హరియాణాలోని కర్నాల్), ధర్మేంద్ర ప్రధాన్(ఒడిశాలోని సంబల్‌పూర్), అభిజిత్ గంగోపాధ్యాయ్(పశ్చిమబెంగాల్‌లోని తామ్లుక్), నవీన్ జిందాల్ (కురుక్షేత్ర), రావు ఇందర్‌జిత్ సింగ్(గురుగ్రామ్), మేనకా గాంధీ(ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్)తోపాటు పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ(జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ) బరిలో ఉన్నారు. నార్త్ ఈస్ట్ ఢిల్లీ నుంచి బీజేపీ నేత మనోజ్ తివారీ, కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ పోటీ పడుతున్నారు.

ప్రధాని మోదీని చంపేస్తాం!

ఎన్ఐఏకి ఆగంతకుడి బెదిరింపు కాల్

సాక్షి, చెన్నై: ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని చంపేస్తామంటూ అందిన బెదిరింపు కాల్‌తో చెన్నైలోని జాతీయ దర్యాప్తు విభాగం అప్రమత్తమైంది. చెన్నై పురసైవాక్కంలో ఎన్ఐఏ కార్యాలయం ఉంది. బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఈ కార్యాలయానికి ఫోన్ చేసి...ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీని హతమా రుస్తామంటూ హిందీలో హెచ్చరించాడు. వెంటనే ఎన్ఐఏ అధికారులు చెన్నై సైబర్‌క్రైం బ్రాంచిని అప్రమత్తం చేశారు. మధ్యప్రదేశ్ నుంచి ఆ కాల్ వచ్చిన ట్లుగా తేలడంతో గురువారం ఉదయం ఎన్ఐఏ, సైబర్ క్రైం బృందాలు భోపాల్‌కు వెళ్లాయి. అదేవిధంగా, చివరి విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ప్రధానికి భద్రతను మరింతగా పెంచాలని కూడా యోచిస్తున్నట్లు సమాచారం.

అమెరికాలో జడ్జిగా నియమితులైన తెలుగు మహిళ జయ బాడిగ



న్యూయార్క్: భారతీయ సంతతి అమెరికా పౌరురాలు, తెలుగుబిడ్డ జయ బాడిగ అక్కడి శాక్రామెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన జయ ఆ తర్వాత కుటుంబంతో అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడే న్యాయ విద్య చదివి న్యాయవాద వృత్తి జీవితం మొదలెట్టారు. ఇటీవల జడ్జిగా ఎంపికైన జయను కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ శాక్రామెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు జడ్జిగా తాజాగా నియమించారు. ఇదే కోర్టులో గత రెండేళ్లుగా జయ కమిషనర్‌గా సేవలందిస్తుండటం విశేషం. డెమొక్రటిక్ పార్టీ సభ్యురాలైన జయ 2020లో కాలిఫోర్నియా ఆరోగ్య పరిరక్షణ సేవల విభాగంలో అటార్నీగా పనిచేశారు. 2018లో కాలిఫోర్నియా గవర్నర్ కార్యాలయంలో అత్యవసర సేవల విభాగంలో సేవలందించారు. శాంటాక్లారా విశ్వవిద్యాలయంలో లా చదివారు. బోస్టన్ విశ్వవిద్యాలయంలోని ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఎంఏ చేశారు. కుటుంబ కేసులు, తగాదాలను పరిష్కరించడంలో జయ పది సంవత్సరాల అనుభవం గడించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టులు మృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గురువారం జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. నారాయణపూర్ -బీజాపూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఇంద్రావతి ఏరియా కమిటీ, ప్లాటూన్-16 దళాలు సమావేశమయ్యాయనే సమాచారంతో భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఉదయం 11 గంటల సమయంలో ఇరు వర్గాల నడుమ కాల్పులు మొదలయ్యాయి. కాల్పులు ఆగాక ఆ ప్రాంతంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. మృతులను గుర్తించాల్సి ఉందన్నారు.

బంగ్లా ఎంపీ హత్యకు రూ.5 కోట్ల సుపారీ

కోల్‌కతా: చికిత్స కోసం భారత్‌కు వచ్చి పశ్చిమబెంగాల్‌లో హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. అజీమ్ హత్యకు అతని పాత స్నేహితుడే రూ.5 కోట్ల సుపారీ ఇచ్చాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పశ్చిమబెంగాల్ సీఐడీ ఐజీ అఖిలేశ్ చతుర్వేది గురువారం ప్రకటించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇది పక్కా ప్రణాళికతో చేసి హత్య. కోల్‌కతా శివారులోని న్యూ టౌన్ ప్రాంతంలో అజీమ్ చివరిసారిగా కనిపించిన అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను అజీమ్ పాత స్నేహితుడే అద్దెకు తీసుకున్నాడు. అమెరికా పౌరసత్వమున్న ఆ స్నేహితుడు ప్రస్తుతం అమెరికాలో ఉన్నాడు. 56 ఏళ్ల అజీమ్‌ను హంతకులు ఊపిరాడకుండా చేసి చంపాక మృతదేహాన్ని ముక్కలుగా చేశారు.

రసాయన కర్మాగారంలో భారీ పేలుడు.. 8 మంది మృతి..60 మందికి గాయాలు

థానె: మహారాష్ట్రలోని థానె జిల్లాలో రసాయన కర్మాగారంలో గురువారం సంభవించిన భారీ పేలుడు, అగ్ని ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా మరో 60 మంది గాయాలపాలయ్యారు. డొంబివిలి పారిశ్రామిక వాడలోని అముదాన్ కెమికల్స్ ఫ్యాక్టరీ బాయిలర్ గురువారం మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో అకస్మాత్తుగా పేలింది. పేలుడుతోపాటు మంటలు వ్యాపించి చుట్టుపక్కల కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇద్దరు మహిళలు సహా 8 మంది చనిపోగా మరో 60 మంది గాయపడ్డారు. మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలిపోయాయి. పేలుడు శబ్దం కిలోమీటర్ దూరం మేర వినిపించిందని స్థానికులు తెలిపారు. ఆ ప్రాంతంలో రసాయనాలతో కూడిన రంగురంగుల పొగలు దట్టంగా కమ్ముకున్నాయి. చుట్టుపక్కల ఫ్యాక్టరీల భవనాలు, నివాసాలు దెబ్బతిన్నాయి. ఘటన చోటుచేసుకున్న ఫ్యాక్టరీలోని బాయిలర్‌ను నెలలపాటు మూసివేసి ఇటీవలే తిరిగి ప్రారంభించారని అధికారులు తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 24 । మే । 2024



మరో జంతర్ మంతర్?

బెంగళూరులోని రేస్‌కోర్సు సర్కిల్‌లో సుందరీకరణ పనులు. ఢిల్లీలో ఉండే జంతర్ మంతర్ తరహా నిర్మాణాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం

న్యూస్‌రీల్

చాముండి బెట్ట మార్గంలో కోతుల బెడద



మైసూరు: నాడశక్తి దేవత చాముండేశ్వరి దర్శనం చేసుకునేందుకు చాముండిబెట్టకు వచ్చే భక్తులకు కోతుల వల్ల మనశ్శాంతి కరువైందనే ఆరోపణలున్నాయి. కోతులు భక్తులను ఇబ్బందులకు గురిచేయడమే కారణం. ఇదే మాదిరిగా ఓ భక్తురాలి బ్యాగ్‌ను కోతి ఎత్తుకెళ్లింది. హాసన్ నుంచి వచ్చిన భక్తుడు చాముండిబెట్ట మెట్లపై తల్లితో కలసి అమ్మవారి దర్శనానికి వెళుతున్నాడు. మెట్ల మార్గంలో పాదం వద్ద చాముండి విగ్రహానికి ఇద్దరూ పూజలు చేస్తుండగా వృద్ధురాలి చేతిలో ఉన్న పర్సును కోతి తీసుకెళ్లి దాంట్లోని ఒక్కో వస్తువును విసిరేసింది. చివరికి మొబైల్‌ఫోన్‌ను పట్టుకుని చెట్లపై తిరుగుతూ ఆడుకుంది. అరటిపండ్లు చూపించినా, ఏమిచ్చినా కోతి మాత్రం లొంగలేదు. సుమారు అర్ధగంట పాటు అవస్థలు పెట్టి చివరికి మొబైల్‌ను కిందకి విసిరేసింది. మొబైల్ దొరికిన ఆనందంలో మహిళ, కొడుకు దర్శనానికి వెళ్లారు. ఇటీవల కాలంలో చాముండిబెట్టలో కోతుల బెడద బాగా పెరిగింది.

హాసన్ ఎంపీ వచ్చేయాలి: నిఖిల్

శివాజీనగర: హాసన్ ఎంపీ ఎక్కడున్నా వచ్చి తనిఖీ ఎదుర్కోవాలని మాజీ సీఎం హెచ్.డీ. కుమారస్వామి తనయుడు, జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ అన్నారు. తన సోదరుడైన ప్రజ్వల్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని సీఎం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం, ఎక్కడ ఉన్నా వచ్చేయాలని కుమారస్వామి సూచించడంపై ఆయన స్పందించారు. హాసన్ ఎంపీ నేరుగా వచ్చి సిట్ దర్యాప్తును ఎదుర్కోవాలని విన్నవించారు. తండ్రి అభిప్రాయమే తనది కూడా అని, ఎంపీ వస్తారనే నిరీక్షణలో ఉన్నట్లు చెప్పారు. కాగా ప్రజ్వల్ పేరును నిఖిల్ ఎక్కడా పలకకపోవడం గమనార్హం.

మహిళ సంసారంలో చిచ్చు

- మాజీ ప్రియుని నిర్వాకం



మైసూరు: మహిళ వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, ఆడియోలను ఇన్‌స్టా లో పోస్ట్ చేసి ఆమెను వేధించి సంసారంలో చిచ్చు పెట్టిన మాజీ ప్రియుని దురాగతమిది. ఈ సంఘటన మైసూరు బన్నిమంటప అలీం నగరలో జరిగింది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైసూరు సైబర్‌పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. బాధిత మహిళ నాయుడు నగరకు చెందిన మహమ్మద్ ఫైజాన్ అనే వ్యక్తితో రెండేళ్ల పాటు సహజీవనం చేసింది. అతని ప్రవర్తన నచ్చకపోవడంతో విడిపోయింది. తరువాత బంధువుల్లో ఒకరిని పెళ్లి చేసుకుని జీవిస్తోంది. మరోవైపు మాజీ ప్రియుడు ఫైజాన్‌కు ఇదంతా నచ్చలేదు. గతంలో తాను తీసిన ఆమె వీడియోలు, ఫోటోలు, ఆడియోలను నకిలీ ఇన్‌స్టా ఖాతాను రూపొందించి పోస్ట్ చేయసాగాడు. ఇవి వైరల్ కావడంతో ఆమె భర్త ఆ మహిళ నుంచి విడిపోయాడు. ఈ పని చేసింది తన మాజీ ప్రియుడేనని ఆమె గుర్తించింది. అతన్ని ప్రశ్నించగా తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే నగ్న ఫోటోలను అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. ఆ ఫోటోలను మహిళ కుటుంబ సభ్యులు, స్నేహితులకు పంపించి పైశాచికంగా ప్రవర్తించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

రూ. 60 కోట్ల కబ్జా భూమి స్వాధీనం

శివాజీనగర: బెంగళూరు బనశంకరి వద్ద బీ.ఎం.కావల్ సర్వే నంబర్ 92లో ఆక్రమణ అయిన సుమారు రూ.60 కోట్ల విలువ చేసే 5 ఎకరాల అటవీ భూమిని ఖాళీ చేయించినట్లు అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె తెలిపారు. గురువారం వికాససౌధలో విలేకరులతో మాట్లాడుతూ అటవీభూముల్లో కబ్జాలను తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో బెంగళూరు బీ.ఎం.కావల్ వ్యాప్తిలో గొట్టిగెరపాళ్య వెంకటప్ప, ఆయన తల్లి తిమ్మక్క అనే వ్యక్తులు 5 ఎకరాల 20 కుంటల అటవీ భూమిని ఆక్రమించుకున్నట్లు తేలిందన్నారు. ఏసీఎఫ్ కోర్టు ఆదేశాల మేరకు ఈ భూమి నుంచి కబ్జాదారులను ఖాళీ చేయించినట్లు చెప్పారు.

ప్రశాంతత ఎండమావేనా?

- తరచూ సంచలనాత్మక ఘటనలు
- బాలికలు, యువతులపై ఘోరాలు
- పెరిగిన డ్రగ్స్, సైబర్ నేరాలు
- గత 4 నెలల్లో మరింత అధికం

ఎవరైనా ప్రశాంతతను కోరుకుంటారు. ప్రభుత్వం, పోలీసులు తమకు భద్రతను కల్పిస్తారని ఆశిస్తారు. కానీ తరచూ ఏదో ఒక జిల్లాలో పెద్ద ఘోరం జరగడం పరిపాటిగా మారింది. హత్యలు, మూకుమ్మడి దాడులు, సైబర్ మోసాలు పెరిగిపోవడం అందరికీ కలవరం కలిగిస్తోంది. శాంతితో కూడిన భద్రమైన సమాజం కావాలని కోరుకోవడం అత్యాశ కాకూడదు.







బెంగళూరులో తరచూ భారీగా పట్టుబడుతున్న డ్రగ్స్

బనశంకరి: హుబ్లీ కాలేజీ ఆవరణలో బీబీఏ విద్యార్థిని నేహా హిరేమఠ హత్య, అదే నగరంలో ఇంట్లోకి చొరబడి యువతి అంజలి హత్య, మైసూరులో సినీ నటి విద్య భర్త చేతిలో హతం కావడం, కొడగులో ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలు వెలువడిన రోజే విద్యార్థినిని గొంతుకోసి చంపడం వంటి దుర్ఘటనలు, బెంగళూరు కెఫెలో బాంబు విస్ఫోటం, తరచూ మతపరమైన సంఘటనలు, మంగళూరు వద్ద కడబలో కాలేజీలో ముగ్గురు అమ్మాయిలపై యాసిడ్ దాడి, బెళగావిలో మహిళను వివస్త్రను చేసి ఊరేగించి దాడి చేయడం, తుమకూరు జిల్లాలో కారులో ముగ్గురిని హత్య చేసి దహనం.. తదితరాలు రాష్ట్రంలో శాంతి భద్రతలపై చర్చనే రేకెత్తిస్తున్నాయి. గత నాలుగు నెలల్లో నేర కార్యకలాపాలు హెచ్చుమీరడం సామాన్య ప్రజలకు గుబులు పుట్టిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించే పరిస్థితి ఏర్పడింది. ఈ నేర కార్యకలాపాల అడ్డుకట్టకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని విపక్షాలు, విశ్రాంత పోలీస్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు.



విద్యార్థిని నేహా హిరేమఠ హత్యకు వ్యతిరేకంగా హుబ్లీలో సాగిన ఆందోళనలు

3 ఏళ్లుగా నేరాల వృద్ధి

రాష్ట్ర క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎస్‌సీఆర్‌బీ) అందించిన వివరాలు గమనిస్తే రాష్ట్రంలో నేరాల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. గత మూడేళ్లలో హత్యలు, అత్యాచారాలు, పోక్సో కేసులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. అందులోనూ గత నాలుగు నెలల్లో నేరాలు ఇంకా పెచ్చుమీరాయి. డ్రగ్స్ మాఫియా కేసులు సైతం ఎక్కువయ్యాయి. బాలికలపై లైంగిక దాడులు, వేధింపులు, దౌర్జన్యాలు, సైబర్ మోసాలూ అదే బాటలో ఉన్నాయి.

నేరాలంటే భయపడేలా ఉండాలి

విశ్రాంత డీజీపీ డాక్టర్ డీవీ.గురుప్రసాద్ దీనిపై స్పందిస్తూ నేరాల నియంత్రణకు పోలీసులు ప్రాధాన్యత ఇవ్వాలి గస్తీ వ్యవస్థ మరింత పటిష్టం చేయాలి. నేర కార్యకలాపాల పట్ల ప్రజల్లో జాగృతం చేయాలి. పోలీసులు యూనిఫాంలో తిరుగుతూ కనిపిస్తే దుండగులు నేరాలకు పాల్పడటానికి భయపడతారు. నేరస్తులకు పోలీసులు అంటే భయం కలిగించేలా ఉండాలి. సీసీ కెమెరాలను అధికంగా అమర్చాలి. 100 నేరాలు జరిగితే 45 కేసుల్లో మాత్రమే నిందితులను కనిపెడుతున్నారు. నేర నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు.

3 వేలకు పైగా హత్యలు

- 2022 నుంచి 2024 ఏప్రిల్ వరకు రాష్ట్రంలో 3,095 హత్యలు సంభవించాయి. అందులోను బెంగళూరులో చాలా ఎక్కువ. దేశంలో ఢిల్లీ తరువాత సిలికాన్ సిటీలోనే ఎక్కువగా హత్యలు జరుగుతున్నట్లు జాతీయ నేర గణాంక సంస్థ ప్రకటించింది. పచ్చని ఉద్యాననగరిలో నెత్తుటి చారికలు కనిపిస్తున్నాయి.
- రాష్ట్రంలో 2024 ఏప్రిల్ వరకు నాలుగు నెలల్లో 430 హత్యలు జరిగాయి.
- మూడేళ్లలో 8310 బాలికలపై లైంగిక వేధింపులు జరిగి ఆ మేరకు పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇదే అవధిలో 1,344 అత్యాచారాలు నమోదయ్యాయి.
- 2024లో నాలుగు నెలల్లో 1,262 మంది పిల్లలపై లైంగిక వేధింపులు, 198 అత్యాచార కేసులు వెలుగుచూశాయి.



మోసకారి ఏటీఎం?

- రూ 5 వేలు విత్ డ్రా చేస్తే 4040 మాత్రమే రాక



డబ్బులు లెక్క పెడుతున్న యువతి

దొడ్డబళ్లాపురం: చాలా మంది ఏటీఎంలో డబ్బులు డ్రా చేశాక కరెక్టుగా ఉంటాయి కదా అని లెక్కపెట్టుకోరు. ఏటీఎం మీద అంత నమ్మకం మనకు. కానీ అలా లెక్కపెట్టుకోకుంటే మోసపోయే ప్రమాదం ఉంది. విత్‌డ్రా చేసిన డబ్బు కంటే తక్కువ వచ్చిన సంఘటన రామనగరలో వెలుగు చూసింది. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేసే సుమ అనే యువతి రామనగర కేఎస్ ఆర్టీసీ బస్టాండులో ఉన్న ఇండియా ఏటీఎంలో రూ.5 వేలు విత్ డ్రా చేసింది. కానీ ఏటీఎంలో వచ్చింది మాత్రం రూ.4040. రూ.960 తక్కువ వచ్చింది. దీంతో సుమ అక్కడే ఉన్న కేఎస్ ఆర్టీసీ సిబ్బందికి చెప్పగా వారు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేసారు. ఇది దగాకోరు ఏటీఎం అని పలువురు కామెంట్లు చేశారు.

సీఏలలో భారత్ అగ్రస్థానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బనశంకరి: ప్రపంచంలో చార్టెర్డ్ అకౌంటెంట్స్ లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. జూన్ 27 నుంచి 29 వరకు జాతీయ స్టార్టప్‌ల సమావేశం బెంగళూరులో నిర్వహిస్తామని చెప్పారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండువందల మంది స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో పాటు పదివేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. దేశంలో 4 లక్షల మంది సీఏలు ఉన్నారని, 9 లక్షల మంది విద్యార్థులు సీఏ కోర్సు చేస్తున్నారని, ప్రపంచంలో ఏ దేశంలో ఇంతమంది సీఏలు లేరని చెప్పారు. ఈ సమావేశంలో సీఏ దీరజ్‌కుమార్ ఖండేవాల, సీఏ అభయ్‌కుమార్, సీఏ ప్రమోద్‌హెగ్డే, కోదాశ్రీనివాస్, సీఏ గీత, సీఏ కవిత పాల్గొన్నారు.





● సన్మార్గమే శరణ్యం వేల ఏళ్ల కిందట బుద్ధుడు ప్రవచించిన బోధనలు నేడు మరింత ఆవశ్యకమయ్యాయి. బుద్ధ పూర్ణిమ సందర్భంగా గురువారం బెంగళూరు మహాబోధి సొసైటీలో సాగిన వేడుకలు, పాల్గొన్న భిక్షువులు

ముగ్గురు అధికారుల సస్పెండ్

- సాలుండి కలుషిత నీటి ఘటనలో సీఎం చర్యలు



గ్యాస్ లీకైన ఇంటిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

మైసూరు/ శివాజీనగర: జిల్లాలోని కె.సాలుండి గ్రామంలో కలుషిత నీరు తాగి యువకుడి మరణించడంతో పాటు 48 మంది ఆస్పత్రిపాలైన దుర్ఘటనలో ముగ్గురు పంచాయతీ అధికారులను బాధ్యులను చేసినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. గురువారం సాయంత్రం మైసూరుకు చేరుకున్నారు. కలెక్టర్ నివేదిక ఆధారంగా ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కె.సాలుండి గ్రామంలో కలుషిత నీరు సరఫరా అయిందని, అధికారులు తనిఖీ చేయలేదని తెలిపారు. సాలుండికి వెళ్లి, మరణించిన యువకుని కుటుంబ సభ్యులను కలుసుకుని ఓదార్చారు. ఆ తర్వాత మైసూరులోని యరగనహళ్లికి వచ్చి అక్కడ గ్యాస్ లీకేజీ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన ఇంటిని పరిశీలించారు. మృతుల బంధువులను పరామర్శించారు. మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయంపై సమీక్ష

రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, రసాయనిక ఎరువులను, రుణ వసతిని సక్రమంగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. బెంగళూరులో నివాస కార్యాలయం కృష్ణాలో వ్యవసాయం గురించి కలెక్టర్లు, జడ్పీ సీఈఓలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. సుదీర్ఘమైన ఎన్నికల కోడ్ వల్ల పరిపాలనకు ఇబ్బంది కలిగిందన్నారు. అయినప్పటికీ అత్యవసర పనులపై దృష్టి సారించాలని, ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కోడ్ అయిపోగానే అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు.

భవాని కారు డ్రైవర్ పరారీ

బనశంకరి: మహిళపై వేధింపులు, కిడ్నాప్ కేసులో మాజీ మంత్రి హెచ్‌డీ.రేవణ్ణ సతీమణి భవానీకి సిట్ అధికారులు నోటీస్ ఇచ్చినప్పటికీ ఆమె విచారణకు హాజరు కావడం లేదు. భవానీకి రెండు నోటీసులు జారీచేశారు. అనారోగ్యం నెపంతో ఆమె ముఖం చాటేశారు. మరోపక్క భవానీ కారు డ్రైవరు అజిత్ కూడా అదృశ్యమయ్యాడు. ఇక పోలీసులు హొళెనరసిపురలో అజిత్ నివాసానికి వెళ్లి సమన్లు అంటించారు.

ఆలయాల్లో రేవణ్ణ పూజలు

యశవంతపుర: కిడ్నాప్ కేసులో జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలైన జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ ఆలయాల చుట్టూ తిరుగుతున్నారు. గురువారం కలబురిగి జిల్లా అఫజలపుర తాలూకా గాణగాపురలో ప్రఖ్యాత దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో పూజలు చేశారు.

ఎమ్మెల్యే మాజీ పీఏ వసూళ్లపర్వం

యశవంతపుర: ప్రభుత్వ ఉద్యోగాలు, కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అజయ్‌సింగ్ మాజీ పీఏని కలబురగి పోలీసులు అరెస్ట్ చేశారు. పరశురామ్ జీవర్గి నిందితుడు, ఇతడు అజయ్‌సింగ్ వద్ద గతంలో పీఏగా పనిచేశాడు, ఆ సమయంలో ఉద్యోగాలు, కాంట్రాక్టర్లకు పనులు ఇప్పిస్తానని నమ్మించి రూ.14.90 లక్షలు వసూలు చేశాడు. కిరణ్ అనే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పరశురామ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి ప్రశ్నించగా పలు మోసాలు బయటపడ్డాయి. 39 మంది నుంచి సుమారు రూ.1.50 కోట్లను వసూలు చేసినట్లు చెప్పాడు. బాధితులు ప్రశ్నించడంతో నిందితుడు బెంగళూరులో లాడ్జిలోకి మకాం మార్చాడు. కలబురగి పోలీసులు గాలించి పట్టుకున్నారు.

ఫ్యాక్టరీలో పేలుడు, ఇద్దరు కార్మికుల మృతి

దొడ్డబళ్లాపురం: స్టీల్ కంపెనీలో గ్యాస్ పేలుడు జరిగి ఇద్దరు కార్మికులు మృతిచెందిన సంఘటన నెలమంగల తాలూకా దాబస్‌పేట పారిశ్రామికవాడలో జరిగింది. బిహార్‌కు చెంది అశోక్‌కుమార్ (49), ఒడిశాకు చెందిన ముఖేశ్ కుమార్ (33) మృతులు. 17వ తేదీన దాబస్‌పేట పారిశ్రామికవాడలో ఉన్న ఎస్‌కే స్టీల్ ఫ్యాక్టరీలో మెటల్ గ్యాస్ పేలుడు సంభవించి అశోక్ కుమార్,ముఖేశ్ కుమార్, సుశీల్ అనేవారు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరూ గురువారం ఉదయం మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కంపెనీ సూపర్‌వైజర్ పప్పు యాదవ్, యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేసారు.

సరిహద్దుల్లో అతిసారం

రొళ్ల: కర్ణాటక – ఆంధ్ర సరిహద్దుల్లో మరో భారీ నీటి కాలుష్య సంఘటన జరిగింది. మండల పరిధిలోని కాకి గ్రామంలో అతిసారం వ్యాపించింది. సుమారు 30 మందికి పైగా వాంతులు, విరేచనాలతో రొళ్ల, మడకశి, శిర, మధుగిరిలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వర్షాలకు నీళ్ల కలుషితం కావడంతో పాటు వాతావరణం మార్పు వల్ల అతిసారం వ్యాపించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గురువారం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగుల నుంచి నమూనాలను సేకరించినట్లు వైద్యురాలు మాధుర్య తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలతో కూడిన పోషక భోజనం చేయాలని, పరిశుభ్రమైన నీరు తాగాలన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

దొంగ భయమా.. స్వామి మహత్తా?

- ఆలయంలో దోచుకెళ్లిన నగలు
- వారం తరువాత ప్రత్యక్షం



ఆలయంలో వదిలివెళ్లిన నగలు, సామగ్రి



ప్రాచీన ఐరావతేశ్వరస్వామి ఆలయం

క్రిష్ణగిరి: వారం రోజుల క్రితం గుర్తుతెలియని దుండగులు పురాతన ఆలయంలో దోచుకెళ్లిన 300 కిలోల వెండి నగలు, సామగ్రి మళ్లీ ఆలయంలో ప్రత్యక్షమైంది. సినిమాల్లో మాదిరిగా ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు బేరికె సమీపంలోని అత్తిముగం గ్రామంలో చారిత్రక ప్రసిద్ధి పొందిన ఐరావతేశ్వర స్వామి ఆలయం ఉంది. వారం రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు చొరబడి 300 కిలోల వెండి నగలు, సొత్తును దోచుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు బేరికె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దొంగల కోసం గాలింపు చేపట్టారు. ఈ తరుణంలో బుధవారం సాయంత్రం ఆ నగలను మళ్లీ ఆలయంలోనే పడేసి వెళ్లారు. దొరికిపోతామనే భయంతోనే పడేసి ఉంటారని కొందరు, స్వామి మహత్తుకు దొంగలు బెదిరిపోయారని మరికొందరు వ్యాఖ్యానించారు.



గురువారం ధార్వాడ నగరంలో కుండపోత వర్షం ముంచెత్తింది. బీఆర్‌టీఎస్ రోడ్డులో నీరు నిలిచిపోవడంతో మ్యాన్‌హోల్స్‌ను తీస్తున్న కార్మికులు

క్లుప్తంగా

వైభవంగా తాయమ్మ దేవి ఉత్సవాలు



దేవికి స్వామీజీల పూజలు, హోమం నిర్వహిస్తున్న భక్తులు

రాయచూరు రూరల్: నగరంలో తాయమ్మ దేవి ఆలయ జీర్ణోద్ధరణ ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. గురువారం అంబేడ్కర్ నగర్‌లో భక్తుల సమక్షంలో మఠాధిపతులు శాంత మల్ల, సోమ శంభునాథ స్వామీజీలు జీర్ణోద్ధరణ ఉత్సవాలకు పూజలు చేశారు. వెంకటేష్, మల్లేష్, శివకుమార్, శంకర్, రాఘవేంద్ర, అనిల్, తేజుకుమార్, బసవరాజ్, నరసింహులు, బ్రహ్మేంద్ర, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

బోధనపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అరుణ

రాయచూరు రూరల్: జిల్లాలో విద్యార్థులకు పాఠాలు బోధించే పద్ధతులపై ఉపాధ్యాయులకు తగిన అవగాహన అవసరమని హిందీ అధ్యాపకురాలు అరుణ హిరేమట్ వెల్లడించారు. గురువారం భారతీయ వైద్య సంఘం సభాంగణంలో ఏబీఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధనా పద్ధతులను అనుసరించాలని అన్నారు. ఈ సందర్భంగా మల్లనగౌడ, చెన్నబసవ, సరోజ తదితరులున్నారు.

రింగ్ రోడ్లను నిర్మించండి



మంత్రి సతీష్ జార్కిహోళికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మారెప్ప

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని రాయచూరు నగరంలో రింగ్ రోడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యతను ఇవ్వాలని ప్రజాపనుల శాఖా మంత్రి సతీష్ జార్కిహోళికి కాంగ్రెస్ పార్టీ వెనుకబడిన వర్గాల విభాగం ప్రధాన కార్యదర్శి టి.మారెప్ప విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం బెంగళూరులో మంత్రిని కలిసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మనవి చేశారు. కళ్యాణ కర్ణాటకలో రాయచూరు జిల్లా అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ.1500 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు.

మండలి ఎన్నికల్లో ఆశీర్వదించండి



మాట్లాడుతున్న శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జూన్ 3న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ సూచించారు. ఆయన గురువారం నగరంలో పార్టీ కార్యకర్తలతో కలిసి అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ తరపున ఏర్పాటు చేసిన సమావేశంలో ఓటర్లను అభ్యర్థించి మాట్లాడారు. 60 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పేదలను పట్టించుకోలేదన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధి మండలిని ఏర్పాటు చేశామన్నారు. తమ పార్టీ అభ్యర్థిని ఓటర్లు ఆశీర్వదించాలని కోరారు.

వడకరాయ రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

హొసపేటె: నగరంలో వెలిసిన పురాతన వడకరాయ దేవస్థానం రథోత్సవం గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు నెరవేర్చారు. సాయంత్రం రథం లాగారు. నగరంలో వివిధ వార్డులలో పాటు చుట్టుపక్కల ప్రదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవాన్ని ఆలయం నుంచి ప్రారంభించి పాదగట్ట ఆంజనేయ దేవస్థానం వరకు నిర్వహించారు.

బుద్ధం శరణం గచ్ఛామి



నార్సింగ్ ఘూత్ నిర్వహిస్తున్న బౌద్ధ సన్యాసులు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

- ప్రశాంతి నిలయంలో ఘనంగా బుద్ధ పూర్ణిమ
- దేశ విదేశాల నుంచి భక్తుల రాక
- భక్తిభావం పంచిన ప్రార్థనలు

ప్రశాంతి నిలయం: వేలాది మంది బౌద్ధ సన్యాసులు, భక్తుల నడుమ బుద్ధ పూర్ణిమ వేడుకలు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. గురువారం ఉదయమే సాయికుల్వంత్ సభా మందిరాన్ని, సత్యసాయి మహాసమాధిని బౌద్ధ సంస్కృతీ సంప్రదాయాల ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. సత్యసాయి మహాసమాధి చెంత బౌద్ధ గురువులు ప్రార్థనలు చేశారు. సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, జపాన్, తైవాన్, బ్రూనై, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన వేలాది భక్తులు వేడుకలలో పాల్గొన్నారు. హిమాచల్ ప్రదేశ్, నేపాల్‌కు చెందిన 30 మంది బౌద్ధ సన్యాసులు సంప్రదాయమైన నార్సింగ్ ఘూత్‌ను ఆలపించారు. బాలలు, మహిళలు గీతాలను ఆలపించారు. అనంతరం సాయంత్రం బౌద్ధ సన్యాసులు వారి సంస్కృతీ సంప్రదాయాలను వివరిస్తూ కనువిందుగా నృత్య ప్రదర్శన నిర్వహించారు. బుద్ధుని బోధనలను చాటుతూ శాంతి సౌభ్రాతృత్వాలు వర్ధిల్లాలని పూజలు చేశారు.

నేత్రపర్వంగా బ్రహ్మారథోత్సవం



రథోత్సవం నిర్వహించిన దృశ్యం



ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు దృశ్యం

కోలారు: నగరంలోని అమ్మవారిపేట శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి బ్రహ్మారథోత్సవ వేడుకలను అపార భక్త సందోహం మధ్య గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు శుభ కటక లగ్నంలో రథారోహణం జరిగింది. ఈ సందర్భంగా స్వస్తివాచన, కుంభారాధన, బలిహరణం, ప్రాయశ్చిత్త హోమం, రథబలి, రథ ప్రతిష్ఠ, నిత్య హోమం, ధూళోత్సవం తదితర పూజా విధులు నిర్వహించారు. రథోత్సవానికి ముందు రోజున సీతారామ కళ్యాణోత్సవాన్ని నెరవేర్చారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. రథోత్సవంలో ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, అమ్మవారిపేట ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బీఎస్ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గంగాధరేశ్వర స్వామి దీపోత్సవం



దేవాలయానికి దీపాలు మోసుకు వెళుతున్న మహిళలు

మాలూరు : తాలూకాలోని దొడ్డశివార గ్రామంలోని పురాతన గవి గంగాధరేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశేష పూజా కార్యక్రమం, గ్రామ దేవతలకు దీపోత్సవం, కరగ ఉత్సవం, కురుబ సముదాయం ఆధ్వర్యంలో తలపై టెంకాయ కొట్టే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రతి యేటా మాదిరిగా తెల్లవారు జాము నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన అర్చకుల నేతృత్వంలో అభిషేకం, పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం తదితర పూజలను చేశారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని కళా బృందాలతో వివిధ రకాల సాంస్కృతిక మనోరంజన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు ఆరతి తంబిట్టు దీపాలను తలపై మోసుకుని వచ్చి గ్రామ దేవతలకు సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే కేవై నంజేగౌడ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రజ్వల్ పాస్‌పోర్టు రద్దయ్యేనా?

- ప్రధానికి సీఎం లేఖ
- పరిణామాలపై ఉత్కంఠ

బనశంకరి: అత్యాచారం, లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటూ విదేశాల్లో తలదాచుకున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పాస్‌పోర్టు రద్దు కోసం రాజకీయ ఒత్తిడి అధికమైంది. ప్రధాని నరేంద్రమోదీకి మరోసారి లేఖరాసిన సీఎం సిద్దరామయ్య, ఎంపీ ప్రజ్వల్ పాస్‌పోర్టును తక్షణం రద్దుచేయాలని కోరారు. సిట్ అరెస్ట్ వారంట్‌ను కూడా అందులో జత చేశారు. అశ్లీల వీడియోల కేసులో ఎఫ్ఐఆర్ నమోదైన కొన్ని గంటల ముందు ప్రజ్వల్ దేశం వదిలిపెట్టారు. అతనిపై అత్యాచారం, లైంగికదాడి వీడియో తీసిన ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వ్యక్తి పాస్‌పోర్టు పేరుతో తప్పించుకుంటున్నారు అని లేఖలో సీఎం ఆరోపించారు.



రద్దయితే ఏం జరుగుతుంది?

పాస్‌పోర్టు రద్దయితే అన్ని దేశాలు వలసశాఖకు సమాచారం అందిస్తారు. దీంతో ప్రజ్వల్‌ను వారి దేశం విడిచి సొంత దేశం వెళ్లాలని అక్కడి అధికారులు ఆదేశిస్తారు. దీంతో భారత్ కు రావాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుంది. లేదా ప్రజ్వల్ ఏ దేశంలో ఉంటే అక్కడే అతన్ని అప్పగించే ప్రక్రియ చేపడతారు.

బైక్ అదుపు తప్పి బోల్తా



ఘటనా స్థలంలో బోల్తా పడి ఉన్న బైక్



కిందపడ్డ మృతుడు, గాయపడ్డ వ్యక్తులు

- స్థలంలోనే చోదకుడు మృతి

హొసపేటె: అతివేగంగా వస్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో పక్కనే ఉన్న తుంగభద్ర రిజర్వాయర్‌లోకి పడిపోవడంతో బైక్‌చోదకుడు స్థలంలోనే మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. వివరాలు..బెంగళూరుకు చెందిన జగదీశ్(28), శశాంక్ పాటిల్ అనే ఇద్దరూ కలిసి బెంగళూరు నుంచి ఇలకల్ వైపునకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో నగర శివార్లలోని జాతీయ రహదారిపై గుండా అటవీ ప్రాంత సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బైక్ నడుపుతున్న జగదీశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థలంలోనే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చొన్న శశాంక్ పాటిల్ కూడా తీవ్రంగా గాయపడటంతో నగరంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. ఘటనా స్థలిని సందర్శించి జగదీష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మరియమ్మనహళ్లి పోలీసులు తెలిపారు.

కైవారంలో పౌర్ణమి పూజలు



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చింతామణి: శ్రీ క్షేత్ర కైవార సద్గురు శ్రీ యోగినారేయణ మఠం ఆవరణలో వైశాఖమాస పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భూదేవి సమేత శ్రీ అమరనారేయణ స్వామి, తాతయ్య గారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

నారాయణస్వామిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న మాజీ సీఎం సదానందగౌడ

చింతామణి: జూన్ 3న జరిగే ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నారాయణస్వామిని గెలిపించాలని మాజీ సీఎం సదానందగౌడ ఉపాధ్యాయులను విన్నవించారు. గురువారం తాలుకాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల అధ్యాపకులను కలిసి నారాయణస్వామిని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, రాజణ్ణ, నాయకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం

కేజీఎఫ్: లోక కళ్యాణం కోసం శంకర సేవా మండలి ఆధ్వర్యంలో గురువారం నరసింహ కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సకాలంలో వానలు కురిసి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు మండలి కార్యదర్శి నారాయణమూర్తి తెలిపారు. గుప్త శత్రువులు, దుష్ట శక్తులు, నకారాత్మక శక్తులు, ఆందోళన తదితర సమస్యలతో బాధపడేవారు నరసింహ స్వామిని పూజించాలన్నారు. కళ్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్న సంతర్పణ జరిగింది.

కోలారు వార్తలు...

విద్యుత్ ప్రసార మండలికి ముగ్గురు ఎన్నిక



నూతన సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: కర్ణాటక విద్యుత్ ప్రసార మండలి ఉద్యోగుల సంఘం 22వ త్రైమాసిక మహాధివేశన ప్రాథమిక ప్రతినిధుల ఎన్నికలో ఆరుగురు పోటీ పడగా ముగ్గురు సభ్యులు ఎన్నికయ్యారు. పట్టణంలోని కేఈబీ ఉప విభాగం నుంచి ప్రాథమిక ప్రతినిధుల ఎన్నికలో ఆర్.చంద్రు 76 ఓట్లు, ఆర్‌కె శ్రీనివాస్ కుమార్ 69 ఓట్లు, కెబి నంజుండేశ్వర 64 ఓట్లు పొంది విజేతలయ్యారు. వీరిపై పోటీ చేసిన రాజణ్ణ 61, పి.శ్రీనివాస్ 60, బిఆర్ నాగేష్ 47 ఓట్లతో పరాజితులైనట్లు ఎన్నికల అధికారి రాజగోపాల రెడ్డి తెలిపారు. అనంతరం ఆర్.చంద్రు మాట్లాడుతూ కేఈబీ ఉద్యోగులకు రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్య వచ్చినా ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు సభ్యులు ఉద్యోగుల సమస్యలపై వెంటనే స్పందిస్తామన్నారు. కేఈబీ వివిధ సంఘాల అధ్యక్షులు, పదాధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

తాలూకా అభివృద్ధికి భారీగా నిధులు



ఫ్లై ఓవర్ బ్లూప్రింట్ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ తదితరులు

మాలూరు: పట్టణంతో పాటు తాలూకా అభివృద్ధి కోసం ప్రభుత్వం అదనంగా 58 శాతం నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. గురువారం పట్టణంలోని యోజనా ప్రాధికార కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి కాగా ఈ యేడాదిలో ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పట్టణంలోని పెద్ద చెరువును రూ.21 కోట్లతో, రూ.15 కోట్లతో బస్టాండు అభివృద్ధి, రూ.350 కోట్లతో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, 4 లేన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇంతవరకు ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదన్నారు. పట్టణ సమీపంలోని పెద్ద చెరువును రెండు విడతల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రూ.10 కోట్ల వ్యయంతో పనులు సాగుతున్నాయన్నారు. రెండున్నరేళ్లలోగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు.

నాసిరకం పనులపై ధర్నా



ధర్నా చేస్తున్న నగరసభ సభ్యులు

కోలారు: నగరసభ వ్యాప్తిలో జరిగిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుండా పనులను చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని నగరసభ సభ్యులు గురువారం నగరసభ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ నగరోత్థాన పథకంలో భాగంగా రూ.17 కోట్ల వ్యయంతో నగరంలో కొత్తగా వేసిన రోడ్లు నాణ్యత లేకపోవడం వల్ల తిరిగి అధ్వాన స్థితికి చేరాయన్నారు. నాణ్యతలేని పనులు చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. చాలా చోట్ల రహదారులను తవ్వి కంకర వేసి వదిలేశారన్నారు. దీని వల్ల వాహనాల్లో సంచరించే వారికి తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. పనుల నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఇంజినీర్లు కాంట్రాక్టర్‌ల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారని ఆరోపించారు. ధర్నాలో సభ్యులు ఇదాయత్ ఉల్లా, ఎస్ఆర్ మురళిగౌడ, రమేష్, నారాయణమ్మ, సూరి, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

హొసపేటె: విజయనగర జిల్లా మాదిగ మహాసభ, డాక్టర్.బీఆర్ అంబేడ్కర్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నగరంలోని బుద్ధభవనంలో బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏ సమాజమైనా తమ నిజమైన చారిత్రక మూలాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం ద్వారా కొత్త చరిత్రను నిర్మించుకోవాలన్నారు. భారత దేశపు తొలి భక్తుడు మాదర చెన్నయ్య, బసవాది శరణుల మధ్య వందలాది ఏళ్ల అంతరం ఉందన్నారు. మాదిగ సంఘం నాయకులు ఎంసీ వీరాస్వామి, తిప్పన్న, రామచంద్ర, శేషు, గణప్ప బడిగేర, బసవరాజ్, వెంకప్ప, శ్రీనివాసులు, విజయకుమార్, మారేశ, మంజునాథ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పానకంతో చల్లదనం



పానకాన్ని పంపిణీ చేస్తున్న అశోక్

రాయచూరు రూరల్: మనిషి శరీరంలోని వేడిని తగ్గించడంలో చించా జ్యూస్(పానకం) పాత్ర ప్రధానమని అదనపు జిల్లాధికారి అశోక్ పేర్కొన్నారు. ఆయన బుధవారం జిల్లా ఆయుష్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో తయారు చేసిన చించా పానకాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. చింత పండు, బెల్లం, లవణం, జీలకర్ర, ఆవాలతో కాషాయాన్ని తయారు చేసుకొని తాగితే శరీరంలో వేడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సుభాస్ సంగావి, యోజనాధికారి జగదీష్, జిల్లా ఆయుష్ అధికారి శంకర్‌గౌడ పాటిల్, బసవరాజ్, మహ్మద్ అమీనుద్దీన్, రాజేంద్ర, పూజ, ఆస్మా బేగం, నరసప్పలున్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అన్యాయం

రాయచూరు రూరల్: ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో కళ్యాణ కర్ణాటకకు అన్యాయం జరిగిందని కళ్యాణ కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి కాశీనాథ్ ఆరోపించారు. గురువారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల నియోజకవర్గంలో జూన్ 3న జరగనున్న ఎన్నికల్లో 2018లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ గత ఆరేళ్ల పాటు పట్టభద్రుల సమస్యలపై విధాన పరిషత్ సమావేశాల్లో ప్రసంగించిన సందర్భాలు లేవన్నారు. బీజేపీ అభ్యర్థి 2018 నుంచి ఇంతవరకు ప్రతిపక్ష నేతగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యలపై స్పందిస్తానన్నారు. గత 15 ఏళ్ల నుంచి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా మీనమేషాలు లెక్కించారన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్

కేజీఎఫ్: తాలూకాలో అక్కడక్కడ డెంగీ కేసులు కనిపిస్తున్నందున మరింతగా ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. డెంగీకి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అరికట్టవచ్చన్నారు. నిరంతరంగా తలనొప్పి, ఒళ్లు నొప్పులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నివాసం ఉంటున్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇంటి వద్ద టైర్లు, కొబ్బరి మట్టలను ఉంచవద్దన్నారు. వ్యాధి సోకిన తరువాత చికిత్స పొందడం కంటే రాకుండా జాగ్రత్త పడడమే మంచిదన్నారు.

త్వరలో చెరువుల్లో ఆక్రమణల తొలగింపు



మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రం పాషా

కోలారు: జిల్లాలో జూన్ 10వ తేదీ లోగా చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తామని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. గురువారం తన కార్యాలయంలో చెరువుల సంరక్షణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలారులో 19, మాలూరు 35, ముళబాగిలు 20, బంగారుపేటలో 14, కేజీఎఫ్ 6, శ్రీనివాసపురంలో 6 చెరువులు కలిపి మొత్తం జిల్లాలో 106 చెరువుల్లో ఆక్రమణలు తొలగించాల్సి ఉందన్నారు. చెరువుల్లో ఆక్రమణల తొలగింపును త్వరగా చేపట్టాలని చిన్ననీటి పారుదల, పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అలరించిన అందాల పోటీలు

బనశంకరి: డాక్టర్ నిశితాశెట్టి యాన్ ఫెర్నాండీస్ మిసెస్ ఇండియా కర్ణాటక మంగళూరు 2024 కిరీటం దక్కించుకుంది. ప్రతిభా సౌన్శిమర్ నేతృత్వంలో మిసెస్ ఇండియా కర్ణాటక మంగళూరు 5వ ఫైనల్ పోటీలు మంగళూరు కద్రిపార్కులో నిర్వహించారు. డాక్టర్ నిశితాశెట్టి అందచందాలతో పాటు కఠిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చి విజేతగా నిలిచింది. రన్నరప్‌గా డాక్టర్ రశ్మి, ద్వితీయ రన్నరప్‌గా శృతి బల్లాళ్, తృతీయ రన్నరప్‌గా విద్యా ఎంపికయ్యారు.

క్లుప్తంగా

వేడుకగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

గౌరిబిదనూరు: తాలూకా డారినాయకనపాళ్య (డి పాళ్య) గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరుని ఆలయంలో వైశాఖ శుద్ధ పున్నమిని పురస్కరించుకొని గురువారం రథోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజగోపాల్, శ్రీనాగ్, గౌతమ్, శ్రీకాంత భట్టర్ నేతృత్వంలో ఉదయం నుంచి పూజాది కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవం జరిగింది. బుధవారం రాత్రి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మాజీ మంత్రి శివశంకరరెడ్డి, ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ, రాఘవేంద్ర హనుమాన్, ఆర్ఐ లక్ష్మీనరసప్ప, ఉప తహసీల్దారు వెంకటరామరావ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



నీటితో నిండిన ఓ చెరువు

శివమొగ్గ: గడిచిన కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో శివమొగ్గ తాలూకాలోని పలు గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. గత ఏడాది వర్షాభావం కారణంగా చెరువులు పూర్తిగా ఎండిపోయిన విషయం తెల్సిందే. దీంతో పెద్ద ఎత్తున బోరుబావులు కూడా ఎండిపోయాయి. తాజాగా వరుసగా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లో చెరువులు నిండుతున్నాయి.

బస్సులో ఆభరణాల చోరీ

మైసూరు: మైసూరు నగరంలో బస్సుల్లో చోరీలు అధికమయ్యాయి. రెండు రోజుల వ్యవధిలోనే మూడు కేసులు నమోదయ్యాయి. ముగ్గురు మహిళల నుంచి దొంగలు దాదాపు 210 గ్రాముల బంగారు నగలు దోచుకున్నారు. ఉచిత బస్సుల కారణంగా మహిళలు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుండటంతో చోరీలు కూడా అధికమయ్యాయి.

నటి విద్యశ్రీ హత్య కేసులో భర్త అరెస్టు

మైసూరు: జిల్లాలోని టీ.నరసీపుర తాలూకా తురగనూరులో చిత్ర నటి, కాంగ్రెస్ కార్యకర్త విదశ్రీ హత్య కేసులో ఆమె భర్త నందీశ్, అతని తల్లి రత్నను పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరు శ్రీరాంపుర నివాసి లతా కుమార్తె విద్యశ్రీ (38)ని ఆమె భర్త నందీశ్ సోమవారం రాత్రి సుత్తితో తలపై బాది హత్య చేశాడు. అనంతరం పారిపోయాడు. బన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

డీటీ శ్రీనివాస్ గెలుపు తథ్యం




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పుట్టణ్ణ

తుమకూరు: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజక వర్గం అభ్యర్థిగా డీటీ శ్రీనివాస్ గెలుపు తథ్యమని ఎమ్మెల్సీ పుట్టణ్ణ జోస్యం చెప్పారు., గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీటీ శ్రీనివాస్ విద్యా సంస్థల కార్యదర్శిగా ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించి వారి మన్ననలు పొందారని గుర్తు చేశారు. కేవలం ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గంలో మాత్రమే కాకుండా ఆరు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

డీకేశితో బీజేపీ ఎంపీ కోరె భేటీ

శివాజీనగర: బీజేపీ రాజ్యసభ సభ్యుడు ప్రభాకర్ కోరె డీసీఎం డీ.కే.శివకుమార్‌ను కలిశారు. బెంగళూరులోని సదాశివ నగరలోని డీకేశి ఇంటిలో కొంతసేపు చర్చలు జరిపారు. ఈ ఇద్దరి భేటీ రాజకీయ వర్గాల్లో కుతూహలానికి కారణమైంది.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత

తుమకూరు: నగర సమీపంలోని వసంతరసాపుర ఇండస్ట్రీయల్ అసోసియేషన్ నూతన కార్యాలయం ఉద్యోగ భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 200 మందికిపైగా ప్రజలు రక్తదానం చేశారు. ఈ సమయంలో సంఘం సంస్థాపక అధ్యక్షుడు ఓంకార మూర్తి, కార్యదర్శి డాక్టర్ హరీశ్, సత్యనారాయణ, మధుకుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం పూల పల్లకీ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో మహేశ్వరమ్మ మూలవిరాట్





వివిధ దేవతామూర్తుల పూల పల్లకీల ఊరేగింపు



కరగ ఊరేగింపు దృశ్యం



బనశంకరి: యలహంకలో మహేశ్వరమ్మ కరగ మహోత్సవం, పూలపల్లకీల ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. యలహంకలో వెలసిన మహేశ్వరమ్మ కరగ సందర్భంగా బుధవారం అర్ధరాత్రి మహేశ్వరమ్మ పూలకరగను వీరకుమారుల సమక్షంలో పూజారి అయ్యప్ప ఎత్తుకుని పట్టణంలో ఊరేగింపునకు బయలుదేరారు. యలహంకలోని వివిధ ఆలయాల్లో పూజలందుకుని గురువారం ఉదయం సూర్యోదయంలోగా తిరిగి మహేశ్వరమ్మ ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా వివిధ దేవతల పూల పల్లకీలను జానపద కళాబృందాల మధ్య ఊరేగించారు. అంతకుముందు మహేశ్వరమ్మ మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక వహ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కృష్ణమూర్తి, వైఎం.నారాయణస్వామి, మునిపుళ్లప్పగౌడ, ఎండీ.పాపణ్ణ, టీ.త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం భారీ తెర

తుమకూరు: ఐపీఎల్ సెమీఫైనల్, ఫైనల్ మ్యాచులను వీక్షించేందుకు టాటా ఐపీఎల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో భారీ తెరను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ తుమకూరు జిల్లా ఇన్‌చార్జి సునీల్ పాటిల్ మాట్లాడుతూ...దేశంలో ఐదు ప్రాంతాల్లో భారీ తెరలను ఏర్పాటు చేసి మ్యాచ్‌లను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 24, 26 తేదీలలో ఒకేసారి నాలుగైదు వేల మంది వీక్షించేందుకు వీలు కల్పించినట్లు చెప్పారు.

దత్తపీఠంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న స్వామీజీ

మైసూరు: శ్రీ దత్త వేంకటేశ్వర క్షేత్రం 25వ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహించారు. మైసూరు అవధూత దత్తపీఠం, శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శ్రీ దత్త వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున హోమం, హవనం జరిపించారు. వివిధ నదుల నుంచి తీసుకొచ్చిన నీటితో శ్రీదత్త వేంకటేశ్వర స్వామికి అభిషేకం చేశారు. అనంతరం క్షీరాభిషేకం చేపట్టి గణపతి శ్రీగళు మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమాలను శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ చేపట్టారు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం



ఆశీస్సులు అందుకుంటున్న పరమేశ్వర్

తుమకూరు: గౌతమ బుద్ధుడి బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. నగర శివార్లలోని సిద్ధార్థ విద్యా సంస్థలో బుద్ధ విహారలో ఏర్పాటు చేసిన బుద్ధ పూర్ణిమా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వ శాంతికి మార్గదర్శకుడు బుద్ధుడని, ఆయన తత్వాలను ప్రతి ఒక్కరూ జీవితంలో అలవరచుకోవాలన్నారు.

ఉత్తర పినాకినీపై కొత్త వంతెన నిర్మించాలి



మాట్లాడుతున్న హితరక్షణా వేదిక సభ్యులు

గౌరిబిదనూరు: చిక్కబళ్లాపురం రోడ్డులో ఉత్తర పినాకినీ నదిపై నిర్మించిన వంతెన శిథిలమై ఉందని, వెంటనే ఆ స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని ఉత్తర పినాకినీ నది హితరక్షణా వేదికె సభ్యులు డిమాండు చేస్తున్నారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం వంతెన నిర్మించాలని ఆదేశించిందని, అయితే కొందరు కొత్త వంతెన నిర్మాణం చేపట్టకూడదని యత్నిస్తున్నట్లు తెలియవచ్చింది. గత ఏడాది వరదల వల్ల వంతెన శిథిలమైందని, పోలీసులు రోడ్డును వారం రోజుల పాటు బంద్ చేశారని గుర్తు చేశారు. వెంటనే కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో సభ్యులు హీరే బిదనూరు రాజణ్ణ, సులేమాన్, మహేశ్, అబ్బాస్, సుధాకర్, చలువరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్

బనశంకరి: వాట్సాప్‌కు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన ఫొటోలు పంపించి జరిమానా వసూలు చేస్తున్న పశ్చిమ బెంగాల్ గ్యాంగ్‌ను గురువారం ఈశాన్య విభాగం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌లో ప్రముఖరోడ్లలో ఇతర రోడ్లలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడిన ఫొటోలు ఈ గ్యాంగ్ తీసుకునేవారు. అనంతరం వాహనదారుల మొబైల్ నెంబరు గాలించి వారి వాట్సాప్‌కు ఫొటోలు పంపించి జరిమానా వసూలు చేసి కాజేసేవారు. చాలా మందికి వాట్సాప్ ద్వారా యుపీఐడీ, క్యూఆర్ కోడ్ స్కాన్ పంపించి మొబైల్ ద్వారా నగదు జమ చేసుకునేవారు. నగదు చెల్లించే సమయంలో ఓ వాహనదారుడు మీరు ట్రాఫిక్ పోలీసులు అనేదానికి పోలీస్ ఐడీకార్డు పంపించాలని తెలిపారు. కర్ణాటక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ అని నకిలీ ఐడీకార్డును వాట్సాప్‌కు పంపించారు. తక్షణం ఇది నకిలీ ముఠా అని గుర్తించి ఈశాన్య విభాగ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం గ్యాంగ్‌కు చెందిన రంజన్ కుమార్, బ్రహ్మదేవ్, ఇస్మాయిల్ బిన్‌అనసర్‌అలీ, సుబీర్‌మల్లిక్‌ను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

నవంబర్ నాటికి మెట్రో వాణిజ్య సంచార సేవలు ?

దొడ్డబళ్లాపురం: ఇన్ని రోజులు బెంగళూరులో మెట్రో సేవలు కేవలం ప్రజలు ప్రయాణించడానికే పరిమితమైన సంగతి తెలిసిందే. అయితే నవంబర్ నాటికి మెట్రో నుండి వాణిజ్య సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ దిశలో భాగంగా గురువారం ఎల్లో రూట్‌లో రీచ్–5లోని ఆర్.వీ.రోడ్డు నుండి బొమ్మసంద్ర వరకూ సివిల్ పనులు చాలావరకూ పూర్తవగా, ఈ మార్గంలో వయాడక్ట్ పరీక్షించడానికి విద్యుత్ సరఫరా చేసి ట్రయల్స్ ప్రారంభించారు. గత డిసెంబర్‌లోనే మెట్రో ద్వారా వాణిజ్య పరంగా సేవలు అందించాలని బీఎంఆర్‌సీఎల్ భావించినప్పటికీ అది సాధ్యం కాలేదు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతుండగా అక్టోబర్, నవంబర్‌కి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. మొదటి దశలో బీటీఎం లేఔట్ స్టేషన్ నుండి జయదేవ స్టేషన్, రాగిగుడ్డ స్టేషన్, ఆర్‌వీ రోడ్డు స్టేషన్ వరకూ సేవలు అందుతాయి. తదనంతరం బొమ్మసంద్ర, హెబ్బగోడి, ఇన్ఫోసిస్ స్టేషన్, ఎలక్ట్రానిక్ సిటీ వరకూ విస్తరించడం జరుగుతుంది.

స్నేహితుడిపై చాకుతో దాడి

బనశంకరి: చిన్న విషయానికి స్నేహితుడిపై చాకుతో దాడికి పాల్పడిన ఘటన బండెపాళ్య పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. నరసింహ, జోకర్ మంజులు.. మునిరాజు అనే స్నేహితుడి ఇంటిలో పార్టీ చేసుకున్నారు. ఈ సమయంలో చిన్న విషయానికి స్నేహితుల మధ్య గొడవ జరిగింది. అనంతరం అక్కడ నుంచి బయటికి వెళ్లిపోయారు. తరువాత జోకర్ మంజు బండేపాళ్య సమీపంలో ఉన్న నరసింహ వద్దకు వచ్చి గొడవకు దిగాడు. చాకుతో నరసింహపై దాడి చేయడంతో గట్టిగా కేకలు వేస్తూ సమీపంలోని బండెపాళ్య పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీశాడు. తక్షణం పోలీసులు నరసింహను సెయింట్ జాన్స్ ఆసుపత్రికి తరలించారు. బండెపాళ్య పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఎన్నికల ఫలితాల తరువాత సిద్ధు ప్రభుత్వం ఉండదు

- బీజేపీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు

దొడ్డబళ్లాపురం: జూన్.4న ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్రంలో సిద్ధరామయ్య ప్రభుత్వం ఉండదని బీజేపీ ఎమ్మెల్యే అభయ్ పాటీల్ కీలక వ్యాఖ్యలు చేసారు. గురువారం బెళగావిలో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల తరువాత సిద్ధరామయ్య ప్రభుత్వం పడిపోతుందని ఈ మాట తాను చెప్పడం లేదని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్వయంగా చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ కూటమికి 24 సీట్లు వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసింది ఏమీలేదన్నారు.

మద్యం మత్తులో భార్య హతం

యశవంతపుర: తాగిన మత్తులో భార్యను పిల్లల ఎదుటే దారుణంగా హత్య చేసిన ఘటన బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా బణబరహట్టి గ్రామంలో జరిగింది. ఫకీరవ్వ (36)ను యల్లప్ప హత్య చేశాడు. పీకాలదాక తాగి వచ్చిన యల్లప్ప నిద్రిస్తున్న భార్యను పారతో కొట్టి హతమార్చాడు. అనంతరం నిందితుడు పారిపోయాడు. నేసరగి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వాహనాలు ఢీ, ఒకరి మృతి

చిత్రదుర్గ జిల్లా హిరియూరు వద్ద వాహనాలు వరుసగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. తాలూకా జవగోండనహళ్లి బస్టాండ్ వద్ద టాటా ఏస్, బస్సు, లారీ వరుసగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గాయపడిన పలువురిని ఆస్పత్రికి తరలించారు. హిరియూరు గ్రామాంతర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీ.. యువకుడి మృతి

మైసూరు: చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా గరగనహళ్లి గేట్ వద్ద కారు, బైక్ ఎదురు రెదురుగా ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మృతుడిని తాలూకాలోని అలత్తూరు గ్రామానికి చెందిన మల్లేశ్ (23)గా గుర్తించారు. బైక్ వెనుక కూర్చున్న మల్లేశ్ సోదరి మానసను ఆస్పత్రికి తరలించారు. బేగూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చెరువులో పడి మహిళ...

దొడ్డబళ్లాపురం: చెరువులో మునిగి మహిళ మృతి చెందిన సంఘటన రామనగర శివారులోని బోళప్పనచెరువులో చోటుచేసుకుంది. రేణుకమ్మ (30) మృతి చెందిన మహిళ. గురువారం ఉదయం రేణుకమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దుస్తులు ఉతకడానికి వెళ్లింది. ఈ క్రమంలో కాలుజారి నీటిలో మునిగి మృతి చెందింది. అయితే పిల్లలు చెరువులో దిగకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఐజూరు పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేసుకున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు షురూ

బనశంకరి: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఎన్నికలు అధికారులు, సిబ్బందితో ఓట్లు లెక్కింపు ఎలా చేపట్టాలి అనే దానిపై సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు చేశారు. జూన్ 4 తేదీ ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో ప్రారంభిస్తారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మొబైళ్లను నిషేధించారు.

ఫైవ్‌స్టార్ హోటల్‌కు బాంబు బెదిరింపు

బనశంకరి: బెంగళూరు నగరంలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌కు బాంబు పెట్టామని ఇ–మెయిల్ రావడంతో కొద్దిసేపు కలకలం చెలరేగింది. ఎలక్ట్రానిక్‌సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టార్ హోటల్‌కు బాంబు పెట్టామని గురువారం తెల్లవారుజామున 2 గంటలకు పేలుతుందని మెసేజ్ వచ్చింది. గురువారం ఉదయం హోటల్ సిబ్బంది మెయిల్స్‌ను పరిశీలిస్తుండగా మెసేజ్‌ను గమనించి తక్షణం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎలక్ట్రానిక్‌సిటీ పోలీసులు బాంబ్‌స్క్వాడ్‌తో అక్కడికి చేరుకుని హోటల్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా ఎలాంటి బాంబు జాడ కనిపించలేదు. ఇది ఉత్తుత్తి బాంబు మెసేజ్ అని తెలుసుకుని వారంతా ఊపిరి పీల్చుకున్నారు. రామేశ్వరం కెఫెలో బాంబు పేలుడు అనంతరం ఇటువంటి ఫేక్ కాల్స్ వస్తుండటంతో నగరవాసులు హడలిపోతున్నారు. కొద్దిరోజుల క్రితం అమృతహళ్లి పరిధిలో పాఠశాలకు బాంబు బెదిరింపు మెసేజ్ వచ్చింది. మరుసటి రోజు కగ్గలిపుర, కనకపుర రోడ్డులోని పలు పాఠశాలలు, కళాశాలలకు ఇదే విధంగా బాంబు బెదిరింపు మెయిళ్లు వచ్చిన విషయం తెల్సిందే.

అడ్డదిడ్డంగా కారు నడిపి...



సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యం

యశవంతపుర: కారును ఓ డ్రైవర్ అడ్డదిడ్డంగా నడిపి పాదచారులకు ఇబ్బంది కలిగించిన ఘటనకు సంబంధించి బెంగళూరు విజయనగర ట్రాఫిక్ పోలీసులు సుమోటా కేసుగా నమోదు చేశారు. విజయనగర వెస్ట్ఆఫ్‌రోడ్డ్ ఎస్‌పీఎస్ జంక్షన్ వద్ద సాయంత్రం కారును డ్రైవర్ అడ్డదిడ్డంగా నడిపాడు. 22 ఏళ్ల యువకుడు కారును నడిపినట్లు కనిపిస్తోంది. రోడ్డు పక్కలో నిలిపిన కారు కూడా ఢీకొని, ఓ పాదచారిని కూడా ఢీకొట్టాడు. అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు వైరల్‌గా మారడంతో పోలీసులు సుమోటాగా కేసు పెట్టారు.

హోసూరు వార్తలు..

ఇంటిపై కూలిన చెట్టు



చెట్టు పడిపోయిన దృశ్యం

హోసూరు: హోసూరు ప్రాంతంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పట్టణంలోని ఓ ఇంటిపై చెట్టుకూలింది. బుధవారం సాయంత్రం హోసూరు ప్రాంతంలో బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. డెంకణీకోట రోడ్డులోని డీఎస్పీ బంగ్లా రామక్రిష్ణనగర్ ప్రాంతంలో ఓ ఇంటిపై వందల ఏళ్ల నాటి చెట్టు కూలిపోయింది. దీంతో ఇంటి యాజమాని నాగరాజరెడ్డి, భార్య సునీత భయాందోళనకు గురయ్యారు. చెట్టు పడడంతో ఇంటి గోడలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని బాధితులు కోరారు. మున్సిపల్ సిబ్బంది ఆ చెట్టును తొలగించారు.


రైతు మహిళా నాయకురాలు మృతి



జయశ్రీ (ఫైల్)

యశవంతపుర: రైతు మహిళా నాయకురాలు జయశ్రీ గురన్నవర్ (40) అనారోగ్యంతో మృతి చెందారు. కొద్ది రోజులుగా ఆమె బెళగావిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమె ఉత్తర కర్ణాటకలో రైతుల తరపున పోరాటం చేస్తున్నారు. కుమారస్వామి నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వ అవధిలో పెద్ద పోరాటం చేశారు. చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలని బెళగావి విధాన సౌధకు చెరకు నింపిన లారీని తీసుకెళ్లి ఆందోళన చేయడంలో జయశ్రీ ప్రధాన పాత్ర పోషించారు. ఆమె మృతికి పలువురు సంతాపం ప్రకటించారు.

యువకుడి ఆత్మహత్య



సురేశ్ (ఫైల్)

యశవంతపుర: వివాహం కాలేదని ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన చిక్కోడి జిల్లా హుక్కేరి తాలూకాలో జరిగింది. హుక్కేరి పట్టణంలో శాంతినాథ సురేశ్ కేస్తి (27) అధికంగా అప్పులు చేశాడు. దీనికి తోడు అతడికి పెళ్లి ఆలస్యం కావడంతో తన గ్యారేజీలో ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. హుక్కేరి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

జులై 13న పీజీ సీఈటీ

యశవంతపుర: పీజీ సీఈటీ పరీక్షలను జులై 13, 14న నిర్వహించాలని కర్ణాటక పరీక్ష మండలి ఒక ప్రకటనలో తెలిపింది. ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఎంఈ, ఎం.ఆర్కిటెక్చర్ కోర్సుల ప్రవేశ పరీక్ష పీజీ సీఈటీ–24ను నిర్వహించనున్నట్లు పరీక్ష మండలి డైరెక్టర్ ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి జూన్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పొలాల్లో పైప్‌లైన్ వద్దు



ధర్నా చేస్తున్న రైతు సంఘం కార్యకర్తలు

హోసూరు: కేరళ రాష్ట్రం కొచ్చి నుంచి తమిళనాడు మీదుగా బెంగళూరు వరకు గెయిల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ పైప్‌లైన్‌ను రైతు భూముల్లో వేయరాదని సీపీఐఎం కార్యకర్తలు ఆందోళన చేశారు. గెయిల్ సంస్థ బయోగ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటుకు గత 2012న అనుమతి పొందింది. రైతుల పొలాల్లో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయరాదని అప్పటి తమిళనాడు ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడంతో రోడ్డుపక్కన పైప్‌లైన్ వేయాలని తీర్పు ఇచ్చింది. కానీ ఇప్పుడు హోసూరు సమీపంలోని నాగొండపల్లి, సూతాళం, యడేనల్లూరు తదితర ప్రాంతాల్లో పచ్చని పంట పొలాల్లో బయోగ్యాస్ గొట్టాలను వేస్తున్నారు. సిపిఎం అనుబంధ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి అధ్యక్షతన గురువారం ఉదయం హోసూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

హోసూరు: కర్ణాటక మద్యం అమ్ముతున్న వ్యక్తిని మత్తిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు అమ్మన్‌నగర్ ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కెలమంగలం ప్రాంతానికి చెందిన మద్యం విక్రేత రవి (43) పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న రూ. 12,200 విలువ చేసే 138 మద్యం బాటిళ్లను స్వాధీనపరుచుకొని అరెస్టు చేశారు.

ప్లస్ వన్ అడ్మిషన్లు ప్రారంభం

హోసూరు: రాబోవు విద్యాసంవత్సరానికి గాను పభుత్వ పాఠశాలల్లో ప్లస్‌వన్ అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయి. డెంకణీకోట విద్యా జిల్లా బాలతోటనపల్లిలోని ప్రభుత్వ ఉన్నవతోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని హెలెన్, ఉప ప్రధానోపాధ్యాయుడు కిషోర్‌ల నేతృత్వంలో అడ్మిషన్‌లను గురువారం నుంచి ప్రారంభించారు. తమ పాఠశాలలో ఉపాధ్యాయుల తీవ్ర కృషితో ప్లస్టూ ఫలితాంశాల్లో 95 శాతం, 10వ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తోటి ఉపాధ్యాయులు తీవ్ర కృషి చేస్తున్నారని హెచ్‌ఎం తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించాలని, ప్రస్తుతం 11వ తరగతి పిసిఎంబి, పిసిబిజెడ్, హెచ్ఈసీఏ కోర్సుల్లో ఆంగ్ల మాధ్యమంతో అడ్మిషన్‌లు జరుగుతుందని తెలిపారు.

45 రోజుల్లో రైల్వే పనులు పూర్తి?



నత్తనడకన సాగుతున్న రైల్వే వంతెన నిర్మాణం

హోసూరు: హోసూరు పట్టణంలో రైల్వే రోడ్డు విస్తరణ పనులను 45 రోజుల్లో పరిష్కరిస్తామని రైల్వేశాఖాధికారులు తెలిపారు. సేలం నుంచి బెంగళూరుకు వెళ్లే రైల్వే మార్గం విస్తరణ పనులు గత ఏడాదిగా జరుగుతున్నాయి. డెంకణీకోట రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జ్‌ను తొలగించి కొత్తగా బ్రిడ్జ్ కడుతున్నారు, దీని వల్ల పక్కనే ఉన్న సొరంగ మార్గంలోకి వాహన రాకపోకలను మళ్లించారు. వర్షాకాలంలో సొరంగ మార్గంలో నీరు నిండిపోవడంతో వాహనదారులు వెళ్లలేకపోతున్నారు. దీంతో వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో 45 రోజుల్లో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి డెంకణీకోట మార్గాన్ని వినియోగానికి తీసుకొస్తామని తెలిపారు.

వైభవంగా రథోత్సవం



భక్తసంద్రం మధ్య తేరు వేడుక

కెలమంగలం: నియోజకవర్గ కేంద్రం తళిలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మారథోత్సవం గురువారం విశేషంగా జరిగింది. విశేష పూజల అనంతరం ఉత్సవమూర్తులను తేరులో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్, అన్నాడీఎంకే ఎంపి అభ్యర్థి జే.పి.జయప్రకాష్ పాల్గొన్నారు. బెంగళూరు నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాల్లో ముస్లింలు కూడా పాల్గొనడం విశేషం. నేడు శుక్రవారం దీపారాధన, పల్లకీ ఉత్సవాలు జరగనున్నాయి. డెంకణీకోట డీఎస్పీ శాంతి నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఢిల్లీ బరిలో స్వతంత్రుల సందడి

● వెల్డర్ నుంచి సామాజిక కార్యకర్త దాకా
● సామాజిక సమస్యలే ఎజెండాగా పోటీ

దండల్లేవు. నినాదాల్లేవు. పెద్ద ఎత్తున ప్రజానీకం లేరు. లౌడ్ స్పీకర్లు అసలే లేవు. ప్రచారానికి నిధులు కూడా లేవు. అయినా ఇల్లిల్లూ తిరుగుతూ ఓట్లడుగుతున్నారు. వారంతా ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన 49 మంది స్వతంత్ర అభ్యర్థులు. వీరిలో ఓ బహుళజాతి సంస్థ ఉద్యోగి మొదలుకుని వెల్డర్, మెకానిక్, సామాజిక కార్యకర్త, స్టాక్ ట్రేడర్ దాకా రకరకాల వాళ్లున్నారు. వీరిలో 67 ఏళ్ల సుభాష్ చందర్ హరియాణాలోని సిర్సా వాసి. కాలుష్యంతో ఢిల్లీ గ్యాస్ చాంబర్‌లా మారిపోయిందన్నది ఆయన ఆవేదన. దీన్ని ఎత్తి చూపేందుకే చాందినీ చౌక్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో దిగానని చెబుతున్నాడు. డబ్బు ఆదా చేసేందుకు రాత్రుళ్లు గురుద్వారాల్లో బస చేస్తున్నాడు.

రూ.10కే భోజనం పెడతా


సౌత్ ఢిల్లీ బరిలో ఉన్న శంకర్ రాజధానిలో పోటీ చేస్తున్న ఏకైక బెంగాలీ అభ్యర్థి! 30 ఏళ్లు ఢిల్లీలోనే ప్రభుత్వోద్యోగం చేసి రిటైరయ్యారు. గెలిచినా ఓడినా ఎన్నికల తర్వాత ఢిల్లీలో ప్రజలకు రూ.10కే కడుపునిండా భోజనం అందిస్తానని ధీమాగా చెబుతున్నాడు! అల్కా జైశ్వాలనీ ఓ బహుళజాతి సంస్థలో మంచి హోదాలో పని చేశారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి బాసూరీ స్వరాజ్, సోమనాథ్ భారతిలతో తలపడుతున్నారు. పెచ్చరిల్లిన నిరుద్యోగంపై పోరాడేందుకే బరిలో దిగానంటున్నారు. ఉద్యోగిగా పొదుపు చేసుకున్న డబ్బును ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు. సౌత్ ఢిల్లీలో బరిలో ఉన్న నవీన్‌కుమార్ వృత్తిరీత్యా వెల్డర్. చదువుకోలేదు. అందుకే సరైన విద్యా వ్యవస్థ కోసం బరిలో దిగాడు. ఆయన కోసం 12 మందితో కూడిన బృందం పని చేస్తోంది.



తనకు 6 లక్షల ఓట్లు ఖాయమంటున్నాడు! వెస్ట్ ఢిల్లీ నుంచి బరిలో ఉన్న సామాజిక కార్యకర్త అంజు శర్మ పూర్వాశ్రమంలో కాంగ్రెస్ నాయకురాలు. - న్యూఢిల్లీ

బిహార్‌లో ఆరో విడత...

బీజేపీకి అగ్నిపరీక్ష!



వైశాలిలోని క్రీస్తుపూర్వం మూడో శతాబ్దం నాటి అశోక స్తంభం

8 లోక్‌సభ స్థానాలకు రేపు పోలింగ్

● వాటిలో ఏడు ఎన్డీఏ సిట్టింగ్ సీట్లే
● ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి గట్టి పోటీ

పోలింగ్ జరిగే మొత్తం స్థానాలివి...
వాల్మీకి నగర్, పశ్చిమ్ చంపారన్, పూర్వీ చంపారన్, శివహర్, వైశాలి, గోపాల్‌గంజ్ (ఎస్సీ), సివాన్, మహారాజ్‌గంజ్.

బిహార్‌లో ఇప్పటిదాకా ఐదు విడతల్లో 24 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. శనివారం ఆరో దశలో 8 చోట్ల పోలింగ్ జరగనుంది. వీటిలో ఏకంగా ఏడు ఎన్డీఏ సిట్టింగ్ స్థానాలే కావడం విశేషం. దాంతో వాటిని నిలబెట్టుకోవడం బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్-ఆర్జేడీ-లెఫ్ట్ పార్టీలతో కూడిన ఇండియా కూటమి ఈసారి గట్టి పోటీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో కీలక స్థానాలపై ఫోకస్... - సాక్షి, నేషనల్ డెస్క్

వాల్మీకి నగర్... పోటాపోటీ



● సునీల్ కుమార్

గత ఎన్నికల్లో జేడీ(యూ) నేత బైద్యనాథ్ ప్రసాద్ మహతో 3.5 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. ఆయన మరణానంతరం ఉప ఎన్నికలో తనయుడు సునీల్ కుమార్ కుష్వాహ గెలుపొందారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున ఆర్జేడీ అభ్యర్థి దీపక్ యాదవ్ తలపడుతున్నారు. బీఎస్పీ దుర్గేశ్ సింగ్ చౌహాన్‌ను రంగంలోకి దించడంతో పోటీ హీటెక్కింది. నేపాల్ సరిహద్దులో ఉన్న ఈ నియోజకవర్గంలో 22 శాతం ముస్లింలు, 15 శాతం ఎస్సీ ఓటర్లుంటారు.

పశ్చిమ్ చంపారన్... కమలం అడ్డా

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2008లో ఉనికిలోకి వచ్చినప్పటి నుంచీ ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. బీజేపీ తరఫున సంజయ్ జైశ్వాల్ గత ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టారు. ఈసారి ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ తివారీ, బీఎస్పీ నుంచి ఉపేంద్ర రామ్ పోటీ చేస్తున్నారు. పలువురు ముస్లిం అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా బరిలో ఉండటం విశేషం. సుమారు 4 లక్షలున్న ముస్లిం ఓటర్లు ఇక్కడ కీలకం. బనియా, బ్రాహ్మణ ఓటర్లు రెండేసి లక్షల చొప్పున, యాదవులు, కుర్మి, కుష్వాహ సామాజిక వర్గ ఓటర్లు 1.5 లక్షల చొప్పున ఉన్నారు. నితీశ్ ప్రభుత్వంపై వ్యతిరేకత, ఇండియా కూటమి గట్టి పోటీ నేపథ్యంలో బీజేపీ ఎదురీదుతోంది.



● సంజయ్ జైశ్వాల్



● అలోక్ కుమార్

గోపాల్‌గంజ్... లాలు సొంత జిల్లా

తొలుత కాంగ్రెస్ గుప్పిట్లో ఉన్న ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో క్రమంగా ప్రాంతీయ పార్టీలు పాగా వేశాయి. బిహార్ మాజీ ముఖ్యమంత్రి అబ్దుల్ గఫూర్ జనతాదళ్ తరఫున, సమతా పార్టీ తరఫున రెండు సార్లు ఇక్కడ గెలిచారు. ఆర్జేడీ, బీజేపీ ఒక్కోసారి మాత్రమే విజయం సాధించాయి. గత ఎన్నికల్లో జేడీయూ తరఫున అలోక్ కుమార్ సుమన్ 2.86 లక్షలకు పైగా ఓట్ల తేడాతో ఆర్జేడీ నేత సురేంద్ర రామ్‌పై విక్టరీ కొట్టారు. కాగా, ఈసారి కాంగ్రెస్, ఆర్జేడీ, లెఫ్ట్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) ఇండియా కూటమి తరఫున వీఐపీ అభ్యర్థి ప్రేమ్‌నాథ్ చంచల్ పాశ్వాన్ బరిలోకి దిగారు. ఎన్డీఏ నుంచి జేడీయూ సిట్టింగ్ ఎంపీ అలోక్ కుమార్ పోటీలో ఉన్నారు. కాగా, ముస్లిం ఓటర్లు కూడా ఎక్కువగానే ఉన్న నేపథ్యంలో ఇక్కడ మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) దియానాథ్ మాంఝీని రేసులో నిలపడంతో పోటీ రసవత్తరంగా మారింది. బీఎస్పీ కూడా సుజీత్ రామ్‌ను రంగంలోకి దించింది. ఇది లాలు, తేజస్వీ సొంత జిల్లా కావడంతో ఆర్జేడీ ఈ సీటుపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. 94 శాతం గ్రామీణ జనాభా గల ఈ సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవడానికి నితీశ్ కుమార్ కూడా తీవ్రంగానే కష్టపడుతున్నారు. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో జేడీయూ, బీజేపీ, ఆర్జేడీ ఖాతాలో తలో రెండు సీట్లు ఉన్నాయి.

పూర్వీ చంపారన్... రాధామోహన్ జోరు



● రాధామోహన్ సింగ్

బీజేపీ సిట్టింగ్ ఎంపీ రాధామోహన్ సింగ్ గత ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. 1989లో ఇక్కడ తొలిసారి కాషాయ జెండా పాతింది కూడా ఆయనే! ఇండియా కూటమి నుంచి వంచిత్ సమాజ్ ఇన్సాఫ్ పార్టీ అభ్యర్థి రాజేశ్ కుమార్ పోటీ చేస్తున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 6 అసెంబ్లీ సెగ్మెంట్లలో 4 బీజేపీ ఖాతాలో ఉండగా, జేడీయూ, ఆర్జేడీ చెరొకటి దక్కించుకున్నాయి.

వైశాలి... ప్రాంతీయ పార్టీల హవా



● వీణా దేవి

1977లో ఏర్పాటైన ఈ ఎంపీ సీటును కాంగ్రెస్ నుంచి ప్రాంతీయ పార్టీలు చేజిక్కించుకున్నాయి. 1996 నుంచి ఆర్జేడీ కంచుకోటగా మారింది. ఆ పార్టీ సీనియర్ నేత రఘువంశ్ ప్రసాద్ సింగ్ వరుసగా ఐదుసార్లు గెలిచారు. ఆర్జేడీ జైత్రయాత్రకు 2014లో ఎల్జేపీ బ్రేకులేసింది. రఘువంశ్‌పై ఎల్జేపీ అభ్యర్థి రామ్‌కిశోర్ సింగ్ గెలిచారు. 2019లో కూడా ఎల్జేపీ అభ్యర్థి వీణా దేవి చేతిలో రఘువంశ్ ఓటమి చవిచూశారు! ఈసారి కూడా ఎల్జేపీ (రాం విలాస్) నుంచి వీణా దేవే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి ఆర్జేడీ మున్నా శుక్లాను పోటీకి దించింది. ఆయన హత్య కేసులో బెయిల్‌పై ఉన్నారు. బీఎస్పీ నుంచి శంభు కుమార్ సింగ్ రేసులో ఉన్నారు. ఇక్కడ యాదవులు, కుష్వాహ, నిషాద్ సామాజిక వర్గాల ఓటర్లు కీలకం.

సిట్టింగ్ సీట్లలో గట్టి పోటీ

జార్ఖండ్‌లో 4 స్థానాలకు రేపు పోలింగ్ | అన్నీ ఎన్డీఏ స్థానాలే

ఆరో విడతలో భాగంగా జార్ఖండ్‌లో 4 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. ఇవన్నీ ఎన్డీఏ సిట్టింగ్ స్థానాలే కావడం విశేషం. మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్ట్ బీజేపీ ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమంటూ జేఎంఎం ప్రచారంలో హోరెత్తిస్తోంది. బీజేపీకి మద్దతుగా నిలుస్తున్న ఆదివాసీలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆరో విడత స్థానాలపై ఫోకస్...
- సాక్షి, నేషనల్ డెస్క్

ధన్‌బాద్

బొగ్గు గనుల స్థావరం. ఇక్కడి ఓటర్లలో 62 శాతం పట్టణవాసులే. ఎస్సీలు 16 శాతం, ఎస్టీలు 8 శాతముంటారు. యూపీ, బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి వలస వచ్చినవారు ఎక్కువ. 2009 నుంచి బీజేపీ కంచుకోటగా ఉంది. హ్యాట్రిక్ కొట్టిన సిట్టింగ్ ఎంపీ పశుపతినాథ్ పోటీకి దూరంగా ఉండటంతో ఎమ్మెల్యే దుల్లు మహతోకు బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి అనుపమా సింగ్ పోటీ పడుతున్నారు. వీరిపై రెండు పార్టీల్లోనూ అసంతృప్తే ఉంది. బీఎస్పీ, సమతా, ఆజాద్ సమాజ్, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా వంటి పార్టీలు, స్వతంత్రులు... ఇలా మరో డజను మంది బరిలో ఉన్నారు.

రాంచీ

సిట్టింగ్ ఎంపీ సంజయ్ సేత్‌ను కాదని 2014లో గెలిచిన రామ్ తహల్ చౌదరికి బీజేపీ ఈసారి టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి సుబోధ్‌కాంత్ సహాయ్ కుమార్తె, ప్రముఖ న్యాయవాది. యశస్వి పోటీ చేస్తున్నారు. తండ్రి ప్రాతినిధ్యం వహించిన స్థానం కావడం ఆమెకు కలిసొచ్చే అంశం. అయితే ఎంపీగా సంజయ్ పని తీరుపై ఏకంగా 73 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినట్టు గతేడాది ఓ సర్వేలో తెలిసింది. రాష్ట్రంలో బీజేపీకి ఆయన బలమైన గళంగా నిలుస్తున్నారు.



జంషెడ్‌పూర్

దీన్ని టాటా నగర్, స్టీల్ సిటీ అని కూడా పిలుస్తారు. టాటా స్టీల్ అతిపెద్ద ప్లాంట్ ఇక్కడ ఉంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ బిద్యుత్ బరణ్ మహతో హ్యాట్రిక్‌పై కన్నేశారు. 2019లో ప్రస్తుత సీఎం చంపయ్ సోరెన్‌పై 3 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారాయన. మాజీ ఎమ్మెల్యే కునాల్ సారంగికి టికెటివ్వకపోవడం ఒడిశావాసుల ఓట్లపై ప్రభావం చూపేలా ఉంది. కాకపోతే కుర్మి-మహతో ఓటర్లు 3 లక్షలకు పైగా ఉండటం మహతోకి కలిసొచ్చే అంశం. 27 శాతమున్న ఆదివాసీలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. జేఎంఎం నుంచి సమీర్‌కుమార్ మొహంతీ బరిలో ఉన్నారు.

గిరిధ్

బీజేపీకి బలమైన స్థానమిది. పొత్తులో భాగంగా ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ)కు విడిచిపెట్టింది. ఏజేఎస్‌యూ సిట్టింగ్ ఎంపీ చంద్రప్రకాశ్ చౌదరి మరోసారి పోటీ చేస్తున్నారు. జేఎంఎం నుంచి మధుర ప్రసాద్ మహతో బరిలో ఉన్నారు. వీరిద్దరికీ స్వతంత్ర అభ్యర్థి జైరాం కుమార్ మహతో గట్టి సవాల్ విసురుతున్నారు. ముగ్గురు నేతలూ కుర్మి సామాజికవర్గీయులే. టైగర్ జైరాంగా పిలిచే జైరాం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజల మంచి స్పందన కూడా వస్తోంది. దీంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

నవధాన్యాలతో జవసత్వాలు

భూసార పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం ● ప్రభుత్వ చొరవతో పెరిగిన వైనం ● రైతులను చైతన్య పరుస్తున్న అధికారులు

పిఠాపురం: అధునాతన వ్యవసాయంలో మితిమీరిన రసాయనాలు వాడడం వల్ల పసిడి పంటలు పండే భూములు సహజ శక్తిని కోల్పోయాయి. అలాంటి పరిస్థితుల్లో నేలలను పునరుజ్జీవింప చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూములను సారవంతం చేసే దిశగా అడుగులు వేయాలని, ఎరువులు.. పురుగు మందులకు చెక్ పెట్టి ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగా అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ భూసారం సాధించే దిశగా నవ ధాన్యాల సాగుకు ప్రభుత్వం తోడ్పాటు ఇచ్చే చర్యలు తీసుకుంది. పచ్చి రొట్ట సాగుతో పచ్చని పంటలు పండే విధంగా ప్రకృతి వ్యవసాయంపై అధికారులు రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.



నవధాన్యాల విత్తనాలు సిద్ధం చేస్తున్న అధికారులు

కాకినాడ జిల్లాలో నవ ధాన్యాల సాగు లక్ష్యం- 53,253 ఎకరాలు
సాగు చేయడానికి నిర్ణయించిన రైతుల సంఖ్య- 49,895
ఇప్పటి వరకు సాగయిన భూములు - 26,846 ఎకరాలు
విత్తనాలు తీసుకున్న రైతులు - 26,680 మంది
పంపిణీ చేసిన విత్తనాలు - 26 టన్నులు
సాగు చేసిన రైతులు - 26,564 మంది
పంపిణీ చేస్తున్న విత్తనాలు - 31 రకాలు

నవ ధాన్యాల సాగుతో భూసారం పెంపు

వివిధ కారణాలతో క్రమంగా భూములు తమ బలాన్ని కోల్పోతున్నాయి. దీంతో సూక్ష్మ పోషక లోపాలు బయటపడుతున్నాయి. ఫలితంగా భారీ పెట్టుబడులు పెట్టినా ఆశించిన దిగుబడులు రాని పరిస్థితి నెలకొంది. పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు కాక రైతులు నష్టపోతున్నారు. రానున్న రోజుల్లో భూసారం లేక ఏ పంటలు వేసినా పండని పరిస్థితులు నెలకొననున్నాయి. వాటిని అధిగమించడానికి నవ ధాన్యాల సాగు చేపట్టారు. వీటిని సాగు చేసి భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో సూక్ష్మ పోషక విలువలు వృద్ధి చెంది, భూసారం పెరిగి ఏది సాగు చేసినా బాగా పండుతుంది. భూమి సారవంతంగా ఉండేందుకు దోహద పడే సూక్ష్మ జీవులు వృద్ధి చెంది నత్రజని స్థిరీకరణ జరిగి మొక్కల్లో రోగ నిరోధక శక్తి పెరిగి భూసారాన్ని మరింత పెంచుతాయి. చౌడు సమస్యను నివారించడంతో పాటు నేల నుంచి వచ్చే తెగుళ్లను సైతం ఈ పైర్లు అరికడతాయి. నవ ధాన్యాలు సాగు చేసి దున్నిన భూమిలో పండించిన ధాన్యంలో పోషకాల విలువలు పెరిగినట్టు శాస్త్రవేత్తల పరిశోధనలో నిర్ధారించారు.



పిఠాపురం మండలంలో నవధాన్యాల సాగు చేసిన పొలం

నవ ధాన్యాల సాగు

నవ ధాన్యాలు అంటే నవగ్రహాల పూజలకు వాడే ధాన్యాలుగానే చాలామందికి తెలుసు. కేవలం దైవ పూజలకు మాత్రమే వాడే నవ ధాన్యాలు ఇప్పుడు రైతుకు వరంగా మారాయి. గోధుమలు, వరి, కందులు, పెసలు, మినుములు, శనగలు, బొబ్బర్లు, నువ్వులు, ఉలవలు వంటి తొమ్మిది రకాల నవ ధాన్యాలు ఇప్పుడు భూసార పెంపులో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. వీటితో పాటు మరో 22 రకాల ధాన్యం రకాల విత్తనాలను ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తోంది. పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు తదితర సహజంగా లభించే ఎరువులు సామాన్య రైతుకు లభ్యం కావడం భారంగా మారింది. వాటి స్థానంలో ప్రతీ రైతుకు అందుబాటులో ఉండే సహజ సిద్ధ ఎరువుల తయారీకి నవ ధాన్యాల సాగు ఒక వరంగా మారింది. జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చి రొట్ట సాగుతో పాటు నవ ధాన్యాల సాగుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. తొమ్మిది రకాల ధాన్యాలను రబీకి చివరిలో జల్లుకుని కోతలు పూర్తయ్యాక వాటిని కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చు. ఈ విషయంలో అధికారుల సూచనలు, సలహాలతో రైతులు నవ ధాన్యాల సాగు చేపట్టారు.

మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి

గత ఏడాది అధికారులు ఇచ్చిన విత్తనాలు చల్లి కలియ దున్నడం వల్ల చాలా వరకు ఎరువుల వాడకం తగ్గింది. పూర్వం పశువుల పెంటతో పాటు పచ్చిరొట్ట ఎరువులు వాడేవారు. రానురాను వాటిని మానేసి రసాయనిక ఎరువులు వాడడం ప్రారంభించాక పెట్టుబడులు పెరిగిపోయాయి. మళ్లీ ఇప్పుడు నవధాన్యాలు నాటి దున్నడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయంలో ప్రభుత్వం రైతులకు మంచి అవకాశాలు కల్పిస్తోంది. నవ ధాన్యాల సాగు రైతులకు చాలా మంచిది. వీటి వల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు రసాయనిక ఎరువులు లేని పంటలు అందుబాటులోకి వస్తాయి. నేను రెండు ఎకరాల్లో నవ ధాన్యాల సాగు చేశాను. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు ఇవ్వడంతో పాటు ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తున్నారు. ఇవి సాగు చేయడం వల్ల భూమి సారవంతం కావడంతో ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం లేకుండా తక్కువ పెట్టుబడితో నాణ్యత గల పంటలు వస్తున్నాయి.



- వారణాశి కామేశ్వరశర్మ, నర్సింగపురం, పిఠాపురం మండలం

జిల్లాలో 53 వేల ఎకరాల్లో నవ ధాన్యాల సాగు లక్ష్యం

జిల్లాలో ఈ ఏడాది సుమారు 53 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా నవ ధాన్యాల సాగుకు లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటికే 26 టన్నుల విత్తనాలు పంపిణీ చేయగా 26 వేల మంది రైతులు తమ పొలాల్లో 25 వేల ఎకరాల్లో విత్తనాలు వేసుకుని నవ ధాన్యాల సాగు చేపట్టారు. రబీ పంట చివరిలో నవ ధాన్యాలను చల్లి మొక్కలు ఏపుగా పెరిగిన తరువాత ఖరీఫ్‌కు ముందు కలియ దున్నడం వల్ల భూముల్లో పోషక విలువలు వృద్ధి చెంది భూసారం పెరుగుతుంది. తద్వారా రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో పాటు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలు పండించగలుగుతారు. ఇలా నాలుగు సంవత్సరాలు నవ ధాన్యాలు సాగు చేసి దున్నడం వల్ల భూసారం సహజ సిద్ధంగా పెరిగి రసాయనిక ఎరువుల అవసరం లేకుండా పంటలు పండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే అన్ని గ్రామాల్లోను రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా చైతన్యం తీసుకువచ్చాం. ప్రభుత్వం విత్తనాల పంపిణీ చేస్తుండడంతో రైతుల ముందుకు వస్తున్నారు. త్వరలోనే లక్ష్యం పూర్తి చేస్తాం. ఎకరానికి 10 కేజీల చొప్పున విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్నాం.



- ఎలియాజరు, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి, కాకినాడ



అమలాపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణం

వైద్య, విద్యా ప్రాప్తిరస్తు

అటు ప్రభుత్వ వైద్య కళాశాల, ఇటు బోధనాసుపత్రి

అమలాపురంలో శరవేగంగా పనులు ● ఇప్పటికే 65 శాతం పూర్తి

అమలాపురం టౌన్: చేరువలో చదువుల కోవెల ఉంటే.. ఆరోగ్యానికి పూర్తి భరోసా లభిస్తే ఆ ఆనందమే వేరు. అందుకే విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు సకల సౌకర్యాలూ కల్పిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు ప్రభుత్వ వైద్య విద్య, ఉచిత ప్రభుత్వ వైద్య సేవలు త్వరలో మరింత చేరువ కానున్నాయి. అమలాపురం మండలం కామనగరువు, సమనస గ్రామాల సరిహద్దుల్లో రాష్ట్ర ప్రభుత్వం 54 ఎకరాలను సేకరించి రూ.450 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మిస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైతం ప్రభుత్వపరంగా వైద్య విద్యను అభ్యసించేందుకు మార్గం సుగమమవుతోంది. అమలాపురంలో ఈ వైద్య కళాశాలల నిర్మాణ పనుల వేగం పుంజుకుంది. ఇది అందుబాటులోకి వస్తే ఏటా దాదాపు 150 మెడికల్ సీట్లతో విద్యార్థులు వైద్యను అభ్యసించే అవకాశం ఏర్పడుతుంది. ఇంత వరకూ ప్రభుత్వ వైద్య విద్య కోసం ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అమలాపురంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితులన్నీ దాదాపు దూరం కానున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఎవరైనా వైద్య విద్య అభ్యసించాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అలాంటి విద్యార్థులకు వైద్య విద్యపరంగా జిల్లాలో ఓ భరోసాగా నిలువనుంది. ఇప్పటికే ఈ కళాశాల నిర్మాణ పనులు దాదాపు 65 శాతం పూర్తయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు చెందిన ఇంజినీర్లు ఈ భవనాలను త్వరితగతిన పూర్తి చేసే దిశగా శ్రమిస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి మొత్తం నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని ఆ సంస్థ ఇంజినీర్ యోగి తెలిపారు.

చకచకా సదుపాయాల కల్పన

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా బోధనా ఆసుపత్రిగా అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 100 పడకలతో ఉన్న ఈ ఆసుపత్రి 650 పడకలుగా జిల్లా స్థాయిలో పెద్దాసుపత్రిగా సేవలు అందించనుంది. ఇప్పటికే ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పన పనులు చకచకా జరుగుతున్నాయి. ఏరియా ఆస్పత్రిలో బోధనా ఆసుపత్రి కోసం అప్పుడే ఆపరేషన్ థియేటర్లు, కన్సల్టింగ్ వార్డులు సిద్ధమవుతున్నాయి. ఆ దిశగా యంత్ర పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు జరుగుతోంది. ఇక ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఈ బోధనా ఆసుపత్రి జిల్లా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనుంది. ఇప్పుడు ఆసుపత్రిలో 12 విభాగాలకు వైద్య నిపుణులు ఉంటే, అదే బోధనా ఆసుపత్రి హోదా వచ్చాక 24 విభాగాలు ఏర్పడి ఆయా విభాగాలకు ఒక్కో వైద్య నిపుణుడు అందుబాటులోకి రానున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యనభ్యసించే విద్యార్థులు బోధనా ఆస్పత్రిలో కూడా సేవలు అందించి తమ వైద్య విద్యను పూర్తి చేయనున్నారు. ఇప్పటికే నాడు–నేడు పథకంలో రూ.570 కోట్లతో ఏరియా ఆసుపత్రిని పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. ఈ అభివృద్ధి అంతా బోధనా ఆసుపత్రి అప్‌గ్రేడ్‌కు ఉపయోగపడుతోంది.



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బోధనాసుపత్రి అప్‌గ్రేడ్ పనులు

వచ్చే ఏడాదికి అంతా సిద్ధం

అమలాపురంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనా ఆసుపత్రి వచ్చే ఏడాదికి జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని అంచనా వేస్తున్నాం. ఏరియా ఆసుపత్రిలో బోధనా ఆసుపత్రికి అవసరమైన అన్ని సదుపాయాలూ సిద్ధమవుతున్నాయి. దీనివల్ల ప్రజలకు ఉచిత వైద్యం మరింత చేరువవుతోంది. మెడికల్ స్పెషలిస్టులు, మెడికల్ ఎక్విప్‌మెంట్లు వంటి విషయాల్లో అప్‌గ్రేడ్ సదుపాయాలు వస్తాయి.

-డాక్టర్ పద్మశ్రీరాణి, సమన్వయకర్త, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు

ఫ్యాషన్











డెనిమ్ న్యూ లుక్ డిజైన్

ఫ్యాషన్ ప్రపంచంలో అప్ సైక్లింగ్ మాట ఇప్పుడు బాగా వినిపిస్తోంది. ఉన్నదానిని సృజనాత్మకంగా మార్చడంలో కళాత్మక విలువతో పాటు పర్యావరణ స్పృహ కూడా ఉంటుంది. ఎప్పుడూ కొత్తవాటి కోసం పరుగులు తీయకుండా ఉన్నవాటిని కొత్తగా, ఫ్యాషనబుల్‌గా ఎలా ప్రిపేర్ చేసుకోవాలో తెలియజెప్పడానికి డిజైనర్లు పోటీ పడుతుంటారు. దీంట్లో భాగంగా డెనిమ్ అప్ సైక్లింగ్ ఎప్పుడూ బెస్ట్ ఛాయిస్‌గా ఉంటుంది.



ముంబై ఫ్యాషన్ డిజైనర్ వర్ణిక సాంగోయి డిజైన్ చేసిన అప్‌సైకిల్ డెనిమ్ శారీస్...

మనకున్న రకరకాల డిజైన్ వేర్‌లలో వివిధ రకాల ఫ్యాబ్రిక్‌తో రూపొందించినవి ఉంటాయి. వీటిలో డెనిమ్ జాకెట్స్, స్కర్ట్స్, ప్యాంట్స్ కూడా మోడర్న్ డ్రెస్సుల్లో భాగంగా చేరుతుంటాయి. జీన్స్ ప్యాంటులకు ఉపయోగించే నీలం రంగు గట్టి ఫ్యాబ్రిక్‌ను డెనిమ్ అంటారు. డెనిమ్ డ్రెస్సులైతే సంవత్సరాలుగా ఉపయోగించేవీ ఉంటాయి. కొన్నింటిని తీసిపడేయలేం, అలాగని వార్డ్ రోబ్స్‌లోనూ ఏళ్ల తరబడి ఉంచేయలేం. ఈ పరిస్థితులలో వాటికో కొత్త రూపు ఇవ్వడం చాలా మేలైన కళ. టాప్స్, కుర్తీస్, శారీస్.. ఇలా అనుకూలతను బట్టి అందమైన డిజైనర్ వేర్‌ని రూపొందించవచ్చు. లేదంటే విడిగా కొత్త ఫ్యాబ్రిక్‌తో సరికొత్త డిజైన్‌నీ క్రియేట్ చేయవచ్చు.

అప్ సైకిల్ డెనిమ్ శారీ

వర్ణిక సాంగోయి ముంబై ఫ్యాషన్ డిజైనర్. డెనిమ్‌తో ఎన్నో అప్‌సైకిల్ డిజైన్స్ చేసిన డిజైనర్. మోడర్న్ డ్రెస్సులే కాదు శారీస్‌ను కూడా డెనిమ్ టచ్‌తో, ప్యాచ్ వర్క్‌తో వివిధ రకాల మెటీరియల్‌ను ఉపయోగిస్తూ తయారు చేసింది. డెనిమ్ దర్జీ పేరుతో స్టూడియో కూడా రన్ చేస్తుంది.



* నెట్ ఫ్యాబ్రిక్, డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన చీర ఇది. చీర బార్డర్ పైన ఘుంగ్రూ వర్క్ డిజైన్ చేశారు.
* పోల్కా డాట్స్ ప్యాచ్ వర్క్‌తో రూపొందించిన శారీ
* లినెన్ శారీకి జియోమెట్రిక్ స్టైల్‌లో కట్ చేసిన డెనిమ్ క్లాతతో ప్యాచ్ వర్క్ చేశారు.
* స్కర్ట్ శారీని డెనిమ్‌ను ఉపయోగిస్తూ చేసిన మ్యాజిక్ స్టైల్ డ్రెస్ ఇది.
* డెనిమ్ క్రాప్‌టాప్
* కాటన్ ఫ్యాబ్రిక్ – డెనిమ్ జాకెట్‌ని ఉపయోగిస్తూ రూపొందించిన కుర్తా
* లేస్‌తో లాంగ్ స్లీవ్స్ రూపొందించిన డెనిమ్ జాకెట్
* డెనిమ్ ప్యాచ్‌వర్క్‌తో మోడర్న్ టాప్
* డెనిమ్ ప్యాంట్ బెల్ స్టైల్‌కి క్రోచెట్ డిజైన్‌ను అదనంగా జత చేస్తే వచ్చే స్టైల్.

వంటిల్లు

టొమాటో కనువిందు

మార్కెట్‌లో టొమాటోలు ఎర్రగా నోరూరిస్తున్నాయి.
ఏ కూర వండినా ఒక టొమాటో వేసుకుంటాం.
టొమాటోలతోనే కూరలు వండుతాం కూడా.
పచ్చళ్లయితే తెలుగు వాళ్ల తర్వాతే ఎవరైనా.
ఈసారి కొంచెం వెరైటీగా ప్రయత్నం చేద్దాం.
సాస్... కెచప్‌లు మనకు రావా... షాప్‌లో కొనాల్సిందేనా!
కొనడం ఎందుకు? మనమే నేర్చుకోవచ్చు కదా!
మనింట్లో వంటిల్లు ఉంది... మార్కెట్‌లో టొమాటో ఉంది.
సాస్... కెచప్పే కాదు... బాత్... ఆమ్లెట్ కూడా!

పిజ్జా సాస్



కావలసినవి: టొమాటోలు – అరకేజీ; ఆలివ్ ఆయిల్ – పావు కప్పు; వెల్లుల్లి – 10 (సన్నగా తరగాలి); సబ్జా ఆకులు – పావు కప్పు (తరగాలి); ఆరెగానో పొడి– 2 టీ స్పూన్‌లు; ఉప్పు – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; మిరియాల పొడి – అర టీ స్పూన్.

తయారీ: ● టొమాటోలను శుభ్రంగా కడిగి తరగాలి. ఆ ముక్కలను మిక్సీ జార్‌లో వేసి గుజ్జు చేయాలి ● వెడల్పుగా ఉన్న బాణలి స్టవ్ మీద పెట్టి ఆలివ్ ఆయిల్ వేసి వెంటనే అందులో వెల్లుల్లి వేసి సన్న మంట మగ్గనివ్వాలి. ఆ తర్వాత టొమాటో గుజ్జు వేసి ఐదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడకనివ్వాలి. ఈ లోపు మధ్యలో కలుపుతూ ఉండాలి. ఆ తర్వాత అందులో సబ్జా ఆకులు, ఆరేగానో, ఉప్పు, మిరియాల పొడి వేసి కలిపి మూత పెట్టి మంట తగ్గించి దాదాపుగా అరగంట సేపు ఉంచాలి. మిశ్రమం దగ్గరయ్యే కొద్దీ నూనె పైకి తేలుతుంది. సాస్ దాదాపు సిద్ధమైనట్లే. ఈ దశలో ఒకసారి రుచి చూసుకుని అవసరమైతే మరింత ఉప్పు, మిరియాల పొడి కలుపుకోవచ్చు. సాస్ చిక్కదనాన్ని కూడా చూసుకుని అవసరమైతే మరో ఐదు నిమిషాల సేపు ఉంచాలి. స్టవ్ మీద నుంచి దించిన తర్వాత కదిలించకుండా పక్కన పెట్టాలి. చల్లారిన తర్వాత జాడీలో పోసుకుని గట్టిగా మూతపెట్టి ఫ్రిజ్‌లో పెట్టుకుని రెండు నెలలపాటు వాడుకోవచ్చు. పిజ్జా టాపింగ్‌గా ఈ సాస్ చాలా బాగుంటుంది.

టొమాటో ఆమ్లెట్



కావలసినవి: శనగపిండి – కప్పు; టొమాటో ముక్కలు – కప్పు (2 మీడియం సైజ్ టొమాటోలు); ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు (మీడియం సైజు ఉల్లిపాయ 1); అల్లం – అంగుళం ముక్క (సన్నగా తరగాలి); పచ్చిమిర్చి –1 (సన్నగా తరగాలి); కొత్తిమీర తరుగు – 3 టేబుల్ స్పూన్‌లు; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– పావు టీ స్పూన్; ఇంగువ– చిటికెడు; గరం మసాలా పొడి– చిటికెడు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు– కప్పు లేదా చిక్కదనాన్ని బట్టి; నూనె లేదా నెయ్యి – 2 లేదా 3 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, టొమాటో ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర తరుగు, ఉప్పు, పసుపు, మిరప్పొడి, ఇంగువ, గరం మసాలా పొడి వేసి గరిటతో బాగా కలపాలి. అందులో ముప్పావు కప్పు నీటిని పోసి పిండి ఉండలు లేకుండా దోశెలపిండిలా గరిట జారుడుగా వచ్చేటట్లు కలపాలి. చిక్కదనాన్ని బట్టి మరికొంత నీటిని కలుపుకోవచ్చు. ఉప్పు సరి చూసుకుని అవసరమైతే కలుపుకోవాలి ● పెనం వేడి చేసి టీ స్పూన్ నెయ్యి వేసి వేడెక్కుతున్నప్పుడే ఉల్లిపాయ ముక్కతో పెనం అంతటికీ పట్టేలా రుద్దాలి. ఇప్పుడు టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడెక్కిన తర్వాత శనగపిండి మిశ్రమాన్ని రెండు గరిటెలు వేసి సర్దాలి. దోశెలాగ మరీ పలుచగా వేయకూడదు, ఇది ఊతప్పంలాగ మందంగా ఉండాలి. ఆమ్లెట్ కాలుతున్నప్పుడు చుట్టూ అంచులకు మరో టీ స్పూన్ నెయ్యి వేయాలి. మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు ఎర్రగా కాలిన తర్వాత అట్లకాడతో తిరగ వేసి మంట తగ్గించి సన్నమంట మీద కాలనివ్వాలి. రెండు వైపులా కాలిన తర్వాత ప్లేట్‌లోకి తీసుకుని వేడివేడిగా తినాలి ● దీనిని ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా బ్రెడ్‌తో కలిపి తినవచ్చు. బ్రెడ్ లేకుండా ఆమ్లెట్ మాత్రమే తినవచ్చు. రెండు ఆమ్లెట్‌లు తింటే కడుపు నిండుగా బ్రేక్‌ఫాస్ట్ చేసినట్లే ● పిండి మిశ్రమం మరీ పలుచగా అయి ఆమ్లెట్ విరిగిపోతుంటే మరికొంత శనగపిండి కలుపుకోవాలి. మిశ్రమం మరీ చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవాలి.

టొమాటో కెచప్



కావలసినవి: టొమాటోలు – 2.5 కేజీలు; వెల్లుల్లి రేకలు – 15; అల్లం– 3 అంగుళాల ముక్క; ఎండు మిర్చి – 6; కిస్‌మిస్– అర కప్పు; యాపిల్ సిడెర్ వినెగర్ – అర కప్పు; ఉప్పు – టేబుల్ స్పూన్; చక్కెర – 6 టేబుల్ స్పూన్‌లు; సోడియం బెంజోయేట్ – పావు టీ స్పూన్ (టీ స్పూన్ నీటిలో వేసి కరిగించాలి)

తయారీ: ● టొమాటోలను శుభ్రంగా కడగాలి. ఆరిన తర్వాత తొడిమలు తొలగించాలి. ఇప్పుడు టొమాటోలన్నింటినీ మీడియం సైజు ముక్కలుగా తరగాలి ● వెల్లుల్లి రేకల పొట్టు వలిచి తరగాలి. అల్లం కడిగి చెక్కు తీసి తరగాలి ● కిస్‌మిస్‌లు కడిగి పక్కన పెట్టుకోవాలి ● ఎండు మిర్చి తొడిమలు తీసి, మధ్యకు విరిచి గింజలతను తొలగించాలి. **తయారీ:** ● మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి టొమాటో ముక్కలు, అల్లం, వెల్లుల్లి ముక్కలు, ఎండు మిర్చి, కిస్‌మిస్, వినెగర్, ఉప్పు, చక్కెర వేసి గరిటెతో కలిపి మీడియం మంట మీద ఉడికించాలి. మధ్యలో కలుపుతూ టొమాటో ముక్కలు మెత్తబడే వరకు ఉడికించి పాత్రను దించేయాలి ● వేడి తగ్గిన తరవాత బ్లెండర్‌లో వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పెద్ద చిల్లులున్న స్ట్రెయినర్‌లో వడపోయాలి. టొమాటో తొక్కలు, మెదగని గింజల వంటివి పైన నిలుస్తాయి. వడపోసిన ద్రవాన్ని బాణలిలో పోసి కొంత సేపు మీడియం మంట మీద ఉడికించి దగ్గరవుతున్నప్పుడు సన్నమంట మీద ఉడికించాలి. టొమాటో ద్రవం కెచప్‌కు తగిన చిక్కదనం సంతరించుకోవాలంటే అరగంటకు పైగా ఉడకాలి. అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఉండాలి. దించడానికి ముందు టీ స్పూన్ వేడి నీటిలో పావు టీ స్పూన్ సోడియం బెంజోయేట్ కలిపి కెచప్‌లో పోసి కలిపి స్టవ్ ఆపేయాలి. సోడియం బెంజోయేట్ కెచప్ నిల్వ ఉండడానికి దోహదం చేసే ప్రిజర్వేటివ్. కెచప్‌ను ఫ్రిజ్‌లో పెట్టుకుని వాడుకునే వాళ్లు సోడియం బెంజోయేట్ లేకుండా కూడా సాస్ చేసుకోవచ్చు ● కెచప్ ఉడికేలోపు సాస్ నిల్వ చేయడానికి గాజు బాటిల్‌ని సిద్ధం చేసుకోవాలి. బాటిల్‌ని శుభ్రంగా కడిగిన తర్వాత వేడి నీటిలో ముంచి తీసి ఆరబెట్టాలి ● కెచప్ చల్లారిన తర్వాత సీసాలో వేసి గట్టిగా మూత పెట్టాలి. దీనిని స్నాక్స్‌లోకి తినవచ్చు లేదా భోజనానికి ముందు ఆకలి పెంచడానికి అప్పిటైజర్‌గా కూడా పని చేస్తుంది. నాలుక రుచి కోల్పోయినట్లు అనిపించినప్పుడు ఒక టీ స్పూన్ కెచప్‌ను చప్పరిస్తే రుచిగ్రంథులు ఉత్తేజితమవుతాయి.

టొమాటో బాత్



కావలసినవి: బియ్యం – పావు కేజీ; టొమాటో ముక్కలు – పావు కేజీ; వెల్లుల్లి రేకలు – 5 (తరగాలి); అల్లం – అంగుళం ముక్క (తరగాలి); పచ్చిమిర్చి – 3 (తరగాలి); జీలకర్ర – అర టీ స్పూన్; లవంగాలు –3; దాల్చిన చెక్క – అంగుళం ముక్క; పచ్చి కొబ్బరి తురుము – పావు కప్పు.

పోపు కోసం: నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; జీలకర్ర – అర టీ స్పూన్
బిర్యానీ ఆకులు– 2; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు ; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి– పావు టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; చక్కెర – పావు టీ స్పూన్; నీరు – అర కప్పు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు. **తయారీ:** ● బియ్యాన్ని కడిగి మునిగేటట్లు నీటిని పోసి అరగంట తర్వాత నీటిని వంపేసి పక్కన పెట్టాలి ● టొమాటో ముక్కలను మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులోనే అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, జీలకర్ర, లవంగాలు, దాల్చిన చెక్క కూడా వేసి గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత కొబ్బరి కూడా వేసి గ్రైండ్ చేయాలి. నీరు వేయాల్సిన అవసరం లేకుండానే మిశ్రమం మెత్తగా మెదుగుతుంది ● మందపాటి పాత్ర పెట్టి సన్న మంట నెయ్యి వేడి చేసి అందులో బిర్యానీ ఆకులు, జీలకర్ర వేయాలి. జీలకర్ర పేలిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. దోరగా వేగిన తర్వాత అందులో క్యాప్సికమ్ ముక్కలు వేయాలి. రెండు లేదా మూడు నిమిషాల పాటు వేగిన తర్వాత నానబెట్టిన బియ్యాన్ని వేయాలి. అందులో పసుపు, మిరప్పొడి, ఉప్పు, చక్కెర వేసి సున్నితంగా (బియ్యం విరిగిపోకుండా) కలపాలి. ఇప్పుడు కొబ్బరి మసాలా పేస్ట్ వేసి జాగ్రత్తగా కలపాలి. ఆ తర్వాత కప్పు నీటిని పోసి కలిపి మూత పెట్టి ఉడకనివ్వాలి. నీరు ఇంకిపోయేటప్పుడు ఒకసారి అన్నం మెతుకు పట్టుకుని చూసి అవసరమైతే మరికొన్ని వేడి నీటిని పై నుంచి చిలకరించి మూత పెట్టి సన్నమంట మీద ఉడకనివ్వాలి. ఈ దశలోనే రుచి చూసి ఉప్పు తగ్గితే వేడి నీటిలో ఉప్పు కలిపి టొమాటో బాత్ మీద చల్లాలి. తేమ లేకుండా ఉడికిన తర్వాత స్టవ్ ఆపేసి కొత్తిమీర తరుగు, కొబ్బరి తురుము చల్లి మూత పెట్టాలి.

న్యూస్‌మేకర్

ఎవరెస్ట్ కీ బేటీ

కుమార్తెను ప్రోత్సహించడానికి తండ్రి ఎవరెస్ట్‌లా నిలబడితే ఏ కుమార్తైనా ఎవరెస్ట్‌ను అధిరోహించడానికి వెనుకాడదు. ముంబైకు చెందిన 16 ఏళ్ల కామ్య తన తండ్రితో కలిసి తొమ్మిదో ఏటనే ఎవరెస్ట్ బేస్ క్యాంప్ తాకగలిగింది. ఇప్పుడు తండ్రిని తోడు చేసుకుని ఎవరెస్ట్‌నే అధిరోహించింది. ఎవరెస్ట్‌ను ఎక్కిన బాలికలలో ఈమెది రెండో చిన్న వయసు. కామ్య సాహసయాత్ర విశేషాలు.

కొన్ని విజయాలు పుట్టుకతోనే నిర్ధారితమవుతాయి. ముంబైలోని నేవీ స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న 16 ఏళ్ల కామ్య కార్తికేయన్ తాజా ఘన విజయం చూస్తే ఆ మాటే అనాలనిపిస్తుంది. ఇంత చిన్న వయసులో 6 ఖండాల్లోని ఎత్తయిన పర్వతాలన్నీ అధిరోహించిందామె. మే 20న ఎవరెస్ట్ అధిరోహణతో నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్ అధిరోహించిన రెండవ చిన్న వయసు మౌంటెనీర్‌గా, మన దేశం నుంచైతే మొట్టమొదటి చిన్న వయసు మౌంటనీర్‌గా రికార్డ్ సృష్టించింది. దీని వెనుక కామ్య తండ్రి కార్తికేయన్ ఉన్నాడు. తల్లి లావణ్య ఉంది. అన్నింటి కంటే ముఖ్యంగా ఊహ తెలిసిన వెంటనే కనిపించిన సహ్యాద్రి పర్వతాలున్నాయి.



ఎవరెస్ట్‌పై తండ్రితో కామ్య

మూడేళ్ల వయసు నుంచే

కామ్య తండ్రి కార్తికేయన్ నేవీలో ఆఫీసర్. అతని పోస్టింగ్ లోనావాలాలో ఉండగా కావ్యాకు మూడేళ్లు. వీకెండ్స్‌లో ఆమె తల్లిదండ్రులిద్దరూ సహ్యాద్రి పర్వతాల్లో విహారానికి కావ్యను తీసుకెళ్లేవారు. ఐదారేళ్లు వచ్చేసరికి సహ్యాద్రిలో ఆమె కాళ్లు పరుగులు తీయడం మొదలుపెట్టాయి. ప్రకృతి కామ్యను ఆకర్షించింది. పర్వతాలు హద్దుల్లేని ప్రయాణం చేయమని స్ఫూర్తినిచ్చాయి. కామ్యలోని చురుకుదనాన్ని చూసి పర్వతారోహణలో ఆమెను ప్రోత్సహించాలని కార్తికేయన్ నిశ్చయించుకున్నాడు.

మొదటి లిట్మస్ టెస్ట్

కామ్యకు 9 ఏళ్ల వయసు ఉండగా కార్తికేయన్ ఆమెను పర్వతారోహణలో నిలదొక్కుకోగలదో లేదో పరీక్షించడానికి లదాఖ్ తీసుకెళ్లాడు. అక్కడి మౌంట్ స్టాక్ కంగ్రిని 6000 అడుగుల ఎత్తు మేర ఆమె అధిరోహించింది. ప్రతికూల వాతావరణంలో ఆ వయసులో ఆమె చేసిన అధిరోహణ కార్తికేయన్‌కు నమ్మకమిచ్చింది. దాంతో తన కూతురు చిన్న వయసులోనే అన్ని ఖండాల్లోని పర్వతాలు అధిరోహించాలని అతడు ప్రోత్సహించాడు. కామ్య ఆ సవాలును స్వీకరించింది. అలా మొదలైంది వారి 'సాహస్' యాత్ర.

7 ఖండాల సాహస్

కామ్య ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తయిన శిఖరాలన్నీ అధిరోహించాలని నిశ్చయించుకుంది. ఆ యాత్రకు 'సాహస్' అని పేరు పెట్టుకుంది. 'అయితే అది అంత సులువైన పని కాదు. మానసికంగా శారీరకంగా వైద్యానికి స్పందించే విధంగా మన శరీరం మనసు ఉండాలి. అందుకని నేను రోజుకు ఆరు గంటలు సైక్లింగ్, రన్నింగ్ చేసేదాన్ని' అని తెలిపింది కామ్య. తన సాహస యాత్ర మొదలెట్టే ముందు ప్రఖ్యాత పర్వతారోహకుడు ఎం.ఎస్. కోలిని కలిస్తే 'పర్వతాలు ఎన్నో కథలను నీకు ఇస్తాయి. అవి జీవితాంతం గొప్పగా నీతో మిగులుతాయి. గో అహేడ్' అని ఆశీర్వదించాడు. కామ్య ఆగలేదు. తండ్రితో పాటు 2017లో కిలిమంజారో (ఆఫ్రికా), ఆ తర్వాతి సంవత్సరం మౌంట్ ఎల్‌బ్రుస్ (యూరప్), ఆ తర్వాత మౌంట్ కోసియుస్కో (ఆస్ట్రేలియా), మౌంట్ అకోంకగువా (సౌత్ అమెరికా), మౌంట్ డెనాలి (నార్త్ అమెరికా) అధిరోహించింది. మే 20న మౌంట్ ఎవరెస్ట్ (ఆసియా) అధిరోహించడంతో అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ మాసిఫ్ ఒక్కటే చేరడం మిగిలింది.

ఎవరెస్ట్ అధిరోహణ

మే 20న ఎవరెస్ట్ శిఖరాగ్రం చేరడానికి ఏప్రిల్ 6 నుంచి కామ్య, ఆమె తండ్రి కార్తికేయన్ ప్రయాణం మొదలైంది. అధిరోహించేది ఎవరెస్ట్ కనుక ట్రైనింగ్, షాపింగ్, ప్యాకింగ్, ట్రావెల్ పకడ్బందీగా ప్లాన్ చేసుకున్నారు. మొదట ఖట్మాండు చేరుకుని అక్కడి నుంచి విమానం ద్వారా లుక్లా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఎవరెస్ట్ అధిరోహణకు ఇది మొదటి మజిలీ. అక్కడి నుంచి ఆరోహణ ప్రారంభించి ఫాక్‌డింగ్ (2610 మీటర్లు) నుంచి నామ్‌చే బజార్ (3440 మీటర్లు) చేరుకున్నారు. అక్కడ విరామం తీసుకున్నాక టింగ్‌బోచె (3860 మీటర్లు)కు ట్రెక్ సాగింది. ఆ తర్వాత లొబొచె (4940 మీటర్లు) చేరుకుని ఆ తర్వాత ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఆక్సిజన్ పరికరాలు ఉపయోగిస్తూ పర్వతారోహణ ఎలా చేయాలో, పైకి కొనసాగే సమయంలో సేఫ్టీ పరికరాలు ఎలా ఉపయోగించాలో ట్రయినింగ్ తీసుకున్నారు. శిఖరాగ్రం చేరుకోవడానికి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మే 15 వరకూ బేస్ క్యాంప్‌లోనే ఉండాల్సి వచ్చింది. మే 15న బయలుదేరి మే 20 మధ్యాహ్నం 12 గంటల 50 నిమిషాలకు కామ్య ఎవరెస్ట్ శిఖరానికి చేరుకుంది. 8, 849 మీటర్ల ఎత్తు ఉన్న ఎవరెస్ట్ శిఖరంపైన తన తండ్రితో పాటు నిలబడి కామ్య తన విజయాన్ని ఆస్వాదించింది. సంకల్పం ఉంటే సాధించలేనిది లేదని నిరూపించింది.

● యంగ్ టాలెంట్

అరుదైన ప్రతిభ....అక్షత



చిన్న వయసులోనే కృత్రిమ మేధా(ఏఐ) రంగంలో పెద్ద పేరు తెచ్చుకుంది అక్షతా కిశోర్ మొహరిర్. అభిరుచితో మొదలైన ప్రయాణం... అధ్యయనం, పట్టుదలతో మెషిన్ లెర్నింగ్ రంగంలో అక్షతను అగ్రగామిగా నిలిపింది. కర్నాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్శిటీ(వీటీయు-బెళగావీ)లో కంప్యూటర్ సైన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసింది. ఆ తరువాత డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్‌లకు సంబంధించిన ఆసక్తి మరింత పెరిగింది. యూనివర్శిటీ ఆఫ్ మేరీల్యాండ్ కాలేజ్ పార్క్(యూఎంసీపీ)లో మెషిన్ లెర్నింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఇంటర్‌ప్రెటబుల్ అండ్ ఇంటరాక్టివ్ మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అక్షతకు ఏడు యూఎస్ పేటెంట్లు లభించాయి. యూజర్ ఫ్రెండ్లీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్‌లను రూపొందించడంపై అక్షత దృష్టి పెట్టింది.



ఇన్ లింబో

అస్థిరమైన పరిస్థితి, ఎటూ తేల్చుకోలేని అయోమయం, త్రిశంకు స్వర్గం లాంటి పరిస్థితిని సూచించే మాట...ఇన్ లింబో. **ఉదా:** అవర్ ప్లాన్స్ ఫర్ ది ఫ్యూచర్ వర్ లెఫ్ట్ ఇన్ లింబో డ్యూ టు ది పాండమిక్

ఇన్ పింక్

ఆరోగ్య విషయాల నుంచి ఆర్థిక విధానాలకు వరకు 'బాగుంది' అనే ఆశాజనకమైన పరిస్థితిని సూచించే మాట... ఇన్ పింక్.
ఉదా:
కన్‌సైడరింగ్ హిజ్ ఏజ్, హి ఇజ్ ఇన్ ది పింక్ ఆఫ్ హెల్త్.

● గేమింగ్

రక్షకుడు వచ్చాడు



యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'ఘోస్ట్ ఆఫ్ సుషిమ' విడుదల అయింది. థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే గేమ్ ఇది. సుషిమ ద్వీపాన్ని రక్షించడానికి రంగంలోకి దిగిన 'సకాయ్' అనే సమురాయ్‌ని ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఆకీరా కురోసావా సినిమాలు, కామిక్ బుక్ సిరీస్ 'ఉసాగి యోజింబో' ప్రేరణతో ఈ గేమ్‌ను రూపొందించారు. గేమ్ ల్యాండ్‌స్కేప్, మినిమలిస్టిక్ ఆర్ట్ స్టైల్‌ను యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'షాడో ఆఫ్ ది కొలోసస్' ప్రభావంతో చేశారు. గేమ్‌లోని లొకేషన్‌లు 'పర్‌ఫెక్ట్ ఫొటోగ్రాఫర్స్ డ్రీమ్స్' అనిపించేలా అందంగా ఉంటాయి. ఇలన్ ఎస్కేరి, షిగేర్ ఉమేలయాషి ఈ గేమ్ సౌండ్ ట్రాక్‌ను అద్భుతంగా కంపోజ్ చేశారు. 'చారిత్రకంగా, సాంస్కృతికంగా ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాం' అని మేకర్స్ చెబుతున్నారు. **జానర్:** యాక్షన్-అడ్వెంచర్ **మోడ్స్:** సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్ **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, విండోస్.

● సక్సెస్ స్టోరీ



● ప్రఫుల్

పవర్‌ఫుల్ ప్రఫుల్

'కవిత్వం ఒక తీరని దాహం' అనేది ప్రసిద్ధమైన మాట. ప్రఫుల్ ధరివాల్‌కు కవిత్వం పెద్దగా పరిచయం లేకపోవచ్చు.

అయితే భౌతిక, గణిత శాస్త్రాలు అంటే చెప్పలేనంత ఇష్టం.

ఆ ఇష్టం భౌతిక, గణిత శాస్త్రాలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడంలో అంతులేని దాహం అయింది.

'ఈరోజు ఒక కొత్త విషయం తెలుసుకున్నాను. నెక్ట్స్ ఏమిటి' అనే అతడి సూపర్ స్పీడ్ ఎప్పటికప్పుడు కొత్త కొత్త విషయాలు తెలుసుకునేలా, తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడింది.

అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ 'ఓపెన్‌ఏఐ' గుర్తించే స్థాయికి చేరుకుంది.

'ఓపెన్ ఏఐకి గర్వకారణం' అని చెప్పుకునేలా చేసింది.

'నేర్చుకున్నది ఎప్పుడూ వృథా పోదు. అది విజయానికి గట్టి పునాది' అనే మాట పుణెకి చెందిన ప్రఫుల్ ధరివాల్ విషయంలో మరోసారి నిజమైంది....

ఓపెన్‌ఏఐ సీయివో సామ్ ఆల్ట్‌మాన్ ప్రఫుల్ ధరివాల్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. ధరివాల్ లేకుండా 'జీపీటీ 4వో' సాధ్యమయ్యేది కాదని ట్వీట్ చేశాడు.

చిన్నప్పటి నుంచే సైన్స్, గణితంలో అసాధారణ ప్రతిభను ప్రదర్శిస్తూ వస్తున్నాడు ప్రఫుల్. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నేషనల్ టాలెంట్ రిసెర్చ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. చైనాలో జరిగిన అంతర్జాతీయ ఖగోళ ఒలింపియాడ్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లోనూ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

ప్రఫుల్ అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపుగా మహారాష్ట్ర స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ అండ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు సంబంధించి అబాసాహెబ్ నరవానే మెమోరియల్ ప్రైజ్‌కు ఎంపికయ్యాడు.

ప్రతిష్ఠాత్మకమైన మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో కంప్యూటర్ సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేశాడు. 2016లో 'ఓపెన్‌ఏఐ'లో రిసెర్చ్ ఇంటర్న్‌గా చేరాడు. జీపీటీ-3, డాల్-ఇ 2, జ్యూక్‌బాక్స్, గ్లోతో సహా ఎన్నో సంచలనాత్మక ఏఐ మోడల్స్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాడు.

ఓపెన్ ఏఐకి ముందు క్వాంటిటేటివ్ అనలిస్ట్ ఇంటర్న్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఇంటర్న్‌గా, సెంటర్ ఫర్ బ్రెయిన్, మైండ్ అండ్ మెషిన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ రిసెర్చర్‌గా పనిచేశాడు.

తాజా విషయానికి వస్తే....

ఓపెన్‌ఏఐ సీయివో సామ్ ఆల్ట్‌మాన్ ట్వీట్‌తో సోషల్ మీడియా దృష్టిని ఆకర్షించాడు ప్రఫుల్.

ప్రఫుల్ కీలక పాత్ర పోషించిన మల్టీలింగ్వల్, మల్టీమోడల్ జెనరేటివ్ ప్రీ-ట్రైన్‌డ్ ట్రాన్స్‌ఫార్మర్ 'జీపీటీ-4వో' గురించి...'అందరి కృషి వల్లే జీపీటీ-4వో లాంచ్ సాధ్యమైంది' అంటాడు ప్రఫుల్.

'ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా అద్భుతమైన వ్యక్తులతో కలిసిపనిచేసే అవకాశం దొరికింది' అంటాడు వినమ్రంగా.

ఇంతకీ ప్రఫుల్ సక్సెస్ మంత్రా ఏమిటి?

సామ్ ఆల్ట్‌మాన్ మాటల్లో చెప్పాలంటే... వీటీసీడీ.

వి... విజన్
టి... టాలెంట్
సి... కన్విక్షన్
డి... డిటర్మినేషన్.

ఇన్‌స్టాగ్రామ్ 'పీక్' ఫీచర్



'పీక్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది ఫొటో షేరింగ్ యాప్ ఇన్‌స్టాగ్రామ్. ఈ ఫీచర్ ద్వారా ఒక వ్యూ తరువాత మాయం అయ్యే ఎడిట్ చేయని, అన్‌ఫిల్టర్, ఇన్-ది-మూమెంట్ ఫొటోలను యూజర్‌లు స్పీడ్‌గా క్యాప్చర్, షేర్ చేయవచ్చు. స్నాప్‌చాట్, బీరియల్‌ను స్ఫూర్తిగా తీసుకొని 'పీక్'పై దృష్టి పెట్టింది ఇన్‌స్టా. ఫొటోలు, వీడియోలను 24 గంటల పాటు చూడడానికి అనుమతించే ఇన్‌స్టాగ్రామ్‌లోని ప్రస్తుత 'స్టోరీస్' ఫీచర్‌లా కాకుండా 'పీక్' ఫొటోలు సింగిల్ వ్యూలో అదృశ్యం అవుతాయి, 'లిటిల్ మూమెంట్స్ విత్ ది పీపుల్ యూ లవ్' అని 'పీక్' గురించి చెప్పింది ఇన్‌స్టాగ్రామ్.

● టెక్.. టాక్

హువావే మేట్ బుక్ 14



సైజ్: 14.2 అంగుళాలు
రిజల్యూషన్: 2880x1920 పిక్సెల్స్
బరువు: 1.31 కేజీ   మెమోరీ: 16జీబి
స్టోరేజ్: 512 జీబి/1టీబి
● బ్యాటరీ లైఫ్: 19 గంటలు
● ఏఐ ఫీచర్స్ ● ఇన్‌టెల్ కోర్ ఆల్ట్రా చిప్

ఆల్ట్రా హ్యూమన్ రింగ్ ఏయిర్



థిక్: 2.5 ఎంఎం
వైడ్: 8.1 ఎంఎం   బరువు: 3 గ్రా.
కలర్ ఆప్షన్: టైటానియం
పీపీజీ ఆప్టికల్ సెన్సర్:
హార్ట్ రేట్ అండ్ బ్లడ్ ఆక్సిజన్ సాచ్యురేషన్
● వాటర్ రెసిస్టెంట్   ● సపోర్ట్స్: 22 వర్కవుట్ మోడ్స్

హెచ్‌ఎండీ టీ21 ట్యాబ్



సైజ్: 10.36 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 1200x2000 పిక్సెల్స్
కలర్: బ్లాక్ స్టీల్
ఇంటర్నల్: 64జీబి 4జీబి ర్యామ్/128జీబి 4జీబి ర్యామ్
బ్యాటరీ: 8200 ఎంఏహెచ్
● స్క్రాచ్ రెసిస్టెంట్ గ్లాస్

గూగుల్ కొత్త ఏఐ వీడియో అండ్ ఇమేజ్ జనరేటర్స్



కొత్త ఏఐ వీడియో అండ్ ఇమేజ్ జనరేటర్స్ వియో, ఇమాజెన్ 3లను గూగుల్ లాంచ్ చేసింది. టెక్ట్స్ ప్రాంప్ట్‌ల నుంచి వీడియోలను జనరేట్ చేయడానికి వియో ఉపయోగపడుతుంది. ఇమాజెన్ 3 అనేది గూగుల్‌కు సంబంధించి అత్యంత అధునాతన 'టెక్ట్స్-టు-ఇమేజ్' మోడల్. 'ఇమాజెన్ 3 అనేది టెక్ట్స్-టు-ఇమేజ్ హైక్వాలిటీ మోడల్. ఫొటోరియలిస్టిక్, లైఫ్‌లైక్ ఇమేజ్‌లను సృష్టించే సామర్థ్యం దీని సొంతం' అంటుంది గూగుల్. మోస్ట్ అడ్వాన్స్‌డ్ వీడియో మోడల్‌గా గూగుల్ చెబుతున్న 'వియో' వెరైటీ స్టైల్స్‌లో హై-క్వాలిటీ 1080పి వీడియోలను ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ ఏఐ మోడల్ 'టైమ్‌ల్యాప్స్' 'ఏరియల్ షాట్స్' లాంటి సినిమాటిక్ కాన్సెప్ట్‌లను కూడా అర్థం చేసుకుంటుంది. వీడియో క్రియేటర్‌లకు ఇది గేమ్-చేంజర్ అవుతుందని ప్రకటించింది గూగుల్.

సినిమా


● చిరంజీవి

మళ్లీ షురూ

కొంత గ్యాప్ తర్వాత మళ్లీ 'విశ్వంభర' సెట్స్‌కు వెళ్లారు చిరంజీవి. ఆయన హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాలోని ఇంట్రవెల్ యాక్షన్ సీక్వెన్స్‌ని హైదరాబాద్‌లో చిత్రీకరించారు. ఈ భారీ షెడ్యూల్ తర్వాత చిరంజీవి ఈ సినిమా చిత్రీకరణ నుంచి చిన్న విరామం తీసుకున్నారు. కాగా మళ్లీ హైదరాబాద్‌లోనే ఈ సినిమా తాజా షెడ్యూల్ షురూ అయింది. చిరంజీవి పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట దర్శకుడు వశిష్ఠ. ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 10న విడుదల కానుంది.



ఆగస్టులో క్రైమ్ కామెడీ స్టార్ట్


● వెంకటేశ్

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తారు. ఓ మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, ఆ పోలీసాఫీసర్ మాజీ ప్రేయసి... ప్రధానంగా ఈ మూడు పాత్రల నేపథ్యంలో సాగే క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ఆల్రెడీ యూనిట్ ప్రకటించింది. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను జూలై చివర్లో లేదా ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారట. ప్రస్తుతం 'రానా నాయుడు' వెబ్ సిరీస్ సెకండ్ సీజన్ షూటింగ్‌తో వెంకటేశ్ బిజీగా ఉన్నారని సమాచారం. ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయ్యాక అనిల్ రావిపూడి డైరెక్షన్‌లోని సినిమా సెట్స్‌లోకి వెంకటేశ్ ఎంట్రీ ఇస్తారని ఊహించవచ్చు.

ఎన్టీఆర్‌కు జోడీగా...

హీరో ఎన్టీఆర్, హీరోయిన్ రష్మికా మందన్నా జంటగా నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'కేజీఎఫ్, సలార్' సినిమాలను తీసిన దర్శకుడు ప్రశాంత్ నీల్ తర్వాతి చిత్రంలో ఎన్టీఆర్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభం కానుంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు రష్మికా మందన్నాను సంప్రదించారట దర్శకుడు ప్రశాంత్ అండ్ టీమ్. ఈ చిత్రానికి ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్.

ఆస్కార్ లైబ్రరీలో పార్కింగ్



తమిళ చిత్రం 'పార్కింగ్'కు అరుదైన గౌరవం లభించింది. ఆస్కార్ లైబ్రరీలో 'పార్కింగ్' సినిమా స్క్రీన్‌ప్లేకు చోటు దక్కింది. హరీష్ కల్యాణ్, ఎమ్‌ఎస్ భాస్కర్, ఇందుజా రవిచంద్రన్ లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'పార్కింగ్'. రామ్‌కుమార్ బాలకృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, సుధన్ సుందరం-కేఎస్ సినీష్ నిర్మించిన ఈ చిత్రం 2023 డిసెంబరు 1న విడుదలై, మంచి విజయం సాధించింది. ప్రేక్షకులతో పాటు విమర్శకుల మెప్పు కూడా పొందింది. తాజాగా 'పార్కింగ్' సినిమా స్క్రీన్‌ప్లేకు ఆస్కార్ లైబ్రరీలో శాశ్వతంగా చోటు కల్పిస్తున్నామని ఆస్కార్ మేనేజింగ్ లైబ్రేరియన్ ఫిలిఫ్ గార్సియా నుంచి ఇ-మెయిల్ వచ్చిందని చిత్రనిర్మాత కేఎస్ సినీష్ సోషల్ మీడియాలో పేర్కొని, ఆనందం వ్యక్తం చేశారు. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే... ఒకే ఇంట్లో అద్దెకు ఉండే ఐటీ ఉద్యోగి ఈశ్వర్, ప్రభుత్వోద్యోగి ఎస్. ఇళంపరుతి పార్కింగ్ విషయంలో ఈగోలకు పోయి ఒకరికి ఒకరు ఎలా హాని చేసుకున్నారు? ఆ తర్వాత తమ తప్పులను ఎలా తెలుసుకున్నారు? అనే అంశాల నేపథ్యంతో 'పార్కింగ్' కథ సాగుతుంది. రూ. 3 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా రూ. 15 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లుగా కోలీవుడ్ ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ తమిళ 'పార్కింగ్' సినిమాను తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషలతో పాటు ఓ విదేశీ భాషలోనూ రీమేక్ చేయడానికి చిత్ర దర్శక-నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం.

ఆశిష్ ముందున్న పెద్ద చాలెంజ్ అదే! - 'దిల్' రాజు


● భీమవరపు అరుణ్, కీరవాణి, 'దిల్' రాజు, ఆశిష్, వైష్ణవీ చైతన్య, హన్షిత, శిరీష్

"ఇప్పుడు ప్రేక్షకులను సంతృప్తిపరచడం అంత సులభమైన విషయం కాదు. ప్రేక్షకులను గెలవడమే ప్రస్తుతం ఆశిష్ ముందున్న పెద్ద చాలెంజ్" అని అన్నారు 'దిల్' రాజు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం 'లవ్ మీ'. భీమవరపు అరుణ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం రేపు (శనివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన అల్లు అరవింద్ మాట్లాడుతూ– "ఆశిష్ వందకు వంద శాతం ప్రామిసింగ్ పర్సనాలిటీ. ఇది తనకు బిగినింగ్ మాత్రమే. కొత్తవాళ్ళతో సినిమా చేసే ధైర్యం 'దిల్' రాజు అండ్ కోకి మాత్రమే సాధ్యం. 'లవ్ మీ' టీమ్‌కు ఆల్ ది బెస్ట్" అన్నారు. "'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌ను ఆరంభించినప్పుడు ఏదైనా కొత్తగా చేయాలని 'బలగం' సినిమా చేశాం. ఇప్పుడు వస్తున్న 'లవ్ మీ' కూడా కొత్త తరహా చిత్రమే. దర్శకుడు అరుణ్ ఈ సినిమా డ్రైవ్ చేసిన విధానం సూపర్. కీరవాణిగారి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అద్భుతం. మా బ్యానర్ నుంచి భవిష్యత్‌లో హరి, శ్యాండి, శశి, రవికిరణ్‌లతో సహా మరో ఇద్దరు కొత్త దర్శకులను పరిచయం చేయనున్నాం" అన్నారు 'దిల్' రాజు. "'లవ్ మీ' ఓ డిఫరెంట్ మూవీ" అన్నారు ఆశిష్. "'లవ్ మీ'తో నాన్ లీనియర్ నరేషన్‌కు దర్శకుడు అరుణ్ ఓ కొత్త నిర్వచనాన్ని ఇచ్చాడనిపించింది" అన్నారు కీరవాణి. "'లవ్ మీ: ఇఫ్ యు డేర్'కి సీక్వెల్‌గా 'కిల్ మీ: ఇఫ్ యు లవ్' ఉంటుంది" అన్నారు అరుణ్.

ఊ అన్నావా భామా..!


● త్రిప్తి దిమ్రి

'పుష్ప: ది రైజ్' చిత్రంలో స్పెషల్ సాంగ్ 'ఊ అంటావా మావ....' ఎంత పాపులర్ అయిందో తెలిసిందే. ఈ ప్రత్యేక పాటలో అల్లు అర్జున్‌తో కలిసి హాట్ హాట్ స్టెప్పులేశారు సమంత. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'పుష్ప: ది రూల్'లో కూడా ఇలాంటి ఓ ప్రత్యేక పాట ఉందని సమాచారం. ఈ పాటకు అల్లు అర్జున్‌తో కలిసి బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి కాలు కదపనున్నారని సమాచారం. రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్'లో చేసిన ఓ పాత్రతో త్రిప్తి బాగా పాపులర్ అయ్యారు. ఈ చిత్రం తర్వాత త్రిప్తికి హిందీలో అవకాశాలు పెరిగాయి. ఇప్పుడు 'పుష్ప: ది రూల్' పాటకు ఆమెను తీసుకున్నారనే వార్త ప్రచారంలోకి రావడంతో 'ఊ అన్నావా భామా...!' అని అభిమానులు సరదాగా అంటున్నారు. మరి.. ప్రచారంలో ఉన్నట్లు ఈ పాటతో త్రిప్తి తెలుగుకి పరిచయం అవుతారా? వేచి చూడాల్సిందే.

29న అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే...

'పుష్ప: ది రూల్' సినిమా నుంచి ఈ నెల 1న 'పుష్ప..పుష్ప' అంటూ సాగే పాట విడుదలైన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమా నుంచి 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' అంటూ సాగే మరో పాట లిరికల్ వీడియోను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో కూడా ఈ పాట విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు స్వరకర్త. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' చిత్రం ఆగస్ట్ 15న విడుదల కానుంది.

నవ్వుతూ ఉండటం ఓ సవాల్ - గెటప్ శ్రీను



"టీవీ రంగం నాకు మంచి పేరు తెచ్చి, ఆర్థిక స్థిరత్వాన్ని ఇచ్చింది. కానీ టీవీ షోలకు ఎక్కువగా టైమ్ కేటాయించడం వల్ల సినిమాల్లో మంచి పాత్రలను మిస్సవుతున్నాను. అందుకే ఇప్పుడు సినిమాలపై దృష్టి పెట్టాను" అని 'గెటప్' శ్రీను అన్నారు. 'గెటప్' శ్రీను సోలో హీరోగా నటించిన తొలి చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వంలో కె. ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి నిర్మించిన ఈ చిత్రాన్ని నేడు నిర్మాత బన్నీ వాసు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం విలేకర్లతో గెటప్ శ్రీను మాట్లాడుతూ– "'రాజు యాదవ్' ఫన్ అండ్ ఎమోషనల్ రైడ్. తల్లిదండ్రులు తమ కొడుకు నుంచి ఏం కోరుకుంటారు? తన తల్లిదండ్రులు ఎలా ఉండాలని ఓ కొడుకు ఆశపడుతుంటాడు? తల్లిదండ్రుల కలని సాకారం చేయడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎందుకు వెనకడుగు వేయకూడదు? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఇది నిజమైన కథ. కానీ ఇందులో నా పాత్రను మలిచిన విధానం కల్పితం. ఎప్పుడూ నవ్వుతూ ఉండే పాత్ర చేయడం ఈజీ కాదు. కొన్ని సన్నివేశాల చిత్రీకరణ సమయంలో సవాల్‌గా అనిపించింది. ఇక రామ్ ప్రసాద్ ఓ కథ రాస్తున్నాడు. సుధీర్, రామ్ ప్రసాద్, నా కాంబినేషన్‌లో ఓ సినిమా చేసే ఆలోచన ఉంది" అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,197	370
75,418	22,968

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,812	▲ 10
డోజోన్స్	39,200	▼ 472
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,339	▼ 31
డాక్స్	18,691	▲ 11
షాంఘై	3,116	▲ 42
నికాయ్	39,103	▲ 486

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	71,590	▼ 1,050
బంగారం (22 క్యారెట్)	68,180	▼ 1,000
వెండి (కేజీ)	97,000	▼ 2,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.77	107.33
€	యూరో	ఎస్‌బీఐ	89.37	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.80	53.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.65	56.59
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

డివిడెండ్ జోష్.. సూచీలు ఖుష్

తాజా గరిష్టాలకు సెన్సెక్స్, నిఫ్టీలు ● ఇన్వెస్టర్లకు రూ.4.28 లక్షల కోట్ల సంపద



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)బోర్డు కేంద్ర ప్రభుత్వానికి రూ.2.1 లక్షల కోట్ల భారీ డివిడెండ్ ఇచ్చేందుకు ఆమోదం తెలపడంతో గురువారం స్టాక్ సూచీలు సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపాయి. అలాగే దేశంలో ఎగుమతులు పెరగడంతో పాటు మే నెలలో ఉద్యోగ కల్పన 18 ఏళ్ల గరిష్టానికి చేరినట్లు వెల్లడైన గణాంకాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఫలితంగా సూచీలు దాదాపు 2% ర్యాలీ చేసి ఈ జనవరి 29 తర్వాత అతిపెద్ద ఒక రోజు లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,197 పాయింట్లు పెరిగి 75,418 ముగిసింది. నిఫ్టీ 370 పాయింట్లు బలపడి 22,968 వద్ద నిలిచింది.

కొనుగోళ్ల జోరు - రికార్డు హోరు

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం ఫ్లాటుగా మొదలయ్యాయి. మెటల్, ఫార్మా మినహా అన్ని రంగాల్లో కొనుగోళ్ల వెల్లువెత్తడంతో సూచీలు స్థిరంగా ముందుకు కదలాడాయి. మిడ్‌సెషన్ నుంచి ఆర్‌బీఐ డివిడెండ్ ప్రకటనల బలపడటంతో ఐటీ, బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. దశలో సెన్సెక్స్ 1,279 పాయింట్లు దూసుకెళ్లి 75వేల స్థాయిపైన 75,500 వద్ద, నిఫ్టీ 396 పాయింట్లు బలపడి 22,968 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. జూన్ 4 తర్వాత స్టాక్ మార్కెట్ భారీ లాభాల్లో దూసుకుపోవచ్చని నిపుణులు భావించారు. అయితే సార్వత్రిక ఎన్నికల ఫలితాల కంటే ముందే సరికొత్త రికార్డులను నమోదు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఆర్‌బీఐ భారీ డివిడెండ్ మరోసారి స్థిరమైన ప్రభుత్వమే ఏర్పడొచ్చన్న అంచనాలు సూచీల పరుగుకు ప్రధాన కారణమని భావిస్తున్నారు.

74,221
క్రితం ముగింపు

గరిష్ట స్థాయి 75,500
ముగింపు 75,418

■ **జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద**

సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.4.28 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.420 లక్షల కోట్లకు చేరింది.

■ **అదానీ గ్రూప్ షేర్లకు డిమాండ్**

అదానీ గ్రూప్‌కు చెందిన ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ బీఎస్‌ఈ సెన్సెక్స్‌లో చోటు దక్కనుండడంతో ఈ గ్రూప్‌లోని తక్కిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మొత్తం గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 17.23 లక్షల కోట్లకు చేరింది.

■ **ఎన్‌ఎస్‌ఈ రికార్డ్**

ఎన్‌ఎస్‌ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ తొలిసారి 5 ట్రిలియన్ డాలర్లను అధిగమించింది. గతేడాది డిసెంబర్‌లో 4 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్ మైలురాయిని అందుకుంది.

■ **మెప్పించిన గో డిజిట్**

ఆన్‌లైన్ వేదికగా బీమా సేవలు అందించే గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ షేరు లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.272)తో పోలిస్తే 3% లాభంతో ప్రీమియంతో రూ.281 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 15% ఎగసి రూ.314 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 12% లాభంతో రూ.306 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.28,043 కోట్లుగా నమోదైంది.

ఐకూ అమ్మకాల్లో ఏపీ, తెలంగాణ హవా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్స్ తయారీలో ఉన్న ఐకూ 2024 జనవరి–మార్చి అమ్మకాల్లో వాటా పరంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తొలి స్థానంలో నిలిచాయి. తెలుగు రాష్ట్రాల్లో వార్షిక వృద్ధి అత్యధికంగా 35 శాతం నమోదైందని ఐకూ సీఈవో నిపుణ్ మార్యా గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. నగరాల వారీగా మార్చి త్రైమాసికం విక్రయాల్లో 28 శాతం వృద్ధితో హైదరాబాద్ నంబర్–1 స్థానం సంపాదించిందన్నారు. 'ప్రస్తుతం మొబైల్ ఫోన్స్‌ను అమెజాన్, ఐకూ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నాం. భవిష్యత్తులో ఆఫ్‌లైన్‌కు విస్తరిస్తాం.' అని వివరించారు.

ఇండిగో లాభం హైజంప్

క్యూ4లో రూ. 1,895 కోట్లు



న్యూఢిల్లీ: ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్–ఇండిగో గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసిక నికర లాభం రెట్టింపై రూ. 1,895 కోట్లకు చేరింది. సామర్థ్య విస్తరణ, ప్రయాణికులు పెరగడం, సానుకూల వాతావరణం ఇందుకు తోడ్పాటునిచ్చాయి. ఇక మొత్తం ఆదాయం సైతం 27 శాతం జంప్‌చేసి రూ. 18,505 కోట్లను అధిగమించింది. పూర్తి ఏడాదికి ఇండిగో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. దాదాపు రూ. 8,173 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2022–23లో రూ. 306 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 71,200 కోట్లకు చేరింది.

ఇండిగో షేరు బీఎస్‌ఈలో 1 శాతం లాభంతో రూ. 4,401 వద్ద ముగిసింది.

ఐటీసీ లాభం ఫ్లాట్

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్ర క్షీణతతో రూ. 5,191 కోట్లకు పరిమితమైంది. వినియోగ డిమాండ్ మందగించడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 5,243 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 7.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక మొత్తం ఆదాయం మాత్రం రూ. 19,058 కోట్ల నుంచి రూ. 19,446 కోట్లకు బలపడింది. ఇతర ఆదాయంతో కలిపి రూ. 20,130 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 3 శాతం పెరిగి రూ. 13,294 కోట్లను తాకాయి. కాగా.. పూర్తి ఏడాదికి ఐటీసీ నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 20,751 కోట్లను దాటింది. 2022–23లో రూ. 19,477 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 76,518 కోట్ల నుంచి రూ. 76,840 కోట్లకు స్వల్పంగా పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్‌ఈలో స్వల్ప లాభంతో రూ. 441 వద్ద ముగిసింది.

విస్తరిస్తున్న సిమెంట్ పరిశ్రమ



శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖౌరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత సిమెంట్ పరిశ్రమ స్థాపిత సామర్థ్యం ప్రస్తుతం 665 మిలియన్ టన్నులు. ఈ రంగం ఏటా 40–50 మిలియన్ టన్నుల సామర్థ్యం నూతనంగా జోడిస్తోందని సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సీఎంఏ) ప్రెసిడెంట్, శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖౌరీ తెలిపారు. సీఎంఏ, సీఐఐ ఆధ్వర్యంలో ఇక్కడి హెచ్ఐసీసీలో గురువారం ప్రారంభమైన 20వ గ్రీన్ సిమెంటెక్ సదస్సు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 2023–24లో దేశవ్యాప్తంగా 430 మిలియన్ టన్నుల సిమెంట్ అమ్ముడైందని చెప్పారు. ప్లాంట్ల వినియోగం ఏటా సగటున 75 శాతం ఉంటోందని పేర్కొన్నారు. ఒక్కో మిలియన్ టన్ను సామర్థ్యం జోడించేందుకు కంపెనీలకు సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడి అవసరమని గ్రీన్ సిమెంటెక్ 2024 చైర్మన్, జేకే సిమెంట్ డిప్యూటీ ఎండీ, సీఈవో మాధవ్ సింఘానియా వెల్లడించారు. సిమెంట్ రవాణాకు ఎలక్ట్రిక్ ట్రక్‌లను దశలవారీగా వినియోగించాలని పరిశ్రమ నిర్ణయించిందని మాధవ్ తెలిపారు. ఇప్పటికే వివిధ కంపెనీలు సుమారు 150 ట్రక్‌లకు ఆర్డర్లు ఇచ్చాయని వెల్లడించారు.

బ్లాక్‌లిస్టులో ఈవీ కంపెనీలు!



- లిస్ట్‌లో హీరో ఎలక్ట్రిక్, ఒకినావా, బెన్లింగ్
- ఫేమ్–2 నిబంధనల ఉల్లంఘన నేపథ్యం

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఉన్న హీరో ఎలక్ట్రిక్, ఒకినావా ఆటోటెక్, బెన్లింగ్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల నుండి బ్లాక్‌లిస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫేమ్–2 పథకం కింద తప్పుగా అందుకున్న సబ్సిడీ ప్రయోజనాలను తిరిగి ఇవ్వడంలో ఈ సంస్థలు విఫలం కావడమే ఇందుకు కారణం. ఈ పథకం కింద నమోదైన వివిధ తయారీ సంస్థలు ఫేమ్–2 మార్గదర్శకాలను ఉల్లంఘించడంపై భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు 2022లో ఫిర్యాదులు అందాయి. ఫేమ్–2 నిబంధన ప్రకారం దేశీయంగా విడిభాగాలను కొనుగోలు చేయకుండా విదేశాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకున్నాయన్నది ఈ ఫిర్యాదుల సారాంశం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-5-2024	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

సాక్షి స్పోర్ట్స్

భారత బాక్సర్లకు చివరి అవకాశం



పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ చివరి టోర్నీ నేటి నుంచి బ్యాంకాక్‌లో జరగనుంది. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారవుతుంది. భారత్ నుంచి పురుషుల విభాగంలో ఏడుగురు బాక్సర్లు (అమిత్ పంఘాల్-51 కేజీలు, సచిన్-57 కేజీలు, అభినాశ్ జమ్వాల్-63.5 కేజీలు, నిశాంత్ దేవ్-71 కేజీలు, అభిమన్యు-80 కేజీలు, సంజీత్-92 కేజీలు, నరేందర్ -ప్లస్ 92 కేజీలు)... మహిళల విభాగంలో ముగ్గురు బాక్సర్లు (జాస్మిన్-57 కేజీలు, అంకుశిత-60 కేజీలు, అరుంధతి-66 కేజీలు) బరిలో ఉన్నారు.

భారత మహిళల జట్టుకు రెండో ఓటమి

యూరోప్ అంచె ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత మహిళల జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఆంట్‌వర్ప్‌లో గురువారం ఆతిథ్య బెల్జియం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 0-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. అర్జెంటీనాతో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 0-5 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది.

'ఫైనల్' వేటలో...

ఓవరాల్‌గా ఆరుసార్లు 200కుపైగా స్కోర్లు... వీటిలో గత ఏడాది వరకు ఉన్న అత్యుత్తమ స్కోరును అధిగమిస్తూ మూడుసార్లు 250కు పైగా పరుగులు... పవర్‌ప్లేలో ఏ జట్టుకూ సాధ్యం కాని విధంగా రెండుసార్లు 100కు పైగా స్కోర్లు... ముగ్గురు ప్రధాన బ్యాటర్లు కలిపి ఏకంగా 106 సిక్సర్లు... ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన ఇది. ఈ జోరులో ప్లే ఆఫ్స్‌కు దూసుకొచ్చిన జట్టు తొలి క్వాలిఫయర్‌లో కాస్త తడబడింది. అయితే ఆరేళ్ల తర్వాత మళ్లీ ఫైనల్ చేరేందుకు ఆ జట్టుకు మరో అవకాశం లభించగా, రాజస్తాన్ రాయల్స్ రూపంలో ఎదురుగా ప్రత్యర్థి ఉంది. నాణ్యమైన బౌలింగ్‌తో రాజస్తాన్ ఎలాంటి ప్రత్యర్థినైనా నిలువరించగలుగుతోంది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య రెండో క్వాలిఫయర్ మ్యాచ్ ఆసక్తి రేపుతోంది.

నేడు ఐపీఎల్ రెండో క్వాలిఫయర్
- రాజస్తాన్‌తో సన్‌రైజర్స్ ఢీ
- గెలిచిన జట్టు తుది పోరుకు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

చెన్నై: ఐపీఎల్–17 సీజన్ తుది పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రత్యర్థిని నిర్ణయించే క్వాలిఫయర్–2 సమరానికి రంగం సిద్ధమైంది. పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన హైదరాబాద్, రాజస్తాన్ జట్ల మధ్య చెపాక్ మైదానంలో ఈ పోరు జరగనుంది. ఈ సీజన్‌లో ఇరు జట్లు తలపడిన ఏకైక మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఒక పరుగు తేడాతో నెగ్గింది. టోర్నీలో దూకుడైన బ్యాటింగ్‌తో హైదరాబాద్ శాసించగా... రాజస్తాన్ విజయాల్లో బౌలింగ్ కీలకంగా నిలిచింది. ఇరు జట్లు తాజా సీజన్‌లో చెన్నై వేదికగా ఒక్కో మ్యాచ్ ఆడాయి. హైదరాబాద్ 134, రాజస్తాన్ 141 పరుగులు మాత్రమే చేసి చెన్నై చేతిలో ఓటమి పాలవడం విశేషం.

మార్క్‌రమ్‌ను ఆడిస్తారా!

కోల్‌కతాతో తొలి క్వాలిఫయర్‌లో హైదరాబాద్ బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. హెడ్ వరుసగా రెండోసారి డకౌట్ కాగా, అభిషేక్ శర్మ కూడా విఫలం కావడం జట్టుపై ప్రభావం చూపింది. క్లాసెన్ మాత్రం తన ఫామ్ కొనసాగించాడు. ఓపెనర్లు లీగ్ మ్యాచ్ తరహాలో తమ జోరును అందిపుచ్చుకుంటే జట్టు మరోసారి భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. ఇతర బ్యాటర్లు రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్ రెడ్డి, అబ్దుల్ సమద్ కూడా సహకరించాల్సి ఉంది. అయితే బ్యాటింగ్‌ను పటిష్టం చేసేందుకు నాలుగో విదేశీ ఆటగాడిగా మార్క్‌రమ్ లేదా గ్లెన్ ఫిలిప్స్‌లలో ఒకరిని రైజర్స్ ఆడించవచ్చు. పెద్దగా ప్రభావం చూపలేని విజయకాంత్ స్థానంలో లెగ్ స్పిన్నర్ మయాంక్ మార్కండేను తీసుకొని 'ఇంపాక్ట్' ద్వారా మరో బ్యాటర్‌ను ఆడించే అవకాశం ఉంది. చెపాక్ పిచ్‌పై షహబాజ్‌తో పాటు మరో స్పిన్నర్ జట్టుకు అవసరం. పేస్ బౌలింగ్‌లో భువనేశ్వర్, కమిన్స్‌లతో పాటు సొంత మైదానంలో ఆడుతున్న నటరాజన్ కీలకం అవుతారు.

మార్పుల్లేకుండా...

రాజస్తాన్ మాత్రం బుధవారం ఆర్‌సీబీని ఓడించిన టీమ్‌లో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చు. స్పిన్‌కు అనుకూలిస్తే ఒక పేసర్‌ను తప్పించి కేశవ్‌ను ఆడించాలని భావిస్తే... జట్టు విదేశీ కూర్పుపై ప్రభావం పడవచ్చు. బౌల్ట్ కీలక బౌలర్ కాగా ఓపెనర్‌గా టామ్ కోలర్ ఖాయం. లోయర్ మిడిలార్డర్‌లో హెట్‌మైర్, పావెల్ మెరుపు బ్యాటింగ్‌ను కోల్పోయి పరిస్థితి రాజస్తాన్ తెచ్చుకోదు. కాబట్టి ఇద్దరు అగ్రశ్రేణి స్పిన్నర్లు అశ్విన్, చహల్ జట్టు భారం మోస్తారు. ముఖ్యంగా ఓనమాలు నేర్చుకున్న మైదానంలో అశ్విన్ చెలరేగితే హైదరాబాద్‌కు కష్టాలు తప్పవు. రాయల్స్ బ్యాటింగ్‌లో కాస్త దూకుడు లోపించింది. ఎలిమినేటర్‌లో కూడా అది కనిపించింది కానీ లక్ష్యం చిన్నది కావడంతో దాని ప్రభావం కనపడలేదు. ముఖ్యంగా సామ్సన్ వరుసగా మూడు మ్యాచ్‌లలో విఫలమయ్యాడు. రియాన్ పరాగ్ మాత్రమే నిలకడగా ఆడుతుండగా, జురేల్ కూడా రాణించడం లేదు.



సామ్సన్, కమిన్స్

తుది జట్ల వివరాలు (అంచనా)

హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, త్రిపాఠి, నితీశ్ రెడ్డి, క్లాసెన్, సమద్, షహబాజ్, భువనేశ్వర్, నటరాజన్, మార్కండే, మార్క్‌రమ్. రాజస్తాన్: సామ్సన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, టామ్ కోలర్, పరాగ్, జురేల్, హెట్‌మైర్, పావెల్, అశ్విన్, బౌల్ట్, అవేశ్ ఖాన్, సందీప్ శర్మ, చహల్.

పిచ్, వాతావరణం

చెన్నైలో వేడి చాలా ఎక్కువగా ఉంది. అయితే సాయంత్రం మంచు ప్రభావం కూడా ఉండటంతో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు. ఈ సీజన్‌లో జరిగిన 7 మ్యాచ్‌లలో 5 సార్లు తర్వాత బ్యాటింగ్ చేసిన జట్టే నెగ్గింది.

19 ఐపీఎల్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లు ముఖాముఖిగా 19 సార్లు తలపడ్డాయి. 10 మ్యాచ్‌ల్లో హైదరాబాద్... 9 మ్యాచ్‌ల్లో రాజస్తాన్ గెలుపొందాయి. ఈ సీజన్‌లో ఈ రెండు జట్లు ఒకసారి పోటీ పడగా సన్‌రైజర్స్ ఒక పరుగు తేడాతో నెగ్గింది. రాజస్తాన్‌పై సన్‌రైజర్స్ అత్యధిక స్కోరు 217, అత్యల్ప స్కోరు 127 కాగా... సన్‌రైజర్స్‌పై రాజస్తాన్ అత్యధిక స్కోరు 220, అత్యల్ప స్కోరు 102.

ప్రీతిస్మిత ప్రపంచ రికార్డు



లిమా (పెరూ): ప్రపంచ యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి ప్రీతిస్మిత భోయ్ మూడు స్వర్ణ పతకాలు సాధించింది. ఈ క్రమంలో క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. మహిళల 40 కేజీల విభాగంలో బరిలోకి దిగిన ఒడిశాకు చెందిన 15 ఏళ్ల ప్రీతిస్మిత మొత్తం 133 కేజీలు (క్లీన్ అండ్ జెర్క్‌లో 76 కేజీలు+స్నాచ్‌లో 57 కేజీలు) బరువెత్తి విజేతగా నిలిచింది. మూడు విభాగాల్లో (క్లీన్ అండ్ జెర్క్+స్నాచ్+టోటల్) వేర్వేరుగా పతకాలు అందించగా... ఈ మూడింటిలోనూ ప్రీతిస్మిత అగ్ర స్థానంలో నిలిచి మూడు పసిడి పతకాలను సొంతం చేసుకుంది. 40 కేజీల విభాగంలోనే పోటీపడ్డ భారత లిఫ్టర్ జోష్నా సబర్ రెండు రజతాలు, ఒక కాంస్యం సాధించింది. 45 కేజీల విభాగంలో పాయల్ ఒక రజతం, రెండు కాంస్యాలు గెలిచింది. పురుషుల 49 కేజీల విభాగంలో బాబూలాల్ రెండు కాంస్య పతకాలు దక్కించుకున్నాడు.

సుమిత్‌కు క్లిష్టమైన 'డ్రా'

ఫ్రెంచ్ ఓపెన్ తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్‌తో 'ఢీ'



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో భారత నంబర్‌వన్, ప్రపంచ 94వ ర్యాంకర్ సుమిత్ నగాల్‌కు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కరెన్ ఖచనోవ్ (రష్యా)తో సుమిత్ ఆడతాడు. గతంలో వీరిద్దరు ముఖాముఖిగా ఒక్కసారి కూడా తలపడలేదు. 6 అడుగుల 6 అంగుళాల ఎత్తు, 87 కేజీల బరువున్న ఖచనోవ్ తన కెరీర్‌లో 6 ఏటీపీ టూర్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గగా... సుమిత్ ఒక్కసారి కూడా ఏటీపీ టూర్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయాడు. మరోవైపు స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు కూడా తొలి రౌండ్‌లో కఠిన ప్రత్యర్థి ఎదురుకానున్నాడు. 14సార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన నాదల్ తొలి రౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో ఆడతాడు. ఫ్రెంచ్ ఓపెన్ ఈనెల 26 నుంచి జరుగుతుంది.

శ్రమించి గెలిచిన సింధు

ప్రపంచ 10వ ర్యాంకర్‌పై అష్మిత విజయం ● డబుల్స్‌లో ముగిసిన భారత్ పోరు



సింధు



అష్మిత

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు, రైజింగ్ స్టార్ అష్మిత చాలిహా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సింధు 21–13, 12–21, 21–14తో ప్రపంచ 34వ ర్యాంకర్ సిమ్ యు జిన్ (దక్షిణ కొరియా)పై కష్టపడి గెలుపొందగా... ప్రపంచ 53వ ర్యాంకర్ అష్మిత 21–19, 16–21, 21–12తో ప్రపంచ 10వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. 2022 ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన అష్మిత మళ్లీ రెండేళ్ల తర్వాత సూపర్–500 టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరడం విశేషం. సిమ్‌తో 59 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సింధు నిలకడలేమితో ఇబ్బంది పడింది. తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గిన సింధు రెండో గేమ్‌లో తడబడింది. రెండుసార్లు వరుసగా ఐదు పాయింట్ల చొప్పున ప్రత్యర్థికి కోల్పోయింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో గాడిలో పడిన సింధు స్కోరు 16–14 వద్ద వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కిరణ్ జార్జి (భారత్) 13–21, 18–21తో లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్‌లో భారత పోరు ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 70 నిమిషాల్లో 18–21, 22–20, 14–21తో సుంగ్ షువో యున్–యు చెయిన్ హుయ్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోగా... రితిక–సిమ్రన్ జంట 17–21, 11–21తో పియర్లీ టాన్–థినా మురళీధరన్ (మలేసియా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జంట 9–21, 15–21తో టాప్ సీడ్ చెన్ టాంగ్ జి–టో ఈ వె (మలేసియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో గరగ కృష్ణప్రసాద్–సాయిప్రతీక్ ద్వయం 11–21, 9–21తో హి జి టింగ్–రెన్ జియాంగ్ యు (చైనా) జోడీ చేతిలో ఓటమి పాలైంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ హాన్ యువె (చైనా)తో సింధు; ఆరో సీడ్ జాంగ్ యి మాన్ (చైనా)తో అష్మిత తలపడతారు.

క్వార్టర్ ఫైనల్లో ఓడిన జ్యోతి సురేఖ



యెచోన్ (దక్షిణ కొరియా): ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్లకు నిరాశ ఎదురైంది. భారత స్టార్స్, ప్రపంచ రెండో ర్యాంకర్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ 12వ ర్యాంకర్ పర్ణీత్ కౌర్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరగ్గా... ప్రపంచ చాంపియన్ అదితి రెండో రౌండ్‌లో, అవనీత్ కౌర్ రెండో రౌండ్‌లో నిష్క్రమించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో జ్యోతి సురేఖ 142–145తో ప్రపంచ మూడో ర్యాంకర్ సారా లోపెజ్ (కొలంబియా) చేతిలో... పర్ణీత్ 138–145తో హాన్ సెంగ్యోన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమి చవిచూశారు. అదితి 142–145తో అలెక్సిస్ రూయిజ్ (అమెరికా) చేతిలో, అవనీత్ 143–145తో ఒ యుహాన్ (కొరియా) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్ సెమీఫైనల్లోకి ప్రవేశించగా... ప్రియాంశ్ మూడో రౌండ్‌లో, అభిషేక్ వర్మ, రజత్ చౌహాన్ రెండో రౌండ్‌లో ఓడిపోయారు.

సెమీస్‌లో యూకీ–ఒలివెట్టి జోడీ



పారిస్: ఓపెన్ పార్క్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 7–6 (7/4)తో సాండర్ అరెండ్స్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ, ఒలివెట్టి జోడీ పది ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. నేడు జరిగే సెమీఫైనల్లో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–వాసెలిన్ (ఫ్రాన్స్)లతో యూకీ, ఒలివెట్టి తలపడతారు.

క్లుప్తంగా...

బీసీ గురుకులాల్లో ప్రవేశాలు ప్రారంభం

సాక్షి, అమరావతి: మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకులాలు(ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్)లో ప్రవేశాలు మొదలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలను ఆ సంస్థ కార్యదర్శి కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25)లో బీసీ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం, ఐదో తరగతి ప్రవేశాలకు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షలను నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలోని 18 ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ జూనియర్ కాలేజీల్లో మొత్తం 2,640 ఇంటర్ మొదటి సంవత్సరం సీట్లు ఉన్నాయని వివరించారు. వాటిలో తొలి దశలో 2,213 సీట్లు భర్తీ చేశామన్నారు. 106 గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి సీట్లు 6,480 ఉన్నాయని, వాటిలో మొదటి విడతలో 5,977 సీట్లు భర్తీ చేసినట్టు వివరించారు. ఖాళీగా ఉన్న సీట్లను కూడా త్వరలో భర్తీ చేస్తామన్నారు.

రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో సీట్లన్నీ భర్తీ



విద్యార్థికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న నరసింహారావు, ఉబేదుల్లా, వైఎస్ఎస్ చౌదరి

గుంటూరు (ఎడ్యుకేషన్): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో నాగార్జున సాగర్‌లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి. ఇటీవల జరిగిన ఏపీఆర్డీసీ సెట్-2024లో అర్హత పొందిన విద్యార్థులకు గురువారం గుంటూరులోని జిల్లా పరీక్షా భవన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించారు. ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి ఆర్.నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన కౌన్సెలింగ్‌లో నాగార్జునసాగర్‌లోని బాలుర డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల వారీగా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 152 సీట్లను ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కోటా ప్రకారం కేటాయించారు. సంస్థ నిర్వహణలో నాగార్జున సాగర్‌లోని ఏకైక డిగ్రీ కళాశాలలో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయినట్టు నరసింహారావు చెప్పారు. కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు సీటు అలాట్‌మెంట్ పత్రాలను అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏపీఆర్డీసీ సెట్-2024 కన్వీనర్ హెచ్ఎండీ ఉబేదుల్లా, సాగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి, లైజనింగ్ అధికారి పీవీ మల్లేశ్వర్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి 'గోరుముద్ద' తినేలా చర్యలు

- వంటకాల తయారీ, ఆరోగ్య ప్రయోజనాలపై వీడియోల రూపకల్పన: ప్రవీణ్‌ప్రకాష్


సాక్షి, అమరావతి: వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం తినేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ డీఈవోలను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం మెనూలోని వంటకాల తయారీపై గురువారం తిరుపతిలోని తాజ్ హోటల్ వంట నిపుణుల సహకారంతో మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ శిక్షణ వీడియోలను రూపొందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న గోరుముద్ద (మధ్యాహ్న భోజన పథకం)లో భాగంగా ప్రతిరోజు మెనూ భిన్నంగా ఉండడంతో రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాల తయారీ, తద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ ఆరు వీడియోలను రూపొందించి గోరుముద్ద యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 44,190 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే 85 వేల మంది వంటవారు ఈ వీడియోలు చూసేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించాలని డీఈవోలను ఆదేశించారు. స్మార్ట్ ఫోన్లు లేని వంటవారికి పాఠశాలల్లోని ఐఎఫ్‌పీ స్క్రీన్లు, స్మార్ట్ టీవీల ద్వారా పాఠశాల సమయం తర్వాత ఈ వీడియోలు ప్రదర్శించి చూపించాలని ఆయన చెప్పారు.

పదో తరగతి రీ వెరిఫికేషన్ ఫలితాలు వెల్లడి

- స్కూల్ లాగిన్‌లో జవాబు పత్రాల కాపీలు

సాక్షి, అమరావతి: పదో తరగతి (2023-24) పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల రీ-వెరిఫికేషన్, రీ-కౌంటింగ్ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ గురువారం ప్రకటించింది. మొత్తం 55,966 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. 43,714 జవాబు పత్రాల ఫలితాలను సంబంధిత పాఠశాల లాగిన్‌లో విడుదల చేశామని, మిగిలిన పత్రాల ఫలితాలను త్వరలో వెల్లడిస్తామని ఆయన ప్రకటించారు. ఈ సంవత్సరం రీ-వెరిఫికేషన్, రీ-కౌంటింగ్ కోసం కొత్తగా ఆన్సర్ స్క్రిప్ట్‌ల డిజిటలైజేషన్ విధానం ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా ఫలితాల కాపీలను పొందవచ్చని సూచించారు.

చారిత్రక విజయానికి ఐదేళ్లు...



- చంద్రబాబు అరాచక పాలనకు 2019, మే 23న ముగింపు పలుకుతూ ప్రజా తీర్పు
- 50 శాతం ఓట్లు.. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ చారిత్రక విజయానికి ఐదేళ్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో 2014-19 మధ్య చంద్రబాబు అరాచక పాలనకు తెరదించుతూ 2019, మే 23న ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారు. 50 శాతం ఓట్లు.. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి గతంలో ఎన్నడూలేనంత ఘన విజయాన్ని అందించారు. 2019, మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లు సుపరిపాలన అందించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి రికార్డు సృష్టించారు. అర్హతే ప్రామాణికంగా వివక్ష చూపకుండా.. లంచాలకు తావు లేకుండా.. అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలోనే రూ.2.70 లక్షల కోట్లను పేదల ఖాతాల్లోకి జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనాన్ని పేదలకు చేకూర్చారు. వాటిని సద్వినియోగం చేసుకున్న పేదలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే.. ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి ఆశీర్వదించాలని సీఎం జగన్ వినమ్రంగా చేసిన విజ్ఞప్తికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు భారీఎత్తున స్పందించారు. ఈనెల 13న జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే.. వైఎస్సార్‌సీపీ మరోసారి అఖండ విజయం సాధించడం ఖాయమని.. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి చిత్తుగా ఓడిపోవడం తథ్యమని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

టీడీపీ దాడులపై చర్యలెందుకు తీసుకోలేదు?

- ఒక్క పాల్వాయి గేట్ వీడియోనే ఎలా లీక్ అయ్యింది?
- అది కూడా చిన్న క్లిప్పింగే ఎలా బయటకు వచ్చింది?
- 7 చోట్ల ఈవీఎంలు ధ్వంసమయ్యాయని ఎన్నికల కమిషనే చెబుతోంది
- ఆ వీడియోలను ఎందుకు రిలీజ్ చేయట్లేదు?
- అమాయక ఓటర్లపై దాడులు చేసిన టీడీపీ గూండాలపై చర్యలకెందుకు వెనుకాడుతున్నారు?
- ఎన్నికల కమిషన్‌కు ప్రశ్నలు సంధించిన సజ్జల



సాక్షి, అమరావతి: అమాయక ఓటర్లపై టీడీపీ గూండాలు చేసిన దాడులకు సాక్ష్యాలున్నా చర్యలెందుకు తీసుకోవట్లేదని ఎన్నికల సంఘాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదికగా గురువారం సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్నికల సంఘానికి ప్రశ్నలు సంధించారు. అలాగే పోలింగ్ రోజున మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ గూండాల అరాచకాలకు సంబంధించిన వీడియోలను ఆయన సామాజిక మాధ్యమం (ఎక్స్)లో పోస్టు చేశారు. 'మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలను ధ్వంసం చేశారని చెబుతున్న పాల్వాయి గేట్ వీడియో నిజమైనదేనని ఎన్నికల సంఘం ప్రకటిస్తుందా? వీడియో సరైనదేనా? కాదా? అనేది నిర్ధారించకుండానే ఈసీ చర్యలకు ఎలా దిగుతుంది? ఒకవేళ నిజమైనదే అయితే ఆ వీడియో సోషల్ మీడియాలోకి ఎలా వచ్చింది? మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజున ఈవీఎంల ధ్వంసానికి సంబంధించి ఏడు ఘటనలు జరిగాయని ఎన్నికల కమిషనే చెబుతోంది. అలాంటప్పుడు కేవలం ఈ ఒక్క వీడియో మాత్రమే ఎలా లీక్ చేశారు? ఈసీకి చిత్తశుద్ధి ఉంటే మొత్తం వీడియోలను.. 7 చోట్ల జరిగిన ఘటనలకు సంబంధించిన పూర్తి వీడియోలను ఎందుకు బయటపెట్టట్లేదు? ఒక చిన్న క్లిప్పింగ్ మాత్రమే బయటకు ఎలా వదిలారు? అన్ని వీడియోలు బయటకు వస్తే అసలేం జరిగిందో తెలుస్తుంది కదా! తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు, వారిని గుర్తించేందుకు ఈసీ ఎందుకు సరైన పద్ధతిలో నిర్ణయాలు తీసుకోవడం లేదు?' అని సజ్జల ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రెండు వీడియోలను పరిశీలిస్తే అమాయక ఓటర్లపై టీడీపీ గూండాలు దాడి చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని సజ్జల చెప్పారు. వారి మీద ఎన్నికల సంఘం చర్యలెందుకు తీసుకోవడం లేదు? దాని వెనుక ఉన్న వారిని ఎందుకు పట్టుకోవడం లేదు? అని నిలదీశారు. టీడీపీ మూకల రిగ్గింగ్‌లపై తాము ఫిర్యాదు చేసిన అన్నిచోట్లకు సంబంధించిన వీడియోలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల అనుమానాలన్నీ నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కు కచ్చితంగా ఉందన్నారు. మాచర్లలో ప్రజాబలమున్న పిన్నెల్లి ఇప్పటికే 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని.. ఐదోసారి కూడా గెలవబోతున్నారని చెప్పారు. ఏదో నలుగురు అధికారులను మేనేజ్ చేసి.. అవసరమైనంత వరకే వీడియోను కట్ చేసి.. దొంగ వీడియోలను లీక్ చేసి.. కేసులు పెట్టినంత మాత్రాన భయపడే వ్యక్తులం కాదన్నారు.

అల్లర్లపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలి

- అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్

సాక్షి,అమరావతి/నరసరావుపేట: మాచర్లలో జరిగిన అల్లర్లపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని నరసరావుపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ అల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. టీడీపీ నేతలు సత్యహరిశ్చంద్రులు అన్నట్లుగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. గురువారం ఆయన తన ప్రసంగంతో కూడిన వీడియోను విడుదల చేశారు. ఎన్నికల హింస, అల్లర్లపై ఈసీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. మాచర్ల నియోజకవర్గంలో అధికారులను మార్చిన తరువాతే దాడులు, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. టీడీపీ అల్లర్లకు పాల్పడేందుకు అవకాశాలున్నాయని పిన్నెల్లి ముందు నుంచి ఈసీకి లేఖలు రాస్తూనే ఉన్నారని గుర్తుచేశారు. మాచర్లలోని పలు ప్రాంతాల్లో రిగ్గింగ్ జరుగుతోందని, ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీకి ఫోన్ చేసినా స్పందించలేదని ఆరోపించారు. టీడీపీ రిగ్గింగ్ చేస్తున్న చోట ఎస్పీ సహకారం అందించారని, టీడీపీ పాల్పడ్డ రిగ్గింగ్ పై ఎస్పీ స్పందించకపోతే స్వయంగా పిన్నెల్లి వెళ్లి అడ్డుకున్నారని గుర్తుచేశారు. పాల్వాయి గేట్ వద్ద పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కొడుకు తల పగులకొట్టినా పోలీసులు స్పందించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల రోజు తొమ్మిది ఈవీఎంలు ధ్వంసం అయితే పిన్నెల్లి వీడియో మాత్రమే ఎందుకు బయటకు వచ్చిందని ప్రశ్నించారు. పిన్నెల్లి వీడియో బయటకు ఎలా వచ్చిందనే దానిపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఒక సామాజికవర్గం అధికారులను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు రిగ్గింగ్ చేశారని, కానీ టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు కృష్ణ దేవరాయలు సుద్ధ పూసలాగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తుమృకోటలో రిగ్గింగ్ జరుగుతోందని తానే ఫోన్ చేసి ఎస్పీకి తెలియచేశానని, టీడీపీవాళ్లు దాడులు చేస్తున్నారని చెప్పినా స్పందించలేదన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడుతున్న ఒప్పిచర్ల, తుమృకోట, పాల్వాయి గేట్, చింతపల్లిలో మాత్రం నామమాత్రంగా పోలీసులను నియమించారని ఆరోపించారు. ఈ గ్రామాల్లో పోలింగ్ బూత్ ల వీడియో ఫుటేజ్ బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

పిన్నెల్లి ఫిర్యాదు పట్టదా?

- ఎస్పీపై ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- ఫుటేజీని పరిశీలిస్తే రిగ్గింగ్ నిజమేనని రుజువవుతుంది
- స్పందించకుంటే న్యాయ పోరాటమే



ఎన్నికల కమిషన్ ప్రధానాధికారికి ఫిర్యాదు అందిస్తున్న కాసు, మల్లాది, అప్పిరెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: ఎన్నికల రోజు ఉదయం నుంచి సాయంత్రం 7గంటల వరకు చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు, రిగ్గింగ్‌పై మాచర్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పలు దఫాలు ఫిర్యాదు చేసినా జిల్లా ఎస్పీ బేఖాతర్ చేశారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను గురువారం కలసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ అరాచకాలు, హింసపై ఈసీ సరైన రీతిలో స్పందించకుంటే హైకోర్టు, సుప్రీం కోర్టు వరకు న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ రోజు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలపై టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయన్నారు. ఈ అరాచకాలపై ఎన్నికల కమిషన్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. టీడీపీ యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడిందని, 60కి పైగా కేంద్రాలలో రీపోలింగ్ నిర్వహించాలని కోరామన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన వారిపై టీడీపీ మూకలు దాడులకు తెగబడటాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా పోలీసులు ఏమాత్రం స్పందించలేదన్నారు. ఎన్నికల ముందు పోలీస్ అధికారులను ఈసీ ఆకస్మికంగా బదిలీ చేయడంతో హింస చెలరేగిందని చెప్పారు. దీనికి బీజేపీ, టీడీపీ, ఈసీ పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. టీడీపీ గూండాలు యథేచ్ఛగా రిగ్గింగ్ చేసినా ఈసీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

బదిలీలతో చెలరేగిన హింస..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి ముందుగానే ఈసీ దృష్టికి తెచ్చామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా తగిన భద్రత కల్పించాలని కోరామన్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో టీడీపీ బరి తెగించి రిగ్గింగ్, దాడులకు తెగబడిందన్నారు. చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిడితో ఈసీ అధికారులను బదిలీ చేసిన చోట్ల హింస చెలరేగిందన్నారు. రిగ్గింగ్, ఓటర్లను బెదిరించడం, బూత్‌ల క్యాప్చరింగ్ తదితరాలపై పోలింగ్ రోజే టీడీపీపై ఈసీకి ఫిర్యాదు చేసినట్లు శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. 16 నియోజకవర్గాలకు సంబంధించి 60 పోలింగ్ బూత్‌లలో రీ పోలింగ్ జరపాలని కోరామన్నారు. రీ పోలింగ్ కోరుతున్న బూత్‌లలో లైవ్ వెబ్ క్యాస్టింగ్ ఫుటేజీని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పాల్వాయి గేట్, తుమృకోట, చింతపల్లి, ఒప్పిచర్ల, జెట్టిపాలెం, వెల్దుర్తిలో టీడీపీ విధ్వంసకాండపై ఈసీకి పోలింగ్ రోజే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహించిందని చెప్పారు. వీడియో ఫుటేజీల ఆధారంగా టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, ఇతర అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నేత శ్రీనివాసరెడ్డి, పానుగంటి చైతన్య పాల్గొన్నారు.

మోహిత్‌రెడ్డి, అంబటిల పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: తమ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్, ఇతర అక్రమాలు జరిగిన నేపథ్యంలో ఓటర్ల రిజిస్టర్ (ఫాం 17)ను తిరిగి తన సమక్షంలో పరిశీలన చేసేలా ఎన్నికల అధికారులను ఆదేశించాలని కోరుతూ చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఎన్నికల విషయంలో ఏ అభ్యంతరాలున్నా ఈసీకి దాఖలు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ ప్రతాప వెంకటజ్యోతిర్మయిల ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. కాగా, సత్తెనపల్లి నియోజకవర్గంలోని నర్నేపాడు, దమ్మాలపాడుల్లోని పోలింగ్‌కేంద్రాల్లో టీడీపీ అక్రమాలకు పాల్పడిందని, వాటిపై చర్యలు తీసుకునేలా ఈసీని ఆదేశించాలని ఎమ్మెల్యే అంబటి రాంబాబు దాఖలు చేసిన వ్యాజ్యాన్నీ హైకోర్టు కొట్టేసింది.

మహిళా పోలీస్‌కే రక్షణ లేదు..

- పోలింగ్ రోజున మహిళా పోలీస్ అనూషపై టీడీపీ నేతల దాడి
- ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురంలో ఘటన
- ఎస్పీని కలవకుండా మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు
- చివరికి కలెక్టర్ ఆదేశాలతో టీడీపీ నేతలపై అట్రాసిటీ కేసు
- రాజీకి ఒప్పుకోలేదని కౌంటర్ కేసూ నమోదు చేశారని బాధితురాలి ఆవేదన



అనూష పై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ మూకలు



అనూష

దర్శి: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన టీడీపీ నాయకులకు వత్తాసు పలకడమే కాకుండా, కేసు నమోదు చేయడంలో పోలీసులు తాత్సారం చేసిన ఉదంతమిది. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురం బూత్ నం.213లో మే 13న మహిళా పోలీస్ కట్టా అనూష బీఎల్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. పోలింగ్ బూత్‌లో టీడీపీ కార్యకర్తలు దొంగ ఓట్లు వేశారనే విషయమై వివాదం చెలరేగింది. ఓటు వేసి ఇంటికి వెళ్లకుండా అక్కడే కూర్చున్న టీడీపీ నాయకులను ఓ కానిస్టేబుల్ వెళ్లిపోవాలని సూచించినా లెక్క చేయలేదు. అదే సమయంలో బీఎల్‌వో కల్పించుకుని మీరంతా ఇక్కడే ఉంటే ఇబ్బంది కలుగుతుందని చెబుతుండగా టీడీపీ నాయకుడు జిల్లెళ్లమూడి రామకృష్ణ, మరో 12 మంది ఒక్కసారిగా రెచ్చిపోయారు. అనూషను అసభ్యకరంగా తిడుతూ జుట్టు పట్టుకుని లాగారు. గొంతు పట్టుకుని కింద పడేసి కొట్టారు. కులం పేరుతో తిడుతూ కాలితో తన్నబోతుండగా అక్కడే ఉన్న కానిస్టేబుల్, బస్ డ్రైవర్ వచ్చి పక్కకు నెట్టినా ఆవేశంతో ఊగిపోయారు.

పట్టించుకున్నవారు లేరు..

తనపై టీడీపీ నేతలు దాడి చేసిన విషయాన్ని మహిళా పోలీస్ అనూష మే 13వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫోన్ చేసి చెప్పగా, దర్శి సీఐ షమీఉల్లాను కలవాలని సూచించారు. ఆ రోజు సీఐ, ఎస్ఐకి విషయం చెప్పినా పట్టించుకోలేదు. 14న ఎస్ఐ సెలవులో ఉన్నారని చెప్పి ఫిర్యాదు తీసుకున్నారు. కానీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. 16న కేసు ఎందుకు కట్టలేదని ఏఎస్ఐని ప్రశ్నించగా ఉన్నతాధికారులను అడగాలని సమాధానమిచ్చారు. కేసు నమోదు చేయాలని అనూష నిలదీయడంతో నిందితులుగా ఉన్న కోటేశ్వరరావు, మరి కొందరిని స్టేషన్‌కు పిలిపించారు. వారు ఏఎస్ఐ ఎదుటే మహిళా పోలీస్‌ను బెదిరించారు. కాగా, మే 17న దర్శి సీఐని కలిశానని, అయితే టీడీపీ నేతలను పిలిపించి రాజీ చేసుకోవాలని ఆయన సలహా ఇచ్చారని, అందుకు తాను అంగీకరించలేదని అనూష చెబుతోంది. అదే రోజు మధ్యాహ్నం ఆమె ఒంగోలులో ఎస్పీని కలిసేందుకు ప్రయత్నించగా.. ఎస్పీ ఉన్నప్పటికీ లేరని చెప్పి వెనక్కు పంపారు. 17న కలెక్టర్ దినేష్‌కుమార్ ఎదుట అనూష తన గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే కేసు నమోదు చేయాలని ఎస్పీ కార్యాలయానికి కలెక్టర్ ఆదేశాలిచ్చారు. దీంతో ముండ్లమూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు 13 మంది టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అదేరోజు బాధితురాలు అనూషపైనా టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం. అట్రాసిటీ కేసుపై దర్శి డీఎస్పీ విచారణ చేపట్టినా ఇప్పటి వరకు ఏమీ చర్యలు తీసుకోలేదు.

నగరి టీడీపీ అభ్యర్థి ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- ఫలితాలు రాకముందే గాలి భానుప్రకాష్‌ను నగరి ఎమ్మెల్యేగా పేర్కొంటూ ఫ్లెక్సీల ఏర్పాటు
- బీఎస్ స్పోర్ట్స్ క్లబ్‌ను ప్రారంభించిన భానుప్రకాష్
- ఎన్నికల అధికారికి మున్సిపల్ చైర్మన్ హరి ఫిర్యాదు



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న హరి బృందం

పుత్తూరు (తిరుపతి జిల్లా): పట్టణ పరిధిలోని చింతలగుంట వద్ద నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ గురువారం ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బీఎస్ స్పోర్ట్స్ క్లబ్‌ను ప్రారంభించారు. తద్వారా ప్రశాంత పుత్తూరు పట్టణంలో అల్లర్లకు తెరతీస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఎ.హరి ఎన్నికల అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హరి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు రాకముందే తాను గెలిచినట్లు, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అంటూ చింతలగుంట, వేదవ్యాస స్కూల్ సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. బీఎస్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకుడు బి.ఎస్.హరి గంజాయి కేసుల్లో నిందితుడని తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ పేరిట యువతకు గంజాయి సరఫరా చేసి. వారిని వ్యసనాల పాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పుత్తూరు పట్టణంలో అల్లర్లను ప్రేరేపిస్తున్న టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, నాయకులు యుగంధర్, డీఎస్ గణేష్, అశోక్, బీఎస్ హరి, షణ్ముగరెడ్డి తదితరులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఈశ్వరాలయం చైర్మన్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- జూన్ 3 వరకు పరీక్షల నిర్వహణ

సాక్షి, అమరావతి: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ఫెయిలైన మొత్తం 1,61,877 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నట్టు పదో తరగతి పరీక్షల విభాగం ప్రకటించింది. వీరిలో 96,938 మంది బాలురు కాగా.. 64,939 మంది బాలికలు ఉన్నారు. శుక్రవారం నుంచి జూన్ 3వ తేదీ వరకు మొత్తం 9 రోజులపాటు జరిగే పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 685 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. పర్యవేక్షణకు 685 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 685 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 6,900 మంది ఇన్విజిలేటర్లతో పాటు 86 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలను 'నో ఫోన్ జోన్'గా ప్రకటించామని, ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని ప్రకటించారు. డీఈవోల ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో పరీక్షలు ముగిసేవరకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షల డైరెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పరీక్షలపై ఎలాంటి సందేహాలున్నా 0866-2974540 నంబర్‌లో సంప్రదించాలని దేవానందరెడ్డి సూచించారు.

పరీక్షల షెడ్యూల్ ఇదీ..

24-5-2024	తెలుగు
25-5-2024	హిందీ
27-5-2024	ఇంగ్లిష్
28-5-2024	లెక్కలు
29-5-2024	ఫిజికల్ సైన్స్
30-5-2024	బయలాజికల్ సైన్స్
31-5-2024	సోషల్ స్టడీస్
01-6-2024	ఓఎస్ఎస్‌సీ పేపర్-1
03-6-2024	ఓఎస్ఎస్‌సీ పేపర్-2

ప్రశాంతంగా ముగిసిన ఈఏపీ సెట్

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీ సెట్-2024 విజయవంతంగా ముగిసినట్టు సెట్ చైర్మన్, జేఎన్‌టీయూ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షకు ఎనిమిదో రోజు (చివరి రోజు) 30,102 మంది విద్యార్థులకుగాను 28,182మంది హాజరైనట్లు తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ప్రవేశపరీక్షలు పూర్తయినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రాథమిక కీని విడుదల చేయడంతో పాటు రెస్పాన్స్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల్లోగా ప్రాథమిక కీపై విద్యార్థులు అభ్యంతరాలు తెలపాలని సూచించారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో శుక్రవారం ప్రాథమిక కీ విడుదల చేస్తామని, 26వ తేదీ ఉదయం 10 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈఏపీ సెట్‌కు 3,62,851 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షలకు 3,39,139 (93.47 శాతం) మంది హాజరైనట్టు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,74,213 మందికి 2,58,373 మంది (94.22 శాతం), అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 88,638 మందికి 80,766 (91.12 శాతం) మంది పరీక్ష రాసినట్లు ఆయన వివరించారు.

కానిస్టేబుల్‌పై పచ్చమూక తీవ్రంగా దాడి

- వజ్రకరూరు మండలంలో ఘటన.. పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ అరాచకం
- పోలీసుకు తీవ్ర గాయాలు
- ఆలస్యంగా వెలుగులోకి..

వజ్రకరూరు/ఉరవకొండ: అక్రమాలకు తెగబడి అయినా ఎన్నికల్లో గెలవాలన్న కుట్రతో అనంతపురం జిల్లాలో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. పోలింగ్ రోజున ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండా (రూపానాయక్‌తాండా)లో అలజడి సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలింగ్ రోజు సాయంత్రం 6గంటల తర్వాత వెంకటాంపల్లి పెద్దతండా పోలింగ్ బూత్ ఎదుట క్యూలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. వారికి స్లిప్పులు అందించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే అక్కడకు చేరుకున్న కొందరు టీడీపీ కార్యకర్తలు తమకూ ఓటు వేసే అవకాశం కల్పించాలని అధికారులతో వాదనకు దిగారు. సమయం ముగిసినందువల్ల కుదరదని అధికారులు చెప్పారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ పాపన్న వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా, టీడీపీ నేతలు అతనిపై కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడగా,, వెంటనే పోలింగ్ కేంద్రం ఆవరణలోని సీసీ కెమెరాను పచ్చమూక ధ్వంసం చేసింది. ఈ గొడవను చిత్రీకరిస్తున్న వీడియోగ్రాఫర్‌పైనా దాడి చేసి కెమెరా లాక్కుంది. గాయపడిన కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం పోలీసు వాహనంలోనే వజ్రకరూరుకు తరలించారు. కానిస్టేబుల్‌పై దాడి ఘటన గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943



మరో జంతర్ మంతర్?

బెంగళూరులోని రేస్‌కోర్సు సర్కిల్‌లో సుందరీకరణ పనులు. ఢిల్లీలో ఉండే జంతర్ మంతర్ తరహా నిర్మాణాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం

న్యూస్‌రీల్

చాముండి బెట్ట మార్గంలో కోతుల బెడద



మైసూరు: నాడశక్తి దేవత చాముండేశ్వరి దర్శనం చేసుకునేందుకు చాముండిబెట్టకు వచ్చే భక్తులకు కోతుల వల్ల మనశ్శాంతి కరువైందనే ఆరోపణలున్నాయి. కోతులు భక్తులను ఇబ్బందులకు గురిచేయడమే కారణం. ఇదే మాదిరిగా ఓ భక్తురాలి బ్యాగ్‌ను కోతి ఎత్తుకెళ్లింది. హాసన్ నుంచి వచ్చిన భక్తుడు చాముండిబెట్ట మెట్లపై తల్లితో కలసి అమ్మవారి దర్శనానికి వెళుతున్నాడు. మెట్ల మార్గంలో పాదం వద్ద చాముండి విగ్రహానికి ఇద్దరూ పూజలు చేస్తుండగా వృద్ధురాలి చేతిలో ఉన్న పర్సును కోతి తీసుకెళ్లి దాంట్లోని ఒక్కో వస్తువును విసిరేసింది. చివరికి మొబైల్‌ఫోన్‌ను పట్టుకుని చెట్లపై తిరుగుతూ ఆడుకుంది. అరటిపండ్లు చూపించినా, ఏమిచ్చినా కోతి మాత్రం లొంగలేదు. సుమారు అర్ధగంట పాటు అవస్థలు పెట్టి చివరికి మొబైల్‌ను కిందకి విసిరేసింది. మొబైల్ దొరికిన ఆనందంలో మహిళ, కొడుకు దర్శనానికి వెళ్లారు. ఇటీవల కాలంలో చాముండిబెట్టలో కోతుల బెడద బాగా పెరిగింది.

హాసన్ ఎంపీ వచ్చేయాలి: నిఖిల్

శివాజీనగర: హాసన్ ఎంపీ ఎక్కడున్నా వచ్చి తనిఖీ ఎదుర్కోవాలని మాజీ సీఎం హెచ్.డీ. కుమారస్వామి తనయుడు, జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ అన్నారు. తన సోదరుడైన ప్రజ్వల్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని సీఎం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం, ఎక్కడ ఉన్నా వచ్చేయాలని కుమారస్వామి సూచించడంపై ఆయన స్పందించారు. హాసన్ ఎంపీ నేరుగా వచ్చి సిట్ దర్యాప్తును ఎదుర్కోవాలని విన్నవించారు. తండ్రి అభిప్రాయమే తనది కూడా అని, ఎంపీ వస్తారనే నిరీక్షణలో ఉన్నట్లు చెప్పారు. కాగా ప్రజ్వల్ పేరును నిఖిల్ ఎక్కడా పలకకపోవడం గమనార్హం.

మహిళ సంసారంలో చిచ్చు

- మాజీ ప్రియుని నిర్వాకం



మైసూరు: మహిళ వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, ఆడియోలను ఇన్‌స్టా లో పోస్ట్ చేసి ఆమెను వేధించి సంసారంలో చిచ్చు పెట్టిన మాజీ ప్రియుని దురాగతమిది. ఈ సంఘటన మైసూరు బన్నిమంటప అలీం నగరలో జరిగింది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైసూరు సైబర్‌పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. బాధిత మహిళ నాయుడు నగరకు చెందిన మహమ్మద్ ఫైజాన్ అనే వ్యక్తితో రెండేళ్ల పాటు సహజీవనం చేసింది. అతని ప్రవర్తన నచ్చకపోవడంతో విడిపోయింది. తరువాత బంధువుల్లో ఒకరిని పెళ్లి చేసుకుని జీవిస్తోంది. మరోవైపు మాజీ ప్రియుడు ఫైజాన్‌కు ఇదంతా నచ్చలేదు. గతంలో తాను తీసిన ఆమె వీడియోలు, ఫోటోలు, ఆడియోలను నకిలీ ఇన్‌స్టా ఖాతాను రూపొందించి పోస్ట్ చేయసాగాడు. ఇవి వైరల్ కావడంతో ఆమె భర్త ఆ మహిళ నుంచి విడిపోయాడు. ఈ పని చేసింది తన మాజీ ప్రియుడేనని ఆమె గుర్తించింది. అతన్ని ప్రశ్నించగా తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే నగ్న ఫోటోలను అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. ఆ ఫోటోలను మహిళ కుటుంబ సభ్యులు, స్నేహితులకు పంపించి పైశాచికంగా ప్రవర్తించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

రూ. 60 కోట్ల కబ్జా భూమి స్వాధీనం

శివాజీనగర: బెంగళూరు బనశంకరి వద్ద బీ.ఎం.కావల్ సర్వే నంబర్ 92లో ఆక్రమణ అయిన సుమారు రూ.60 కోట్ల విలువ చేసే 5 ఎకరాల అటవీ భూమిని ఖాళీ చేయించినట్లు అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె తెలిపారు. గురువారం వికాససౌధలో విలేకరులతో మాట్లాడుతూ అటవీభూముల్లో కబ్జాలను తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో బెంగళూరు బీ.ఎం.కావల్ వ్యాప్తిలో గొట్టిగెరపాళ్య వెంకటప్ప, ఆయన తల్లి తిమ్మక్క అనే వ్యక్తులు 5 ఎకరాల 20 కుంటల అటవీ భూమిని ఆక్రమించుకున్నట్లు తేలిందన్నారు. ఏసీఎఫ్ కోర్టు ఆదేశాల మేరకు ఈ భూమి నుంచి కబ్జాదారులను ఖాళీ చేయించినట్లు చెప్పారు.

ప్రశాంతత ఎండమావేనా?

- తరచూ సంచలనాత్మక ఘటనలు
- బాలికలు, యువతులపై ఘోరాలు
- పెరిగిన డ్రగ్స్, సైబర్ నేరాలు
- గత 4 నెలల్లో మరింత అధికం

ఎవరైనా ప్రశాంతతను కోరుకుంటారు. ప్రభుత్వం, పోలీసులు తమకు భద్రతను కల్పిస్తారని ఆశిస్తారు. కానీ తరచూ ఏదో ఒక జిల్లాలో పెద్ద ఘోరం జరగడం పరిపాటిగా మారింది. హత్యలు, మూకుమ్మడి దాడులు, సైబర్ మోసాలు పెరిగిపోవడం అందరికీ కలవరం కలిగిస్తోంది. శాంతితో కూడిన భద్రమైన సమాజం కావాలని కోరుకోవడం అత్యాశ కాకూడదు.







బెంగళూరులో తరచూ భారీగా పట్టుబడుతున్న డ్రగ్స్

బనశంకరి: హుబ్లీ కాలేజీ ఆవరణలో బీబీఏ విద్యార్థిని నేహా హిరేమఠ హత్య, అదే నగరంలో ఇంట్లోకి చొరబడి యువతి అంజలి హత్య, మైసూరులో సినీ నటి విద్య భర్త చేతిలో హతం కావడం, కొడగులో ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలు వెలువడిన రోజే విద్యార్థినిని గొంతుకోసి చంపడం వంటి దుర్ఘటనలు, బెంగళూరు కెఫెలో బాంబు విస్ఫోటం, తరచూ మతపరమైన సంఘటనలు, మంగళూరు వద్ద కడబలో కాలేజీలో ముగ్గురు అమ్మాయిలపై యాసిడ్ దాడి, బెళగావిలో మహిళను వివస్త్రను చేసి ఊరేగించి దాడి చేయడం, తుమకూరు జిల్లాలో కారులో ముగ్గురిని హత్య చేసి దహనం.. తదితరాలు రాష్ట్రంలో శాంతి భద్రతలపై చర్చనే రేకెత్తిస్తున్నాయి. గత నాలుగు నెలల్లో నేర కార్యకలాపాలు హెచ్చుమీరడం సామాన్య ప్రజలకు గుబులు పుట్టిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించే పరిస్థితి ఏర్పడింది. ఈ నేర కార్యకలాపాల అడ్డుకట్టకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని విపక్షాలు, విశ్రాంత పోలీస్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

3 ఏళ్లుగా నేరాల వృద్ధి

రాష్ట్ర క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎస్‌సీఆర్‌బీ) అందించిన వివరాలు గమనిస్తే రాష్ట్రంలో నేరాల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. గత మూడేళ్లలో హత్యలు, అత్యాచారాలు, పోక్సో కేసులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. అందులోనూ గత నాలుగు నెలల్లో నేరాలు ఇంకా పెచ్చుమీరాయి. డ్రగ్స్ మాఫియా కేసులు సైతం ఎక్కువయ్యాయి. బాలికలపై లైంగిక దాడులు, వేధింపులు, దౌర్జన్యాలు, సైబర్ మోసాలూ అదే బాటలో ఉన్నాయి.

నేరాలంటే భయపడేలా ఉండాలి

విశ్రాంత డీజీపీ డాక్టర్ డీవీ.గురుప్రసాద్ దీనిపై స్పందిస్తూ నేరాల నియంత్రణకు పోలీసులు ప్రాధాన్యత ఇవ్వాలి గస్తీ వ్యవస్థ మరింత పటిష్టం చేయాలి. నేర కార్యకలాపాల పట్ల ప్రజల్లో జాగృతం చేయాలి. పోలీసులు యూనిఫాంలో తిరుగుతూ కనిపిస్తే దుండగులు నేరాలకు పాల్పడటానికి భయపడతారు. నేరస్తులకు పోలీసులు అంటే భయం కలిగించేలా ఉండాలి. సీసీ కెమెరాలను అధికంగా అమర్చాలి. 100 నేరాలు జరిగితే 45 కేసుల్లో మాత్రమే నిందితులను కనిపెడుతున్నారు. నేర నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు.



విద్యార్థిని నేహా హిరేమఠ హత్యకు వ్యతిరేకంగా హుబ్లీలో సాగిన ఆందోళనలు

3 వేలకు పైగా హత్యలు

- 2022 నుంచి 2024 ఏప్రిల్ వరకు రాష్ట్రంలో 3,095 హత్యలు సంభవించాయి. అందులోను బెంగళూరులో చాలా ఎక్కువ. దేశంలో ఢిల్లీ తరువాత సిలికాన్ సిటీలోనే ఎక్కువగా హత్యలు జరుగుతున్నట్లు జాతీయ నేర గణాంక సంస్థ ప్రకటించింది. పచ్చని ఉద్యాననగరిలో నెత్తుటి చారికలు కనిపిస్తున్నాయి.
- రాష్ట్రంలో 2024 ఏప్రిల్ వరకు నాలుగు నెలల్లో 430 హత్యలు జరిగాయి.
- మూడేళ్లలో 8310 బాలికలపై లైంగిక వేధింపులు జరిగి ఆ మేరకు పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇదే అవధిలో 1,344 అత్యాచారాలు నమోదయ్యాయి.
- 2024లో నాలుగు నెలల్లో 1,262 మంది పిల్లలపై లైంగిక వేధింపులు, 198 అత్యాచార కేసులు వెలుగుచూశాయి.



మోసకారి ఏటీఎం?

- రూ 5 వేలు విత్ డ్రా చేస్తే 4040 మాత్రమే రాక



డబ్బులు లెక్క పెడుతున్న యువతి

దొడ్డబళ్లాపురం: చాలా మంది ఏటీఎంలో డబ్బులు డ్రా చేశాక కరెక్టుగా ఉంటాయి కదా అని లెక్కపెట్టుకోరు. ఏటీఎం మీద అంత నమ్మకం మనకు. కానీ అలా లెక్కపెట్టుకోకుంటే మోసపోయే ప్రమాదం ఉంది. విత్‌డ్రా చేసిన డబ్బు కంటే తక్కువ వచ్చిన సంఘటన రామనగరలో వెలుగు చూసింది. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేసే సుమ అనే యువతి రామనగర కేఎస్ ఆర్టీసీ బస్టాండులో ఉన్న ఇండియా ఏటీఎంలో రూ.5 వేలు విత్ డ్రా చేసింది. కానీ ఏటీఎంలో వచ్చింది మాత్రం రూ.4040. రూ.960 తక్కువ వచ్చింది. దీంతో సుమ అక్కడే ఉన్న కేఎస్ ఆర్టీసీ సిబ్బందికి చెప్పగా వారు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేసారు. ఇది దగాకోరు ఏటీఎం అని పలువురు కామెంట్లు చేశారు.

సీఏలలో భారత్ అగ్రస్థానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బనశంకరి: ప్రపంచంలో చార్టెర్డ్ అకౌంటెంట్స్ లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. జూన్ 27 నుంచి 29 వరకు జాతీయ స్టార్టప్‌ల సమావేశం బెంగళూరులో నిర్వహిస్తామని చెప్పారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండువందల మంది స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో పాటు పదివేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. దేశంలో 4 లక్షల మంది సీఏలు ఉన్నారని, 9 లక్షల మంది విద్యార్థులు సీఏ కోర్సు చేస్తున్నారని, ప్రపంచంలో ఏ దేశంలో ఇంతమంది సీఏలు లేరని చెప్పారు. ఈ సమావేశంలో సీఏ దీరజ్‌కుమార్ ఖండేవాల, సీఏ అభయ్‌కుమార్, సీఏ ప్రమోద్‌హెగ్డే, కోదాశ్రీనివాస్, సీఏ గీత, సీఏ కవిత పాల్గొన్నారు.





సన్మార్గమే శరణ్యం వేల ఏళ్ల కిందట బుద్ధుడు ప్రవచించిన బోధనలు నేడు మరింత ఆవశ్యకమయ్యాయి. బుద్ధ పూర్ణిమ సందర్భంగా గురువారం బెంగళూరు మహాబోధి సొసైటీలో సాగిన వేడుకలు, పాల్గొన్న భక్తులు

ముగ్గురు అధికారుల సస్పెండ్

- సాలుండి కలుషిత నీటి ఘటనలో సీఎం చర్యలు



గ్యాస్ లీకైన ఇంటిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

మైసూరు/ శివాజీనగర: జిల్లాలోని కె.సాలుండి గ్రామంలో కలుషిత నీరు తాగి యువకుడి మరణించడంతో పాటు 48 మంది ఆస్పత్రిపాలైన దుర్ఘటనలో ముగ్గురు పంచాయతీ అధికారులను బాధ్యులను చేసినట్లు సీఎం సిద్ధరామయ్య తెలిపారు. గురువారం సాయంత్రం మైసూరుకు చేరుకున్నారు. కలెక్టర్ నివేదిక ఆధారంగా ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కె.సాలుండి గ్రామంలో కలుషిత నీరు సరఫరా అయిందని, అధికారులు తనిఖీ చేయలేదని తెలిపారు. సాలుండికి వెళ్లి, మరణించిన యువకుని కుటుంబ సభ్యులను కలుసుకుని ఓదార్చారు. ఆ తర్వాత మైసూరులోని యరగనహళ్లికి వచ్చి అక్కడ గ్యాస్ లీకేజీ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన ఇంటిని పరిశీలించారు. మృతుల బంధువులను పరామర్శించారు. మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయంపై సమీక్ష

రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, రసాయనిక ఎరువులను, రుణ వసతిని సక్రమంగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం సిద్ధరామయ్య ఆదేశించారు. బెంగళూరులో నివాస కార్యాలయం కృష్ణాలో వ్యవసాయం గురించి కలెక్టర్లు, జడ్పీ సీఈఓలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. సుదీర్ఘమైన ఎన్నికల కోడ్ వల్ల పరిపాలనకు ఇబ్బంది కలిగిందన్నారు. అయినప్పటికీ అత్యవసర పనులపై దృష్టి సారించాలని, ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కోడ్ అయిపోగానే అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు.

భవాని కారు డ్రైవర్ పరారీ

బనశంకరి: మహిళపై వేధింపులు, కిడ్నాప్ కేసులో మాజీ మంత్రి హెచ్‌డీ.రేవణ్ణ సతీమణి భవానీకి సిట్ అధికారులు నోటీస్ ఇచ్చినప్పటికీ ఆమె విచారణకు హాజరు కావడం లేదు. భవానీకి రెండు నోటీసులు జారీచేశారు. అనారోగ్యం నెపంతో ఆమె ముఖం చాటేశారు. మరోపక్క భవానీ కారు డ్రైవరు అజిత్ కూడా అదృశ్యమయ్యాడు. ఇక పోలీసులు హొళెనరసిపురలో అజిత్ నివాసానికి వెళ్లి సమన్లు అంటించారు.

ఆలయాల్లో రేవణ్ణ పూజలు

యశవంతపుర: కిడ్నాప్ కేసులో జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలైన జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ ఆలయాల చుట్టూ తిరుగుతున్నారు. గురువారం కలబురిగి జిల్లా అఫజలపుర తాలూకా గాణగాపురలో ప్రఖ్యాత దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో పూజలు చేశారు.

ఎమ్మెల్యే మాజీ పీఏ వసూళ్లపర్వం

యశవంతపుర: ప్రభుత్వ ఉద్యోగాలు, కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అజయ్‌సింగ్ మాజీ పీఏని కలబురగి పోలీసులు అరెస్ట్ చేశారు. పరశురామ్ జీవర్గి నిందితుడు, ఇతడు అజయ్‌సింగ్ వద్ద గతంలో పీఏగా పనిచేశాడు, ఆ సమయంలో ఉద్యోగాలు, కాంట్రాక్టర్లకు పనులు ఇప్పిస్తానని నమ్మించి రూ.14.90 లక్షలు వసూలు చేశాడు. కిరణ్ అనే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పరశురామ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి ప్రశ్నించగా పలు మోసాలు బయటపడ్డాయి. 39 మంది నుంచి సుమారు రూ.1.50 కోట్లను వసూలు చేసినట్లు చెప్పాడు. బాధితులు ప్రశ్నించడంతో నిందితుడు బెంగళూరులో లాడ్జిలోకి మకాం మార్చాడు. కలబురగి పోలీసులు గాలించి పట్టుకున్నారు.

ఫ్యాక్టరీలో పేలుడు, ఇద్దరు కార్మికుల మృతి

దొడ్డబళ్లాపురం: స్టీల్ కంపెనీలో గ్యాస్ పేలుడు జరిగి ఇద్దరు కార్మికులు మృతిచెందిన సంఘటన నెలమంగల తాలూకా దాబస్‌పేట పారిశ్రామికవాడలో జరిగింది. బిహార్‌కు చెంది అశోక్‌కుమార్ (49), ఒడిశాకు చెందిన ముఖేశ్ కుమార్ (33) మృతులు. 17వ తేదీన దాబస్‌పేట పారిశ్రామికవాడలో ఉన్న ఎస్‌కే స్టీల్ ఫ్యాక్టరీలో మెటల్ గ్యాస్ పేలుడు సంభవించి అశోక్ కుమార్,ముఖేశ్ కుమార్, సునీల్ అనేవారు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరూ గురువారం ఉదయం మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కంపెనీ సూపర్‌వైజర్ పప్పు యాదవ్, యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేసారు.

సరిహద్దుల్లో అతిసారం

రొళ్ల: కర్ణాటక – ఆంధ్ర సరిహద్దుల్లో మరో భారీ నీటి కాలుష్య సంఘటన జరిగింది. మండల పరిధిలోని కాకి గ్రామంలో అతిసారం వ్యాపించింది. సుమారు 30 మందికి పైగా వాంతులు, విరేచనాలతో రొళ్ల, మడకశి, శిర, మధుగిరిలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వర్షాలకు నీళ్ల కలుషితం కావడంతో పాటు వాతావరణం మార్పు వల్ల అతిసారం వ్యాపించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గురువారం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగుల నుంచి నమూనాలను సేకరించినట్లు వైద్యురాలు మాధుర్య తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలతో కూడిన పోషక భోజనం చేయాలని, పరిశుభ్రమైన నీరు తాగాలన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

దొంగ భయమా.. స్వామి మహత్తా?

- ఆలయంలో దోచుకెళ్లిన నగలు
- వారం తరువాత ప్రత్యక్షం



ఆలయంలో వదిలివెళ్లిన నగలు, సామగ్రి



ప్రాచీన ఐరావతేశ్వరస్వామి ఆలయం

క్రిష్ణగిరి: వారం రోజుల క్రితం గుర్తుతెలియని దుండగులు పురాతన ఆలయంలో దోచుకెళ్లిన 300 కిలోల వెండి నగలు, సామగ్రి మళ్లీ ఆలయంలో ప్రత్యక్షమైంది. సినిమాల్లో మాదిరిగా ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు బేరికె సమీపంలోని అత్తిముగం గ్రామంలో చారిత్రక ప్రసిద్ధి పొందిన ఐరావతేశ్వర స్వామి ఆలయం ఉంది. వారం రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు చొరబడి 300 కిలోల వెండి నగలు, సొత్తును దోచుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు బేరికె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దొంగల కోసం గాలింపు చేపట్టారు. ఈ తరుణంలో బుధవారం సాయంత్రం ఆ నగలను మళ్లీ ఆలయంలోనే పడేసి వెళ్లారు. దొరికిపోతామనే భయంతోనే పడేసి ఉంటారని కొందరు, స్వామి మహత్తుకు దొంగలు బెదిరిపోయారని మరికొందరు వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా

వైభవంగా తాయమ్మ దేవి ఉత్సవాలు



దేవికి స్వామీజీల పూజలు, హోమం నిర్వహిస్తున్న భక్తులు

రాయచూరు రూరల్: నగరంలో తాయమ్మ దేవి ఆలయ జీర్ణోద్ధరణ ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. గురువారం అంబేడ్కర్ నగర్‌లో భక్తుల సమక్షంలో మఠాధిపతులు శాంత మల్ల, సోమ శంభునాథ స్వామీజీలు జీర్ణోద్ధరణ ఉత్సవాలకు పూజలు చేశారు. వెంకటేష్, మల్లేష్, శివకుమార్, శంకర్, రాఘవేంద్ర, అనిల్, తేజుకుమార్, బసవరాజ్, నరసింహులు, బ్రహ్మేంద్ర, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

బోధనపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అరుణ

రాయచూరు రూరల్: జిల్లాలో విద్యార్థులకు పాఠాలు బోధించే పద్ధతులపై ఉపాధ్యాయులకు తగిన అవగాహన అవసరమని హిందీ అధ్యాపకురాలు అరుణ హిరేమఠ్ వెల్లడించారు. గురువారం భారతీయ వైద్య సంఘం సభాంగణంలో ఏబీవీపీఎస్‌ఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధనా పద్ధతులను అనుసరించాలని అన్నారు. ఈ సందర్భంగా మల్లనగౌడ, చెన్నబసవ, సరోజ తదితరులున్నారు.

రింగ్ రోడ్లను నిర్మించండి



మంత్రి సతీష్ జార్కిహోళికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మారెప్ప

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని రాయచూరు నగరంలో రింగ్ రోడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యతను ఇవ్వాలని ప్రజాపనుల శాఖా మంత్రి సతీష్ జార్కిహోళికి కాంగ్రెస్ పార్టీ వెనుకబడిన వర్గాల విభాగం ప్రధాన కార్యదర్శి టి.మారెప్ప విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం బెంగళూరులో మంత్రిని కలిసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మనవి చేశారు. కళ్యాణ కర్ణాటకలో రాయచూరు జిల్లా అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ.1500 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు.

మండలి ఎన్నికల్లో ఆశీర్వదించండి



మాట్లాడుతున్న శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జూన్ 3న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ సూచించారు. ఆయన గురువారం నగరంలో పార్టీ కార్యకర్తలతో కలిసి అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ తరపున ఏర్పాటు చేసిన సమావేశంలో ఓటర్లను అభ్యర్థించి మాట్లాడారు. 60 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పేదలను పట్టించుకోలేదన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధి మండలిని ఏర్పాటు చేశామన్నారు. తమ పార్టీ అభ్యర్థిని ఓటర్లు ఆశీర్వదించాలని కోరారు.

వడకరాయ రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

హొసపేటె: నగరంలో వెలిసిన పురాతన వడకరాయ దేవస్థానం రథోత్సవం గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు నెరవేర్చారు. సాయంత్రం రథం లాగారు. నగరంలో వివిధ వార్డులలో పాటు చుట్టుపక్కల ప్రదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవాన్ని ఆలయం నుంచి ప్రారంభించి పాదగట్ట ఆంజనేయ దేవస్థానం వరకు నిర్వహించారు.

రాజుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

- రసకందాయంలో త్రిముఖ పోరు
- బీజేపీ నుంచి అమరనాథ్ పాటిల్
- కాంగ్రెస్ తరపున చంద్రశేఖర్ పాటిల్
- స్వతంత్ర అభ్యర్థిగా నారా ప్రతాప్‌రెడ్డి



అమరనాథ్‌పాటిల్



నారా ప్రతాప్‌రెడ్డి



చంద్రశేఖర్‌పాటిల్

సాక్షి,బళ్లారి: కర్ణాటకలోని 28 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు ఈనెల 7న ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంది. విధాన పరిషత్ ఎన్నికల పోలింగ్ వచ్చే నెల 3న జరగనున్న నేపథ్యంలో ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతోంది. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గ విధాన పరిషత్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. బీజేపీ తరపున అమరనాథ్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ తరపున చంద్రశేఖర్ పాటిల్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థిగా బళ్లారికి చెందిన నారా ప్రతాప్‌రెడ్డి బరిలో నిలవడంతో రాష్ట్రంలో అందరి దృష్టి ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంపై పడింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడుతున్న తరుణంలో ఒక రోజు ముందుగా ఈశాన్య పట్టభద్ర నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. నెల రోజులకు పైగా ఉమ్మడి బళ్లారి జిల్లాతో పాటు ఈ ప్రాంతంలో లోక్‌సభ ఎన్నికల వేడితో నేతలు, కార్యకర్తలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈశాన్య పట్టభద్ర నియోజకవర్గ పరిధిలో ఉమ్మడి బళ్లారి జిల్లాతో పాటు రాయచూరు, కొప్పళ, యాదగిరి, కలబుర్గి, బీదర్ జిల్లాల పరిధిలో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

హోరాహోరీగా ప్రచారం

ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని నేతలు పట్టభద్రులను కలుసుకునేందుకు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఆయా ఏడు జిల్లాలకు చెందిన ఇంచార్జి మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు చంద్రశేఖర్ పాటిల్ తరపున ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ తరపున బరిలో ఉన్న అమరనాథ్ పాటిల్ తరపున బీజేపీ లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు విస్తృతంగా ఓటర్లను కలుస్తూ ప్రచారం చేస్తున్నారు. కేంద్రంలో మోదీ హ్యాట్రిక్ ప్రధాని కాబోతున్నారని, ఈశాన్య పట్టభద్ర నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కలియతిరుగుతున్నారు. ఈశాన్య పట్టభద్ర నియోజకవర్గ పరిధిలో ఉమ్మడి బళ్లారి జిల్లాలో ఎక్కువ మంది పట్టభద్రులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో బళ్లారి జిల్లాలో 22156, మంది, విజయనగరలో 16999 మంది, రాయచూరు జిల్లాలో 19716 మంది, కొప్పళలో 13405 మంది, యాదగిరిలో 14650 మంది, కలబుర్గిలో 25991 మంది, బీదర్ జిల్లాలో 25,990 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. వీరితో పాటు వేలాది మంది పట్టభద్రులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు విముఖత వ్యక్తం చేశారని తెలుస్తోంది.

ఓటర్ల వద్దకే వెళ్లి ప్రసన్నానికి యత్నం

పట్టభద్రులు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పెద్ద సంఖ్యలో ఉండటంతో వారిని గుర్తించి నేతలు వారి వద్దకే వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలో దాదాపు 40 వేల మంది పట్టభద్ర ఓటర్లు ఉండటంతో వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. గత ఈశాన్య పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన నారా ప్రతాప్‌రెడ్డి ఈసారి కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే కాంగ్రెస్ పార్టీ చంద్రశేఖర్ పాటిల్‌ను బరిలోకి దింపడటంతో నారా ప్రతాప్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగి అన్నీ తానై ప్రచారంలో దూసుకెళుతున్నారు. గత ఎన్నికల్లో ఏడు జిల్లాల్లో ముమ్మరంగా తిరిగి ఓటర్లను కలుసుకుని విస్తృతంగా ప్రచారం చేశారు. అన్ని జిల్లాల పట్టభద్రులతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ సారి తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం అందుబాటులో ఉంటానంటూ నమ్మకం కలిగిస్తున్నారు. ఉమ్మడి బళ్లారి జిల్లా పట్టభద్రులకు నారా ప్రతాప్‌రెడ్డి స్థానికుడు కావడంతో ఇక్కడ ఓటర్లు ఆయన వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నారా ప్రతాప్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

ప్రచారానికి గ్రూపుల ఏర్పాటు

పట్టభద్రులను కలుసుకునేందుకు గ్రూపులు ఏర్పాటు చేసి మద్దతు కోరుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, అభివృద్ధి తమ ద్వారానే సాధ్యం అవుతుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, కేంద్రంలో మోదీ అభివృద్ధి పథకాలే తమను గెలిపిస్తాయని బీజేపీ అభ్యర్థి ఆశల పల్లకీలో ఉండగా, వీరిద్దరూ ఎన్నికల్లో మాత్రమే కనిపిస్తారని, ఆ తర్వాత మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు కనబడరని, పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు తాను అందుబాటులో ఉంటానంటూ స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి ప్రధాన పార్టీల అభ్యర్థులందరికీ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఎక్కడెక్కడ పట్టభద్రులు ఉన్నారో వారిని వెతికివెతికి వారి దగ్గరకు వెళ్లి ప్రచారం చేస్తూ సభలు, సమావేశాలు పెట్టి తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈశాన్య పట్టభద్రుల ఎన్నికలకు మరో 10 రోజులే గడువు ఉండటంతో ఏడు జిల్లాల్లో ఆయా ఓటర్లను కలుసుకునేందుకు విస్తృతంగా తిరుగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసినా విధాన పరిషత్ ఎన్నికల వేడి కొనసాగుతూనే ఉంది. ఏదేమైనా లోక్‌సభ ఓట్ల లెక్కింపు వరకు ఈ ప్రాంతంలో ఎన్నికల వేడి రగులుతుందని చెప్పవచ్చు.

కడుపుబ్బ నవ్వించిన నాటిక



నాటికలోని యమలోక సన్నివేశం

బళ్లారిటౌన్: రాఘవ కళా మందిరంలో బుధవారం రాత్రి రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కనుగోలు తిమ్మప్ప 24వ వార్షిక వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రదర్శించిన జీఆర్ వెంకటేశ్వర్లు రచించిన అంతా అయోమయం నాటిక కడుపుబ్బ నవ్వించింది. నాటికలో జీఆర్ వెంకటేశ్వర్లు యమధర్మరాజుగా, నేతి రఘురాం చిత్రగుప్తుడిగా, యమకింకరులుగా గురుశాంత, మురళీమోహన్, కనుగోలు తిమ్మప్పగా కే.చెన్నప్ప, వైద్యుడిగా కే.నాగభూషన్, కాంపౌండర్‌గా రామచంద్ర, పాపులుగా రామాంజినేయులు, వెంకటేషు పాత్రలు పోషించి నవ్వులను పండించారు. అంతకు ముందు రాఘవ మెమోరియల్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ కనుగోలు తిమ్మప్ప నాటక రంగాన్ని ఎంతో ప్రోత్సహించారని కొనియాడారు. అంతేగాక నగర అభివృద్ధి కోసం ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు కే.చెన్నప్ప, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌గౌడ పాటిల్, ఎం.రామాంజినేయలు, కే.రామాంజినేయులు, కే.కృష్ణ, టిజి.విఠల్, జీ.ప్రభాకర్, గాదెం గోపాలకృష్ణ, శ్యాం సుందర్, పంపనగౌడ, రమేష్‌గోపాల్, అనిల్‌బాబు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్‌పై దాడికి తీవ్ర ఖండన




ఆందోళన చేస్తున్న ఫోటోగ్రాఫర్ల సంఘం సభ్యులు

హుబ్లీ: బెంగళూరులోని శివాజీనగర్‌లో ఈ నెల 18న కళ్యాణ మంటపంలో కొందరు పోకిరీలు పెళ్లి వేడుక ఛాయాచిత్రాలు తీస్తున్న ఫోటోగ్రాఫర్‌పై దాడి చేయడమే కాకుండా అసభ్యంగా నిందించడాన్ని నిరసిస్తూ గురువారం తాలూకా మినీ విధానసౌధ ఎదుట హుబ్లీ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం సభ్యులు ఆందోళన నిర్వహించి హుబ్లీ టౌన్ తహసీల్దార్ కలగౌడ పాటిల్ ద్వారా సీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షులు కిరణ్ బాకళె మాట్లాడుతూ పెళ్లి వేడుకను వీడియో తీస్తున్న వీడియోగ్రాఫర్‌పై దాడి చేయడం ఖండనీయం అన్నారు. అంతేగాక దుండగులు కెమెరా తదితరాలను నాశనం చేశారన్నారు. ఉపాధి కోసం శ్రమిస్తున్న ఫోటో, వీడియోగ్రాఫర్లపై దారుణంగా దాడి చేయడం అమానుషం అన్నారు. ఈ ఘటనలో వీడియో, ఫోటోగ్రాఫర్లకు రక్షణ లేదని రుజువు చేసిందన్నారు. ఈ ఘటనతో సంబంధిత కుటుంబాలు ఎంతో ఆవేదనకు గురయ్యాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని కళ్యాణ మంటపాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అంతేగాక ఫోటోగ్రాఫర్లందరిని ప్రభుత్వ వివిధ సంక్షేమ కార్యక్రమాల పరిధిలోకి తెచ్చి తగిన విధంగా ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు దినేష్ దవాడే, కార్యదర్శి రవీంద్ర కాటిగర, కోశాధికారి అనిల్ తరమరి, సభ్యులు వినాయక సఫరె, ప్రవీణ్ అనగి, శంకర్ మిస్కిన్, ఆనంద్ రాజోళ్లి, విజయ్, ప్రకాష్, కృష్ణ పూజారి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి బోల్తా



ఘటనా స్థలంలో బోల్తా పడి ఉన్న బైక్



కిందపడ్డ మృతుడు, గాయపడ్డ వ్యక్తులు

- స్థలంలోనే చోదకుడు మృతి

హొసపేటె: అతివేగంగా వస్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో పక్కనే ఉన్న తుంగభద్ర రిజర్వాయర్‌లోకి పడిపోవడంతో బైక్‌చోదకుడు స్థలంలోనే మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. వివరాలు..బెంగళూరుకు చెందిన జగదీశ్(28), శశాంక్ పాటిల్ అనే ఇద్దరూ కలిసి బెంగళూరు నుంచి ఇలకల్ వైపునకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో నగర శివార్లలోని జాతీయ రహదారిపై గుండా అటవీ ప్రాంత సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బైక్ నడుపుతున్న జగదీశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థలంలోనే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చొన్న శశాంక్ పాటిల్ కూడా తీవ్రంగా గాయపడటంతో నగరంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఘటనా స్థలిని సందర్శించి జగదీష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మరియమ్మనహళ్లి పోలీసులు తెలిపారు.

ఆత్మసాక్షితో పాఠాలు బోధించాలి

హుబ్లీ: ఉత్తమ ఫలితాలు మన అందరి ఆత్మావలోకనం అని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఆత్మసాక్షితో విధులు నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ అడిషనల్ కమిషనర్ జయశ్రీ సింత్రి తెలిపారు. ధార్వాడలోని పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హుబ్లీ బీవీబీ సంస్థ బయోటెక్ హాల్ ఏర్పాటు చేసిన 10వ తరగతి ఫలితాల విశ్లేషణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చదవడం, రాయడం, లెక్కలు రాని వారికి నేర్పించడం సవాలుతో కూడిన పని అన్నారు. కన్నడ, ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఫెయిలైన కారణాలు తెలుసుకోవాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేరే విద్యార్థులకు రాయడం, చదవడం వంటి ప్రక్రియలను ప్రారంభం నుంచే చేపట్టాలన్నారు. నోడల్ అధికారులు ఆయా పాఠశాలలను సందర్శించి విద్యా నాణ్యత మెరుగుదలకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి నెల బీఈఓలో సదరు విద్యార్థుల ప్రగతిని పరిశీలించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల హాజరు ప్రమాణం పెంచాలన్నారు. డీడీపీఐ ఎస్ఎస్ కేళదిమఠ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ప్రతి విద్యార్థుల ఫలితాల మెరుగుదలకు తీసుకున్న చర్యలను విశ్లేషించి ఆ మేరకు నివేదిక సమర్పించాలన్నారు. రాబోయే రోజుల్లో పరీక్ష పద్ధతులు మరింత కఠినంగా ఉంటాయన్నారు. హెచ్చరికతో విధులు నిర్వర్తించాలని, సహ ఉపాధ్యాయులకు బాధ్యతలను పంచి ఫలితాల మెరుగుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఎస్ఎం ఉడేదమని, రవికుమార్ బారటక్కే, ఆర్ఆర్ సదలిగి, అశోక్ సింధగి, ఉమేష్ బొమ్మక్కనవరతో పాటు 482 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శభాష్ పోలీసమ్మా..!

- దోపిడీ దొంగలను వెంటాడి బంధించిన వైనం
- మహిళా ఎస్ఐ ధైర్యాన్ని ప్రశంసించిన ఎస్పీ

హుబ్లీ: ఓ బైక్ చోదకుడిని అడ్డగించి మొబైల్‌తో పాటు అతడి వద్ద ఉన్న వివిధ వస్తువులను దోచుకొని పరారవుతున్న ఇద్దరు దోపిడీ దొంగలను సినిమా ఫక్కీలో వెంటాడి పట్టుకున్న ఘటన గురువారం ధార్వాడలో చోటు చేసుకుంది. ధార్వాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రేణుకా ఐరాణి సారథ్యంలో నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ రేణుకా ఐరాణి పని తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. అళ్నావర రోడ్డులోని మండిహాళ గ్రామం వద్ద నలుగురు దోపిడీ దొంగలు బైక్ చోదకుడిని అడ్డగించి అతడి వద్ద నుంచి మొబైల్, నగదును దోచుకొని పరారయ్యారు. ఈ ఘటనపై స్థానికులు తక్షణమే ఎస్ఐ రేణుకా ఐరాణికి ఫోన్ చేసి తెలియజేశారు. స్పందించిన ఆమె తన సొంత కారులో దోపిడీ దొంగలను వెంటాడి వారిని అరెస్ట్ చేసింది. విధి నిర్వహణలో ఎస్ఐ చూపిన చిత్తశుద్ధి, ధైర్యాన్ని ప్రశంసించిన జిల్లా ఎస్పీ గోపాల్ బ్యాకోడ్ ఆమెను అభినందించి రివార్డును ప్రకటించారు.

వర్షాకాలం.. జాగ్రత్తలు అనివార్యం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీహెచ్‌ఓ రమేష్ బాబు

బళ్లారిఅర్బన్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలందరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాల్సిన అనివార్యం ఉందని డీహెచ్‌ఓ డాక్టర్.రమేష్‌బాబు తెలిపారు. గురువారం సండూరు సార్వజనిక ఆస్పత్రిలోని వివిధ వార్డులలో ఆయన రోగులను పరామర్శించి మాట్లాడారు. తమ ఇళ్ల చుట్టుపక్కల పరిసరాల్లో వాన నీరు నిలబడకుండా చూసుకోవాలన్నారు. నీటిని నిలువ ఉంచే డ్రమ్ములు, ట్యాంకర్లు, సంపులను వారం రోజులకు ఒక్కసారి శుభ్రం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా తమ ఇంటి ముందు ఉన్న మురుగు కాలువలో చెత్తచెదారాన్ని వేయకుండా మురుగు నీరు సజావుగా సాగేలా జాగ్రత్త వహించాలన్నారు. దోమల నుంచి సంక్రమించే వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు చెట్లు లేని చోట తలదాచుకోవాలన్నారు. కొత్త నీటిని నేరుగా తాగకుండా కాచి వడబోసి చల్లార్చిన తర్వాత తాగాలన్నారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఆస్పత్రుల్లో వర్షాకాలంలో అవసరమైన మందులతో పాటు ఏ రోజు రోగులు వచ్చినా సకాలంలో స్పందించేలా సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తగిన వైద్యం అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా నియంత్రణాధికారి డాక్టర్ అబ్దుల్లా, ముఖ్యపాలన వైద్యాధికారి డాక్టర్ సతీష్, టీహెచ్‌ఓ డాక్టర్ భరత్, వైద్యాధికారి డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వ్యయంపై విచారణకు డిమాండ్



మాట్లాడుతున్న శాంతకుమార్

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గ తాలూకా ఖానాపూర్–మదరకల్ రహదారికి రూ.5 కోట్లు వ్యయం చేయడంపై సమగ్ర విచారణ చేపట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంచాలకుడు శాంతకుమార్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. అరకొరగా మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారని, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ వెంకటేష్ యాదవ్ లైసెన్సును రద్దు చేయాలని ఒత్తిడి చేశారు. విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు కళ్లు మూసుకొని చెక్కులపై సంతకాలు చేశారని, దీనిపై కూలంకషంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డుకు తారు వేసే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వేడుకగా గంగాధరేశ్వర స్వామి దీపోత్సవం



దేవాలయానికి దీపాలు మోసుకు వెళుతున్న మహిళలు

మాలూరు : తాలూకాలోని దొడ్డశివార గ్రామంలోని పురాతన గవి గంగాధరేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశేష పూజా కార్యక్రమం, గ్రామ దేవతలకు దీపోత్సవం, కరగ ఉత్సవం, కురుబ సముదాయం ఆధ్వర్యంలో తలపై టెంకాయ కొట్టే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రతి యేటా మాదిరిగా తెల్లవారు జాము నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన అర్చకుల నేతృత్వంలో అభిషేకం, పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం తదితర పూజలను చేశారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని కళా బృందాలతో వివిధ రకాల సాంస్కృతిక మనోరంజన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు ఆరతి తంబిట్లు దీపాలను తలపై మోసుకుని వచ్చి గ్రామ దేవతలకు సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యుత్ ప్రసార మండలికి ముగ్గురు ఎన్నిక



నూతన సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: కర్ణాటక విద్యుత్ ప్రసార మండలి ఉద్యోగుల సంఘం 22వ త్రైమాసిక మహాధివేశన ప్రాథమిక ప్రతినిధుల ఎన్నికలో ఆరుగురు పోటీ పడగా ముగ్గురు సభ్యులు ఎన్నికయ్యారు. పట్టణంలోని కేఈబీ ఉప విభాగం నుంచి ప్రాథమిక ప్రతినిధుల ఎన్నికలో ఆర్.చంద్రు 76 ఓట్లు, ఆర్‌కె శ్రీనివాస్ కుమార్ 69 ఓట్లు, కెబి సంజుండేశ్వర 64 ఓట్లు పొంది విజేతలయ్యారు. వీరిపై పోటీ చేసిన రాజణ్ణ 61, పి.శ్రీనివాస్ 60, బిఆర్ నాగేష్ 47 ఓట్లతో పరాజితులైనట్లు ఎన్నికల అధికారి రాజగోపాల రెడ్డి తెలిపారు. అనంతరం ఆర్.చంద్రు మాట్లాడుతూ కేఈబీ ఉద్యోగులకు రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్య వచ్చినా ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు సభ్యులు ఉద్యోగుల సమస్యలపై వెంటనే స్పందిస్తామన్నారు. కేఈబీ వివిధ సంఘాల అధ్యక్షులు, పదాధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

హొసపేటె: విజయనగర జిల్లా మాదిగ మహాసభ, డాక్టర్.బీఆర్ అంబేడ్కర్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నగరంలోని బుద్ధభవనంలో బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏ సమాజమైనా తమ నిజమైన చారిత్రక మూలాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం ద్వారా కొత్త చరిత్రను నిర్మించుకోవాలన్నారు. భారత దేశపు తొలి భిక్షుడు మాదర చెన్నయ్య, బసవాది శరణుల మధ్య వందలాది ఏళ్ల అంతరం ఉందన్నారు. మాదిగ సంఘం నాయకులు ఎంసీ వీరాస్వామి, తిప్పన్న, రామచంద్ర, శేషు, గణప్ప బడిగేర, బసవరాజ్, వెంకప్ప, శ్రీనివాసులు, విజయకుమార్, మారేశ, మంజునాథ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పానకంతో చల్లదనం



పానకాన్ని పంపిణీ చేస్తున్న అశోక్

రాయచూరు రూరల్: మనిషి శరీరంలోని వేడిని తగ్గించడంలో చించా జ్యూస్(పానకం) పాత్ర ప్రధానమని అదనపు జిల్లాధికారి అశోక్ పేర్కొన్నారు. ఆయన బుధవారం జిల్లా ఆయుష్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో తయారు చేసిన చించా పానకాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. చింతపండు, బెల్లం, లవణం, జీలకర్ర, ఆవాలతో కాషాయాన్ని తయారు చేసుకొని తాగితే శరీరంలో వేడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సుభాస్ సంగావి, యోజనాధికారి జగదీష్, జిల్లా ఆయుష్ అధికారి శంకర్‌గౌడ పాటిల్, బసవరాజ్, మహ్మద్ అమీనుద్దీన్, రాజేంద్ర, పూజ, ఆస్మా బేగం, నరసప్పలున్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అన్యాయం



మాట్లాడుతున్న కాశీనాథ్

రాయచూరు రూరల్: ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో కళ్యాణ కర్ణాటకకు అన్యాయం జరిగిందని కళ్యాణ కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి కాశీనాథ్ ఆరోపించారు. గురువారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల నియోజకవర్గంలో జూన్ 3న జరగనున్న ఎన్నికల్లో 2018లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ గత ఆరేళ్ల పాటు పట్టభద్రుల సమస్యలపై విధాన పరిషత్ సమావేశాల్లో ప్రసంగించిన సందర్భాలు లేవన్నారు. బీజేపీ అభ్యర్థి 2018 నుంచి ఇంతవరకు ప్రతిపక్ష నేతగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యలపై స్పందిస్తానన్నారు. గత 15 ఏళ్ల నుంచి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా మీనమేషాలు లెక్కించారన్నారు.

నకిలీ విత్తనాల బెడద అరికడతాం



మాట్లాడుతున్న జేడీ దేవిక

రాయచూరు రూరల్: జిల్లాలో అధికమవుతున్న నకిలీ విత్తనాల విక్రయ బెడదను అరికడతామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవిక పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో కర్ణాటక రైతు సంఘం నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పత్తి, పొద్దుతిరుగుడు, సజ్జ, కంది వంగడాల నకిలీ విత్తనాలను విక్రయించడానికి వచ్చే వారి లైసెన్సులను గుర్తించి, నకిలీ విత్తనాలను కొనుగోలు చేయకుండా రైతులను జాగృతం చేస్తామన్నారు. 2024–25లో రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నియంత్రణకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక కమిటీలను నియమించామన్నారు.

యువతి అదృశ్యం



సిద్దమ్మ(ఫైల్)

బళ్లారిఅర్బన్: జిల్లాలోని సండూరు తాలూకా తోరణగల్లు పరిధిలో సిద్దమ్మ అనే 17 ఏళ్ల యువతి ఈ నెల 12 నుంచి కనిపించకుండా పోయిన ఘటన వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తోరణగల్లు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు బళ్లారి పోలీస్ కంట్రోల్ రూం –08392–258100 లేదా తోరణగల్లు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సంబంధిత పోలీసులు కోరారు.